MADRAS GOVERNMENT ORIENTAL MANUSCRIPTS SERIES

No. 42

కులశేఖర మహీపాల చరిత్రము

శేషము రఘునాథార్య ప్రణీతము

KULASĒKHARA MAHIPALA CARITRA

By

SESAM RAGHUNĀTHĀRYA

Edited by

T. CHANDRASEKHARAN, M.A., L.T.

Curator, Government Oriental Manuscripts Library, Madras.

and Staff of the Library

Under the orders of the Government of Madras

UNIVERSAL
LIBRARY
OU_206013
UNIVERSAL
LIBRARY

OUP—390—29-4-72—10,000.

OSMANIA UNIVERSITY LIBRARY

Call No. T81 R14K PG Accession No. T2479

Author రఘు నాథాచార్య, శేషము.

Title కులశేఖర మహారాజు చరిత్రము. 1953.

This book should be returned on or before the date last marked below

MADRAS GOVERNMENT ORIENTAL MANUSCRIPTS SERIES
No. 42

కులశేఖర మహీపాల చరిత్రము

శేషము రఘునాథార్య ప్రణీతము

KULASEKHARA MAHIPALA CARITRA

By

ŚĒSAM RAGHUNĀTHĀRYA

Edited by
T. CHANDRASEKHARAN, M.A., L.T.
Curator, Government Oriental Manuscripts Library, Madras
and Staff of the Library
Under the orders of the Government of Madras.

1955

Price Rs. 2—4—0.

PRINTED AT
SOLAR WORKS
12, Thambu Chetty Street,
MADRAS-1

INTRODUCTION

There are two manuscript copies of Kulaśekhara Mahīpāla Caritra available in the Government Oriental manuscripts Library, Madras, described under Nos. D. 2077 and R. 1071. The second one is a restored copy of the former which is in palm-leaf. The original palm leaf manuscript is complete and not damaged. The writing is also lucid and there are only minor mistakes and omissions here and there.

In the galaxy of the Āḻvārs, the pioneers of Vaiṣṇava cult, Kulaśekhara Mahīpāla holds a unique place. He was not only the author of "PERIYA TIRUMOḺI" of Tamil Prabandhas, but also the famous Stotra "MUKUNDAMĀLĀ" in Sanskrit. The life of such an esteemed person is the subject-matter taken for this Kāvya. Sēṣam Raghunāthācārya of Kauṇḍinya Gōtra and Āpastamba Sūtra is the author of this work. The following information may be gathered from the Introductory portion of the work regarding the author's family and heredity. The family tree to which clan the author belonged is given as follows:—

AHŌBILA DEŚIKA

Rāmānujācārya. | 2 | 3 | 4 | 5

Śrī Bhaṭṭar (Two wives Rāgama and Satyabhāmā)

Veṅkaṭācārya (Wife Lakṣmamma)

Raghunāthācārya. (Present author). | Rāmānujācārya | Cenna Bhaṭṭar. (Author of Abhimanyu-Kalyāṇam in Dvipada).

In addition, Cenna Bhaṭṭar the youngest brother of Raghunāthācārya also mentions in his book "Abhimanyu Kalyāṇam" about his brother Raghunāthācārya. This Abhimanyu-Kalyāṇam in Dvipada is also of a fluent and simple style. The manuscript copies of this book are available in this library under D. Nos. 1022 to 1027. But this is not yet printed. The son of this Cennabhaṭṭar Raṅgācārya is the author of Bhāvanārāyaṇa Vilāsamu in Yakṣagāna style. This also is a fine piece of poetry available in this library under D. No, 1931. Thus we clearly understand that this author comes from a family of scholars and poets. The subject-matter chosen in Bhāvanārāyaṇa Vilāsamu is very

enchanting and interesting. There is a temple of Sākṣi Bhāvanārāyaṇa in Ponnur village of Guntur District. The story goes that a Bhakta of this Bhāvanārāyaṇa by name Guni Gōvinda brought him there as a witness to his maternal uncle in connection with his marriage. Because he was brought there by his Bhakta as a witness, the God was thereupon called by the name Sākṣi Bhāvanārāyaṇa. This Sthalapurāṇa or the description of this incident, *i.e.*, Māhātmya of that God happens to be the subject-matter of Bhāvanārāyaṇa Vilāsamu. In a way, the narration of the theme in Abhimanyu Kalyāṇam, written by Cenna Bhaṭṭar coincides with that of Bhāvanārayāṇa Vilāsamu. In both these works, the maternal uncle fails to keep up his promise to his nephew in connection with giving his daughter in marriage, when God Bhāvanārayaṇa interferes as a witness and fulfils the wishes of the nephew. Thus we find a similarity in the works of both the father and the son. Now, as the son selects the subject matter pertaining to Guntur District, there is a slight chance for our drawing the hypothetic conclusion that they might be the inhabitants, somewhere, of Guntur District. Practically, no internal evidence is available from either the present book or from the works of his brother Cenna Bhaṭṭar or from that of his son *i.e.*, Raṅgācārya to assign any date to the author.[1]

---

1. Sri N. Venkata Rao, M.A., in his essay "Kulaśekhara in Telugu Literature" in the Journal of the Uuniversity of Madras, Section-A, Humanities, Volume XXIII, Nos. 1 and 2 (July—December pages 57 to 61) establishes the date of Raghunāthācārya. There he puts forth the following arguments :—

2. Firstly in the Dāśarathi Śataka written by Gōpanna, mention is made of one Raghunātha Bhattarācārya in the 9th stanza. There neither his family nor surname is mentioned. As such this statement could not stand for argument as there is the possibility of having different persons with one and the same name.

3. Secondly he brings in the relationship between Raghunāthācārya and one Tirumalācārya of the same family and surname, giving out as example the introductory portions written by the respective authors of Kulaśekhara-mahīpāla Caritra, Abhimanyu Kalyānam and Ambarīṣōpākhyānam. Though the said Tirumalācārya belongs to "Sēṣam" family and Kaundinyasa Gōtra, he describes Nārāyaṇacārya as his father. But the mention of this Nārāyaṇācārya is not made by these two brothers in their respective works. Here Sri N. Venkata Rao has mentioned in the family tree that Nārāyaṇācārya was one of the five sons of Ahōbila Dēśika. But in both Kulaśekharamahīpāla Caritra and Abhimanyu Kalayāṇam nothing was mentioned except the fact that Ahōbila Deśika had five sons and Rāmānujācārya was the eldest of them. At the same time the mention of either Ahōbila Deśika or his five sons has not been made by Thirumalācārya through it is said that his father was Nārāyaṇācārya. He never mentioned anything about his grandfather.

As such the statement that Nārāyānācārya was one of the five sons of Ahōbila Dēśika, is not borne out by literary evidences and could not stand for reason. Therefore until and unless a positive proof is available, the matter is left open for investigation and till then we are not in a position to decide the exact date in which Raghunāthācārya lived.

The style and the descriptive talents in poetry, exhibited in this book may assign to this author a place in comparison to the Prabhanda Kavis, the men of letters of the age of Kṛṣṇadēvarāya. None of the poets of the Tanjore Naicks' time could stand a comparison to this author in his great creative imagination and poetic fluency in narration. He may be classified amongst the illustrious poets like Kaṅkaṇṭi, Pāparāju and others. Thus this book forms one of those rare and exceptional works. It is a wonder how such a great poetical work has not been printed so far. We can go to the extent of even saying that it excels all the poetical works so far published by the Government. Every poem in this book is a shining precious jem of a high order. This Raghunāthācārya assimilated in him many of the high poetical talents from the so-called pioneer works of the Prabhanda Yuga like Āmukthamālyada, Vasucaritra, Pāṇḍuraṅga Māhātmyam, Prabhāvatī-Pradyumnam, etc. The fluent narration and candour, appropriate usuage of words, epic style and magnificent poetical imagination, all assign to him an important place of high order in the poetical hemisphere.

The subject-matter of this work is the life-history of one of the Āḻvārs of Viśiṣṭādvaita Saṁpradāya; as such his Stuti (prayers) to five weapons of Lord Viṣṇu (Pañcāyudha), Viṣvaksena (Commander-in-Chief), Garutmanta (the ride of Lord Viṣṇu) etc. adds a special flavour to the excellent diction and brings to our memory Āmuktamālyada of Śrī Kṛṣṇa Dēva Rāya of Vijayanagaram. The excellence of the style and the ideal usage of words reveal that he is a great scholar with a wide field of varied scholastic interests and a poet of magnitude. In reading his poety one cannot miss the influence which he has in his writings from the great Prabhandha poets, like Rāmarājabhūṣaṇa, Tenāli Rāmakṛṣṇa, Piṅgali Sūraṇa etc. Especially the story of the deer in the first canto and the situation brought out in the meeting of Śrī Dēvī by Śrī Raṅganātha, after he married Nīḷā in the fourth canto bears testimony to the genius of the author. The different meteres used to suit the different situations are also worth mentioning. The rest is left to the readers themselwes.

It is hoped that this work, a rare gem of its kind, will take its proper place in the world of Telugu Literature.

My thanks are due to Sri M. Sarabhesvara Sarma, Telugu Pandit of this library, for preparing the press copy and correcting the proofs and to the Solar Works, Madras, for printing the work in a good manner.

Govt. Oriental Manuscripts Library, Madras,
3rd March 1955.

T. CHANDRASEKHARAN,
CURATOR.

PRINTED AT THE MADRAS LAW JOURNAL PRESS, MADRAS 4.

పీఠిక

★

చెన్నపురి ప్రభుత్వ ప్రాచ్యలిఖితపుస్తకభాండారములో ఈ కులశేఖరమహీపాలచరిత్రమునకుఁ దాళపత్రప్రతి యొక్కటియే కలదు. (డి. నం. 2077) ఇటీవలనే దానికి దుహితృక కల్పింపఁ బడినది. (ఆర్. నం. 1071)

మాతృక అశిథిలమును దోషరహితమునగుటచే ముద్రణప్రతిసంపాదనము సుకరమైనది. చివరి యాశ్వాసమున తుదిపద్యము లొండురెండును కావ్యమధ్యమున రెండుమూడు తావులలో నొకటి, అఱ, పద్యచరణములుమాత్రము త్రుటితములును లేఖక ప్రమాదవిస్మృతములునని తెలుపవలసియున్నది.

అపరిహరణీయములగు నీనీహారలేశములను విడిచినచో నితరపూర్వకావ్యములవలె సందేహస్థలములలో బరిష్కర్తల వికల్పములకెడమీయక యథోచ్చారితముగఁ బ్రకాశమునందగలుగుట యీ కావ్యవిషయమున నెన్నఁదగిన విశేషము. ఇందలి కావ్యగుణముల మేలిమి కీమేలు కలిసివచ్చినది. ఇట్టిది యరుదు. శ్రీవైష్ణవమతప్రవర్తకులగు నాళ్వారులలో నన్యతముఁడును, సుప్రసిద్ధమగు ముకుందమాలకును ద్రవిడాగమైకదేశమగు పెరియతిరుమొழிకినిఁ గర్తయగు కులశేఖరమహీపాలుని చరిత్రమిందలి వస్తువు. ఆపస్తంబసూత్రుఁడును కౌండిన్యగోత్రుఁడునగు శేషము రఘునాథాచార్యుఁడు దీనికిఁ గర్త. ఇతఁడు ప్రస్తావనలో నిరూపించిన తనవంశక్రమమిది :—

అహోబలదేశికుఁడు
- రామానుజాచార్యుడు — సీతమ్మ (భార్య)
  - శ్రీ భట్టరు. రాగమ, సత్యభామ (భార్యలు)
    - వేంకటాచార్యుఁడు — లక్ష్మమ (భార్య)
      - రఘునాథాచార్యుఁడు (ప్రకృత కృతికర్త)
      - రామానుజాచార్యుఁడు
      - చెన్నభట్టరు (అభిమన్యు కల్యాణ ద్విపద కృతి కర్త)
- 2
- 3
- 4
- 5

పినతమ్ముఁడు చెన్నభట్టరు, తన యభిమన్యుకల్యాణములో రఘునాథాచార్యుని నిట్లు స్తుతించెను.

“ అందగ్రజుఁడు సద్గుణాభిరాముండు
నందనందన కథానందచిత్తుండు
శమదమవాత్సల్య శౌశీల్యముఖ్య
కమనీయగుణరత్న కలశవారాశి
యమలవైష్ణవరహస్యార్థసంవేది
రమణీయశుభకీర్తి రఘునాథగురుఁడు.”

ఈ అభిమన్యుకల్యాణము రసోత్తరమయిన ద్విపదకావ్యము. ఇది యీగ్రంథాలయమున డి. నం. 1022-1027 రులలో వర్ణితము. ఇదియముద్రితము. ఈచెన్నభట్టరుకుమారుఁడు రంగాచార్యుఁడును సరసకవి. భావనారాయణవిలాసమను ప్రశస్తయక్షగానమును రచించెను.

“ ఇది శ్రీమన్నందనందనచరణారవిందద్వంద్వనిష్యందిమరందబిందుమదవదిందిరాయమాణ మానస శేషవంశాబ్ధిసుధాకర చెన్నభట్టారకకుమార రంగాచార్యప్రణీతంబైన భావనారాయణ విలాసంబు ” అని దానిగద్య.

ఇది యీ గ్రంథాలయమున డి. నం. 1981 రున వర్ణితము. వీరివంశము పరిపాటి యిట్టిది .అంద ఱును విద్వత్కవులే. భావనారాయణవిలాసమునందలి యితివృత్తము ముచ్చటయైనది గుంటూరి మండలము పొన్నూరుగ్రామమునకు గూనిగోవిందుఁడను భక్తునిచేఁ దన వైవాహికవిషయమున మేనమామ కడకు సాక్షిగఁ గొనితేఁబడి సాక్షిభావనారాయణుఁడనపేరనచట నిలిచిన స్వామి మాహాత్మ్యమిందు వర్ణితమైనది.

చెన్నభట్టరు రచించిన యభిమన్యుకల్యాణమునందలి వస్తువుకూడ దాదాపుగ నిట్టిదియే. కన్యా ప్రదానవిషయమున నాడినమాట తప్పఁ జూచిన మేనమామ, సాక్షియైననారాయణుని యనుగ్రహ మునఁ దుదకు కృతార్థుఁడైన మేనల్లుఁడును, ఈ తండ్రికొడుకుల కృతులలో సమానముగ గోచరింతురు. రంగాచార్యుఁడు గ్రహించిన యితివృత్తము పొన్నూరునకు సంబంధించినదగుట నీశేషమువారు గుంటూరు మండల వాస్తవ్యులై యుందురనునూహకెడమిచ్చుచున్నది. రఘునాథాచార్యుల కాలనిర్ణయమునకుఁ బ్రకృతకావ్యమునందుఁగాని తమ్ముఁడు చెన్నభట్టరు కృతిలోఁగాని, తత్పుత్రుని కృతిలోఁగాని యాధార ములు గనవచ్చుటలేదు.*

శ్రీ నిడదవోలు వేంకటరావుగారు Journal of University of Madras Sections A. Humanities Vol. XXIII Nos. 1-2. (July-December) Pages (57-61) లో Kulasekhara in Telugu Literature అనువ్యాసములో నీరఘునాథాచార్యుల కాలమును నిర్ణయించిరి. అందు వారుచూపిన యాధారములలో మొదటిది. రామదాసకృతమగు దాశరథిశతకము 9 వ పద్యములో “ రఘునాథభట్టరాచార్యుల కంజలెత్తి ” అనునది. కాని గోత్రగృహనామములు తెలుపఁబడని ఈ రఘునాథభట్టరు, ప్రకృత రఘునాథాచార్యులు కాకపోవుటకుగల సంభవమును, రఘునాథసంజ్ఞికులు

ఎట్లును బదునేడవ శతాబ్దికీవలిదియే యనకతీఱని యీ కావ్యము కవితాపరిణతినిబట్టి మాత్రము పదునాఱవశతాబ్దిలోఁ బుట్టఁదగినదిగఁదోఁచును. ప్రతిభావ్యుత్పత్తులలో నాయకరాజులనాఁటి తెనుఁగుకవులెవ్వరును ఈ రఘునాథాచార్యునితో సరిరారు. ఇట్టి విశిష్టమైనవాఙ్ముద్రయే వారికిలేదు. ఈయుజ్జ్వలతయు పరిణతియు క్షయోన్ముఖమైన నాఁటి సారస్వతములో పుట్టకపుట్టినదనవలెను. ఆ యుగలక్షణములకపవాదభూతమై కంకంటి పాపరాజు కావ్యమొకటియున్నదన్నచో నీ కులశేఖర చరిత్రమును దాని సరసన జేర్పవలెను. గతానుగతికమును మందప్రతిభమునగు పదునేడు పదునెనిమిదవ శతాబ్దుల తెనుఁగువాఙ్మయములో నరుదుగ నుదయించిన రెండుమూఁడుప్రశస్తకృతులలో నిదియొకటి. అసలిది యిన్నాళ్ళప్రకటితమైమఱుగుపడి యుండుటయే యాశ్చర్యము. ప్రభుత్వమువారిచే నేఁటి వఱకుఁ బ్రచురితములగుచున్న పూర్వాంధ్రకావ్యములలో నింతకవితాగుణసమృద్ధమైనకావ్యమురాలే దనుట యతిశయోక్తికాదు. ఇందలి ప్రతిపద్యమును శాణోత్తేజితమైనరత్నము. ప్రబంధవాఙ్మయ మహాసౌధమునకు మూలస్తంభములగు ఆముక్తమాల్యద, వసుచరిత్రము, పాండురంగమాహాత్మ్యము, ప్రభావతీప్రద్యుమ్నములలోని యాయావిశిష్టకవితాలక్షణములు రఘునాథాచార్యుని కృతిలో హత్తికొనినవి. భావగతముగనో రచనాగతముగనో, పలుకుబడినో, ప్రతిపద్యమునను నొకవిశేషము భాసించుచునేయుండును. కవియొక్క కృతహస్తతకు నిందలి ప్రతిపద్యము నుదాహరణమే.

ఇదియు నాళ్వారుకథయు, కావ్యముఖమునందలి పంచాయుధవిష్వక్సేనగరుత్మదాదులస్తుతులును, కావ్యమునఁనాపాదచూడముగ గుబాళించుచున్న విశిష్టాద్వైతసంప్రదాయముద్రయును ఆముక్తమాల్యదను దలపించుచున్నవి. శ్లేషవర్ణనాసందర్భములలో నీకావ్యము వసుచరిత్రధోరణులను పుణికిపుచ్చుకొన్నట్లు కననగును. ఒక్కొకయెడ తెనాలికవి కూర్పుబిగువులహరువు మెఱయును. ఇఁక సంవాదములలో, శృంగారదౌత్యములలో, ప్రణయలేఖలలో సూరన దైశికముద్రయట్టి పడును. కవియుపజ్ఞకుఁ దొలియాశ్వాసమున హరిణీవృత్తాంతములోని కోదండ్రికము యొక్క చిత్రణమే గొప్పయుదాహరణము. నాల్గవయాశ్వాసముతుద నీళాపరిగ్రహానంతరము శ్రీరంగనాథుఁడు దాక్షిణ్యభంగభీరువై శ్రీదేవిని జూడనేగిన సన్నివేశము తన్నిర్వహణము కావ్యమునకు మకుటాయ

పలువురుండకుండుటకుఁగల యసంభవమును దీనికి బాధకములుగ నున్నవి. రెండవది. కులశేఖర చరిత్ర అభిమన్యుకల్యాణములలోని ప్రస్తావనలకు అంబరీషోపాఖ్యానప్రస్తావనోదాహృతపద్యాను జోడించి వారొసగిన శేషమువారివంశవృక్షము. అంబరీషోపాఖ్యానకృతికర్త తిరుమలాచార్యుఁడుకూడ శేషమువంశజుఁడును కౌండిన్యగోత్రుఁడును. అందు తిరుమలాచార్యుఁడు తాను నారాయణార్యసంభవుఁడనని చెప్పికొనెను. శ్రీ వేంకటరావుగారు తామొసగిన వంశవృక్షములో 'నారాయణాచార్యుని' అహోబలదేశికుని పుత్రపంచకములో నన్యతమునిగా జేర్చిరి. అభిమన్యుకల్యాణ, కులశేఖరచరిత్రములలో నహోబలదేశికుని యగ్రనందనుఁడని రామానుజాచార్యుఁడొక్కఁడే పేర్కొనఁబడెను. కడమ నలువురినామములు పేర్కొనఁబడలేదు తిరుమలాచార్యుఁడు తనకృతిలోఁ దండ్రినిమాత్రమే పేర్కొనెనుగాని, తాతపేరుతడవినవాఁడుకాఁడు. ఇట్టి స్థితిలో నహోబలదేశికునకు నారాయణచార్యుఁడు కుమారుఁడనుట, యూహైకసాధ్యముకాని ప్రమాణసిద్ధము కాదనవలసివచ్చుచున్నది. అది పొసఁగిననేకాని తిరుమలాచార్యుని యంబరీషోపాఖ్యానమునుబట్టి వారుచేసిన రఘునాథాచార్యుని కాలనిర్ణయము పొందుపడదు. ప్రతివాదమునకులోఁగని ప్రమాణాంతరములు లభించునంతవఱకు ఘునాథాచార్యుని కాలనిర్ణయవిషయము పరిశీలనార్హమైయున్నది.

మానముగనున్నవి. కులశేఖరులు నీళను శ్రీదేవికినప్పగించు సందర్భమునం దుహితృస్నేహవిక్లబమగు పితృహృదయమునుండి వెలువడినమాటలు, వానికి శ్రీదేవియొసంగినయుత్తరమును ఔచిత్యమునకు మేలగనున్నవి.

కౌస్తుభాంశజనితుండగు కులశేఖరుని భక్తివాసనాక్రమసమున్మేషము, రామాయణశ్రవణ సమయములయందలి యతనితన్మయత, భాగవతులయందతనిపక్షము పుణ్యవాసనాప్రబోధదక్షములుగ నున్నవి. మంత్రులదుర్మంత్రమును వ్యవహారకౌటిల్యమును జిత్రించిననేర్పు కవికింగల లోకస్వభావ పరిజ్ఞానమునకు నిదర్శకముగనున్నది. రసానుకూలముగ నాయాఘట్టములలో స్వీకృతములైనఛందో భేదములు శిల్పజ్ఞతనుజాటుచున్నవి.

కావ్యము సర్వాంగీణముగ గుణసంపన్నమైనపుడు కతిపయోదాహరణములతో దాని సమగ్ర సౌందర్యనిరూపణము సాధ్యపడునదికాదు. ఇచట సమగ్రపరిశీలనమున కెడమునులేదు. నేడు ప్రచురితములై వెలువడుచున్న గ్రంథమాత్రములనెల్ల "వ్రతానాముత్తమం వ్రతం" అనున్యాయమును పాలించి యతివిస్తరముగం బీఠికలయందుం బ్రశంసించుట యొకయాచారమైపోయినదికానం బ్రకృత కావ్యమునుగూర్చి సంక్షేపముగనైన నీ మాత్రము చెప్పవలసివచ్చినది. కాని నిజమున కిట్టికావ్యములు పీఠికోపజీవ్యములుకావు. స్వయంప్రకాశములు.

నికషాయమాణులై యభిజ్ఞులీకృతిరత్నము నొరయుదురుగాక.

తి. చంద్రశేఖరన్.

విషయసూచిక

విషయము ... పుట

ప్రథమాశ్వాసము

కావ్యముఖము ... 1
పురవర్ణనము ... 7
రాజు వేఁటకేఁగుట ... 14
హరిణి పూర్వకథ ... 18
పరిజనము రాజునరయుట ... 27
అనపత్యతకు రాజు విచారించుట ... 30
మంత్రులు రాజునోదార్చుట ... 31

ద్వితీయాశ్వాసము

రాజుకడకు భాగవతులువచ్చుట ... 35
భాగవతుల యుపదేశము ... 38
వ్రతారంభము ... 43
శ్రీమన్నారాయణసాక్షాత్కారము ... 45
వరప్రదానము ... 48
కులశేఖరుని జననము ... 50
కులశేఖరుఁడు రాజగుట ... 54
వైష్ణవయతివచ్చుట ... 57
రాజు ప్రశ్నములకు యతియుత్తరము ... 59
రావణోదంతము ... 64
శ్రీమన్నారాయణునితో నింద్రుఁడు తనపాట్లు చెప్పికొనుట ... 68
అభయప్రదానము ... 71
శ్రీరాముని యరణ్యగమనము ... 74
సీతాపహరణము ... 78
సుగ్రీవ సమాగమము ... 79
హనుమ సముద్రమునుదాఁటి సీతను గనుగొనుట ... 80
లంకాదహనము ... 82
యుద్ధము ... 84
రావణ వధ ... 85
అయోధ్యా ప్రవేశము ... 88
శ్రీరామాభిషేకము ... 89

తృతీయాశ్వాసము

కులశేఖరుని రామాయణ శ్రవణము ... 91
కులశేఖరుఁడు రావణునిపై దండెత్తుట ... 98
నీళాదేవి యవతరించుట ... 101
వనవిహారము ... 105
సూర్యాస్తమయవర్ణనము ... 111
మన్మథాద్యుపాలంభము ... 114
శ్రీరంగపతి విరాళి ... 122
నీలవేణి నీళావృత్తాంతమును శ్రీరంగపతికి విన్నవించుట ... 128

చతుర్థాశ్వాసము

నీలవేణి నీళాదేవియొద్దకు వచ్చుట ... 136
మంత్రుల దుర్మంత్రము ... 145
స్వాములకు దోషములేమికి కులశేఖరుడు పాముముట్టుట ... 149
శ్రీమన్నారాయణ సాక్షాత్కారము ... 150
నీళా కల్యాణము ... 159
నీళను శ్రీదేవి పరిగ్రహించుట ... 171

కులశేఖర మహీపాల చరిత్ర

ప్రథమాశ్వాసము

శా. శ్రీ గోత్రాతనయా స్తనస్థగితకాశ్మీరద్యుతుల్ స్వీయ వ
క్షో [గంధార్ద్రి] లలంతికారుచితతుల్ చూపట్టి యన్యోన్య హృ
ద్రాగంబుల్ బయలెక్కినట్లెసఁగ నుద్యత్సంతతానంద సం
భోగౌత్సుక్యమునందు రాఘవుఁడు మమ్ముం బ్రోచు నెల్లప్పుడున్. 1

ఉ. ధౌతయశఃప్రభూత విబుధవ్రజసేవిత దివ్యరూప వి
ఖ్యాత సమస్తలోకశుభకారణదృష్టిసమేత జాంబవ
ద్వాతసుతాంగదాది, కపివందిత పూతపదాంబుజాత, సం
ప్రీత, పతివ్రతాశ్రవణపీతగుణామృత సీతఁ గొల్చెదన్. 2

మ. జలజాక్షుం డెట సంభవించె నచటన్ సాహాయ్యధౌరేయుఁడై
బలశౌర్యమ్ములఁ బెంపు గాంచి విలసత్పర్యంకసౌధాంబరా
దులు దానై హరికిన్ సఖిత్వభట వృత్తుల్ పూను ధన్యాత్ము ని
స్తుల భోగోన్నతు నిత్యశాంతుని ననంతున్ గొల్తుఁ జిత్తమ్మునన్. 3

చం. తన భుజపీఠి నచ్యుతుఁడు తర్కర పద్మమునందు మందరా,
వనిధరమున్ దదగ్రమున వారణ ఖడ్గ లులాయ సింహ భృ
ద్వనములు దద్రిమస్థ కపివర్గము, పైపయి నిట్లు దొంతిఁ బూ
నిన క్రియఁ దాల్చి లీలఁ జననేర్చిన పత్రిపతిన్ భజించెదన్. 4

మ. వివిధప్రాణి సమాకులాఖిల జగద్విశ్రాంతి కృత్కాండ సం
భవ రక్షా లయహేతు సంచలనశుంభద్వేత్రబాహుండు, మా
ధవ భావాభిమతప్రవర్తకుఁడు దైత్యధ్వాంతభానుండు, దా
సవనవ్రాత వసంతుఁడై వెలయు విష్వక్సేనుఁ గీర్తించెదన్. 5

మ. రవి మున్నొక్కరుఁ డేగుదెంచు నిదె ఘోరప్రక్రియన్ గోటి సూ
ర్య విలాసోగ్రత దోఁచె నంచు ఖచరవ్రాతమ్ము భీతిల్ల దా
నవ సేనావనముం దహించి సురసన్మానంబులం జెందు మా
ధవు చక్రాయుధమున్ భజించెద సముద్యద్భక్తియోగమ్మునన్. 6

చ. యూథములై నిశాచరసముత్కట చక్రము లోలిఁ బర్వ ని
ష్కృతిక మహామునివ్రజచకోరము లింపు వహింప నిర్జరాం
భోధి సమృద్ధి జెంద భవపుంజతమం బెడలన్ దనర్చు న
మ్మాధవు శంఖచంద్రికలు మాకు శుభమ్ములొసంగు గావుతన్. 7

మ. ప్రకటారాతి కరోటపాటనవినిర్యద్రక్తసిక్తాత్మమూ
ర్తికి సొంపై పఖుఁ జెందు దివ్య కుసుమశ్రేణీరుచిన్ జిత్రకం
చుకమున్ దాల్చిన లీల దోఁప సుమనస్సత్క్రియాప్తిన్ సము
గ్ర కళావైఖరి శౌరిచేఁ దనరు సత్కౌమోదకిన్ గొల్చెదన్. 8

మ. రవికోటిన్ దెగడు న్నతాంతరతమోరాశివ్యయాపాదియై
పవికోటిన్ బ్రహసించు దైత్యకుధర ప్రధ్వంసనోద్వృత్తి కే
శవ హస్తాంబుజభూషణమ్మగుచు శశ్వద్విశ్వవిఖ్యాత వై
భవమై యొప్పెడు నందకమ్ము గలుషప్రచ్ఛేదమున్ జేయుతన్. 9

ఉ. పాటవమొప్పనాత్మముఖ బంధ విముక్తశరమ్ములన్ ద్విషత్
కోటులు గ్రుంగె నంచుఁ దన కోటి జనార్దను కర్ణసీమకున్
మాటికిఁ దెల్పఁ బంచిన క్రమంబున మండలితాకృతిన్ సమి
న్నాటక లీలఁ దాల్చు యదునాయకు శార్ఙ్గము నాశ్రయించెదన్. 10

సీ. తనుకాంతులఖిలదిక్తట నటత్కరటి వి
 స్ఫుటకటమ్ముల జాఁజువూఁతఁ బెనుప
ఛదజనుః పవనముల్ సప్తాబ్ధివీచీ వ
 రస్ఫురాహతికి సారథ్య మునుప
తుండాగ్ర మత్స్యాగ్ర దుర్గ్రహారిగ్రావ
 పాళిపై దంభోళికేళి సలుప
నఖరముల్ నతజనోన్ముఖ మహాఘధ్వాంత
 పేటికిఁ దపనాంశుధాటి గాఁగ

తే.గీ. ముఖరుచులు శంభుజంభారి ముఖ్యదేవ
దృక్చకోరావళులకుఁ జంద్రికల నినుప
విలసితోదగ్రమూర్తియై వెలయు బుధ వి
ధేయు మునిగేయు నవ్వైనతేయుఁ గొలుతు. 11

శా. సత్యానందగుణాభినంద్యుఁడు జగజ్జన్మాది కృత్యైక సం
గత్యాపాదక వేత్రపాణి, నిజహుంకారాంకురోగ్రోత్కటిమ
ప్రత్యాఖ్యాత విరోధిమండలుఁడు విష్వక్సేనదేవుండు ని
ష్ప్రత్యూహమ్ముగ మత్కృతిం గరుణనిర్వ్యాహాస్థితిం బ్రోవుతన్. 12

చం. అనయము సత్కవుల్ భగవదర్పిత కావ్యరసమ్ము మెత్తు, రో
య్యనఁ గుకవుల్ వెసన్ నెరసు లారయుచుండుదు రేమిచిత్రమో!
ఘన సరసీ లసత్కమలకైరవ సౌరభ మేవగింపుచున్
మునుకొని నత్తగుల్లలకు ముక్కులు సాచు బకంబులున్ బలెన్. 13

వ. ఇత్తెఱంగున నిష్టదేవతాప్రార్థనంబును సుకవికవితాభివందనంబునుం
గుకవి నిందనంబునుంగావించి యెద్దియేనియు నొక్క చిరంతన ప్రపన్నచరితంబును
మిశ్రకవితావిశేషానుబంధంబుగావించి భగవత్సమర్పితంబుసేయుభాగ్యంబు దొర
కొనునొకో యని నిదురించు నంత నుషావసానయామంబునందు. 14

చం నగుమొగమున్ విశాలనయనమ్ములు చక్కని చెక్కుదోయి, చె
న్నగు సరులున్న పెన్నుర, ముదంచిత బాహుయుగంబు, ముత్తెపుం
జిగిఁ దళుకొత్తు పల్వరుస, చిన్నియొయారపుచెయ్వులొప్ప సొం
పగు పురుషుఁడు నాదుకల నాదర మేర్పడ గోచరించినన్. 15

వ. ఏనును బులకాంకురంబులవయంబుల నవలంబింప నప్పురుషుని తెఱఁ
గెఱుఁగక వెరఁగుపడి చూచుచున్నంత— 16

తే.గీ. "ఏను రఘువల్లభుఁడ నీదుహృదయమెఱిఁగి
వచ్చితిని గులశేఖరాళ్వార్ల చరిత
మాంధ్రగీర్వాణ మిశ్రపద్యాంతరములఁ
గృతి వినిర్మింపు మాకు నంకితముగాఁగ." 17

వ. పరమపురుషార్థవేత్తలగు భాగవతోత్తములం గీర్తించుట కీర్తికరంబును మదీయకైంకర్యవిశేషంబు నగుంగావున నిత్తెఱంగునం గావించి కృతార్థుండవు గమ్మని యానతిచ్చిచనియె నంత మేలుకాంచి నామనంబున నిట్లని యూహించితి. 18

ఉ. ఎక్కడిచోద్య మజ్జగదధీశ్వరుఁగూర్చి మహాతపమ్ము మ
న్నెక్కడినుండి చేసితి నహేతుక మాతని సత్కటాక్ష మె
క్కొక్కనిపైఁ బొసంగు ననుచుండెద రార్యులు తథ్యమయ్యె లోఁ
జిక్కనభక్తి నర్పణముఁ జేసెద మత్కృతి రామమూర్తికిన్, 19

సీ. శుభకరాపస్తంబసూత్రుండు కౌండిన్య
గోత్రపవిత్రుండు గుణవిశిష్టుఁ
డనుపమశేషాన్వయాంభోధి చంద్రుండ
హోబలదేశికుండొనరఁ దనదు
సతియందుఁబుత్రపంచకము నాపాదించె
నందగ్రజుండు రామానుజార్యుఁ
డమ్మహాత్ముండు సీతమయను నిజదేవి
వలన శ్రీభట్టరాహ్వాయకుమారుఁ

తే.గీ. గనియె నా శాంతినిధికి రాగమయు సత్య
భామ యను భార్యలిరువురు భవ్యమతులు
సరవి రాగమదేవికి సంభవించె
సరసగుణశాలి వేంకటాచార్యమౌళి. 20

తే.గీ. అమ్మహాత్ముఁడు లక్ష్మమ యనెడి పత్ని
వలన ముప్వురిఁ దనయుల నెలమి గాంచెఁ
జెలిమి రామానుజుండును జెన్నభట్ట
రను సహోదరు లిరువు, రే నగ్రజుండ. 21

కం. ఇల రఘునాథార్యుండన
వెలసితి లక్ష్మణమునీంద్ర విమలపదాబ్జం
బులు శరణంబని నమ్మితి
లలి భాగవతార్చనాభిలాషం బెసఁగన్. 22

వ. ఇట్టియేనుగృతిపతియగు జానకీపతిం గుఱించి షష్ఠ్యంతమ్ములు రచించెద 23

కం. పురహరగిరి సురవరకరి
దరశరహారనిభయశస్సుధాలహరికి దు
ష్కర పరసైన్యోద్ధురసం
గరరంగ విశృంఖల ప్రకటశౌర్యునకున్. 24

కం. అకుటిల సంవిన్నిజసే
వకజన భయదోగ్రదైత్యవపురేఫః పా
వక కీలాయితశరునకు
ప్రకటయశః పిహితభూనభః కుహరునకున్. 25

కం. ఉద్యత్ప్రద్యోతద్యో
తద్యోతిత నిజభుజప్రతాపద్యుతికిన్
హృద్యానవద్య పద్య
స్వాద్యరసోద్యత్ప్రబంధ సమ్యక్ఛ్రుతికిన్. 26

కం. దుర్గమనిలయనిశాచర
వర్గాధిప భయదశస్త్ర వరధోరణికిన్
దోర్గర్వనృపతిదుస్సహ
భర్గధనుర్భంగలబ్ధ భామామణికిన్. 27

కం. శోభితకల్యాణగుణ
శ్రీభరితాత్మునకు రత్నచిత్రవిభూషా
భాభూషితాంగునకు రవి
భూభూపాలునకు రామభూపాలునకున్. 28

వ. అంకితంబుగా నాయొనర్పంబూనిన కులశేఖరచరిత్రంబునకుం గథాక్రమం
బెట్టిదనిన— 29

చం. శమదమ సత్యశీల గుణసంపద సొంపువహింప వైష్ణవో
త్తములు ప్రభాతవేళ నుచితజ్ఞత మేల్కని తామ్రపర్ణికా
విమలజలావగాహనము వేడ్క నొనర్చి సితోర్ధ్వపుండ్ర దీ
ప్తముఖసరోజులై జపతపః క్రియలన్ నివసించి యున్నెడన్. 30

కం. అందొక దేశికమణి ని
ష్పందముకుందాంఘ్రిభక్తి భజనాసక్తిం
జెంది సికతాతలమ్మున
సుందర పద్మాసనైక శోభితుఁడగుచున్. 31

వ. విచ్చేసియున్న యెడ శిష్యప్రవరులయ్యాచార్యపురుషునకుఁ బ్రదక్షిణ ప్రణామమ్ములాచరించి యంజలిపుటంబులు నిటలతటంబులం గదియించి యిట్లని విన్నవించిరి— 32

ఉ. దేవరవారు మున్ను వసుదేవకుమారక భక్తవృత్తముల్
పావనసూక్తులం దెలియఁబల్కితి రక్కులశేఖరాభిధా
నావనిభర్త సచ్చరిత మద్భుతరూప మనంగ నాత్మలన్
దావలమయ్యెఁ గౌతుకము దాసులకున్ గృప నానతీదగున్. 33

కం. అనుచుం బ్రార్థించిన శి
ష్యనికాయముఁ జూచి పలికె నాచార్యుఁడు మీ
రనుపమభక్తిన్ వేడిన
ఘనుచరితంబిపుడు దెలియఁగా వివరింతున్. 34

కం. శ్రీదమ్ములు దళితాశ్రిత
ఖేదమ్ములు దుష్టహృద్విగీతాచారో
చ్ఛేదమ్ములు శోషితభవ
శాదమ్ములు విష్ణుభక్తజనపాదమ్ముల్. 35

కం. పావనములు వినమితసుజ
నావనములు విబుధకోకిలాశ్రయణమధు
శ్రీ వనములు కృతమునిసం
భావనములు విష్ణుదాస పదసేవనముల్. 36

వ. అదిగావునఁ బ్రపన్నపురుషశ్రేష్ఠుండగు కులశేఖర మహీపాలుని చరిత్రంబు పురాతనభాగవతపరంపరాముఖోదీరితంబై వచ్చుచున్నయది. పరమపవిత్రం బగు తచ్చరిత్రంబు మీకు దెలియునట్లు వివరించెద సావధానులరై వినుండని పల్కి ప్రసాదసుముఖుండగుచు వారలఁజూచి యిట్లని యానతిచ్చె— 37

ఉ. శ్రీకరమై సుధీజన వశీకరమై బహుదివ్యరత్న ర
త్నాకరమై విదేహమగధాంధ్ర కళింగ శకాంగముఖ్య దే
శాకృతులన్ దదీయవిభవాతిశయమ్ముల మించి సంతత
ప్రాకటభాగ్యసౌఖ్యములఁ బ్రస్తుతి కెక్కిన కేరళమ్మునన్. 38

పురవర్ణనము

తే. సంపదలకెల్లఁ దామరతంపరగుచు
ధారుణీదేవి యాననదర్పణమ్మ
మాడ్కి సురనరనగరోత్తమంబులందు
మేటియననొప్పుకుక్కుట కూటపురము. 39

సీ. ఉగ్రసేనారూఢి నుల్లసిల్లెడిగాని
మధురసంతత సౌఖ్యమహితగాదు
గురుకృపాధిగమభాసురము గాని గజాఖ్య
నగరమ్ము దుశ్శాసనమ్ము గాదు
హంససంతతి విలాసాస్పదంబగు గాని
సాకేత మనగరాస్పదముగాదు
బాణ ప్రతాపసంభాసమాన్యము గాని
శోణం బదోషాటసులభి గాదు

తే.గీ. ధరణి నటువంటిపురము లెక్కగణి నొకటఁ
గొఱఁతవడుగాని కుక్కుటకూటనగర
మలరు నారోగ్య ధర్మశిక్షా, సుపేత
కపటచరణ సుధీపుణ్యకలన వలన. 40

ఉ. మేటి కవాటపాళికల మీఁద నమర్చిన నూత్నరత్నపుం
దేఁటమెఱుంగు లంగముల నివ్వటిలంగఁ బురప్రఘాణ పా
ర్శ్వాటన వేళలాదు శబలాంబరధారణ లీల లేర్పడన్
నీటు దలిర్ప నొప్పుదురు నిర్ధనులున్ ధనులొక్కరై వడిన్. 41

ఉ. మేడలమీఁది నెత్తముల మేలగుచంద్రిక సాంద్రపింఛముల్
వేడుగ విప్పువార గొని సొంపుగనాడెడి నెమ్మిపిండువున్
జూడఁగ వచ్చియందు పురసుందరులన్ వెసఁ జూచి యచ్చరల్
వ్రీడ ఘటింప మోము లరవెట్టుదు రీసులకున్ మఱుంగుగన్. 42

శా. సౌధద్వారహయమ్ములం గని సముంచద్భాస్కరాశ్వంబు లు
త్ప్రోథోదీరితహేషితార్భటుల నాక్రోశింప భీతిల్లి త
త్ప్రోథోజానన లాననమ్ములుసెమర్పన్ గృత్రిమాశ్వంగముల్
బాధాహేతువులంచుఁ గప్పుదురు కూర్పాసమ్ములన్ మేనులన్. 43

ఉ. అంబరవాహినీ జలగుహాకర కోకగణమ్ము వీఁటి సౌ
ధంబుల పైఁ జరించెడుసుదంతుల కన్నుల మీనులంచు ని
చ్చం బఱతెంచి తద్వదనచంద్రులపై కెదురెక్కలేక వే
గంబ పిఱిందికిందిరిగి గాసిలుఁ గామిత విఘ్నసిద్ధికిన్. 44

సీ. చందన సహకారచాంపేయ పాటలీ
వకుళ పున్నాగద్రువర్ణితములు
బహు పతత్ఫలరసప్రవాహణీయ వేణికా
ప్లావిత సుమరజః పంకిలములు
ప్రత్యగ్రకిసలచర్వణ జాతకాకలీ
కోకిలకుల విహారాకరములు
మంజులమకరంద మాధురీసాహిత్య
మదవ దిందిరమందిరములు

తే.గీ. అంతరాంతర సరసీలతాంత విసర
సురభితానిలబాల సంచరణ శామ్య
దంతికాయాత పథికఘర్మాంకురములు
వెలయు నుద్యానవనము లవ్వీఁటి కడల. 45

సీ. శుచియు నాఁదగియు నాశుగసఖుండాత్మలో
నరసిచూడఁగ నాశ్రయాశుఁడనుచు
బుధుఁడయ్యు నమృతాంశుపుత్రుండు సతతోగ్ర
కర సన్నిధానానుకారి యనుచు

గురుభావ మందియు సురరాజమిత్రుండు
రాజప్రియాంగనారక్తుఁడనుచు
కవియయ్యు భార్గవుఁడవిరళ కలుష దో
షాచరసముదయాచార్యుఁడనుచుఁ

తే.గీ. దారుశుచితా, శుభావాసతా, జితాక్ష
తా, ఘనాశ్రయతా, ది సద్ధర్మయుక్తి
నతిశయిల్లుచు సత్యవ్రతాఢ్యులగుచు
వేడ్కఁ నొప్పుదు రవ్వీటి విప్రవరులు. 46

సీ. భుజమూలములఁ జతుర్భుజసాధనములైన
ఘనశంఖ చక్రలాంఛనము లమర
రసనాంచలముల నారాయణద్వయమంత్ర
లలితాక్షరమ్ములు చెలిమిఁ దెలుప
మనముల నుపనిషద్వనధిప్రమథన ని
ష్కృష్టతత్త్వామృతసేవ దనర
సల్లాపముల విష్ణుచర్యాతదీయ పూ
జావిశేష ప్రపంచన మెసంగ

తే.గీ. మహితసౌరభనళినాక్షమాలికాస్ఫు
రద్గళమ్ముల నూర్ధ్వపుండ్ర ప్రదీప్త
ఫాలముల సొంపుదాల్తు రప్పట్టనముఁ
బరమవైదికులగు మహాభాగవతులు. 47

చం. దళమగు వాసుదేవపరతత్త్వ నిబంధన వాదఘోషణం
బుల హరిపూజనక్రమనిబోధన మంత్రరవంబులన్ నవో
త్పలరుచు లుల్లసిల్ల నునుపాఱెడు తిన్నియలన్ దనర్చి ని
ర్మలగతి నయ్యగార్ల తిరుమాళిగ లప్పురి నొప్పునెంతయున్. 48

ఉ. కంతులు రూపసంపదల గాఢపరాక్రమలీలలన్ శచీ
కాంతు లఖండకీర్తి కళికాపరిపూర్ణత, పూర్ణిమానిశా
కాంతులు సాంద్రసద్గుణనికాయనిశాంతులు సాధురక్షణ
తాంతులు క్షత్రియోత్తములు కాపురముండుదు రప్పురమ్మునన్. 49

మ. పటుగోరక్షణముం గృషిక్రియ యనల్పంబైన వాణిజ్యముం
దిట మొప్పం దమవృత్తులై నడుప నర్థిన్నిత్యసంపాది తో
త్కట నానాధనధాన్యలాభముల యక్షస్వామి నోడించుఁ గో
మటు లవ్వీఁట వసించియుండుదురు సమ్యగ్దానపారీణులై. 50

కం. భీరు లసత్క్రియల, మహో
దారులు సత్పాత్రముల, బుధద్విజసేవా
ధీరులు సంగ్రామకళా
శూరులు తత్పురి వసించు శూద్రప్రవరుల్. 51

ఉ. కొండలపెంపు గెల్చు రథకోటులు కాఱుమొగిళ్ల భంగి నొం
డొండ చెలంగు మత్తకరు లుజ్జ్వలఘోటకముల్ ప్రచండ కో
దండకళోద్భటుల్ భటు లుదగ్రతఁ బెంపువహింప వైరి దో
శ్చండిమ గండడంచు బలసంపద నప్పుర మొప్పు నెంతయుం. 52

చం. సరసిజపత్రలోచనలు చంద్రనిభాస్యలు తప్తహేమసుం
దరతనువల్లు లుల్లసితధర్మ పరిశ్రమనైపుణీ మనో
హరచరితల్ పతిప్రియగుణాన్విత లవ్యయపుణ్యగణ్య ల
ప్పురిని పురంధ్రికామణులు పొల్పువహింతురు శీలసంపదం. 53

సీ. తనుకాంతులకు నోడి తపియించి కరఁగు హే
మార్తికి హేమ తా నార్తిఁ గాంచె
విపులోరుదీప్తికి వెఱ యూఁది రంభ కం
పింపంగ రంభ కంపింపఁదొడఁగె
కమనీయనిటలరేఖకు నోడి శశిరేఖ
కృశియింప శశిరేఖ కృశత గాంచె
విమలలోచన సౌష్ఠవమునకు హరిణి భీ
తిలఁ జూచి హరిణి భీతిల్లఁదొడఁగె

తే.గీ. న ప్పురమ్మున నుండు వారాంగనాంగ
కోపమాన పుంజంబిట్లు లోటువడుట
గాంచి తన్నామ గంధయోగమునఁ జేసి
తలఁకి రచ్చర లెద నపత్రప జనింప. 54

చం. కులుకుమిటారిచన్గవలు కోమలబాహులతా యుగంబు లం
చలగతులన్ గలంచు నడ, సన్నపుగౌనులు విద్రుమంపు సొం
పలవడుకెంపు వాతెఱ, లొయారపుఁజైవులు వింతగూర్చు చెం
తల వెలయాండ్రఁ గన్గొనినఁ దాపసులైనఁ జలింతు రప్పురిన్. 55

సీ. శుభనాస! చాంపేయసూన మంటెద మన్న
నందునే చంద్రమధ్యస్థ మంద్రు
ఏణాక్షి! కలువ లాఘ్రాణింతు మన దుర్ల
భము జోడువిండ్లు కాపాడు నంద్రు
సుకుచ! తామరమొగ్గలకు జయంబు నవం
భస్థానజములు చేపడునె యంద్రు
సుదతి! కందమ్ములసొం [పెద్దియనసుధా]
స్వాదమ్ములవి యగోచరము లంద్రు

తే.గీ. చారుగతి నొప్ప విపణిదేశములయందు
వరసుమస్తోమ విక్రయవ్యాజగతుల
కాముకులతోడ సరసవాగ్రచన లెసఁగ
వీటఁ జరియించు కుసుమలావీజనమ్ము. 56

సీ. చెలి! సదోచితముఖోజ్జ్వలమైనమావి కెం
జిగురొకించుక నొక్కఁజెందరాదె!
శుకవాణి! యళి లసల్లికుచగుచ్ఛమ్ములు
డాసి గోరంత ముట్టంగరాదె!
రుచిరాంగి! విరళాప్త రోచనాబ్జంబులు
గోరి యొక్కింత మూర్కొనఁగరాదె!
సకియ! వికారమై చను వికచోత్పల
శ్రేణి మెల్లన సవరింపరాదె!

తే.గీ. యనుచుఁ బల్లవు లధరస్తనాక్షి కేశ
కలనభాషింపఁ దేనెలు గాఱిపోవ,
నొక్కులకు, కొరెసఁగు దేంట్లు గ్రక్కసించు
వలదువలదంద్రు సుమలావికలు పురమున. 57

ఉ. ఆ పురమేలుచుండు సముదంచిత బాహుబలప్రతాప సం
దీపితకీర్తిమూర్తి పరిధిస్ఫుట దిగ్వలయాంతరక్షమా
ద్వీప సమార్జితద్రవిణ విశ్రుతవైభవశాలి, దాన వి
ద్యావరతన్ దృఢవ్రతశుభాఖ్య వహించి నృపాగ్రగణ్యుఁడై. 58

శా. పాలించెన్ వివిధాశ్రమానుగుణ సంభావ్యప్రజారక్షుఁడై
యాలించెన్ గృపమీఱ దుర్విధజనోక్తాలాపముల్ బాహులన్
గీలించెన్ జతురంబురాశిరశనాక్షీణ క్షమాచక్రమున్
దూలించెన్ బటుమండలాగ్రమున నస్తోకద్విషత్సైన్యమున్. 59

సీ. చెట్టునబొక్కెడు చెలమ గ్రుక్కెడుగాని
నన్నంబునీళులు నంటరింట
నాఁగి నారచీరలు తొగలపేరులుగాని
నవ్యాంబర విభూషణమ్ము లిడరు
పులితేటిగంతులు పులుగురంతులుగాని
నటయూథ నాట్యగానములు వినరు
కొండలచెంతలు గుళ్లపొంతలుగాని
సౌధ పర్యంత దేశములు గనరు

తే.గీ. రణమహీస్థలి నమ్మహారాజు నెదిరి
యోటువడి వ్రీడఁజెంది పానాట హూణ
మద్ర మాళవ సౌవీర మగధ పాండ్య
కురు కరూశాంగ నేపాళధరణిపతులు. 60

సీ. తనభృత్యునిగఁజేసె దాశార్ణభూపతి
ననుచరత్వం బిచ్చె నంధ్రపతికి
వంగభూపాలుని వశునిగా నొనరించెఁ
జెలికాని గావించె సింధువిభుని
సేనానియంతగాఁ జేసె మత్స్యాధీశు
నయమొప్పఁబ్రోచె గాంధారరాజు
నశ్వవరేణ్యుగా నరసె లాటవరేణ్యు
సఖుని గావించెఁ బాంచాలపతిని

తే.గీ. నవ్విధంబున నిఖిలదేశాధినాథు
లనవరతమాత్మహితకారులై చరింప
నల దృఢవ్రత భూపాలుఁడతులకీర్తి
భూషిత దిగంతరాళుఁడై పొలుపు గాంచె. 61

సీ. బ్రాహ్మణుల్ క్రతుకర్మ పరిణతుల్ గాంచిరి
తగువేళ వరముల్ దనియఁ గురిసె
ధనధాన్యరాసులఁ బెనుపొందిరి జనంబు
లవిరళగతుల ధేనువులు పితికె
బహుసస్యసంతతుల్ ఫలభాజనములయ్యె
కలకాల మొగిఁ బచ్చికసవు గలిగె
వనములు సుమవైభవంబులఁ దనరారె
చోరప్రసంగముల్ దూరమయ్యె

తే.గీ. సకలవంశప్రసూతప్రజాసమృద్ధిఁ
బిల్లచెఱకీనినటుల శోభిల్లె ధరణి
యమ్మహీభర్తయయ్యె విధమ్మలెఱిఁగి
మనుజకోటుల శాసించి మనుచు కతన. 62

వ. ఇవ్విధమ్మున నవ్వసుంధరావల్లభుండు కనకకలధౌత కరితురగమణిగణ ప్రముఖవస్తు ప్రదానసమయసముద్గత సలిలధారాపరిగ్రహసమర్ధార్ధి జనానంద ప్రవర్ధమానకీర్తిచంద్రకాధవళీకృతదశదిశాంతరాళుండును, నిరంతర స్వవినయ భక్తిపూర్వకవందనానందితమహాభాగవతకటాక్షవీక్షణాసాదిత భాగధేయవైభవోజ్జ్వలుండును, ప్రచండదోర్దండమండిత కోదండపాండిత్యవశంగతరాజన్య పర్జన్యప్రవర్షితావిరళద్రవిణధారాసంపాతసంపూరితభాండాగారుండునునై నిఖిలప్రజాభ్యర్థితదై నందినమహాసామ్రాజ్యవైభవసమృద్ధిన్ బ్రసిద్ధి వహించి పెద్దకాలమ్ము రాజ్యమ్ము చేసి యొక్కనాఁడు— 63

సీ. విమల ధర్మాధర్మవిదులైన విద్వాంసు
లొకవంక సద్గోష్ఠి నోలలార్ప
మహనీయశౌర్యసామంత భూకాంతులు
కోర్కెచే నొకచాయఁ గొలువుసేయ

నరిభయంకరమూర్తులై యొప్పు రాహుత్తు
లోకచక్క మాఱుగేలూఁది నిలువ
గాయక వందిమాగధ బృందమొకవంక
నమరి యాత్మీయగీతములు పాడ

తే.గీ. నాదిగర్భేశ్వరా! పరాకా! యటంచు
సౌవిదల్లులు దన్ను హెచ్చరిక సేయ
రమణు లిరుగడ వింజామరములు వీవ
నరవరేణ్యుండు సింహాసనమున నుండి. 64

క. ఆటలఁబాటల బహువా
చాటోక్తులఁగొంత ప్రొద్దుచనునంత నిరా
ఘాటముగ వేఁటతమి మదిఁ
బాటింపుచు విభుఁడు సైన్యపతితో ననియెన్. 65

రాజు వేఁటకేగుట

మ. సదసత్కార్యవిధిజ్ఞులార! మృగయాసంచార మొక్కింత స
ల్పుదమే! యంచు వచింప నియ్యకొని యో భూనాథ! యివ్వేళ మం
చిద మాకున్ బ్రియమయ్యె దేవర బలశ్రీ మీఱ, నానామృగా
స్పదకాంతార విహారలీలలఁ జరి పన్ జెంత వీక్షింపఁగన్॥. 66

కం. అని పల్క, నాటవికులన్
గొనిరండని భటులఁ బనుప గొబ్బున వారల్
చని పిలుచునంతఁ బ్రజ తమ
వనచరభావంబుఁజూడ వచ్చిరి సభకున్. 67

కం. వల లురిత్రాళ్లును దగు బో
నులు గాలమ్ములు గదాధనుశ్శరకుంతం
బులు మొదలగు సాధనములు
నలవడ ధరియించి భీషణాకృతులొప్పన్. 68

సీ. కరిగంటు పులిగొంగ కఱకుమీసలబంటు
సయ్యాటములమారి చట్టుగుండె
కొఱవిచూపులబూచి కుప్పిగంతులదిట్ట
యడవులరాకాశి పిడుగుతునుక
జల్లితోకబెడంగు పిల్లులబూతంబు
గవగచ్చికపిసాళి గబ్బిమెకము
ఉరుకులగండుకక్కుర పొంచులాడు గుం
పులమారి జముకోఱ పులుఁగుచూడు
తే.గీ. అక్కన గుబాటుకాఁడు పేరుక్కుతునియ
యనుచు నామమ్ములిడి పెంచినట్టి జాగి
లముల గొలుసుల నిడికొని తమకమడర
నరుగుదెంచిరి యెఱుకు లయ్యధిపు కడకు. 69

ఉ. భూతలనాథుఁ జేరి జయపూర్వక శబ్దములుచ్చరించుచున్
జేతులుసాచి మ్రొక్కి పెడసెయ్యడి ముందటనిల్చి సామి! మీ
తాతలు తండ్రులున్ గరుణ దప్పకసాకిరి మామ సళ్ల, మే
మీ తరువాత దేవరయె యేలికగా సుకముంటి మెంతయున్. 70

కం. ఓడక మీ పాదమ్ముల
నీడలఁజరియించు మమ్ము నీ సొమ్మనుచున్
జూడుము మా కొలఁదుల కిక
నీడగు పనియాజ్ఞ సేయు మెంతయుఁ గరుణన్. 71

చం. అనవుడు నా నృపాలుఁడు దయామతి వారల నాదరించి గ్ర
క్కున విడిదాంబొసంగి పటుఘోటకరాజము లీల నెక్కి త
క్కున బహువీరమంత్రి హితకింకరవర్గము సుట్టిరా, వెసన్
జనియె తరక్షుభల్ల కిటిసైరిభఘోరవనాంతభూమికిన్. 72

సీ. వడిఁబన్నిదముఁ జేసి పొదవైనపొదరిండ్లఁ
దొడరి యావలఁ బడ దుముకువారు
రంపటిల్లెడు మల్లరంపు గిత్తలవోలె
నెడనెడ వడి బొబ్బ లిడెడివారు

వడఁద్రోళ్లు వెట్టిన వెడఁదపెందొడలపై
    సారెసారెకు మల్లసఱచువారు
పటుతరాయుధము లిట్టట్టుద్రిప్పికొనుచు చే
    ర్వాడి లక్ష్యమ్ములవైచువారు
తే.గీ. నగుచు వనచరభటులు సాహసికవృత్తి
గ్రామ్యబలముల నృపవరుఁ గడచి కలిసి
శరభశార్దూల సింహకాసరములాది
యగు మృగమ్ములఁబడవైచి రలవు మెఱసి. 73

కం. అత్తఱి నాగరవీరుల
మొత్తము లారణ్యకులు నమోఘ[సిత]శరా
యత్తములఁ జేసి వివిధమృ
గోత్తముల నవనిఁ గూల్చి రుగ్రార్భటులన్. 74

తే.గీ. జీవురులనంటి వలలకుఁ జేర్చి బోను
లందుఁ జొఱఁద్రోలి యురులచే డిందుపఱచి
పొసఁగఁబట్టిరి, కొన్నింటిఁ బొడవడంచి
రెలమి ఖగముల మృగముల నలవుమెఱసి. 75

భుజంగప్రయాతం. జగద్భీకరాత్మీయ సైన్యంబు లిట్లా
మృగస్తోమముం ద్రుంచి మెప్పించువేళన్
మొగమ్మందు నుత్సాహమున్ సొంపు దోడై
తగన్ ఘోటమున్ గాలఁ దాఁటించె లీలన్. 76

కం. ఘోటకము దుముకఁ జేయుచుఁ
బాటవమున విల్లు బూనిపటుమేఘనిరా
ఘాటధ్వని పురణింపఁగ
జ్యాటంకృతు లెసఁగఁ జేసె జనవరుఁడెలమిన్. 77

కం. ఈ రీతి నిజగుణధ్వని
క్రూరత నందంద వెడలి రోదసి నిండన్
జేరువ నొక యారమ్మున
గూరికియున్నట్టి లేడిగుండియ లవియన్. 78

ఉ. లేచి తటాలునం జమికి లీలమెయిన్ బరువెత్తిపోవగాఁ
జూచి నృపాలుఁ డామెకము జొప్పడ బిట్టడలించి తన్ను ప్రే
రేచెడు దైవసంగతి హరిన్ హరిణీపథయుక్తిఁ జొన్పె మా
రీచుని త్రోవ మున్ననుసరించిన రామ మహీశు చాడ్పునన్. 79

వ. ఇవ్విధంబున నమ్మహీకాంతుండు దురంతకాంతారసీమాభ్యంతర
మార్గంబున ననర్గళసంచారసముదంచితసముత్తుంగతురంగమంబు నా హరిణీలలా
మంబు వెంటనంటం బరపి గెంటని తమకంబునం బ్రచండభుజాదండమండిత కోదండ
నిర్ముక్తకాండపరంపరన్ జంపనొల్లక దిట్టతనంబునం బట్టందలంచి తరుషండంబు
నకుం గేడించియు నికుంజపుంజంబులపయిం జవుకళింపం జేయుచు నేఱులపయిం బఱ
పియు నతివిభ్రమకరాదభ్ర చక్రభ్రమణంబుల నిట్టట్టు ద్రిప్పియుం బుడమి తేఁడు పిఱింది
దెసం దఱిమికొని రా నిరీక్షించి చెదరిన హృదయమ్మునకు దురుపఱుప నేరక యంత
కంతకుం బెరుఁగు తత్తరమ్మున— 80

సీ. తురగరింఖోద్ధూత ధరణీపరాగమ్మ
కనుదోయిఁ గ్రమ్మినఁ గలఁగి కలఁగి
పటుహయాంఘ్రిన్యాస భయదార్భటుల పేర్మి
నుడియు విభ్రాంతిచే సొరిగిసొరిగి
సంక్షుబ్ధ వక్రసంచార శ్రమంబున
నొడలు కంపింపంగ నొదిగియొదిగి
యెడనెడ నృపుఁ డొనర్చెడు సింహరవముల
వెడవెడ నరచుచు నడలియడలి

ఆ వె. కొంతదూరమఱిగి యంతటఁ జిడిముడి
నడలు గడలుకొనఁగ నడువలేక
యొక్క సరసిచెంత నుర్వీశుఁ డీక్షింప
హరిణి తల్లడిలుచు నవని వ్రాలె. 81

వ. అంత నమ్మహీకాంతుండు డాయంజని. 82

సీ. కడుపశిఁ జలియించు కన్నుల కొలఁకుల
నుడుకుజలమ్ములు విడుచుదాని
వెలియూఁది యంగముల్ విరవిరవోవంగ
నగ్గలమ్ముగ వడకాడుదాని
ప్రాణముల్ చంచలభావమందఁగ నోఁట
గళగళ నురువులు గట్టుదాని
మార్మ్రోడ యిడుచు నుమ్మలికంబు దోవంగ
నొయ్యనఁ గుట్టూర్పు లూర్చుదాని

ఆ॥ వె॥ హరిణియువతిఁ జూచి యందంద తనలోనఁ
బాపభీతియును గృపారసమ్ము
గీలుకొనఁగ నవుడు కృష్ణ కృష్ణా! యంచు
నగ్గలించి హాయము డిగ్గనుఱికి. 83

కం. ఈ తెలుఁగున హరిణింగని
శీతల సికతాతలంబుఁజేర్చి కడానీ
పూఁత దువ వలువ ముసుగిడి
చేతుల నుదకంబు పట్టి చిలుకుచు మఱియున్. 84

ఉ. హా! యిదియేటివేఁట యను, నబ్బురపాటున దీనిఁజూడ నే
లా! యను, నాగ్రహింపదగునా యను, నెంత చలమ్ముగొంటి నౌ
రా! యను, లేటి నిట్లలతురా యను, నింతదలంతె శ్రీనివా
సా! యను, సమ్మహీశుఁడు విదార్తి పరిక్షుభితాంతరాత్ముఁడై. 85

వ. ఉన్నయవసరంబునంగొంతవడికి సేదదేఱి తదీయకరకమలసంస్పర్శ విముక్త సకలకలుషబంధయగు నా హరిణాంగన పూర్వజన్మ సుకర్మవాసనావిశేషంబున జనితవిజ్ఞానయై పుణ్యంబునం గృపాళుండగు నృపాలుంజూచి మనుష్యభాషణంబుల నిట్లనియె— 86

హరిణి పూర్వకథ

శా. క్షోణీవల్లభ! మానసంబునఁ బరిక్షోభించెదేలయ్య! మున్
బాణవ్రాతముచే నరాతిభట శుంభత్కుంభిఘోటకరథ

శ్రేణింగూల్చెడిచోఁ జలింపవు కడుం జిత్రంబహో! నేఁడు సం
క్షీణం బౌనొకో! లోకమంతయు మృగస్త్రీ నొక్కతెం జంపినన్. 87

చం. సమరమునందు శత్రుబలసంఘము ముందట వేటలాడుచో
సమదకురంగశల్యకశశవ్రజమున్ వధియించుటల్, క్రతు
ప్రముఖసుకర్మవేళల నపారధనవ్యయబుద్ధి సల్పు, టు
త్తములగు ధారుణీశులకు ధార్మికవర్య! నిసర్గవృత్తముల్. 88

తే॥ గీ॥ కాన మిముబోటి యుత్తమ క్షత్రియులకు
మృగనిబర్హణకృత్యంబు తగవు గాఁగ
నెఱిఁగెఱింగియు ననుఁ బ్రోచి శుద్ధచరిత!
క్షితి నిత్యోధికసౌభాగ్యసిద్ధిఁ గనుము. 89

కం. ఈ కరణి హరిణి పల్కిన
యాకస్మికమనుజభాష లాలించి ధరి
త్రీకాంతుఁ డిట్టులను న
స్తోకతరాద్భుతరసాభిజుష్టాత్ముఁడై. 90

చం. హరిణ! కులమ్మునం బొడమి యద్భుతమానుషభాషణమ్ము తే
వెరవున నేర్చి, తందు నృపవీరకులోచితధర్మమార్గ వి
స్తరము లెఱుంగుటెట్లు! మృగజన్మ కుతూహలతం జరించు ఖే
చరసతివౌదొ! యక్కట నిజమ్ముగ నేరివో! చెప్పుమేర్పడన్. 91

కం. అనవుడు నిట్లను నదిహా
జనవర! మత్పూర్వకర్మ సంగతిని బొసం
గిన లేటితనం బిది చ
క్కన వినుము మెఱిఁగింతు నాదుకత దెలియంగన్. 92

సీ. కురుదేశమున లాంగూలపురమ్మునాఁ
గల దొక్కనగర మత్యలఘులీల
నందుండు ధర్మజ్ఞుఁ డనెడి విప్రుఁడు నే
నర్మిలి కూఁతుర నవనినాథ!

మా తల్లిదండ్రులు మన్నన దళుకొత్త
    నేఁ గోరినవియెల్ల నిడుచుఁ బెంప
నొకనాఁడు నాయీడు సువిదలతోఁ గూడి
    యాడుచు నుండ మాయయ్య చూచి

తే.గీ. నాదు గుణరూపములకు నానంద మంది
యుత్తమాములు మఱఁదులు నాడుబిడ్డ
లుండ సిరులందియున్న చోటొకటి గాంచి
చిత్తమున నన్ బరాధీనఁ జేయఁ దలఁచి. 93

కం. ఆ విప్రున కగ్రసుతుం
డై వెలసిన చంద్రకునిఁ బ్రియం బెసలారన్
రావించి పరిణయం బొగి
గావించిరి యగ్నిసాక్షికముగ నృపాలా! 94

కం. తగు మొదవులేను దాసీ
యుగళము వస్త్రాభరణసమున్నతి యరణం
బుగ నిచ్చి యంత నను జ
క్కఁగ మావా రనిచి రత్తగారింటికొగిన్. 95

తే.గీ. ఏను నుబ్బుచు నత్తవారిల్లు సొచ్చి
పొలుపు దీపింప నాసాటి పువ్వుబోండ్లు
మెచ్చఁ బనులందు నేరుపు లచ్చుపడగ
నిపుణమతి నొప్పుచుందును నృపవరేణ్యా! 96

సీ. సుకుమారనయ్యు నే నొకవేళయందైన
    నలసితి నని యుస్సురస్సు రనను
ఈవలి దావల నిడకున్నదాన న
    య్యును నోర్చి చెప్పినపనులు మఱువ
నఖలవదార్థమ్ము లనుభవించినదాన
    నయ్యు పెట్టరు పొయ్యరని తలంప
గారవమ్మునఁ బెంపు గనుదాన నయ్యును
    గసరులఁబడి మదిఁ గ్రక్కసింప

తే.గీ. మామకోపించునో ! యంచు మగనిమనసు
కందునో ! యంచు మఱందులు కాఱు లఱతు
రనుచు భయమగ్గలింప నే ననుసరింతు
మండలేశ్వర! యత్తింట నుండునపుడు. 97

సీ. పని సాల గలిగియున్నను బొరుగిండ్లకు
నడువ నెన్నండును నరవరేణ్య!
పలుకరించిననైనఁ బరపూరుషుల వంక
తేఱిచూడను ధరిత్రీలలామ!
తిట్టిననైన నర్థి గురువ్రజంబుల
నట్టిట్టు వలుక మహానుభావ!
నడురేయినైన మానక యత్త చెప్పిన
కృత్యముల్ మఱువ నక్షీణవిభవ!

తే.గీ. యిట్లు నిరతంబు భయభక్తు లెసఁగ నేఁ జ
రింపుచుండంగ మత్పూర్వకృతము దక్క
కారణము లేకయును జండిక యనఁ బరగు
నత్త చిత్తమ్మునకుఁ గసరెత్తె నయ్య! 98

వ. ఇట్లు దినదినప్రవర్ధమానరోషాయత్తచిత్తయగు నత్త నాయెడం బెరిగిన
చలమ్మువిడింపక- 99

సీ. ప్రాణపదమ్ముగాఁ బాకమ్ముసేయ ము
ప్పోకలకూడంచు ముట్టియాడు
గృహకృత్యముల నాచరింప దగ్గఱి యింత
వడకంచు నడునెత్తి యడచిపోవు
పని చెప్పవనిచి చయ్యన మగవారితో
నింట నిల్వదటంచు నెచ్చరించు
ముందటఁ జనఁగఁ బిఱుందఁ దా వచ్చుచు
మోము నిట్టట్టుద్రిప్పి మూతి విఱుచు

తే.గీ. మొకమువలె నిల్లు సేఁగి నామీఁద మగని
మదిని మఱఁదులయాత్మల మామగారి
యుల్లమున సివమెత్తిన ట్లుగ్రకోప
బుద్ధి పుట్టించె నేమి సెప్పుదు నరేంద్ర! 100

కం. మును గయ్యాళితనమ్మున
నొనరిన మా యాడుబిడ్డ లుగ్రతఁ దమ్మం
జనని కనుగిలుప నా మా
టనినం బైవత్తురొంటియుడుగున నధిపా! 101

చం. తెలతెల వేఁగుసంతనె యతిత్వరగైకొని మేలుకాంచి ని
ర్మల ముఖమార్జనాదుల సమంజసనై గృహశుద్ధి మున్నుగా
సలవొనరించి శాకములు నన్నముడింపగ నిద్రదేఱి యొ
త్తిలి గళమొత్తి యత్త నను దిట్టును గూఁతులు తోడుపల్కఁగన్. 102

సీ. మా తండ్రి యొసఁగిన మాణిక్యకటకముల్
తెమ్మంచుఁ దనదు సందిట ఘటించె
నమ్మ పెట్టిన పటుటంచుచీరలు నాల్గు
డక్కరి తోడికోడండ్ర కొసఁగె
ముత్తవ దయసేయు ముత్యాల పట్టెడ
వడిఁ బుచ్చుకొని కూఁతుమెడఁ దవిల్చె
యన్న యిచ్చిన పదార్వన్నెయొడ్డాణమ్ము
వదలించి చెల్లెలివైపు జేర్చె

తే.గీ. నన్నియునుగల్గి యరణంపుటాల నమ్మి
కొనియెఁ బరిచారికల నీళ్లు గూఁడు నిడక
నడలఁ గొట్టించె మా పుట్టినింటిసొమ్ము
వీసమైనను లేకుండఁ జేసె నయ్య! 103

ఆ. వె. మూఁడుజాములరుగ ముంగేల నన్నమ్మ
వెట్టి సనుచు నాల్గు దిట్టి దీని
తిండివలన సమసెఁగుండకుండంతయు
ననుచు వీధిజనులు వినఁగనాడు. 104

కం. ఈ రీతి నింటఁ గల్గిన
వారందఱు నటులసేయ వసుధేశ! వగం
గూరి తలమునుకలై సం
సారము దెస రోసి మది విచారము దోఁచన్. 105

చం. కటకట! పూర్వజన్మ కృతకర్మమదెట్టిదో! తప్పొకింత లే
దిటుల దురాగ్రహమ్ము దలకెత్తుక యూరక రంపటిల్లుచుం
దిటమఱి యున్న నన్ను నొగిఁ దిట్టియు గొట్టియు నత్త చిత్తమి
ప్పటికిని శాంతినొందద యుపాయము నామది దోఁచదేమియున్. 106

చం. తోడిబడి కన్నవారొసఁగు తొఱ్ఱుల నమ్మి రోకించుకైన న
న్నెనఁగక సొమ్ముఁబుచ్చుకొని, రన్నము నీళులు వేళపట్టు నం
దిడక యుదల్చి యూడిగఁపుఁటింతుల నిల్వెడలంగఁ ద్రోచి, రీ
నడవడి వీరికిందగియె నాయముగాదని చూడరక్కటా! 107

ఆ. వె. కన్నవార లిచటికత లెఱుంగరు వార
లెఱిఁగియేమి' యొరులకిచ్చినపుడె
పట్టుచెడు స్వతంత్రపద్ధతు లయ్యాస
విడిచి పడినచోట వెదుకవలయు. 108

కం. అనితలఁచి మఱియు నీయడ
లున కత్తయె మూల మాత్మలో నయ్యమకున్
గనికరముపుట్టఁజేసిన
వెనుకన్ భయమెడలుగాక వెంటంబడునే! 109

వ. ఇట్లువిచారించి సవినయసల్లాపమ్ముల నత్తచిత్తమ్ము గఱఁగింపందలంచిన దాననై యొక్కసమయంబు నెడగని డాయంజేరి సముల్లాసహాసభాసురముఖ యగు నయ్యమ పరుండిసాచిన యడుగులు తొడలపయింబెట్టుకొని మెత్త మెత్తనఁ గర తలంబుల నొత్తుచు నల్లన నిట్లంటి. 110

కం. పొలఁతుఁకు నత్తమామలు
దలపోయఁగఁ దల్లి తండ్రి దైవము గురుఁడున్

గలనైన వారికెగ్గులు
పలుకంగారాదు నీతిపథ మూహింపన్. 111

ఉ. పెంచిన తల్లిదండ్రు లరసేయక మీపదసేవకై సమ
ర్పించిరి నన్ను మీకు బెదరింపదలంచిన నాదరించినన్
మంచిదకాక యన్యులిక మాకెవరమ్మ! మదిందలంపు మీ
పంచఁ జరించుదాన దయఁబాయఁగ నేమిటికమ్మ! నాయెడన్. 112

కం. తిట్టియుదీవించియుఁ జే
పట్టి కరుణఁ బ్రోచునట్టి భారంబొగి నీ
పట్టున నుండఁగ మాకి
ట్టట్టని పలుకంగ నేలనమ్మ! తలంపన్. 113

తే. అనుచు నే వేడుటయును మాయత్త కనలి
ముసముసమటంచుఁ దప్పక మోముచూచి
చేరి నాచెంతఁ జకటకటుల్ సెప్ప నెంత
దానవని గోపమునఁ బడఁదన్నె నయ్య! 114

కం. అంతటఁ దనివోవక ని
న్నింతింతలు సేతుననుచు నెగచుచు రాఁ ద
త్ప్రాంతకవాటము నిటలా
భ్యంతరమున దవిలి రక్త మరిముఱిఁ దొరఁగెన్. 115

తే. గీ. అవ్విధంబుననొచ్చి యాయము కడంక
నదియు నాయపరాధం బటంచుఁ దలచి
కూడు నుదకంబు గొననీక మూఁడుదినము
లుపవసింపగఁ జేసె నన్ గృపదొలంగి 116

ఉ. మూఁడవనాఁడు దప్పిగొని మూర్ఛమునింగెడి నన్నుజూచి క్రొ
వ్వాడిమనమ్మనన్ గపటవైఖరి గైకొని మేలిమీగడల్
గూడగఁ బాలు పాత్రనిడి గొబ్బునఁ గ్రోలెడిగాని బింకఁపుం
జేడియ! దీని నీమగనిచేతికి నిమ్మని రే యొసంగుచున్. 117

కం. ఇచ్చినవెంబడిఁ గూఁతురి
నచ్చువడం గాపువెట్టి నదియెఱుఁగక పెం
జిచ్చుగతి డప్పి జఠరము
ద్రచ్చఁగ నొకగ్రుక్కెఁడన్నిఁ ద్రావితి నడుమన్. 118

చం. అదిగని యావెలంది తమయన్నకు నంతయుఁజెప్ప నుగ్రుఁడై
యిది కుటిలాత్మురాలకట! యెంగిలిపాలిడెనంచు నెమ్మదిన్
బొదలిన రోషవేగమున బోరునఁదిట్టుచు నన్నుడాసి యీ
యదనున వెళ్లఁద్రోతునని యద్దమరేయి నతిప్రచండతన్. 119

కం. చేతులు మాటిడికొనుచు భ
యాతురత వడఁకు నన్ను నడిచి గృహాబహి
ర్భూతంగాఁజేసిన మతి
కాతరనై తల్లడిల్లగా నవ్వేళన్. 120

కం. వెడలినయుడిగఁపుబోటులు
వడిఁజని చెప్పంగఁ గన్నవారెఱిఁగి భయం
పడి వనుప నగ్రజుఁడు నా
కడకుం జనుదెంచె దైవగతి నారాత్రిన్. 121

తే. గీ. ఎలుగువిని వచ్చి యంతయు నెఱుకపఱుప
నిచ్చ వగచుచు నను దమయిల్లు సేర్చి
తల్లిదండ్రులు మదిలోన దయఘటిల్లి
చీరగూడు నొసంగి పోషించిరయ్య! 122

వ. అంతం గొంతకాలంబు సనునంతం గృతాంతభటులరుగుదెంచి నన్నుం
గొనిచని ధర్మరాజు ముందటం బెట్టినం జూచి. 123

ఉ. అక్కట భర్త త్రావఁగఁ బయఃపరిపూరితపాత్ర గొంచుఁ దాఁ
దెక్కలికత్తెవోలె నతిదీనగతిం జనుచుండి త్రోవలో
గ్రుక్కెఁడు ద్రావి యెంగిలిడు కుత్సితయౌటఁ దృణాశనంబుచే
నొక్కట ధాత్రిపై హరిణయోని జనించి చరించు గావుతన్. 124

కం. అని యాదేశించి మనం
బున నావెతఁ జూచి కరుణపొడమి పలికె పా
వనమూర్తియగు దృఢవ్రతు
ననుగ్రహమువలన సుగతి నందెద ననుచున్. 125

కం. అక్కారణమునఁ బుట్టితి
నిక్కానన్ హరిణి నగుచు నిన్నాళ్ళకు నీ
యక్కజపు గరుణ నందుట
ద్రిక్కరిసిన దుష్కృతములు ద్రెళ్ళుటికె నృపా! 126

తే. గీ. పాటులన్నిపడియుఁ బతికి నెంగిలివెట్ట
హరిణజన్మ మిట్టు లగ్గమయ్యె
ధరణి నెవ్వఁడోపు ధర్మసూక్ష్మక్రియ
లెఱిఁగి యాచరింప సిద్ధచరిత! 127

సీ. పోషించితివిగదా! పుణ్యతత్త్వజ్ఞాన
పరిణామయుతమహాభాగవతుల
భాషించితివిగదా! బహుధర్మసంహితా
నిర్ణీతనిరుపమనీతికథల
భూషించితివిగదా! భూరికీర్తిమనోజ్ఞ
చంద్రికాస్ఫురణదిక్సామజముల
తోషించితివిగదా! దుష్టరాజకఘోర
కంఠీరవోద్రేకలుంఠనముల

తే. గీ. సకలసంపదలందితి జగము నెల్లఁ
గలయ నేలితి వన్నిఁట ఘనుఁడ వగుదు
వితతగుణజాల! యోదృఢవ్రతనృపాల!
పుడమి ననపత్యత గొంతవడియె గాక. 128

వ. అని పలికి యప్పుడ హరిణీరూపమ్ము విడిచి దివ్యగంధమాల్యాంబరాభరణం
బులం బొలుపుదీపించి యమ్మహారాజుచేత ననుజ్ఞాతయై దివంబునకుంజనియె నంత
నమ్మహీకాంతుండు హరిణీవృత్తాంతంబునకు విస్మితుండగుచు నుండునంత. 129

పరిజనము రాజు నరయుట

ఉ. అంత నమాత్యు లయ్యధిపు నయ్యెడఁగానక దంతిదంతకుం
తాంతనికృత్త శాఖనిచయక్షితి వాంతమధుస్స్రుహా మిథో
త్యంతకభల్లమల్ల కహాహారవ భీత శకుంత సంవృతా
శాంత విచిత్రవర్ణ సుమహా గహనాంత గవేషమాణులై. 130

సీ. ముదమారఁ గదలు తుమ్మెదల బల్ రొదల సం
పదలచేఁ బొదలు పూఁబొదలు జూచి
దివులు వెందవులించు నవ్వులపై సింగంపు
రవళిఁ జూపు వెడందగవులు సూచి
నెరయుఁ బెల్లిరుల పెల్లొరలెడి తరుల పెం
దరుల పందిళుల వందురులు సూచి
తములు నున్మత్తచిత్తములైన కరుల మొ
త్తములు క్రీడించు నెత్తములు సూచి

తే.గీ. కొలఁకుకెలఁకుల లేమావిగుముల గముల
మరువుటిరు.......................
మొగలి తెగలఁ గడిందిగొజ్జగుల జగల
నరసి భూవిభుఁ గానలేరైరి భటులు. 131

తే. అంత మహనీయసైన్య మత్యంతవిపిన
పాళి నరపాలమౌళి శుంభత్తురంగ
ఖురపుటన్యాసనిర్భిన్నసరణిఁ దెలియ
నరసి యుబ్బున నొకట గో యని చెలంగె. 132

శా. ఆ బాబారతనంబు జాడఁ జని యుద్యన్మాధవీవేష్టన
ప్రాబల్యోపహతోష్ణరశ్మికర సంబంధావగాతీరభూ
జాబద్ధ స్ఫటికాయమానతల శైత్యచ్ఛాయఁ గూర్చుండి చిం
తాబాహుళ్యము నొందు భూవిభుని నింతంతన్ విలోకింపుచున్. 133

కం. జనితోత్సుకులై సచివులు
జననాథుని జాడ నరిగి సంభృతచింతా

వనతాననాబ్జుఁడగు నా
తని తెఱఁగూహించి మిగులఁ దలఁకొందవంగన్. 134

చం. తెలియుదమంచు నిట్లనిరి దేవర సేనలడించి యొంటిమై
బలవదతిప్రచండమృగబంధురకాననసీమలందుఁ జే
రలుకమెయిన్ జరింపఁ బ్రియమంచు దలంచిరొ మేల్దలంచు మా
వలన ననాదరంబెసఁగ వంచనసేయుటా ధారుణీశ్వరా! 135

సీ. రింఖాఝుళంఝుళత్ప్రథులార్భటుల ఘోట
కము దుమికింపంగఁ గాంతుమనియు
బహువిచిత్రపతత్రిపటలిపై పెను డేగ
పోతుల నాడింపఁ జూతుమనియు
నదె పదుం డిదెమెకం బని మీఱ లుత్సవా
వేశోక్తులెసఁగింప విందుమనియు
నిశితాసి తళతళ విసరుచుఁ బటుమృగ
శ్రేణి భంజింప వీక్షింతు మనియు

తే. గీ. గాదె యివ్వేళ మృగయావినోద మొదవె
నంచు దేవరయానతి ననుగమింప
భీకరాటోపవేళఁ బరాకు దగునె
దివ్యచిత్తమ్మునకు ధరిత్రీలలామ. 136

కం. అనవుడు వైక్లబ్యము నె
క్కొను మనమొకభంగిఁ జేసికొని యల్లన వాం
చినమొగ మెగయింపుచు ని
ట్లను సచివాగ్రణులఁ జూచి యవనీశుఁ డొగిన్. 137

చం. వినుఁ డెఱిఁగింతు మీ కిచటివృత్తము వంచనమైఁ దొలంగి వ
త్తునె! నయకోవిదుల్ హితతతుల్ మిముఁబాయఁదలంతునయ్య! దై
వనియతి నయ్యె నింతయు నవారణ నొక్కకురంగి పాఱుదెం
చిన నలయించి దాని వడిఁ జేకొను వేడ్క జనింప నొయ్యనన్. 138

సీ. కేడించి హయము క్రొవ్వాడిమై నడరింప
మదమరి కికురించు మంత్రులార!
ఇది యసాధ్యంబంచు నేఁదలంపఁగ నది
దాపై మెలంగు ప్రధానులార!
ఒగి గుబాలునఁ దురంగోత్తమం బెగువంగ
జౌకళింపుచుఁ బాఱు సచివులార!
మది నేమరించి పట్టెదనంచుఁ జూచిన
మది బెగ్గడిల్లు నమాత్యులార!

ఆ. వె. పొదువ నలవిగాదు పోలియింపఁ దమిలేదు
మగిడి విడిచిపోవ మనసురాదు
అకట యేమిచెప్ప నాలేటిఁ గైకొను
నాసఁజేసి వెంట నరుగునపుడు. 139

కం. అంత నది యలసి యేత
త్ప్రాంతంబునఁ బడిన దానిబడలిక గని మ
త్స్వాంతమునఁ గృపజనింపఁగ
నెంతయు శైత్యోపచార మేఁ జేయంగన్. 140

కం. అది యంత మనుజభాషల
ముదవొదవఁగ నన్నుజూచి భూనాయక! నీ
మది నేల వగవఁజూచెద
విది రాజోచితవిహార మీ వెఱుఁగవొకో. 141

వ. అని రాజధర్మానుగుణసంభాషణమ్ముల నాకుంబ్రియమ్ము నెరపి వెండియు. 142

సీ. తన పూర్వభవమున ధర్మజ్ఞుఁడన నొప్పు
భూసురోత్తమునకుఁ బుత్రినవియె
తన నాథుఁడగు చంద్రకుని తల్లిచండిక
శ్రమ నొంచెఁ గోటరికమున ననియె
దన మృదూక్తుల నాయమను మంచిసేయంగఁ
దలఁచిన పగ సాల బలసె ననియె

దను కృశింపించి వంచన నత్త మద్భర్త
కెంగిలిపాలు పోయించె ననియొ

తే. గీ. నింతయును దండధరుఁ డాత్మ నెఱిఁగె ననియొ
నవని హారిణీత్వమునఁ బుట్టుమనియె ననియొ
నీవు దయఁజూడఁ గలుషమ్ము లెడలె ననియొ
నిటుల నాలేఁడి తనచందమెల్లఁ దెలిపె. 143

తే. అంతయును జెప్పి క్రమ్మఱ నమ్మృగమ్ము
మున్నుగ ఘనుండవీవంచు నన్ను నతులొ
నర్చి యనపత్యదోష మెన్నఁగఁ గొఱంత
యయ్యె నీకంచుఁ గాంతయై యరిగె దివికి. 144

అనపత్యతకు రాజు విచారించుట

ఉ. అట్టిదకాదె! నాబ్రతుకు హారపటీరనికాశకీర్తి సం
ఘట్టితదిక్తటీకరటి కౌంభమణివ్రజకంఠపాళికా
పట్టికి రాజ్యపుంగడలిపట్టికిఁ బట్టగునట్టి పటికిన్
పట్టనరాజపీఠమునఁ బట్టముగట్టఁగలేమి నక్కటా! 145

మ. సచివాగ్రేసరులార వింటిరె! సమస్తక్ష్మాతలాధీశ్వరుల్
ప్రచురస్యందనబృందతుంగహయ శుంభత్కుంభిపట్టాంబర
ప్రచయస్వర్ణమణిప్రతానముల సంభావింప నట్లొప్పు మ
త్సుచిరప్రాభవరేఖకుం గొఱంతవచ్చుంబో సుతాభావతన్. 146

సీ. అన్నదానాది పుణ్యఫలంబులకు నెల్ల
సుతుగాంచు ఫలము మెచ్చులు ఘటించు
తరుతటాకాది సంతతిఫలంబులకంటె
సుతుగాంచు ఫలము మెచ్చులు ఘటించు
రాజసూయాది సత్క్రతుఫలంబులకెల్ల
సుతుగాంచు ఫలము మెచ్చులు ఘటించు
ఘనతీర్థయాత్రాధిగతఫలంబుల కెల్ల
సుతుగాంచు ఫలము మెచ్చులు ఘటించు

తే. గీ. పైతృకంబైన ఋణ మెడఁబాయు దలఁపు
లాత్మజులు లేమి గొనసాగవండ్రు బుధులు
గాన హరిణీలలామంబు గడఁక బలుకు
పలుకులన్నియు మృషలంచుఁ బలుకరాదు. 147

ఉ. అప్పటినుండి నాహృదయ మట్లు విషాదరసం బెసంగఁగన్
జొప్పడు రాజ్యసంపదకు సూనుఁడులేని కొఱంతదోఁచె నీ
యొప్పమి మానునట్టి తెఱఁగొయ్యన నాకెఱిఁగింపరయ్య! మా
కెప్పుడు ప్రాణతుల్యహితు లెన్నఁగ మీరకదా! తలంపఁగన్. 148

చం. వనులఁ జరించి పూరిఁదిని వాఁగులవంతల నీరుద్రావి నె
క్కొనెడు పశుత్వధర్మమునఁ గ్రుమ్మఱునట్టి మృగంబె యేవగిం
చెను మది నోటులేక నిఁకఁ జెప్పెడిదేమి! సమగ్రధర్మవ
ర్తను లనపత్యదూష్యుల కొఱంత గణింపక యుండనేర్తురే! 149

తే. గీ. అనుచు సందేహడోలాయితాంతరంగుఁ
డగు నృపాలునిఁ జూచి నెయ్యమున మంత్రి
జనము లౌదలలూఁచి యంజలిపుటములు
ఫాలతలములఁ గదియించి పలికిరెలమి. 150

ఉ. వింతలుగొన్ని మీవలన వింటిమి నేఁడిచటన్ జతుస్సము
ద్రాంతధరాధురంధరుఁడవై జగతిం గలరాజులెల్ల నీ
చెంతలఁ జేరి సన్నుతులుసేయఁగ నొక్క తృణాశి యార్జవం
బింతయులేక దూఱుటిది యెంతకొఱంత నృపాలశేఖరా! 151

మంత్రులు రాజు నోదార్చుట

చం. జగతి ననంతపుణ్యగుణసౌష్ఠవయుక్తులు సాధుసమ్మతా
నుగతసమగ్రవైభవమనోజ్ఞచరిత్రులు ధర్మసంగ్రహా
ద్యగణితకీర్తియుక్తులు మహాత్ములు నిన్ను గొఱంతలెన్న ర
మ్మ్యగమన నోపు కానఁజెడమేసిన చెంగలికాయ క్రొవ్వనన్. 152

సీ. బ్రహ్మోపనయనాదిబహుకృతుల్ గావించి
తది నీకు సంతతి యగునొ కాదొ
వాపీతటాకనిర్వాహమ్ము ఘటియించి
తది నీకు సంతాన మగునొ కాదొ
దేవతాయనప్రదేశముల్ నిర్మించి
తది నీకు సంతాన మగునొ కాదొ
హయమేధముఖ్యభవ్యాధ్వరమ్ము లొనర్చి
తది నీకు సంతతి యగునొ కాదొ

తే.గీ. కాదొ సంతాన మా రమాకాంతపద ని
బద్ధసాంతఃకరణకృత భాగవతస
భాసపర్యాదిసోపానపంక్తి నీకు
సంతతి కొఱంతయెట్లయ్యె జనవరేణ్య! 153

చం. అన నొడఁబాటులేమి దరహాసము చారుకషాయితేక్షణో
జ్జనితలసద్రుచిప్రతతిసాహ్యమునన్ నరపాలశేఖరా
నన మొగిఁ జూడనొప్పెసఁగె నవ్యసముజ్జ్వలసాంధ్యరాగమే
ళనశబలీకృతైందవకళాకలికా కళికాపరాగమై. 154

ఉ. మీరలు నీతివర్తను లమేయగుణాకరులంచు ధర్మవి
స్తారత నిందునందు సుఖసంగతి యే గణియించుపద్ధతిఁ
జేరరు పూర్వపక్షములు జేసెద రిట్టిది రాజకార్యని
స్తారకులౌ నమాత్యుల విధంబె వృథా విపరీతవాదముల్ 155

సీ. తనయులకై ఘోరతపమాచరింపఁడే
యడవులయందు స్వాయంభువుండు
సుతులకై నిష్ఠురవ్రతనిష్ఠపూనఁడే
బుధులెన్న యువనాశ్వభూమిభర్త
సంతతికై యుగ్రశపథముల్ పలుకఁడే
జలధీంద్రుతో హరిశ్చంద్రనృపుఁడు
ఘనపుత్రకాముఁడై క్రతువాచరింపఁడే
బహుదక్షిణలు మీఱఁ బంక్తిరథుఁడు

తే. గీ. నందనావాప్తికై కాదె నాభి కశ్య
పాత్రిదశాదిపుణ్యు లాయాసపడుట
తలఁచిచూడుడు వారికిఁ గలవొ లేవొ
వనతటాకాది సంతానవైభవములు. 156

కం. చనియెదరు నీతిపద్ధతి
ననియెద రుచితోక్తిసరణి సత్యాప్తులరై
మనియెద రనియుండిరి మి
ట్లనయుల రగుటెన్నఁడెఱుఁగ మంచుం బెలుచన్. 157

చం. సమధికసూక్ష్మపక్ష్మనికషానుకషాయిత వీక్షణద్యుతుల్
దమ నునుఁగెంపు దువ్వలువ దట్టఁపురంగు పొసంగఁజేయ భూ
రమణునికిన్నఁ గన్గొని ధరాధరధైర్యధురంధరుండు చి
త్తమునఁ గలంగెనంచును బ్రధానవరుల్ సభయాంతరంగులై. 158

కం. భూనాయక! నీదగు సం
తానేచ్ఛాదృఢత దెలియఁదలఁచి యనుటయే
కాని యొండొకటి సేయం
బూనుదుమే! యిట్టులనుట పోలునె మమ్మున్. 159

శా. సమ్యక్కామ్యపురూరవశ్ఛదకనచ్ఛాఖాంచితంబున్ మరు
ద్గమ్యంబై విలసిల్లు శీతరుచిసత్సంతానసంతాన మౌ
పమ్యశ్రీ నిరసించి యుష్మదురుపుష్పప్రాప్తిఁ జెన్నొంది సం
భ్రామ్యత్సార్వ్యళియై భవత్సుతఫలప్రారంభముం గోరదే! 160

తే. గీ. మంచి దింతటనేమయ్యె మనుజనాథ!
మన పురంబున కేఁగి సమ్మదము మిగుల
బ్రహ్మవిదులైన శ్రీమహాభాగవతుల
నడిగి వారల యానతి నడువ వలయు. 161

కం. అని సచివు లిట్లుపలికెడు
సునయోక్తుల కియ్యకొని యశోధనుఁడగు న

మ్మనుజేంద్రుండు చతుర్విధ
ఘనసేనాకలితుఁడగుచుఁ గదలెం బురికిన్. 162

ఉ. ఆ నృపుఁడాదరించెఁ బునరాగమనావసరాగతాంబు ఖే
లానిరతామరీకుచమిళద్ఘనసార పటీరపాళికా
ఫేనిల సహ్యజా సలిలపేశలబిందు పయోజగంధ స
న్మానితశైత్యమాంద్యలసమాన విహారసమీరడింభమున్. 163

వ. ఇవ్విధంబున నమ్మహీకాంతుండు పథశ్రమం బపనయించి పురంబు ప్రవేశించి యాస్థానమండపంబున సముచితపరివారంబు గొలువం గొలువుండి సమీప జనులం జూచి బ్రహ్మవేత్తలగు భాగవతోత్తములం దోడితెండని పంచినం జనిరని చెప్పినవిని శిష్యప్రవరు లయ్యాచార్యునిం జూచి యవ్వలివృత్తాంతం బెట్టిదని యడిగిన— 164

శా. సారాచారవిహార హారమణిరాజత్కంఠ! కంఠీరవో
దారస్ఫారపరాక్రమాక్రమితదైత్యవ్రాత! సీతావధూ
స్మేరాస్యేక్షణలోలలోచన! యశశ్శ్రీనిర్జితాంచత్పయః
పారావార సితప్రభావిభవ! శుంభద్బాహుదర్పోజ్జ్వలా! 165

కం. శంకరపత్నీహృదయవ
శంకరనిజనామమంత్రసారభ! మౌర్వీ
టంకారశ్రవణదళ
ల్లంకాపురవాసహృదయ! లలితాభ్యుదయా! 166

మాలి. సకలమునిశరణ్యా! సత్యధర్మాభిగణ్యా!
వికటవిమతభేదీ వీరలక్ష్మీవినోదీ!
సుకవిగణితకీర్తి! సుస్థిరానందమూర్తి!
ముకురనిభకపోలా! ముఖ్యసౌజన్యహేలా! 167

గద్యం. ఇది శ్రీరామచంద్ర కరుణానిరీక్షణ సమాసాదితకవితావిశేష
శేషాన్వయప్రదీపక వేంకటాచార్యప్రణీతంబైన కులశేఖరమ
హీపాలచరిత్రంబను మహాప్రబంధంబునందుఁ బ్రథమాశ్వాసము. 168

కులశేఖర మహీపాల చరిత్ర

ద్వితీయాశ్వాసము

★

కం. శ్రీజనకజామనోహర!
రాజకళాధరధనుర్నిరాస విలాస
వ్యాజప్రకటితభుజబల!
రాజద్గజరాజగామి! రామస్వామీ! 1

వ. అవధరింపుము శిష్యులంగని గురువర్యుం డవ్వలికథ యిట్లని చెప్పం దొడంగె. 2

రాజుకడకు భాగవతులు వచ్చుట

సీ. సుషమపారాశర్యసూత్రతత్త్వవివేక
పరిణామమేధానుభావయుతులు
భూతకాసారాదిపూర్వపుణ్యశ్లోక
జల్పితద్రవిడవాక్చతురమతులు
ఘనమనఃకీలితాకారత్రయార్థనిష్ఠాంత్యంత
రసికసాంగత్యమతులు
నశ్రాంతకృతతదీయారాధనార్థస
త్కర్మనిర్మితయశశ్శర్మగతులు

తే. గీ. పరమపురుషానుమతులు శ్రీభాగవతులు
నిజ నిలయభాగ వేదికానిష్ఠులగుచు
బలసి సద్గోష్ఠి సేయుచోఁ బార్థివేంద్ర
భటులు గాంచిరి కన్నులపండువుగను. 3

వ. కాంచి కరమ్ములుమోడ్చుచు మహాత్ములార! మహీకాంతుండు యుష్మత్సందర్శనంబు గోరుచున్నవాఁడు విజయంచేయుండనుటయు నట్లకాకయని యుండఱుం గదలి. 4

సీ. మధుకరాశనమనోరథసిద్ధి వాటింప
సారస్వతోదారశక్తి గాంచి
సదమలామృతపదాశారసజ్ఞత దోప
సఫలసంకల్పప్రశస్తి గాంచి
పరభామినీసహోదరవృత్తి గన్పింప
సుమనస్సమాగమస్ఫురణ మించి
బంధురదివ్యప్రబంధరూఢి యెసంగ
నిత్యమాధవయోగనిరతిఁ బూని

తే. గీ. యెలమి సంశ్రితజనమనోభీప్సితార్థ
నిచయఘటనాసమర్థత నివ్వటిల్ల
జనిరి రాజేంద్రుకడకు నిచ్ఛావిహార
పారిజాతమ్ములో యన భాగవతులు. 5

శా. ఆ సౌజన్యగుణప్రసన్నముఖు లిట్లాస్థానముం జేరు ను
ల్లాసం బేర్పడ వచ్చుచున్న యెడ లీలన్ మంత్రిసంఘంబుతో
నాసక్తిన్ మనుజేంద్రచంద్రుఁడు సముద్యద్భక్తిసంయుక్తుఁడై
దాసోహమ్మని మ్రొక్కెఁ దచ్చరణపద్మప్రాంతధాత్రీస్థలిన్. 6

ఉ. ఆర్యజనాగ్రగణ్యు లపుడా నృపశేఖరుఁ జూచి దోర్బలౌ
దార్యసమృద్ధిరస్తు ధనధాన్యయశోవిభవోస్తు సంతతా
చార్యకృపాకటాక్షవిలసన్మహిమాస్తు సుపుత్రకోస్తు తే
సూర్యసమప్రతాప! యనుచున్ దగ దీవనలిచ్చి రందఱున్. 7

తే.గీ. సరవి నీరీతి మంగళాశాసనమ్ము
లెలమిఁ గావించు శ్రీవైష్ణవుల సభక్తి
వినయవినమితుఁడగుచు భూవిభుఁడు రత్న
చిత్రపీఠుల నుంచి పూజించె నంత. 8

వ. ఇవ్విధంబున నమ్మహాత్ములం బూజించి యమ్మహీకాంతుండు దానునుం దదనుజ్ఞ గైకొని యాసీనుండై వినయవినమితమస్తకుండగుచు వారలతో నిట్లనియె. 9

ఉ. శ్రీ హరిపాదపద్మతులసీదళతీర్థరసజ్ఞు లజ్ఞహృ
న్మోహనివర్తకుల్ భవవిమోచను లాశ్రితమోక్షలాభ ని
ర్వాహులు రోషలోభమదరాగవివర్జితు లూర్జితక్రియో
త్సాహులు నైన మిమ్ముఁ బ్రమదంబునఁ గొల్తురు ధన్యు లెల్లెడన్. 10

సీ. భవబంధ మెడలించు బహుమునివ్రజవపు
స్సంగమంగళజలాభంగ గంగ
తనుతాప ముడిగించు వినుతషోడశకళా
పరిణామరుచిహారి పంకజారి
దారిద్ర్య మడగించు ధన్యలేఖజనౌఘ
కలితనిత్యశ్లాఘి కల్పశాఖి
యపమృత్యువు నడంచు నపగతాఘసుధీ
హృదానందరసపూర యమృతధార

తే. గీ. యిన్ని గుణములు గలసి యొక్కెడనె నిలిచి
యుండునే వార్ధికన్యాప్రియోరుచరిత
ఘనసుధాస్వాదవిదళితకలుషపాశ
వేష్టనులరైన మీయందు వెలయుఁగాని. 11

సీ. హారాళు లెంచ నాహారాళులే యంచు
గళమున వనదామగరిమ బూని
కేయూరరుచి మన కేయూర రుచియంచు
భుజముల దరచక్రములు వహించి
కటకానివృత్తి యక్కటకానివృత్తి యం
చౌకట చే నక్షమాలిక ధరించి
కాంచికాగుణ మిచ్చఁగాంచి కాగుణమంచుఁ
గటి తంతుసూత్ర మొక్కటి యమర్చి

తే. గీ. మణివిభూషణముఖ్యసంపత్సుఖైక
రసము నొల్లక గాఢవైరాగ్యలక్ష్మి
పేర్మి హృద్వీధి నొలయ గాంభీర్యరేఖ
నలరు మీవంటి ధన్యులెందైనఁ గలరె! 12

కం. అనుచు వినుతించి ముదమున
ననపాయనిజాభిలషిత మాపుణ్యులకున్
వినిపింపఁ దలఁచి క్రమ్మఱ
వినయానతవదనుఁడగుచు విభుఁ డిట్లనియెన్. 13

ఉ. అట్టి మహానుభావులు మహాగుణగణ్యులునైన మీరు మా
పట్టునఁగల్గుటన్ జతురపాంపతివేష్టితరాజలక్ష్మికిన్
బట్టపురాజనై విమలభాగ్యసమృద్ధిఁ బ్రసిద్ధిగాంచు నా
పుట్టువు సార్థమై వెలయఁ బుత్రులు గల్గ ననుగ్రహింపరే! 14

చం. ప్రకృతివికారమైన తనుభావము గల్గినచో నిజాన్వయో
పకృతి పరోపకారము లపాయములందఁగనీరయేని యా
సుకృతులు ధర్మకీర్తి పరిశుద్ధిఁ బ్రసిద్ధి వహింతు రింకఁ ద
ద్వికృతియొనర్చునట్టి యవివేకులు నిష్ఫలజన్ములెన్నఁగన్. 15

ఉ. ఆరయ నిట్టిరెండువనులందు నొకండు కులాభిరక్ష త
త్కారణభూతపుత్రఫలగౌరవరేఖ నలంకరించి భూ
భారము నిర్వహించు నదుపాయ మెఱుంగదలంచియే జడీ
ధీరజనాగ్రగణ్యులగు దేవరవారి గురించి వేడెదన్. 16

తే. గీ. అనుచు ననపత్యదోషభయాభిభూత
చిత్తుఁడై వేడుచున్న రాజోత్తమునకు
వరదులై యమ్మహాత్ములు కరుణ నెరయు
చూడ్కులలరంగఁ బల్కిరి సొంపుమీఱ. 17

భాగవతుల యుపదేశము

కం. పున్నామనరకభీతి వి
పన్న పరిత్రాణకార్యభారగుఁడగుచున్
బన్నగరాజశయానుం
డున్నాఁడు మదిం దలంకుటుచితమె! నీకున్. 18

ఉ. ఉన్న జగత్త్రియమ్ము హరి యున్నతకీర్తి శుచిత్వలక్ష్యమై
యున్నది మింటనంటి ధ్రువుఁడున్నది ధారుణిపై విభీషణుం

డున్నది క్రింద దైత్యపతియున్నది పుణ్యపురాణసిద్ధమై
యున్నది తోఁచియున్న దికనున్నది యున్నది చిత్ర మన్నిఁటన్. 19

సీ. విప్రకోటికి వేదవిధిపేటి ముఖమయ్యె
నదిముఖంబయ్యె నయ్యభిముఖునకు
నాకంబున కజాండలోకమ్ము పదమయ్యె
నదిపదమ్మయ్యె నమ్మృదుపదునకు
సర్వభోజికిఁ జలచ్ఛదరాజి రథమయ్యె
నదిరథమ్మయ్యె నయ్యతిరథునకు
మునిమనఃకేళిక వనపాళి సుఖమయ్యె
నదిసుఖమయ్యె నయ్యధిసుఖునకు

తే. గీ. నతఁ డనంతుఁ డనంతలోకాంతరాంత
రాంతరిక్షాదిభూతమయాంగ జంతు
నిచయబహిరంత రనుగత నిజకళాంశుఁ
డధిప! నీచిత్తసంతాప మతఁడెఱుంగు. 20

సీ. శేషదిక్కుంజరశ్రేణి మాన్చి జగమ్ము
నిజకరాంగుళమున నిలువనోపు
నాగి జీవకోటుల నుపసంహరించి క్ర
మ్మఱఁ గ్రమ్ముకొనఁజేసి మనువనోపు
బ్రహ్మాండభాండకర్పరము బ్రద్దలువాపి
చెలిమి నెప్పటియట్లు సేయనోపు
గడిఁదిమై సప్తసాగరముల నింకించి
పెంపొంద మఱలనిండింప నోపు

తే. గీ. గిరులకరులఁ గిరులఁగరులుగాపుట్టించు
కిరులకరుల కరులఁగిరులఁ జేయు
నకట వాసుదేవు నఘటితఘటనాను
భావ మేమిచెప్పఁ బార్థివేంద్ర! 21

వ. అతం డెట్టివాఁడని తలంచితి రేని, 22

సీ. తరువఁ వ్రవ్వినవేళఁ దఱికొండ డిగఁ వ్రాల
నరవ్రేల నూఁదిన యతఁడితండు
మొసలి కాటులనొంప విసువు నేనుఁగు బెంప
నసము డింపక వచ్చు నతఁడితండు
రచ్చ రామొగరాన రెచ్చుసింగఁపుమేన
నచ్చుగా నరి వ్రచ్చు నతఁడితండు
కడిఁదివేలుపునింటఁ గలసిరుల్ గొనుదంట
నడుగంటఁ ద్రోచిన యతఁడితండు

తే. గీ. విను మతఁడతండు వల్లభ వనజభవమ
హేంద్రసనకాది మానసాభీప్సితార్థ
దానధౌరేయుఁ డాశ్రితోదారధీవి
ధేయుఁ డిసుమంత నీకోర్కె దీర్పలేఁడె. 23

సీ. హరులచేఁ గరులచే నరుల గెల్వఁదరంబె
చక్రపాణి సహాయశక్తి లేక
కలిమిచే బలిమిచేఁ గులముఁ బెంపఁ దరంబె
రాక్షసాంతకు దయారసము లేక
సతులచే సుతులచే నుతుల కెక్కఁ దరంబె
శౌరి కటాక్షవీక్షణము లేక
జపముచేఁ దపముచే నుపరమింపఁ దరంబె
కనకచేలుని యనుగ్రహము లేక

తే. గీ. మానవేశ్వర! యమ్మహామహుని కరుణ
కలుగదేనియుఁ గలుగునే! ఘనులకైన
నైహికాముష్మికసుఖమ్ము లతని నాత్మఁ
దెలిసి కీర్తించి నీకోర్కె దీర్చికొనుము. 24

శా. ఆ లక్ష్మీశపదాప్తికిన్ బహుళజన్మాయాసవిశ్రాంతికిన్
మూలంబైన తదీయభక్తిరచనామూలమ్మునన్ గోవిదుల్
బాలత్వమ్మున యౌవనమ్మున గుణప్రఖ్యాతి వాటించి వా
గాలమ్ముల్ పచరింప రాత్మహితసౌజన్యమ్ము దైవారగన్. 25

భుజంగప్రయాతము. జరాజర్జరీభూతసర్వాంగయష్టిన్
బరీతోపరివ్యాధిబాధావిభూతిన్
నరుల్ బుద్ధిజాడ్యమ్మునన్ జొక్కువేళన్
మురారాతి నేరీతిఁ బూజింతు రాత్మన్. 26

తే. గీ. కావున మనోవికారముల్ గ్రమ్మనీక
ఘనులు తద్భక్తిఁ గాంతురుగాన శౌరి
పూజనము బాల్యయౌవనంబుల ఘటింప
వలయు నదియట్టులుండె నీ తలఁచుపనికి. 27

కం. క్షీరోపహారనియతిన్
వారిజదళనేత్రు భక్తవత్సలుఁ గరుణా
పూరితహృదయు భజింపు ము
దారత నీకోర్కె దీర్చు ధరణీనాథా! 28

వ. అనినం గందళితహృదయుండగుచు నమ్మహీపాలుం డమ్మహాత్ములకుఁ
బ్రణమిల్లి నిటలతటఘటితకరకమలుండై యిట్లని విన్నవించె. 29

సీ. క్షీరోపహారవ్రతారూఢి వాటింపఁ
దొడరుచో నేమేమి నడుపవలయు
పుండరీకదళాక్ష పూజాపరత్వమ్ము
దాల్చుచో నేమేమి దడవవలయు
దైనందినముకుందధర్మనిర్మలగోష్ఠి
వెలయుచో నేమేమి విడువవలయు
చక్రాయుధధ్యానజపహోమకార్యముల్
గడపుచో నేమేమి నుడువవలయు

తె.గీ. నెంతకాలమ్ము గావింప నిందిరామ
నోహరుం డిచ్చమెచ్చి యుత్సాహ మెసఁగఁ
గింకరుఁడనైన నన్ను రక్షించు బుద్ధి
నంతయు నెఱుంగఁ గృపసేయుఁ డయ్యలార! 30

కం. అని యిట్లు విన్నవించిన
మనుజేంద్రునిఁ జూచి భువనమాన్యచరిత్రుల్
వినుమీ వెఱుంగఁదలఁచిన
పని యంతయు ననుచుఁ దెలియఁ బల్కిరి వేడ్కన్. 31

తే. నుడువు మచ్యుతనామముల్ విడువు మితర
తంత్రముల్ విష్ణుచరితామృతప్రసక్తి
దడవు మిహపరసౌఖ్యసందర్భనిరతి
నడువు మవనీశ! వేయు ననంగ నేల! 32

సీ. ప్రకృతిభిన్నస్వాత్మ పరమాత్మసాంగత్య
మొకటియందొకటికా నుడుపవలయు
స్తవపూజనాహ్లాదతాత్పర్యశీలమ్ము
లొకటియందొకటిగా నునుపవలయు
భవ్యకర్మజ్ఞానభక్తియోగమ్ముల
నొకటిపై నొకటిగా నూఁదవలయు
నలమనోబుద్ధిచిత్తాహంక్రియావృత్తు
లొకటిచే నొకటిగా నడుపవలయు
తే. గీ. వలయు నీకింక నొక్కటి వనజనాభ
చరణకంజాతమంజులసౌరభాను
భవరసికభాగవతజనాపచితి యిదియె
మాధవారాధనప్రౌఢి మనుజనాథ! 33

తే. గీ. అధిప! భార్యాసమేతుఁడవగుచు నొక్క
వత్సరము బ్రహ్మచర్యానువర్తనమున
శ్రీహరి భజింపఁ గార్యసంసిద్ధి యగుట
నిశ్చయంబంచు పలికిన నృపవరుండు 34

ఉ. అంజలి చేసి పల్కెఁ బులకాంకురజాలము లంగకమ్ములన్
బుంజములై తలిర్పగుణభూషణులార! మదీయభాగ్య మొ
ప్పెం జగ మిచ్చమెచ్చ నిరుపేదకుఁ బెన్నిధి గల్గగోరి సి
ద్ధాంజన మిచ్చినట్లు కృప నానతి యిచ్చితిరిట్టి ధర్మముల్ 35

ఉ. వందన మాచరింతు బుధవంద్యచరిత్రుల కేర్పడన్ బున
ర్వందన మాచరింతు గుణవైభవయుక్తులకున్ బునఃపున
ర్వందన మాచరింతు హితవత్సలచిత్తులకంచు భూమిసం
క్రందనుఁ డమ్మహాత్ములకు గాఢమతిన్ బ్రణమిల్లెఁ గ్రక్కునన్. 36

వ. ఇట్లు మనుజేంద్రుండు భాగవతశిఖామణులకుం బ్రణామమ్ము లాచ
రించి తత్తన్మందిరమ్ముల కనిచి తానునుం దదీయ శాసనం బవలంబించి దక్షులగు
వారలం బురరక్షణమ్మునకు నియోగించి పత్నీసహితుండై శ్రీమన్నారాయణ
పరాయణత్వంబునన్ గృతవ్రతారంభుండయ్యె నప్పుడు. 37

వ్రతారంభము

సీ. మృగనాభితిలకవర్ణితమైన నుదుటిపైఁ
బొలుపొందె ధవళోర్ధ్వపుండ్రరేఖ
యతులచీనాంబరోచితమైన నెమ్మేన
నలరారెఁ గృష్ణసారాజినమ్ము
సితహారపుంజరంజితమైన యురమునఁ
దళుకొత్తెఁ దులసికాదామపంక్తి
కాంచనవలయసంగతిగాంచు కరమున
నమరె వినూత్నపద్మాక్షమాల

తే. గీ. వితతమంజులమణిగణద్యుతివిదీప్త
చటులకోటీరయోగ్యమస్తకమునందుఁ
గిలితంబయ్యె హరిపదాంకితపటమ్ము
నచ్యుతారాధనోద్యుక్తి నవనిపతికి. 38

సీ. సమదేభతురగశిక్షాచమత్కారమ్ము
పరగించె నింద్రియపటలి యందు
శత్రురాజన్యదౌర్జన్యభంజనశక్తి
సమకొల్పె మదమత్సరముల యందు

నసి ధనుశ్శరకృతాభ్యాసకౌశలబుద్ధి
గరపె నష్టాంగయోగముల యందు
వరరాష్ట్రదుర్గసంపాదనక్షమవృత్తి
నెరపె భక్తిజ్ఞాననిరతులందు

తే. గీ. భాసురానర్ఘమణిగణభర్మరజత
జాలకోశాలయేక్షణాసక్తి నిలిపె
కమలలోచను దివ్యవిగ్రహమునందు
భవ్యరుచిహేళి యమ్మహీపాలమౌళి. 39

క. అతులితజపహోమంబుల
నతిశయమునఁ బ్రీతుఁ జేసె నంబుజనాభున్
బ్రతిమారూపమ్మున న
చ్యుతు నర్చితుఁ జేసెఁ దత్తదుపచారమునన్. 40

క. కేసరములఁ గైసేసెను
గేసరినిభమధ్యుఁ బద్మకేసరచేలున్
వాసి దగు మల్లికాసుమ
వాసనలన్ బొదవె భక్తవత్సలు పదముల్. 41

క. చారుతులసీదళము లవి
కారత నర్పించెఁ దులసికాదామునకున్
క్షీరోపహార మొసఁగెను
క్షీరాంబుధిశాయికిన్ విశేషమనీషన్. 42

క. కమలాప్తసదృశతేజుఁడు
కమలమ్ములఁ బూజచేసెఁ గమలాస్త్రగురున్
గమలాక్షు గమలనాభుని
గమలాహృదయేశు హృదయకమలం బలరన్. 43

వ. ఇవ్విధంబున నారాజదంపతులు భక్తినిష్ఠాగరిష్ఠులగుచు భగవత్సమారాధనం బొక్కసంవత్సరంబు సలుపుటయుఁ దదనంతరంబ. 44

శ్రీమన్నారాయణ సాక్షాత్కారము

సీ. కలుములు వెదఁజల్లఁ గలశవార్ధి జనించు
  మగువతో మొలతెంచు నగవుతోడ
పరిపూర్ణచంద్రబింబము వోలు చక్కని
  మొగముతో శేషపన్నగముతోడ
మొనసి నారదముఖ్యు లొనరించు గానని
  స్వనముతో గరుడవాహనముతోడ
ప్రభ మించు భద్రసుభద్రాదిపరిచరో
  త్తములతో శంఖచక్రములతోడ

తే. గీ. సజలజలధరకోమలశ్యామలాంగ
కలితకీలితరత్నధగద్ధగాయ
మానభూషణరుచిభీతభానుకిరణుఁ
డబ్జనాభుండు ప్రత్యక్షమయ్యె నపుడు. 45

చం. పెలుచ ననేకజన్మకృతభీషణదోషకృపాణపంక్తిపై
నొలయఁగ నీని గట్టి మరువ్రాదిన కైవడి నిందిరామనో
లలితవిహారి రాక నొడలన్ బులకాంకురపుంజపంజరం
బలవడఁ దాల్చె భూరమణుఁ డాచరణాననమస్తకమ్ముగన్. 46

మ. మృదునాళీకదళప్రదేశముల దారిందూరి లోవ్రాఁకలన్
గుదురై నిల్చు దుషారవారి పయిఁ తేకుల్ వేఁకువన్ దుమ్మెదల్
జెదరింపన్ దొనుకాడులీల హరి విచ్చేయంగఁ గన్గ్రేవలన్
గదలంబాఱె నృపాలదంపతుల కానందాశ్రుబిందుచ్ఛటల్. 47

మ. పతగాధీశ్వరు నెక్కి లేము లుడిగింపన్ జూచు వాల్గంటితో
శతసూర్యద్యుతి నిక్షుధన్వగురుఁ డిచ్చన్ దోఁచినన్ మేదినీ
పతి దా బ్రాల్చినకన్నుదోయి కదలింపన్ జాలఁడయ్యెన్ సము
ద్గతసంతోషరసాతిరేకజనితాంతః పారవశ్యంబునన్. 48

కం. అంత నృపమౌళి లక్ష్మీ
కాంతుని కృప విపులధైర్యగౌరవమేధా

వంతుండై వీక్షించె ము
రాంతకు శుభమూర్తి లోచనానందముగన్. 49

ఉ. కాంచి మహీవరుండు పులకప్రకరాశ్రుపరీతమైన మో
మంచిత భూపరాగపటలాంచితమై విలసిల్లినట్లు న
క్తంచరవైరి దివ్యపదతామరసమ్ముల వ్రాలె సంపతత్
కాంచనదండ రేఖ నవికారచిరంతనభక్తి వైఖరిన్. 50

వ. ఇత్తెఱంగున నమ్మహీకాంతుం డనంతశయనునకున్ బ్రణామమ్ములాచరించి యిందిరాదేవికి వందనంబొనర్చి పరిషద్భాగవతబృందమ్మునకుం బ్రణమిల్లి కృతార్థంబైన చిత్తమ్ముతో నప్పరమేశ్వరు నగ్రభాగమ్మున నిటలతటఘటితకరకమలుండై యానందబాష్పజలసిక్తకపోలుండగుచు నిట్లని వినుతించె. 51

చం. జయజయ! భక్తలోకహరిచందన పంకజగర్భపార్వతీ
ప్రియ! సనకాదిదేవమునిబృందనిషేవితపాదపద్మ! దు
ర్జయరిపురాజగర్వతరుషండదవానల! ధర్మమార్గని
శ్చయనిరతాంతరంగ! బుధసన్నుత యంచు నుతించి క్రమ్మఱన్. 52

సీ. అనిలాన్నవన్యాశనాంగమానసశయ్య
లోకనిద్ర యొకనిద్ర నొనరు ముద్ర
కమలకైరవలబ్ధకల్యాణదైవమ్ము
లోకకంట నొకకంట నొనరి యుంట
నరిశిరశ్ఛ్రవణదారాయుధశ్రేష్ఠమ్ము
లోకకేల నొకకేల నొనరు లీల
క్షాంతిసంపత్పూర్ణకాంతాలలామమ్ము
లోకక్రేవ నొకక్రేవ నొనరు ఠేవ

తే. గీ. పంక మణఁగింప లోకమ్ము లంకురింపఁ
జేయగల యాదుమొగపాప లాయితముగఁ
దగ నడుఁగుదమ్మి పొక్కిటిదమ్మిఁ బొడము
మహిమ నీయందె చెన్నొందె మధువిరోధి. 53

సీ. బహుభోగనిలయత్రిపాద్విభూతిసమృద్ధి
నుతికెక్కు నారాయణుండ వీవ
వాసుదేవాదిభవ్యవ్యూహభేదసం
గతుల మించిన జగత్పతివి నీవ
భువనరక్షణకళాస్ఫూర్తిచే నవతార
విభవము ల్గను జగత్ప్రభుఁడ వీవ
సకలచేతనకర్మసాక్షివై సదసదం
తర్యామి యగు మహాత్తరుఁడ వీవ

తే. గీ. యీవకావె కవేరకన్యావిదూర
తుంగమణిహేమహర్మ్యనుమంగరంగ
పురవిహారివి, సితకీర్తిపరిచితాభ్ర
గాంగభంగ! విహంగపుంగవతురంగ! 54

శా. నే నేనోములు నోచినాఁడనొ శరన్నిర్ణిద్రపద్మాక్ష! నా
నానైనోనిచయం బడంచితి సితాంతర్ధ్వాంతమున్ సంతతా
నూనేనోత్రచయం బడంచు క్రియ నిన్నుం గొల్తు నెల్లైనఁ గా
నీ నేనౌననఁ గాదనాగలనె! రానీ నీదయాసారమున్. 55

చం. విదితజగత్త్రయాక్రమణవిశ్రుతి కాంచి విరించికుండికా
భ్యుదితపయఃప్రసేచనసమున్నతినొంది మహాఘవల్లికా
విదళనకేళిలోలుపలవిత్రములై విలసిల్లుచున్న నీ
పదకమలమ్ము లెప్పుడు కృపామతి నిల్పుము నా మనమ్మునన్. 56

వ. అని యిట్లు భక్తినిష్ఠాగరిష్ఠుండగు నృపశ్రేష్ఠుండు వినుతించుచున్న యెడ నప్పరమేశ్వరుండు కృపారసతరంగితంబులగు నిజకటాక్షవీక్షణమ్ము లతని పయిం బరగింపుచు జ్ఞానముద్రాముద్రితంబగు దక్షిణకరాగ్రంబు గదలింపుచు ముక్తాఫలదంతకాంతద్యుతిసహకృతంబగు మందస్మితచంద్రికాజాలమ్ము నలుగడలం బొలుపుదీపింప సజలజలధరమధురభాషణమ్ముల నిట్లని యానతిచ్చె. 57

వరప్రదానము

ఉ. ఇంపెసలార నాదుమతి నెంతయు మెచ్చితి మిమ్ము భూమిభృ
ద్దంపతులార! మీ హృదయతామరసమ్ములఁ గల్గు కోర్కెల
తీర్పఁగ నయ్యె నట్లు ప్రసంగించెద మీవలె మద్విధంబు ని
ష్కంపితభక్తిచే నెఱుఁగఁగానరు గానరులెందుఁ జూచినన్. 58

కం. అనఘమతులార! మీ యం
దనుపమత మదీయకౌస్తుభాంశంబున నం
దనుఁడు జనియించుఁ దేజో
వినయోజ్జ్వలశౌర్యధైర్యవిశ్రుతు లెసఁగన్. 59

వ. అదియునుంగాక మదీయప్రియాంగన యగు నీళావధూటి యంశంబున భవత్పుత్రునకుం బుత్రికయై యొక్కకన్యాలలామంబు సంభవింపగలయది. మదీయ విభవస్థానంబైన శ్రీరంగంబునం బొలుపుదీపించుచున్న యే నవ్వరారోహం బరిగ్రహింపంగలవాఁడ మహీపాలా! నీయెడం గృపాళుండ నగుటం జేసి భవదన్వయంబు పవిత్రంబయ్యెం బొమ్మని యానతిచ్చి రథాంగధరుండు నిజభవనంబునకు విజయం చేయుటయు నారాజదంపతు లానందభరితాంతఃకరణమ్ముల నగ్గరుడధ్వజుం బొగడుచు నాత్మగృహమ్ముఁ బ్రవేశించి రంత. 60

శా. శ్రీదేవీపతి సత్కృపామహిమ ధాత్రీకాంతకాంతాసుత
ప్రాదుర్భూతికి వేగిరింప మణిరాజాంశంబు తద్గర్భ మ
ర్యాదన్ లోకసుఖప్రవర్ధనకరంబై యొప్పె నంతస్తమః
క్షోదాంచద్ఘటమధ్యదీపకళికాంకూరానుకారి ద్యుతిన్. 61

కం. వనజాక్షుకరుణ కేరళ
జనపాలాంగనకు భువనసంస్తుత్యకళా
జనకమగు కౌస్తుభాంశం
బనుపమజఠరప్రవిష్టమై పెనుపొందెన్. 62

సీ. ఖర్జూరవల్లరీగర్భపాంసుచ్ఛాయ
గండపాళికలపైఁ గానుపించె

కమలకోశాగ్రసంగతమధువ్రతరేఖ
ఘనపయోధరచూచుకముల నమరె
గ్రస్తపల్లవకంఠకలకంఠరవలీల
మందసల్లాపసంపదలఁ దోఁచె
వలితశైవలనూత్నవల్లీవిలాసమ్ము
సువ్యక్తరోమాళిఁ జూడనయ్యె

తే. వనధిమేఖల నొడుచు నర్భకుఁడు గర్భ
యుక్తి గన మధ్యమేఖల యోహాటించి
కొలఁకు లందక మంజూషికల నడంగెఁ
జిగురుఁబోఁడికి దోహదశ్రీ వెలుంగ. 63

కం. మిసమిసయను చెలి మేనన్
బసపున నలుగిడుట వెఱ్ఱిపనియని చెలులా
రసికతఁ జూపరు మేలిమి
పసిఁడిన్ గరసానసేయు పనులుం గలవే! 64

తే. గీ. గర్భగతడింభకునియూర్పుగములు తోడు
పడిన కైవడి నిశ్వాసపంక్తి యింతి
వదనమున సంచరింప దుర్వారవిమత
జనపతుల కట్టె నిట్టూర్పు లినుమడించె. 65

ఉ. మించెఁ జెమర్చె పొంగె నని మేన ఘటింపక యింతి ద్రోచినన్
గొంచక తన్మనోహరుని కూరిమికిన్ గటకమ్ము కాంచి మేల్
గాంచు పురంబులయ్యె మొదలం దుదఁజెందు వివర్ణవృత్తి న
ర్థించి నిచోళ మంగదము దేశములయ్యె నృపాలమాళికిన్. 66

చం. హారిసతి శంభురాణి యచలాహితు నంగన యిట్టి నేర్పు ము
న్నరయఁగఁ జాలరంచు వసుధాధిపుదేవి తనంత మృత్కణో
త్కరరుచి గోరె కామశిఖికాండజయంతు లెఱుంగలేని త
త్సరస రసారసజ్ఞత నిజప్రభవవిష్ణుఁ డెఱుంగునట్లుగన్. 67

కులశేఖరుని జననము

ఉ. ఆరయఁ గుంభసంక్రమణ మందు శుభానుగతిన్ బునర్వసూ
తార నుదారకీర్తి వనితాసహచారుఁ గుమారు సద్గుణా
ధారు నరేంద్రసుందరి ముదంబునఁ గాంచె సముల్లసత్పయో
వారిధిగర్భవీచి చెలువంబుగఁ జంద్రుని గన్నకైవడిన్. 68

కం. తనయుండు సంభవించుట
విని భూపతి సూతికానివేశమ్మునకున్
జని బాలు వదనకమలము
కనుగొనె సంతోష మాత్మ గడలుకొనంగన్. 69

తే. జనకునకు నాత్మభవరత్నజననవేళఁ
గానబడు పితృలోకతమోనివృత్తి
నాత్మభవరత్న ముదయింప నవ్విభునకు
గానఁబడె సర్వలోకతమోనివృత్తి 70

కం. సుతు కభ్యుదయముగా జన
పతి యానందమున నొసఁగె భర్మాచల గో
వితతమణి చేల యువతీ
ప్రతతుల నమితముగ భూసురప్రవరులకున్. 71

ఉ. లోకహితార్థియైన శిఖిలోచను సాధనభాగవృత్తిమై
నాకుని పక్షపాతియు మనమ్మున సైపక హేమశైలర
త్నాకరతోయముల్ దలపఁడయ్యె సుతోత్సవదానవేళ సు
శ్లోకులు సాధురక్షణవిలోపము సేయుట కోర్వనేర్తురే. 72

తే. చంద్రవంశావతంసమై సంభవించు
సుతున కన్వర్థముగనై యశోధనుండు
ప్రేమఁ గులశేఖరుండను నామమిడియె
సకలశిష్టసభాజనసమ్మతముగ. 73

వ. ఇట్లమ్మహీపాలుండు బాలునకు జాతకర్మ నామకరణాది సంస్కారంబులు నిర్వర్తించి సంతుష్టాంతరంగుండై యుండె నయ్యర్భకుండు క్రమక్రమంబున. 74

ఆ. వె. అక్క యత్త యవ్వ యనియెడి శబ్దమ్ము
లోలిఁ బలుక నేర్చు వేళలందు
రామ! రామభద్ర! రఘువీర! యనియెడు
పేరు లుగ్గడించి పిలువఁదొడఁగె. 75

కం. పాపని తొక్కతొక్క పలుకుల
లోపల రఘుతిలక! కమలలోచన! యను స
ల్లాపము లెఱింగి పొంగున్
భూపతి యొకభుజము రెండుభుజములు గాఁగన్. 76

సీ. శ్రీరామమూర్తి వర్ణించువారల పొందు
వీడఁ డాకొనియున్న వేళనైన
రఘునాథనామకీర్తనము సల్పెడుపట్టు
వెడలఁడు నిద్రించు వేళనైన
కాకుత్స్థవరు గుణోత్కర మెన్నునెడఁ బాయఁ
జాలఁడు క్రీడించు వేళనైన
జానకీపతి కథాశ్రవణ మబ్బిన నొండు
వినఁ డంబ పిలిచిన వేళనైన

తే. దశరథాత్మజపాదపద్మప్రసక్త
చిత్తవృత్తికిఁ బరదైవవృత్తరక్తి
పొరగ నీఁడయ్యె మహనీయసుగుణగణవి
రాజితుండైన కేరళరాజసుతుఁడు. 77

చం. అతివలు నవ్వుటాలకు నృపార్భకుతోఁ దనతండ్రి ద్రోఁచినన్
సతియును దాను రాఘవుఁడు శైలములందుఁ జరించెనాఁగ దుః
ఖితుఁడగు జానకీవిభుఁడు కేవలమర్త్యుఁడె! సోదరుండు భూ
సుతయును దోడరా నగరుసొచ్చెననన్ మదిఁబొంగు క్రమ్మఱన్. 78

ఆ. వె. కోసలేంద్రతనయ కోమలవిగ్రహ
ధ్యానవశత నుండుచో నతండు
ననుభవింపఁగోరి యటమున్న తెమ్మన్న
దాది చేతిపండు తాఁ దినండు. 79

కం. కినియుచుఁ బోరిడు నతనికి
జనని గుడఫలాదు లొసఁగఁ జల ముడుగక యుం
డిన నెల్లివచ్చు రఘుపతి
మనయింటికి ననిన నలుకమాని చెలంగున్. 80

వ. ఇత్తెఱంగున నైసర్గిక శ్రీరామచరణకమలభక్తిభావనాధురీణుండగు కుమారు నుపనీతుం గావించి దృఢవ్రతుండు వివిధవిద్యావిశారదుం జేయఁదలంచి యార్యుల వశంబు చేసిన నతండు. 81

కం. క్షితిపాలసుతుఁడు గురుసం
గతి నతులితసూక్ష్మబుద్ధికౌశలమున సం
చితవేదశాస్త్రముఖో
ర్జితవిద్యానిచయ మభ్యసించెన్ బ్రీతిన్. 82

ఉ. క్రూరకుదృష్టిభాషణనిగూఢవికల్పితశబ్దలింగశా
రీరకశాస్త్రిసూత్రకబరీపరివేష్టితవిష్ణుతత్త్వమం
దారసుమమ్ము దాఁ గొనియె ధన్యవిచారుఁడు నీరసాగత
క్షీరవివేచనారచన చెల్వగు హంసకిశోరవైఖరిన్. 83

తే. వేదవేదాంగముల ధనుర్వేదమున న
రుంతుదాభ్యాసకౌశలస్వాంతుఁ డయిన
యక్కుమారునిఁ దోడ్కొని యార్యజనులు
పార్థివేంద్రుని కడకేగి పలికి రిట్లు. 84

శా. రాజన్మూర్తి భవత్తనూజుఁడు మనోరాజీవవీధిన్ మహా
రాజశ్రీరఘురామనామదివిషద్రాజాధిరాజాంఘ్రి సే
వాజాగ్రద్గతిఁ బూని నేర్చెఁ జదువుల్ వైదుష్య మేపార నో
రాజా! పాండురకీర్తిరాజనిధిముద్రా! రాజరాజోపమా! 85

సీ. అనఘ! పురాణవాగర్థబోధాయనుం
డాగత వివిధభాషాగురుండు
ప్రాకటన్యాయశాస్త్రైకదృక్చరణుండు
చతురాత్మపౌరుష శబ్దభోగి
విపులాహితైశ్వర్యవిక్రమబలభేది
రమ్యధర్మకళాప్తిరాజమౌళి
ప్రమదామనశ్చ్యుతి ప్రసవసాయకపాణి
ధృతిసార విహసిత క్షితిధరుండు.

తే. గీ. చతురగాంభీర్యవాహినీస్వామి పద్మ
వేష్టితపదార్థుఁ డనుభవవితరణస్వ
భావఘనుఁ డింక నిన్ను చెప్పంగ నేల
సుజనమాన్యుఁడు నీతనూజుండు రాజ! 86

చం. అనవుడు ధారుణీరమణుఁ డాత్మజుఁ గన్గొని బార సాచి య
క్కున గదియించి పెల్లెసఁగు కూరిమి పేర్మి నిజాంకపీఠిపై
నునిచి శిరంబు మూర్కొనియె నోలి కుమారు శిరోజపాళిఁ జెం
దిన నవమౌక్తికంబులగతిన్ ప్రమదాశ్రుకణమ్ము లొల్కఁగన్. 87

వ. ఇట్లమ్మహీవల్లభుండు ప్రమోదరసభరితాంతఃకరణుండగుచుఁ గుమారు గారవించియాచార్యునకు ననేకమణిభూషణసువర్ణచేలంబు లొసంగి పరితుష్టులగు వారలయాశీర్వచనంబులు గైకొని యనంతరంబ కుమారునకు ననన్యకన్యాసాధారణమ్ములగు గుణసౌందర్యవిశేషమ్ములం బొలుపుదీపించు నొక్క రాజపుత్రికం బరిణయంబుగావించి పరీక్షితశుభలక్షణశోభితుండగు నతనివలన నాత్మీయ సామ్రాజ్యలక్ష్మి సురక్షిత యగుంగాక యనితలంచి నిజపరికరంబులతో నతని రాజపీఠంబున నభిషిక్తుంజేసి ప్రధానసామంతబలపరిజనభాండాగారంబులు మొదలగు సప్తాంగంబులతని వశంబుచేసి తన్నుం గృతార్థుంగా దలంచుచు నిర్భరుండై యుండె నంత, 88

కులశేఖరుఁడు రాజగుట

కం. సాంద్రసుధాకరమగు మను
జేంద్రసుతాభ్యుదయమున మహీచక్రము ని
స్తంద్రఫలవృద్ధిగనియెన్
జంద్రోదయవేళ నలరు జలనిధి వోలెన్. 89

ఉ. సంతతసత్య దానగుణశాలి దృఢవ్రతనందనుండు కా
ర్తాంతిక విద్వదార్య కవిరాజ సుఖప్రదుఁడై చతుస్సము
ద్రాంత వసుంధరాభరణ మాత్మభుజాభరణమ్ము జేసె ది
గ్దంతి భుజంగరాజ కనకక్షితిభృత్కిటులన్ హసింపుచున్. 90

చం. వనులు ఫలప్రవాళసుమవాసనలన్ దటినీచయమ్ము గో
కనద బిసప్రసూన నవగంధ మనోహర తీర్థయుక్తి గో
ధనము పయఃప్రదోహనవిధానమునన్ ధర సస్యసంపదన్
దనరె దృఢవ్రతాత్మజుఁ డుదారత రాజ్యవిభూతి నందుటన్. 91

చం. భుజబలశాలి యవ్విభుఁడు భూరిశరాసనబాణధారియై
గజ రథ వాజి వీరభటగౌరవభీషణసైన్యబృంద మ
క్కజముగఁ గొల్వ నేగి పటుగర్వమహీపతికోటి నోర్చి ది
గ్విజయము జేసెఁ గీర్తిపదవీపిహితాంబుధి సప్తకంబుగన్. 92

సీ. ఆ ధనుర్ధరు ధాటి కంగరాజు చలింప
కర్ణాటవిభుఁ డిచ్చకంబు నెరపె
నాపుణ్యునకుఁ గామరూపభర్త ప్రియమ్ము
సేయ విదేహుండు సిగ్గువడియె
నావినోదికిఁ గుంతలాధీశ్వరుఁడు మ్రొక్క
కాశ్మీరపతి హితకారి యయ్యె
నాయజ్జ్వరతుఁ గాశనాయకుండు భజింప
నాగి విదర్భవరేణ్యుఁ డోటువడియె
నాబలాఢ్యునకు మహారాష్ట్రరమణుండు
మ్రొక్క వరాటేంద్రుఁ డుక్కుసెడియె

తే. పరగఁ బాంచాలపతి పద్యఫణితి నతని
వినుతిసేయంగ గాంధారవిభుఁడు పఱచె
బలియులగు వారలిట్లైన బలవిహీను
లేమిసేసెద రమ్మానవేంద్రు నెదుట. 93

సీ. అతని సౌందర్యధుర్యతకు వసంతుండు
బెదరి పట్టినకొమ్మ వదలఁడయ్యె
నతని విచారదక్షతకు దక్షుఁడు నాన
యెత్తి వంచినతల యెత్తఁడయ్యె
అతని మహాబలోన్నతికి భీతిలి మహా
బలుఁడు పాఱిన కాలు నిలువఁడయ్యె
నతని ప్రతాపానలాభీలతకు శూలి
తివిరి మూసినకన్ను తెరువఁడయ్యె 94

తే. గీ. నతని చెలిమెంత యాతని యల్లుడెంత
యతని సుతుఁడెంత యాతనియశనమెంత
కాముఁడైనను రాజైన భీముఁడైన
గరళమైనను సరినెన్న గలరె కవులు. 95

తే. గీ. అతని ధైర్యప్రతాపవిశ్రుతికి విబుధ
దంతివహ్నులు దలఁకి దిక్తటులఁ జేరె
నవియె చిరధారుణీభర మూని మోచె
నవియె భయమంది మిన్నుల నాశ్రయించె. 96

సీ. తన సఖిత్వము శారదాదేవి వాంఛింప
హా! నీలవేణి పొమ్మంచుఁ బలికె
తన కుచాప్తత రాజతనగమ్ము గాంక్షింప
హా రసతీనిలయ! పొమ్మంచుఁ బలికె
తన నేత్రముల మైత్రి ధవళాంబుజము వేడ
నలికులాళకమ పొమ్మంచుఁ బలికె

* * * * *

తే. గీ. తన సితచ్ఛాయ సరిసేయఁ దగినవారి
నరసు లెన్నంగఁదొడఁగె నా నృపవరేణ్యు
కీర్తిసీమంతినీమణి కేళిసలుప
నవని కడద్రొక్కి వినువీథి కరుగునపుడు. 97

సీ. తెలిగన్నులకు మీను బెళుకు లెన్నినఁ జాలు
కలువరేకులఁ జెప్పవలె నటమ్మ!
మాటల కమృతంపు దేఁట లెన్నినఁ జాలు
కలికికోయిలఁ జెప్పవలె నటమ్మ!
తగు మోము చికిలియద్దము నెన్నుకొనఁ జాలు
వనజాతములఁ జెప్పవలె నటమ్మ!
గతులకు రాయంచగమన మెన్నినఁ జాలు
వారణమ్ములఁ జెప్పవలె నటమ్మ!
తే. పొలఁతి వర్ణించు కవివరుల్ ప్రొద్దువోక
నిన్ని ద్రవ్వేద రనుచు దా నితరకాంతిఁ
గెలిగొను నమ్మహీనాథు కీర్తికాంత
ప్రాణసఖయైన మిన్నేటిపడుచుఁ గాంచి. 98

చం. అడుగునఁ బుట్టితీవు దివియందు జనించినదాన నౌట నే
పొడవని గంగ పల్క, నరపుంగవు కీర్తివధూటి పల్కు నా
నడుగున నీవుపుట్టితివి హస్తతలమ్ములఁ బుట్టినట్టి నే
పొడవని యిట్లసంగుదురు భూరి నభోంతరవీథి నిద్దఱున్. 99

కం. ధర విక్రమమునఁ గులశే
ఖర నృపతిం బోల్ప హృదయగతుల మహీపా
లుర వెదకివెదకి వేసరి
సరి కేసరి యొకటి యండ్రు సరసులు సభలన్. 100

కం. అని యతిశయోక్తి రచనన్
వినుతింపన్ దగి సముద్రవేలావృతభూ
జనరక్షాపరతంత్రత
నొనరెఁ ధరణీశ్వరుఁడు సమున్నతలీలన్. 101

వ. వెండియు నఖండసామ్రాజ్యలక్ష్మీకటాక్షవీక్షణసంధుక్షిత ప్రతిక్షణాభినవోదయవైఖరీనిరీక్షణోపగత నిజైశ్వర్యన్యూనతానుశయ సంక్షుబ్ధసహస్రాక్షసంతాపనిశ్వాసశ్వసనఘటనానిశ్శేషపరిశోషిత మకరంద పరిమ్లాన నిజసుందరీపయోధరమిళితమందారమాలికావిరక్త మధువ్రతనికరపరివేష్టితాత్మీయమహోద్యాన మండలుండును, మండలాగ్రవిధుంతుదకబళితవిరోధిరాజన్య యశశ్చంద్రికానిమీలనోన్మీలన సంతాపితతదీయకాంతా నయనోపాంత విగళితసాంజనసలిలధారాప్రవాహతిమిరప్రసారనిరోధకనిజతురంగరింఖాసంఘాతసంఘట్టనసముద్ధూతభూభాగారుణపరాగరేఖామయూఖానుమిత నిరవసాన స్వప్రతాపతపనోదయ సంప్రీడితపద్మినీబంధుండును, బంధుజననయనానందసంధాయక నిరంతరనిజకరతలవిముక్త దానధారాసలిలవేణికా పరిప్లుతసమస్తమహీవలయ సంచారసముదంచిత కీర్తిసీమంతినీచరణపంకాంకిత దిక్కుంభికుంభమధ్యుండును, మధ్యమానమహార్ణవ సముదీర్ణసంక్షోభ తిరస్కారకారణభూరిభేరీభాంకారరవశ్రవణసమయోపగతభయకుతూహలభరితామిత్రమిత్ర సముదయుండును, దయారసలేశమాత్రయోగ పాత్రభూతార్థిసందోహమందిరాంగణప్రవేశిత దంతావళకపోలమదామోదానుభవామోదిత మధువ్రతమాలికాఝంకారరవాకర్ణనోత్సుకప్రాహూతికప్రశంసితనిజౌదార్యగుణవిశేషుండును గౌతమజైమినిద్వైపాయనప్రభృతి ప్రణీతవివిధతంత్రాంతరాశయారుందతుమేధాశాలి విబుధహృదయాహ్లాదసంధాయకుండునునగు నమ్మహీనాయకుండు మహనీయకుడ్యవిరచిత చిత్రపుత్రికాసౌందర్యావలోకన కుతూహలాయాతజనవిస్మయాపాదకంబును, మణిఖచితశాతకుంభస్తంభశోభావిభాసమానాభ్యంతరప్రదేశంబునగు సభామధ్యంబున విలాసినీకరకమల చలద్వాలవ్యజన జనితమృదుపవనంబులోలయ విచిత్రసింహాసనాసీనుండై సచివసామంతపురోహితప్రభృతులగు ముఖ్యజనంబులతోడసంభాషణంబులు సలుపుచుండె నంత. 102

వైష్ణవ యతి వచ్చుట

సీ. జడలుగట్టిన శిరోజశ్రేణి బాలార్క
        కిరణాంకురమ్ములఁ గ్రేణిసేయ
భూషితశ్వేతోర్ధ్వపుండ్రరేఖలలోనఁ
        బచరించు హారిద్రరుచు లెసంగ

బహుతంతుకీలితపటమిళత్కాంరపా
　　ళిక పయోజాక్షమాలికలు గదల
పుణ్యతీర్థోదకపూరితంబగు తిరు
　　క్కావేరి వలకేలఁ గానుపింప

తే. గీ. భవ్యభుజపీఠి వ్రేలుచు దివ్యదేశ
గమ్యమృదుతీర్థగుళికల కక్షపాల
సారె నురియాడ శ్రీభక్తిసారు లనఁగ
నెసఁగ నొకయోగిశేఖరుం డేగుదెంచె. 103

వ. ఇట్లు చనుదెంచు యోగీంద్రు ననతిదూరంబునం గాంచి యారాజకులావతంసం బిరుగడల నాందోళితవ్యజనదండపాణులగు సీమంతినీరత్నమ్ముల కరతలమ్మున వారింపుచు కాంచనపీఠమ్ము డిగ్గనుఱికి సంభ్రమంబున సభాసదులుం దాను నమ్మహానుభావు నెదుర్కొని ప్రదక్షిణపూర్వకంబుగా సాష్టాంగదండప్రణామంబు లాచరించి కనకాసనంబున నునిచి తప్తకాంచనకలశానీతంబులగు పూతశీతలసలిలంబుల నమ్మహాత్ము చరణంబులు గడిగి తత్తోయంబులు శిరంబున నిడుకొని యథావిధిం బూజించి తదనుజ్ఞంగొని తానును సముచితపీఠంబున సమాసీనుండై నిజవిలోకనకిరణాంకురసంకరంబు లమ్మహనీయమూర్తి ముఖమండలంబునం బొలయఁ గరంబులు ముకుళించి సవినయంబుగ నిట్లనియె. 104

ఉ. ఏయెడ నుండి మీర లిపు డిం దరుదెంచితిరయ్య! మున్ను నేఁ
జేయు తపమ్ము లన్నియును సిద్ధివహించె రమామనోహర
శ్రీయుతదివ్యమూర్తి మదిఁ జేర్చి భజించు మహానుభావు లే
చాయకు వచ్చినన్ గలుషసంఘము వాయుట తథ్య మెన్నఁగన్. 105

కం. మది మిమ్ముఁ గొలుచుటకు స
మ్ముదమున భావింప నాడఁబోయిన తీర్థం
బెదురుకొనునట్లు మీ రి
య్యెదనున విచ్చేసితిరి కృతార్థుఁడ నైతిన్. 106

మ. భవదావానలకాలమేఘము విపత్పాథోధిపోతమ్ము దుః
ఖవిషాభీలభుజంగబర్హిణము మహాఘవ్రగ్రావదంభోళి దు
ర్వ్యవసాయాంధతమఃపతంగకిరణవ్రాతంబు, తాపత్రయీ
సవిధారణ్యకుఠారధార భవదీయాలాభ మెవ్వారికిన్. 107

కం. సంసృతివిపినము వెడలగ
సంసరణంబెట్లు దొరకు జడులకు భగవ
త్సంసత్ప్రియులగు యుష్మ
త్సంసర్గము లేకయున్న ధన్యవిచారా! 108

వ. కావునఁ బుణ్యపాపఫలమ్ము లెట్టివానికి ననుభవింపందగియుండు నెట్టి వానికి మోక్షమ్ము దొరకొను నదియునుంగాక నాకుం గాలక్షేపమ్ము సేయు సదుపాయమ్ము నెఱింగింపవలయునని ప్రార్థించినం బ్రీతుండై యమ్మునీంద్రుండు నరేంద్రునింజూచి యిట్లనియె. 109

రాజు ప్రశ్నములకు యతి యుత్తరము

సీ. నిసువుఁబ్రాయమునఁ జెన్నెసఁగు నారాయణ
ద్వయమంత్రవర్ణసంతతులు గాంచె
చుంచు బెంచిననాఁడె మంచు ద్రుంచిన వేల్పు
కొలము సామి భజించు నెల వెఱింగె
గరిడి ద్రొక్కిననాఁడె గర్వాంధపరిపంథి
కంధికి మంథాద్రికరణిఁ దోచె
నలిత జన్నిదమూఁదినప్పుడె తొలుపల్కు
కొనలఁ దోఁచిన తత్త్వమునఁ బెనంగె
తే. గీ. కర్ణ సనాగ్రభుజబుద్ధికౌశలములు
వర్ణనీయమ్ములయ్యె నవ్వలనుగాంచి
కాంచుగాకేమి సిరినెదఁ గాంచు విభుని
కరరత్నంబు పుట్టుప్రు గాంచుకతన. 110

వ. ఇట్టి నీవు పరతత్త్వవిచారపరుండవగుట యాశ్చర్యముకాదు కావున నీవడిగినప్రశ్నవచనంబులకు నుత్తరమ్ములు సెప్పెద నాకర్ణింపుము. 111

సీ. ఒనర నేబదికోట్ల యోజనమ్ములు గర్భ
గోళమ్ము దళ మొకకోటి యోజ
నంబులు గలిగి వర్ణ్యంబై హిరణ్మయాం
డంబు దీపించు నున్నతిఁ దనర్చు

నయ్యండమునకు జలానలానిలవియత్ప్రభృతి
సప్తావృతి ప్రతిభ దనరు
భువి యాదిగా సప్తభువనపర్యంతమ్ము
దగ నూర్ధ్వలోకసప్తకము వెలయు

తే. గీ. నతలవితలాదిసంజ్ఞల నమరి క్రింద
జగము లోకయేడుగలవు విశాలలీల
నిందు భువిదక్క దక్కన పొందుపట్లు
పుణ్యపరిపాకలభ్యముల్ భూవరేణ్య! 112

వ. ఇంక భూలోకవిశేషమ్ము పరిపాటి నెఱింగించెద. 113

కం. జంబూద్వీపము విస్తీ
ర్ణంబై యొకలక్షయోజనంబుల దగు దీ
నిం బరివేష్టించిన లవ
ణాంబుధికిన్ మాన మదియె యవనీనాథా! 114

వ. ఇత్తెఱంగున ప్లక్షాదిద్వీపంబులేడును నైక్షవప్రభృతిసముద్రసప్తకంబు నొండొంటికిఁ ద్విగుణితయోజనవిస్తీర్ణంబులై విలసిల్లుచుండ సముద్రద్వీపపరిమితమహీవలయంబునకునినుమడియగుచు పిపీలికామశకమక్షికాదివిరహితంబును విబుధవిహారయోగ్యంబునునగు సువర్ణభూమి తేజరిల్లుచుండుమఱియును. 115

తే. గీ. అంతమీఁదట జక్రవాళాచలంబు
పసిఁడిపుడమికిఁ బెనుకోట పగిది నెసఁగు
నవల మిహిరాంశుజాలమ్ము లడర వదియె
బంధురాంధతమఃపుంజపంజరమ్ము 116

శా. సంబద్ధోరుతరప్రకాండనిచయచ్ఛన్నాంబరప్రోల్లస
జ్జంబూభూజపతత్ఫలవ్రజరసస్రావస్రవంతీతటీ
జంబాలోజ్జ్వలహేమకాంతిపిహితాశాకోణమై యుండుటన్
జంబూద్వీప మనంగఁ బెంపెసఁగు భాస్వల్లీల శోభిల్లుచున్. 117

కం. ఈజంబూద్వీపంబున
నోజఁ నవఖండములు సముజ్జ్వలలీలన్
రాజిల్లు నందు నన్నిది
తేజోవిలసితము లగుచు దీపించు నృపా. 118

తే. గీ. ద్వీపషట్కభూమిఁ దిరిగెడు పుణ్యాత్ము
లాఁకలియును దప్పి యలఁత ముదిమి
దెవులులేక నెపుడు తెలివొంది యుండుదు
రష్టఖండవాసు లట్టివారు. 119

వ. మఱియును. 120

మ. నిరవద్యాచ్యుతలోకలోలుపసుధీనిశ్రేణి కాదండ, మా
దరణీయాతిథికల్పకాండము వినూత్నశ్రీకరండంబు ని
ర్జరభాగాశనపూర్ణభాండము, త్రివర్గస్థేమశౌండంబు దా
నరతాత్మామృతఖండ మీభరతఖండం బొప్పు భూవల్లభా! 121

వ. మఱియు నిట్లుస్నానతపోయజ్ఞవసనభూషణాన్నప్రదానాదిసుకర్మంబుల వలన స్వర్గాదిపుణ్యలోకప్రాప్తియు బ్రహ్మహననసుజనతిరస్కరణపరధనపరదారాద్యపహరణ మృషావాదప్రముఖ దుష్కర్మంబులవలన నిరయనివాసంబును సిద్ధించు స్వర్గనరకాదిసంబంధంబులు జీవులకు స్వకర్మఫలభోగ్యకవినాశ్యంబులు కావునన్ బునర్జననకారణంబులై యుండు భగవన్మాయానిరుద్ధులగు బద్ధజనంబులు కామాది గుణవికారమ్ములం జేసికదా గదాధరు నారాధింపంజాలరు జాలరి జాలకంబునం బొదివి జలచరంబుల నిరోధించు చందంబున నప్పరమపురుషుండు నిజమాయావిశేషమ్మువలనం జీవులం జిక్కువఱచుచుండు మనుజసమూహంబు ధనదారపుత్రక్షేత్రాభిమానంబులను తిమినక్రఝషభుజంగంబుల నతిభయంకరంబగు సంసారసముద్రంబునంబడి మునుంగుచుండు. భగవత్క్రీడాపరికరంబును గుణత్రయాన్వితంబును నగు ప్రకృతివలనంబుట్టిన మహత్తత్త్వంబున నగు నహంకారంబువలన నయ్యెడు శబ్దస్పర్శాదితన్మాత్రలం బ్రభూతంబులగు గగనాదిభూతంబుల మేళనంబునం జేసి యాశరీరంబులు శరీరులకు భోగభాజనంబులగుచుండు. పూర్వపూర్వజననావసరసముత్పాదితనానావిధకర్మఫలానుభవజనితవాసనావిశేషంబులవలన బహిరింద్రియోపకరణంబులను మనోబుద్ధ్యాదులుపెక్కుత్రోవలం ద్రొక్కింపుచుండు. నప్పరమేశ్వరుండే

తత్ప్రపంచంబునకు నుదయస్థితివిలయకారణమ్ములైన రజస్సత్వతమోగుణమ్ముల
నాశ్రయించి వాసుదేవాదివ్యూహభేదమ్ములను రామకృష్ణాద్యవతారవిశేషంబులను
వినోదంబునసలుపుచుండు నింకపునరావృత్తిరహితంబగు నప్పరమపురుషు పరమస్థానం
బునకుఁ జేరు నుపాయమ్ములు కర్మజ్ఞానభక్తిప్రపత్తియోగమ్ములను నభిధానమ్ములం
జతుర్విధంబులని యార్యులవలన వినంబడు, నవి యెయ్యవియనం టేని శ్రీవిష్ణుమందిర
నిర్మాణ తదీయసమ్మార్జన దీపారోపణ మాల్యసమర్పణాదికంబును పంకజోదర
కైంకర్యరూప తపోదానయాగాధ్యయనవనతటాకాదినిర్వర్తనంబులను క్రియావిశే
షంబుల నగునది కర్మయోగంబనంబడు, నట్టిది జనకమహీపతిప్రభృతులయందు
ప్రఖ్యాతంబయ్యె స్వస్వరూపపరస్వరూపవిరోధిస్వరూప ప్రభృతివిషయకంబైన
యథాబోధంబు జ్ఞానయోగంబనంబడు, నట్టిదినారదాదిమహామునులయందు విశ్రుతం
బగుచుండు విజ్ఞానపరిణతంబును సత్త్వగుణాతిరేకోపగతపులకాంకురబాష్పగద్గదస్వర
వికారాదిగుణవిలసితంబును విచ్ఛిత్తివిరహితంబునునగు భగవద్విషయప్రేమవిశేషంబు
భక్తియోగంబనంజను, నది ప్రహ్లాదప్రభృతులయందుఁ బ్రసిద్ధంబయ్యె నింకఁ
దృప్తప్రపత్తియు నార్తప్రపత్తియుననఁ బ్రపత్తియోగంబు ద్వివిధంబైయుండు
ముకుందభక్తిపరిపాకంబువలన దేహదేశకాలాదుల వైరాగ్యంబువలనను నిత్య
యుక్తంబులగు తాపత్రయజనితదుఃఖమ్మువలన నసహిష్ణుతం జేసి విష్ణుదేవునిం గూర్చి
యాక్రోశించునది యార్తప్రపత్తియనంజను నది గజేంద్రముఖ్యులయందు విఖ్యాతం
బయ్యె నింక నాచార్యకృపాలబ్ధంబులగు పంచసంస్కారంబులవలనం బవిత్రిత
గాత్రుండగుచుఁ దదుపదిష్టతత్త్వజ్ఞానవిశేషవిశదీకృతాంతఃకరణుండై స్వాపార
తంత్ర్యంబును భగవత్స్వాతంత్ర్యతయు నెఱింగి యాశేషతల్పునకు శేషభూతుం
డును బరమభాగవతసేవానిరతుండును నగుచు గృహస్థుండయ్యును సుహృత్కళత్ర
పుత్రక్షేత్రారామపశుప్రముఖంబులను ధనంబులయందు మమత్వమ్ము విడిచి యర
విందసభవ భవేంద్రసనకప్రముఖ వర్ణనీయంబులగు నయ్యంబుజేక్షణు దివ్యరూప
దివ్యగుణ దివ్యమహిమైశ్వర్యంబులు మనంబులం దలంచి పులకితశరీరుండగుచు
మోక్షపర్యంతంబు కాలక్షేపంబుసేయునది తృప్తప్రపత్తియనంజను, నట్టిది వశిష్ఠపరా
శరశౌనకవ్యాసాది ఋషులయందును బ్రియవ్రతోత్తానసుత ధ్రువ నాభి వైన్య
రుక్మాంగదాంబరీష ప్రభృతిరాజముఖ్యులయందును సుప్రసిద్ధంబయ్యె నదియట్లుండెఁ
గారణజన్ములగు మీవంటియుత్తమపురుషుల కీధర్మంబులు సులభంబులైయుండు

నదియునుంగాక శ రవాచకశబ్దంబులకు శరీరిపర్యంతధావనంబుగలదు కావున జగచ్ఛరీరుండగు నప్పురుషోత్తముండు సకలశబ్దవాచ్యుండగు నైనను విష్ణునారాయణ వాసుదేవాదిదివ్యనామంబులతనియందు ముఖ్యవృత్తిం బ్రవర్తించుటంజేసి తదాత్మకంబయినమంత్రంబులు ప్రపన్నులకు నవశ్యానుసంధేయంబులని వేదవాక్యంబుల వినంబడు నదియునుంగాక భవజ్జననసమయంబున దృఢవ్రతకాంతానిశాంతంబునకుం జనుదెంచి సూత్రవతీకాంతుండేకాంతంబున శ్రీమన్నారాయణదివ్యమంత్రంబు నీకు నుపదేశించుటంజేసి మున్న కృతార్థుండవై యున్నవాడవైనను సంధుక్షితమోక్షలక్ష్మీప్రతీక్షితులగు విచక్షణులకునవంతశయను ననంతగుణకథనశ్రవణంబులం గాలయాపనంబు సేయవలయుంగావున భాగవతకులావతంసంబ! నీవునుం దొల్లి బృందారకబృందసంప్రార్థితుండై గోవిందుండు రావణవధార్థంబుగా దశరథసుతుండై యుదయించి చేయుకార్యంబులువల్మీకసంభవుండు శ్రీరామాయణంబను నభిధానంబిడి రచియించు నితిహాసంబుపరమపవిత్రంబును నిహపరసౌఖ్యసంధాయకంబును నగుటం జేసి యాప్రబంధంబు శ్రీవైష్ణవసన్నిధానంబున గాలక్షేపంబుసేయునదియని యాదేశించిన నా ధరాభారధౌరేయుండు రోమాంచకంచుకితశరీరుండును ప్రమోదబాష్పసలిలసంసిక్తకపోలయుగళుండునునగుచు నమ్మునివరునకుం బునఃపునఃప్రణామంబులాచరించి యంజలిపుటంబు ఫాలతటంబునం బ్రస్ఫుటంబు గావింపుచు నిట్లనియె. 122

చం. యతివర పంక్తికంఠుఁడు సురావళి నెట్లుజయించె వారలే
గతి హరిఁగాంచి వేడిరి జగన్నుతుఁడేమనియానతిచ్చె సం
శ్రితహితవృత్తిఁ దా నవతరించి విరించివరానుభావగ
ర్వితులగు దైత్యముఖ్యుల హరించిన చందమెటుంగఁ బల్కవే! 123

క. సారములు సాధునిచయా
ధారములు నిశాటహృద్విదారములు మహో
దారములు మోక్షలక్ష్మీ
హారములు రమాధిపతి విహారములరయన్. 124

క. కావున శ్రీహరిచరితము
పావనము శుభాన్వితమ్ము ప్రమదం బెసఁగన్
నీవలనన్ వినవలె నని
భూవరుఁ డర్థింప యోగిపుంగవుఁ డనియెన్. 125

రావణోదంతము

సీ. వినవయ్య! విశ్రవస్తనయులు రావణ
 కుంభకర్ణులు జగత్క్షోభ మొసఁగ
నవ్విరించి గుఱించి యతిఘోరమగు తపం
 బాచరించిన మెచ్చి యవ్విధాత
సురదైత్యనాగకిన్నరయక్షముఖ్యుల
 వలన నొప్పమిలేని వరము లొసఁగె
నది కారణమున దుర్మదగర్వదుర్వార
 సంరంభుఁడై దిగీశ్వరులఁ దొడరి
తే. నొడిచె నగధారి మృగధారి నోటువఱచె
నణఁచె నరభోజి హరివాజి నపహరించె
తఱిమె ధనరాజు దినరాజు దర్పమణఁచె
గెలిచె నలకేలి వలకేలి కేలిగతుల. 126

కం. అంత నిరంతరరోషగు
రంతోగ్రబలేంద్రజిద్భుజాక్రాంతుండై
వంతఁబడవలసె నమరా
త్యంతీనుండైన ధవళదంతీశునకున్. 127

స్రగ్ధర. మదవద్దైత్యేంద్రరక్తాంబకచలనచలన్మంజులస్వర్గలక్ష్మీశ్ర
పదమంజీరారవోజ్జృంభణత ననుమితాపద్భయుల్ దివ్యులాత్మా
స్పదకాంతారంబు డాయంజనఁగ బెదరి కుంజస్థసింహౌఘ మంఘ్రి
స్యదసీర్యద్గ్రావమై విచ్చలవిడి విబుధస్థానముల్ జేరు నోలిన్. 128

మహాస్రగ్ధర. తూలెన్ గైలాసమత్యద్భుతశిఖరశిఖాందోళనధ్వానకుప్య
ద్వ్యాళీనిశ్వాసధూమవ్యతికరకుహనావారిదభ్రాంతచేతః
ఖేలత్తద్బర్హికేకాకృతగుహాపదకేకిప్రతిధ్వానమై ద
ర్పాలీఢానేక లోకోద్యమ దశవదనోద్యద్భుజోత్సాహశక్తిన్. 129

ఆ.వె. అమరు లలిగి వరప్రౌఢి నమరు లలిగి
నిశితపత్రిదశద్వేషి నిశితపత్రి
గతులఁ గఱచిన బహుపత్రిగతులఁ గఱచి
పర చిరంతనహాస్యులై పఱచిరంత. 130

తే. ఇంచుకించుకవడిమైన నంచితాస్త్ర
సంచయాభీలశౌర్యు నక్తంచరేంద్రు
నొంచుటకుఁ జాల కమరులు సంచలించి
యాచరాతింటిపంచమే లంచుఁ జనిరి. 131

వ. ఇట్లేతెంచి విరించిగాంచి దండప్రణామమ్ము లాచరించిన సుపర్వుల
పరిశ్రాంతి నిరీక్షించి యతండు వారలతో నిట్లనియె. 132

సీ. వింతగారుల మేలుబంతి నీచౌదంతి
యేగొంతిఁ జొచ్చె నహిప్రభేది!
నిక్క వైరులఁ ద్రొక్క నీపోతుజక్క యే
చక్కిఁ జిక్కెనో విభాస్వత్కుమార!
పసలేని విసివి నీ మొసలి దాయుసలియై
మసలెనో జలధిసామ్రాజ్యధుర్య!
కొంక దిజ్జగతి నిశ్శంక నీజింక యే
వంక జంకెనో గంధవహనశాలి!

తే.గీ. వాహనము లాయుధమ్ములు వదలి యలసి
సొలసి యేతెంచితిరి దశాస్యునకు నేను
వరము లిచ్చుటెఱింగియు వానితోడ
కయ్యమున కియ్యకొనరు గదయ్య! మీరు. 133

వ. అనినం ద్రిదశపతులాభాషాపతితో నిట్లనిరి. 134

తే. గీ. ఇంటిముంగిట నుండనీకెగచియెగచి
యసురబూతంబు వెనువెంట నంటి తఱుము
వచ్చుటయకాని వానితో వైరమెత్తి
పోరొనర్పంగఁ దరమె యెవ్వారి కైన! 135

కం. పెనుఁ బ్రేవుల్గ గిబ్బ కొమ్ముల
కొనలకుఁ బదనిచ్చి విడుచుకొమరున మీరా
దనుజులకు వరములొసఁగిన
గినిసి యతనిఁ దొడరవశమె! గీర్వాణులకున్. 136

వ. అనిపలికిన వారలపలుకులకుఁ జిత్తమ్మునం గనికరమ్మువొడమి పద్మసంభవుండు పాకశాసన పావక పరేతపతి పలలభోజన పాశధర పవన పౌలస్త్య పార్వతీపతులం దోడ్కొని పాలకడలిపట్టునకుం జని యొక్క శుచిప్రదేశంబున నాసీనులై నియమితేంద్రియవ్యాపారులగుచు శ్రీహరి నారాధించుచున్న యెడ. 137

సీ. మొలకలెత్తెడునవ్వు ముఖసుధాకరునిపై
నవచంద్రికాసమున్నతి నెసంగ
సముకొన్న కరుణారసమ్ము కన్దమ్ముల
మకరందబిందుసంపద వహింప
పొలుపొందు కలుములబోటి వక్షఃపీఠి
తగు రత్నరేఖావిధమ్ము దాల్ప
విలసిల్లుదరచక్రములు భుజోదయశృంగ
ములఁ గేవఁ జంద్రార్కకలనఁ బెనుప

తే లలితపీతాంబరము గాత్రజలధరమున
మించు క్రొమ్మించు తెఱఁగున మెఱుపులీన
చటులఖగరాజ పక్షఘోషము లెసంగ
శౌరి విచ్చేసె నిర్జరేశ్వరుల కడకు. 138

వ. ఇత్తెఱంగున మొదలిచదువుల తుదలంబొదలు కలిమిచెలి మగనిరూపు చవి చూపులంగ్రోలుచు నొండెఱుంగక యొక్కింత తడవూరకుండి యంతఁదెలివి గైకొని యమ్మహాపురుషునిం గాంచి. 39

చం. సనకసనందనాదిమునిసన్నుతపాదసరోరుహాయ, స
జ్జనవిపదంధకారదివసప్రభవే, కమలాలయాఘన
స్తనతటకుంకుమారుణవిలాససముజ్జ్వలవక్షసే, సుహృ
ద్వినయవిదే నమోభగవతే భవతే! యనిప్రొక్కి రందఱున్. 140

మ. అపు డద్దేవవరేణ్యు లాత్మనిటలప్రాంతమ్ములం జేర్చుపా
ణిపుటంబుల్ విలసిల్లె రావణభుజాస్ఫీతజ్వలచ్చంద్రహా
సపటుక్షేపనిరీక్షణోదితమహాసంతాపముం జెందు డెం
దపుఁ గెందమ్ములచంద మచ్యుతునిచెంతం దెల్పునట్లొప్పుగన్. 141

కం. చతురానుపమోక్తుల న
చ్చతురాననుఁ డాత్మవినయసంభృతుఁడై స
న్నుతి గావించిరి శంకర
శతమన్యుప్రభృతులును వచస్స్ఫురితులుగన్. 142

చం. జయజయ! భక్తలోకహరిచందన! నందసునందపత్రి రా
డ్జయవిజయాదినిత్యపరిషద్భజనీయనిజస్వరూప! దు
ర్జయదనుజాటవీదవధనంజయ! వేదశిరస్స్థలీ
శయితమరాళ! కాననగజశ్రమమోచన! పద్మలోచనా! 143

సీ. సదముల భవబంధచయముబాపెడు ప్రాఁక
    పదములందు జనించి బయలుప్రాక
యొడలిపైఁ దెలిచాయ కడలఁ జిమ్మెడి చిల్వ
    కడలిపై నునుపాన్పు కరణి గొల్వ
కరమునందు సువర్ణకమలమూఁదిన చాన
    యురమునందు వసించి యొరపుఁబూన
శ్రుతులందు నుతులఁ బేర్కొన్న చిల్వలగొంగ
    గతులందు వైభవోన్నతి నెసంగ

తే.గీ. నతివిచిత్రప్రభావాభిమతవిలాస
భాసురోదారచరిత మేర్పడిన నిన్ను
సన్నుతింతుము రక్షితసకలభువన!
జంగమస్థావరప్రాణి చక్రపాణి. 144

ఉ. కాదనరాదు కాదు శిఖి కంధి నడంచు భవత్ప్రతాపముల్
గాదనరాదు కాదు ఫణి కాశ్యపిఁ బూన్చుమహోపకారమున్
గాదనరాదు కాదు ఘనుకాంతి నడంచుతనూవిలాసమున్
నీదువిహారముల్ దెలియనేరరుగా విధిముఖ్యు లీశ్వరా! 145

కం. అనుచుం జతుర్ముఖుం డీక్రియం
దను నుపనిషదర్థగతులం దగ వినుతింపన్
విని పద్మలోచనుండు కృప
నెనయు మనోవృత్తి దెలియనిట్లని పలికెన్. 146

ఉ. ఏమి హిరణ్యగర్భ! పనియేమి శచీశ్వర! వహ్నివారిధి
స్వామిమరుత్కుబేరదివసప్రభుచంద్రములార! మీర లే
మేమొకదా భయం బదరి యిట్లరుదెంచుట పంక్తికంధరో
ద్దామభుజావిజృంభణవిధానము సైపకనో! తలంపగన్. 147

కం. హరి యిట్లు లానతిచ్చిన
సరసిజగర్భుండా విపులసంతోషాంతః
కరణుండై పురుహూతుం
గరము ల్లాసమున సైగగాఁ గనుగిలిపెన్. 148

శ్రీమన్నారాయణునితో నింద్రుఁడు తనపాట్లు చెప్పికొనుట

తే. గీ. శిఖికలాపాగ్రమేచకశ్రీ నెసంగు
లోచనసహస్ర మమ్మేఘమేచకాంగు
మోముచందురుపైఁ బర్వ ప్రమొక్కు లిడుచుఁ
జేరి వృత్రారి తమకత చెప్పఁదొడఁగె. 149

కం. అనుపమభుజశౌర్యమునన్
మురు జగముల నేచు రావణుండు తపస్సం
జనితబలమ్మునఁ గ్రమ్మఱ
వనరుహసంభవుని వలన వరములు వడసెన్. 150

కం. రక్కసులఱేఁడు తన పే
రుక్కున బలి గెలువఁబోయె నోహో! తన యూ
రెక్కడ! సుతలం బెక్కడ!
నక్కజ మగుచున్న దిప్పుడది మదిఁ దలఁపన్. 151

సీ. సాలయ నెల్లెడఁ ద్రిప్పి సురభిఁ గ్రొక్కారఁ ద్రాళ్ళ
గ్రుక్కఁ జేసిరి పాలుగ్రోల ననుచుఁ
దటిమి నైరావతదంతిదంతమ్ములు
పెకలఁదీసిరి వాలుబిడులకనుచు
ననయులై పారిజాతాదిద్రుమ శాఖల
విఱుగఁద్రొక్కిరి మంచివిరులటంచు
బలిమి రంభాదికాంతల పయ్యెదలు పట్టి
తలఁగఁ జేసిరి కేళికలకు ననుచు

తె.గీ. నసురు లిబ్భంగి వికచకల్హారకమల
కైరవస్ఫారసౌరభోద్గారిపుణ్య
వారిశోభిత గగనస్రవంతిఁ జొచ్చి
కసటుగల్పిరి మేనులు గడిగి కడిగి. 152

తే. వరములందిన యప్పుడ సరవి నాతఁ
డమరకాంతలఁ జెఱగొందు ననుచుఁబలికె
నాది నిదిచెప్పవలయు నాహా! నిశాట
కపటకృతి బుద్ధి కొకపాదు గలుగనీదు. 153

సీ. దనుజేంద్రుసంధికై త్వష్ట నంపుఘటింప
నతని స్వహర్మ్యనిర్మితికిఁ బొనిపె
సడలక నంత వైశ్వానరుఁబుత్తేర
నతనిఁ బాకక్రియాన్వితునిఁజేసె
పనిదప్పెనని సమీరునిఁ బంప నతని శు
ద్ధాంతకేళీశ్రమం బణఁప నునిచె
మానక విధుని సన్మానించి పంచిన
నతని నుద్యానానుగతిని నిలిపె

తే. మన బృహస్పతి నర్థించి పనుప నతనిఁ
గాంచి శుక్రుండు సు[illegible]లతోఁ గవసి పలుగు
రాల వైచుచుఁ దఱిమినఁ జాలుననుచుఁ
బుడమి య[illegible]రంగఁ బఱతెంచి పురముసొచ్చెఁ. 154

ఉ. అక్షత వార్ధిజన్యధవళాశ్వము నెక్కి జయంతుఁ డేగ, ధూ
మ్రాక్షుఁడు దాడిమైఁ జనుచు నాతనిఁ ద్రోఁచి హరిన్ హరింప, నా
రాక్షసుఁ దాఁకనోడిరి సురప్రభులట్లనె పోఁ జుమీ! రమా
ధ్యక్ష! మదూర్వశీవచనహాసవిలాసము లాఁగకుండినన్. 155

తే. కుంభుఁ డటవచ్చి వెలిగిడ్డి గొనియె మొదల
దాని విడిపింప నశ్వరత్నమ్ముఁ బోదివె
దాని విడిపింప వెండియు దానిఁ బోదివె
చూడు వేల్పులపాటు కౌస్తుభవిభూష! 156

చం. తవిలి దశాస్యుఁ డస్మదిభదంతము తుయ్యుడగాఁ బెకల్చె దా
నవపతిసూతి నన్నొగి రణమ్మున గెల్చి మదంబెలర్ప న
య్యవినయుఁ డింద్రజేత యను నాఖ్యవహించె నికేమిసేయుదున్
నవసినదంతికిన్ విమతనామకృతంబగు కింవదంతికిన్. 157

చం. దనుజుఁడు మేనకాది సురతామరసాక్షులఁ బిల్వఁబంచి పే
ర్చిన మధుపానజృంభణముచే దశవక్త్రిములన్ గడంగి చుం
బనగతులన్ దదీయతనుపార్శ్వములన్ బలుగంట్లు సేయఁ గా
ర్కొనియెడు భీతి వానియిలుద్రొక్కరు క్రమ్మఱ నెన్నిచెప్పినన్. 158

కం. అందుకు మావెల్లేనుఁగు
బందియ వెట్టించినాఁడు పాపరతుం డీ
చందమ్మున బృందారక
బృందము త్రిదివమున నిలువరింపఁగ గలదే! 159

కం. వీరు వినుఁడు నను బిల్చున్
వీరుఁడు రక్కసుఁడు మేషవృషణ! యహల్యా
జార! యనుచు నింద్రసునా
సీరాఖ్యులు నుడువ డపహసింపుచు సభలోన్. 160

కం. ఆయసుర మరుత్తుని యా
గాయతనముఁ జెఱుపఁదలఁచి యత్యుగ్రుండై

డాయఁగ భీతిలు సురలకు
వాయస కృకలాస రూపవైభవ మమరెన్. 161

ఉ. రాజిలు దైత్యరాజునకు రాజు భయంపడె రాజరాజు నీ
రాజన మిచ్చె దక్షిణపురాజు ప్రదక్షిణ మాచరించె వా
రాజు వణంకె డొంకె ఫణిరాజు హరీ! యిఁక నేమి యే మరు
ద్రాజన కాదె రాజపదరాజికి నోటమి గల్గె నేఁటికిన్. 162

బంధుర. అమృతము ద్రావుదు రమరులు సుఖులని యందురు పామరులౌటఁ జుమీ!
విమత నిశాచర వీర శిలీముఖ విక్షపితాంగకులై విబుధుల్
నెమకుదు రద్రిగుహాగహనోదర నిర్వ్యథనాంతరముల్ గతిగా
కమలవిలోచన! విబుధవిపర్యయకార్య మవార్యమె! దేవగణున్. 163

తే. వేయునేటికి దనుజదుర్విషహదుర్వి
లాసదుష్టక్రియాపంకిలమ్ములైన
నెలవు వీక్షింపఁ జనరు వేల్పులు ముకుంద!
నిన్నె కొలిచెద మిచ్చోట నిలుగు కృపను. 164

వ. అని విన్నవించు సురలను సురేంద్రునిం జూచి కృపావిస్మయంబులు మనంబునఁ బెనంగొన హరి యిట్లనియె. 165

అభయ ప్రదానము

కం. శుభమగు వెరవకుఁడిఁక మీ
కభయ మ్మిచ్చెద నిశాచరాధీశ్వరునిన్
బ్రభ చెడఁ దునుమాడెద ము
న్నిభరాజుం బ్రోచు టెఱుఁగరే! సురలారా! 166

వ. అనుచు గోవిందుఁ డందఱం దప్పకచూచి మీమీయంశంబులం గీశపతులం బుడమిం బొడముసట్లు గావింపవలయునని యానతిచ్చి విరించి నూఱడించి, రుద్రు నుల్లాసామృతసముద్రునిం జేసి, పురందరు నానందకందళితహృదయారవిందుం గావించి, తక్కటి బృందారకుల నందఱం బ్రియబంధుర మందమందసల్లాపమ్ముల ననూనయించి వారల వీడుకొల్పి యంతర్హితుండయ్యె మఱియును. 167

ఉ. అంత నిరంతరాదరితహంసరథాదిసుపర్వసంచయ
స్వాంతుఁ డుదారసద్గుణనిశాంతుఁడు శాంతజనాంతరంగవి
శ్రాంతుఁడు పుణ్యకాననవసంతుఁ డనంతుఁడు కోసలావనీ
కాంతుని కాంత నెమ్మొగము కాంతివహింప జనించు వేడుకన్. 168

సీ. పరిపంథిశస్త్రసంపాతవారణవజ్ర
పంజరమ్ములు భద్రకుంజరములు
ఉరుతరోత్సేధమంధరకుధృచ్ఛిఖరాభ
నందనంబులు ఘనస్యందనములు
నతులరింఖావిలంఘితతతాహితపురీ
కూటకంబులు నటద్ఘోటకములు
గణనీయబిరుదోగ్రరణరంగభూతలో
ద్వృత్తనృత్తార్భటుల్ వీరభటులు
తే. బలసి తనుగొల్వఁ గల్వలచెలిమికాని
కలిమి నలమిన సస్యమ్ము కరణి ధరణి
విరులు వనులందు, జనులందు సిరులు నమర
నెసఁగె దశరథభూపాలుఁ డేలునపుడు. 169

కం. అతఁ డనపత్యతఁ బాయఁగఁ
జతురగతిన్ ఋశ్యశృంగు సాహాయ్యమునన్
గ్రతు వాచరించి విప్ర
ప్రతతికి గోభూహిరణ్యరత్నము లొసఁగెన్. 170

తే. మఱియు గౌసల్య కైక సుమిత్ర లనెడి
రాజసతులకుఁ గ్రమమున రామభరతు
లోలి లక్ష్మణశత్రుఘ్ను లుదితులైరి
మంత్రపాయస భాగ సంబంధకలన. 171

సీ. మురువందు చిన్నారిమోము కస్తురిబొట్టు
శశిబింబలాంఛనచ్ఛవి వహింపఁ
దళుకుకెంజాయ కన్నులపై కనీనకల్
తమ్మిరేకుల తేటి యెమ్మె నెరప

పొలుచు గెమ్మోవిపైఁ గళలీను పలుగొనల్
చివురుపై మొగ్గల చెలువుదాల్ప
మెలఁపు చెక్కుల నవ్వు తెలివి యద్దములపై
చికిలి నిగ్గులగుంపు చెలిమిఁ బెంప

తే. గీ. మణిరుచిరకింకిణీఘుణుఘుణురవంబు
ఉల్లసిల బాలలీలలఁ దల్లి మ్రోలఁ
జెలఁగు రఘురాము నెలమి వీక్షించు పౌర
జనములకు నేత్రలాభమ్ము సఫలమయ్యె. 172

కం. మఱచి మరునాకనిఁ బిల్తురె
మఱి నూర్వ్వర వలయు రూపమహిమ నతనికిన్
దఱచి విధు నెన్నవచ్చునె
మఱి నూర్వ్వర వలయు రససమంచితరుచికిన్. 173

కం. ఆటలవేళను దోర్బల
పాటవ మెల్లరు భజింపఁ బటువిశిఖమునన్
కాటుకప్రోవుం బోలిన
తాటకఁ బడనేసె గాధితనయుం డలరన్. 174

ఉ. ఖేచరులై నిశాచరులు కిల్బిషవృత్తి మునిప్రణీత యా
గాచరణాంతరాయకరు లౌట వెసంగని వారి ఘోరనా
రాచపరంపరం బొలుపఱం దునుమాడి కువాచు నీచు మా
రీచుఁ బయోధివీచికల క్రేవలఁ ద్రోఁచె మరుచ్ఛరమ్మునన్. 175

సీ. పదసరోరుహరజఃపటలైకలేశాను
భూతిచే నాగి రాతి నాతిఁ జేసె
కరపల్లవాగ్రప్రకర్షణాకర్షణ
పెల్లుచే హరువిల్లుఁ బొల్లుచేసె
ప్రకటవైభవముచే సకలాస్త్రదేవతా
ప్రతతుల నిజదాస్యరతులఁ జేసె
మృదురూపమహిమచే మిథిలేంద్రకన్యాల
లామంబు దనకు నిల్లాలిఁ జేసె

తే. గీ. బలసమగ్రత నెదిరించు భార్గవునకుఁ
దనదు క్రేఁగంటఁ బొడఁచు కెంధళుకుఁ జూపి
మున్నతఁడు రాచవేఁటఁ గైకొన్న నాఁటి
సా మొదలఁ జేసె భుజశక్తి సాము జేసి. 176

కం. సాకేతనగరమున ల
క్ష్మీకాంతుం డిట్లు జానకీవిభుఁడన మ
ర్త్యాకల్పుఁడయ్యెసుజనే
హాకల్పుండగుచుఁ గీర్తి యాకల్పముగన్. 177

ఆ. వె. అంత దశరథేశుఁ డగ్రనందనునకు
యౌవరాజ్య మొసఁగ నాత్మఁ దలఁపఁ
గినిసి దుర్వివేక కేకయరాజకు
మారి పతిహితమ్ము గోరదయ్యె. 178

కం. నరవర!మును నీవొసఁగిన
వరములు మఱచితివె! రాజ్యవైభవలీలా
భరితుని భరతునిఁ జేయుము
భరతాగ్రజుఁ దపసిఁ జేసి పంపు మడవికిన్. 179

శ్రీరాముని యరణ్య గమనము

తే. గీ. అనుచు నిబ్భంగి కేకయతనయ పలుకు
పలుకుల విధంబెఱింగియుఁ బంక్తిరథుఁడు
ద్రోయఁజాలక శుభకాము రుచిరసుగుణ
ధాము రఘురాముఁ ద్రోఁచెఁ గాంతారములకు. 180

కవిరాజ. వెలవెలనై రవిచంద్రుల యందము వేఱొకచందమునన్ దనరన్
దలకొను నుమ్మలికమ్ములు దమచిత్తములఁ గ్రమ్మ జనమ్ములు సం
కులత నెసంగి ప్రసంగమొనర్పఁ గకుత్స్థకులాగ్రణి డెందమునన్
దలఁకక నేగె వధూమణితోఁ దనతమ్మునితో నడిదమ్ములతోన్. 181

సీ. పలుకులచెలి తేని బహుజగద్భర్తగాఁ
బలికి నేఁటికి నొందు పలుకఁడయ్యొ
నకుగుదమ్ములజగంబంది యన్నకు నిచ్చి
యకుగు దమ్ములరీతి నడుగఁడయ్యొ
నరి గోరుల వధించి ధర బాలునకొసంగి
యరిగోరులేవంచు నాడఁడయ్యొ
జవి, చూచు దేవతాసంఘమ్మున కొసంగి
చవిచూచు నేడుక సలుపఁడయ్యొ

తే. నమ్మహాత్ముఁడునిఖిలవేధోండభర్త
ర్తకెఁజెందునె కోసలరాజ్యమునకు!
లోకహింసకవిద్విషల్లోకదళన
విక్రమకీడ మదిఁబూని వెడలుఁగాని. 182

ఉ. రాజకులావతంసమగు రామవిభుండు గుహానువృత్తి గం
గాజలపూరమున్ గడచి గాఢలతాపిహితద్రుమావళీ
భాజనదుర్గమాటవులఁ బత్నియుఁ దమ్ముఁడు దోడరా భర
ద్వాజుని యాజ్ఞఁ జెందె మదవారణకూటము చిత్రకూటముల్. 183

తే. గీ. అంత భరతుండు చిత్రకూటాద్రి కరిగి
సారెఁ బ్రార్థించి పలుక రాజ్యంబుసేయ
మరుల దొరలక నాతని మఱలఁ బనిచె
నదిగదా! నిత్యసత్య సంవిదులరీతి. 184

సీ. విస్ఫురత్కటతటీవిగళన్మదోదగ్ర
కుంభికుంభఘటాకోటి విడిచి
సముదితధ్వజపటాంచలమరుద్ధుతఘనా
ఘనఘనోన్నతశతాంగముల విడిచి
చటులచంక్రమణవీక్షణభీతపరిపంథి
సంఘతుంగతరంగసమితి విడిచి
బహువిధాయుధపరిభ్రమణకేళీకట
త్వటుమదోద్భటవీరభటుల విడిచి

తే. గీ. రామభద్రుండు విహరించె భీమసింహ
శరభశార్దూలభల్లూకచమరశల్య
గండభేరుండకాసరఖడ్గగవయ
దంతిముఖజంతుఘోరకాంతారములను. 185

కం. అవిరళవిక్రముఁడు రఘు
ప్రవరుం డయ్యడవి నుగ్రభంగి వధించెన్
దివిషన్నిరోధు భైరవ
రవరూఢక్రోధు సాపరాధు విరాధున్. 186

కం. ఈలీల మదిని మునిపరి
పాలనతత్పరత నవ్విభావసువంశ
శ్రీలుం డరిగెన్ వ్యాఘ్ర
వ్యాళమృగార్భటిఁ బంచవటి చక్కటికిన్. 187

తే. గీ. అమ్మహాటవి శూర్పణఖాభిధాన
దానవీమర్విధానప్రధానవచన
సూచితక్రూరతాసహిష్ణుత నతండు
జేసెఁ దత్కర్ణనాసవిచ్ఛేద మపుడు. 188

కం. ముక్కును జెవులును బోయిన
రక్కసి మొఱలిడుచుఁ జని ఖరప్రభృతులతో
నక్కార్యం బెఱిఁగించిన
నెక్కొను రోషమున రాము నిర్జించుటకున్. 189

తే. గీ. ఆగరిత జాగరితయగు నమ్మహాత్ము
నాత్మమాయల బెదరింప నలవిగాక
రుధిరపూరమ్ము సెవినిండి బధిరఁ జేయ
దీనగతి నేగె నజ్జనస్థానమునకు. 190

సీ. మందరాచలనిభస్యందనారూఢుఁడై
భాసురుండైన ఖరాసురుండు
పటురణోత్సాహసంభరితుఁడై ధృతధను
ర్హస్తుండైన త్రిమస్తకుండు

లితసింహఘోషదుర్దాంతుఁడై కృతమరు
త్కంపనుండైన యకంపనుండు
భూరిదోస్సారప్రభూతగర్వక్రూర
భాషణుండై పేర్చు దూషణుండు

తే. గీ. దర్పమదవిస్ఫురచ్చతుర్దశసహస్ర
దనుజభటపంక్తి నడువ నుద్ధతి యెసంగఁ
జనిరి రఘుకులసార్వభౌముని జయింతు
మనుతలంపు నిలింపుల కసము బెంప. 191

కం. అది చూచి రాఘవుండ
భ్యుదితోగ్రక్రోధశిఖిశిఖోజ్జ్వలనిశిత
ప్రదరాస్త్రధనుర్ధరుఁడై
యెదురేగెన్ దనుజవీరహింసాకృతికిన్. 192

మత్తకోకిల. ముంచె నుగ్రశరాగ్నికీలల మోహరించు భటావలిన్
ద్రుంచె ఘోరశిలీముఖమ్ముల దూషణున్ ద్రిశిరున్ మహో
దంచితాస్త్రముల న్వధించె ఖరాసురున్ బ్రియమంది భూ
షించె దేవగణమ్ము లారఘుశేఖరున్ గుణసాగరున్. 193

చం. అదివిని జాతరోషభయదాకృతియై దశకంధరుండు దు
ర్మదమున మాయఁ బొంబసిఁడిమైగల లేడివి గమ్ము రాఘవుం
డుదితసతీనియుక్తి నిను నొయ్యనఁ గైకొన నేగుదెంచు న
య్యదనున సుందనందన'నృపాంగనఁ గైకొని తెత్తు లంకకున్. 194

వ. అనుచు మారీచుం బుత్తెంచిన వతండును హేమకురంగరూపధరుండై స్వాశ్రమసమీపవర్తియగుటయు. 195

కం. చంచద్రత్నకురంగో
దంచితరూపమ్ముఁ గని ధరాత్మజ వేడ్కన్
బంచాశుగనిభు విభుఁ బ్రా
ర్థించెన్ గాంచనమృగమ్ము దెమ్మని వేగన్. 196

సీతాపహరణము

ఉ. ద్యోతితశౌర్యుఁ డారఘుకులోత్తముఁ డట్లు మృగానుసారియై
యాతతవృత్తి నేగఁగ దశాస్యుఁడు భవ్యకులాభిజాత ని
ర్ణీతపతివ్రతాచరితనీత సుధీజనగీత సద్గుణ
వ్రాతసమేత సీతఁ గొనివచ్చె జటాయువుఁగూల్చి లంకకున్. 197

ఉ. శంకితమానసుండగుచు జానకిఁ గైకొని రావణుండు దా
లంకకు నేగె భాస్కరకులప్రవరుండును హేమరత్న చి
త్రాంకమృగాకృతిం జను నిశాటు వధించి నిజాశ్రమంబు ని
ర్వంకల నింతిగానక దురత్యయఖేదపరీతమూర్తియై. 198

కం. దనుజకరఖడ్గవిదళిత
తనుపక్షిణబలు పతంగాధ్యక్షున్
గని కనికరమున రఘునం
దనుఁ డిచ్చెన్ మెచ్చి యచ్యుతంబగు పదమున్. 199

కం. క్రౌంచారణ్యమ్మున నృప
పంచానను లాగ్రహించి బాహాయుగమున్
ద్రుంచి పడవైచి రురుమృగ
పంచజనాద్యంధు దురితబంధు కబంధున్. 200

కం. ఎలమిఁ గబంధుఁడు దమకున్
దెలిపినగతి నేగి కనిరి దీపితపంపా
సలిలాశయ తటతరుసుమ
కలిత రజఃపటలజటిలకబరిన్ శబరిన్. 201

వ. అంత నత్యంతసంతుష్టాంతరంగయగు నయ్యెఱుకుటింతి సేవంతినీలతాంతంబులఁ బ్రఫుల్లమల్లికాకుసుమదామస్తోమంబుల మాలతీప్రసవమాలికల సుకరంబులగు వకుళముకుళంబుల మఱియు ననేకవిధార్ఘ్యంబులం బూజించి సుధామధుర ఫలవిశేషంబులు సమర్పించి కృతార్థయైయున్న యన్నాతికిం బ్రీతియెసంగ దివ్యపదం బొసంగి తదుపదిష్టప్రకారంబున సుగ్రీవుం జూచువారై చనిచని ముందట. 202

సీ. తటసరద్గజఘటాఘటిత మేఘాళరయో
త్కంఠానటన్నీలకంఠచయము
స్ఫటికాశ్మబింబితస్వతనువీక్షాన్యధీ
వైరసంఘుష్టకంఠీరవమ్ము
సానుసన్నిహితేందుసందర్శనానీత
ఫలమనీషోత్ప్రతద్వానరమ్ము
ఘనవిదూరజశిలేశకుణజాఖుభుగ్భృతి
కేకరీకృతకోకకోకిలమ్ము

తే. గీ. సైరిభద్వంద్వకలహప్రసంగ శృంగ
చిటచిట రవోపగత వేణుపటల దావ
బహుళశబ్ద భ్రమద్భ్రమద్బహుళమృగ ని
కాయమగు ఋశ్యమూకంబు గానఁబడియె. 203

సుగ్రీవ సమాగమము

కం. కనుగొని యటఁగ్రుమ్మరు స
మ్మను జేంద్రాత్మజులఁ జూచి మదిఁ బెగడుచు న
య్యినతనయుఁ డనుపఁ బావని
చని వారి తెఱంగెఱింగి సంతుష్టుండై. 204

తే. గీ. రక్తసాంకవమృగమదస్ఫటికతటుల
నడుగులిడఁ గష్టమగునంచు హనుమ వగచి
తనభుజమ్ములఁ నిడుకొని దశరథేంద్ర
సుతులఁ గొనివచ్చె మార్తాండసుతుని కడకు. 205

తే. గీ. అంత నిరువురు సఖ్యసౌఖ్యమ్ము నంది
వెలయ సుగ్రీవుఁ డవనిజ వెదకు పనికి,
సరవి రఘువల్లభుఁడు వాలిఁ జంపుటకును
శపథములు జేసి రవు డగ్నిసాక్షికముగ. 206

కం. లీలఁ దళుకొత్త రాముఁడు
మేలగుబలువింటఁ దొడిగి పిడుగురులడరన్

వాలికతూఁ బెద నాఁటిన
వాలి వెసన్ దూలి తోలి వ్రాలెన్ బుడమిన్. 207

ఉ. అంత ననంత తేజుఁడగు నమ్మనుజేంద్రతనూజుఁ డబ్జినీ
కాంతునిపట్టికిన్ బ్లవగగౌరవరాజ్యమొసంగినన్ శుచి
స్వాంతుఁ డతం డగణ్యమగు వానరసైన్యములన్ సమస్తది
క్ప్రాంతములందు సీతవెదుకం బనిచెన్ బ్రతికారశీలుడై. 208

వ. ఇవ్విధంబున నవ్వసుధాకన్యాన్వేషణమ్మునకు ననన్యసామాన్యబలోదీర్ణమ్ములగు సైన్యమ్ముల నలుగడలకుం బనిచి హనుమదంగదజాంబవన్నీలనల ప్రభృతులగు కపిప్రవరుల ననేకవీరవానరానీకంబులతోడం బనిచిన వారును దక్షిణ దిశావలయమ్ము కలయంబరికించి వదంపడి సంపాతివచనంబులవలనరావణానీతయై సీతాదేవి లంకాపురంబున నుండుటయెఱింగి పరితోషమ్మునం బొంగు నంతరంగమ్ములతోఁ జనిచని ముందట. 209

స్రగ్ధర. అభ్యస్తోదగ్ర వేగవ్యవసిత మకరవ్యాళి పాఠీనధాటీ
క్షుభ్యత్క్షుద్రాండజంబై సురనికర మనస్తోషకృద్రత్నదంబై
బిభ్యద్వైమానికస్త్రీ పృథుకుచ పరిరంభీకృతోరశ్ప్రియంబై
యభ్యుద్యత్తుంగ భంగాహతఘనతటమై యబ్ధి గానంగ నయ్యెన్. 210

కం. చూచి వెతఁజెంది తొల్లిఁటి
వాచాలత యుడిగి రిచ్చవడిరి కపులు కా
లోచిత మెఱింగి పావని
ఖేచరగతి నడువ నుత్సుకితమానసుఁడై. 211

హనుమ సముద్రమునుదాఁటి సీతఁగనుగొనుట

సీ. చూచినచూపులు సురవైరిపురగోపు
రాట్టాలకమ్ముల నదరఁజేయ
చాచినహస్తముల్ సమదవైమానిక
ప్రకరమ్ము నిట్టట్టు పరవఁజేయ
పూఁచినపదములు భుజగరాజస్ఫటా
తతులకు దుస్సహత్వమ్ముఁ జేయ

వీచినవాలమ్మున విపులదిశాగజ
శ్రేణికి గుండియల్ చెదరఁజేయ

తే. గీ. అచల మల్లలనాడ విహంగరాజ
గతి నెగసి లీలఁ దళుకొత్త గగనవీథి
నరుగఁ దొడఁగె నవక్రపరాక్రమప్ర
చండవైఖరి నన్నభస్వత్సుతుండు. 212

మ. చని యాతండు తమస్వినీసమయసంచారోన్ముఖుండై పురా
తనలంకాపుర గోపురావసథ సౌధస్ఫారశాలా వినూ
తనపుష్పావృత పుష్పకప్రతనరత్నగ్రావముల్ రోసి పూ
నిన చింతన్ నృపచంద్రచంద్రముఖి నన్వేషించె జాగ్రద్గతిన్. 213

కం. మొనసి పురియరసి కానక
పనివడి క్రమ్మఱఁ దలంచె పావని కులపా
వని వనితామణి జనకా
వనిపాలతనూజ కింకవని తావని తాఁ. 214

కం. అనిలాత్మజుఁ డవ్వనమున
పనివడి వెదుకంగ శింశుపాతరుమూలం
బునఁ గృశత దోఁప చింతా
తినతాననయైన రాముదేవిం గనియెన్. 215

తే. గీ. కాంచికోదండచదవలగ్న కాంచనాంగి
కాంచి కపి కార్యసిద్ధి యూహించి పొంగె
భంగసంఘాతసంచారభంగిఁ గ్రుంగి
చంద్రకళఁ గాంచి పొంగిన జలధివోలె. 216

వ. ఇక్కరణి నక్కపికుంజరుండు నిశాచరచరిష్యమాణంబగు నవ్వన మధ్యంబునఁదనుమధ్యం జూచి పతివిరహజనిత చింతాపరిశ్రాంతస్వాంతయు నుపవాస కృశాంగియు నగు నన్నలినలోచన చిత్తంబు రామలక్ష్మణక్షేమకథాకలితంబులగు సాంత్వవచనంబుల నుపశమిల్లంజేసి రాఘవాంగుళీయకం బమ్మధురభాషిణికి నభిజ్ఞానమ్ముగా నొసంగి సంతోషరసతరంగితాంతరంగం గావించి పునఃప్రయాణోన్ముఖుండగుచు నద్దేవిచేత ననుజ్ఞాతుండై యచ్చోటుగదలిచని. 217

తే. గీ. చంపకాశోక సహకార చందనాది
బహుళతరు ఫలపుష్పసంపదల నొప్పు
ప్రమదవనమెల్ల నిర్ఘాతపాతఘోష
భీషణమ్ముగ విఱిచె నా భీమబలుఁడు. 218

శా. నిస్త్రింశాదిసమస్తనధనకళాన్వీతుల్ నిశాటుల్ సమి
న్నిస్త్రాసుల్ పొదువం గపీంద్రుఁడు గదానిర్ఘాతపాతమ్ములన్
భస్త్రీజాలముభంగిఁ బ్రోవులుగ గూల్పన్ మేఘనాదుండు బ్ర
హ్మాస్త్రంబేసి నిబద్ధుఁజేసి వెసఁబిత్రావాసముఁ జేర్చినన్. 219

తే. గీ. అతఁడు రోషారుణాక్షుఁడై యనిలతనయు
వాలమునఁ దైలసంసిక్తవస్త్రచయము
జుట్టి కాల్పింపఁ బంచిన సురవిరోధు
లట్లకావించి రత్యుగ్రులై కడంగి. 220

లంకాదహనము

చం పవనజుఁ డంత రజ్జుకృతబంధనముల్ విదిళించి వైచి వా
ల విపులఘోరవహ్నిశిఖలం దరికొల్పి సుశాలి శాలికా
సవనిగయ స్ఫురద్ద్రవిణసద్మ విభూషణవస్త్రపేటికా
భవన విచిత్రమంటప సభానిచయమ్ము దహించె నుగ్రుఁడై. 221

చం. దెసలఁ బఱ స్ఫులింగములు దీటుకొనన్ గపివాలకీలి చేఁ
బసిఁడికవాటముల్ గరఁగిపాఱె మణిచ్ఛట క్రాఁగి వ్రక్కలై
వసుమతిఁ గూలె సౌధరుచివైఖరి తీఱె రవమ్ము మీఱె రా
క్షసవనితాశ్రుబిందువులు జాఱె కనుంగవ నిండి క్రేవలన్. 222

తే. గీ. జృంభదతికాయ కుంభ నికుంభ కుంభ
కర్ణ ధూమ్రాక్ష మత్తశుక ప్రహస్త
జిష్ణుజిన్ముఖ్యమందిరశ్రేణి దవిలి
తోఁకచిచ్చయ్యె హనుమంతు తోఁకచిచ్చు. 223

వ. ఇవ్విధంబునఁ బ్రళయసమయ విజృంభితతాండవప్రచండమూర్తియగు రుద్రునిచందంబున సకలదనుజభయంకరాకారుండగుచు లంకాపురీదహనం బాచరించి యుపశమితక్రోధుండై కీలికీలాభీలంబగు వాలంబు సముద్రసలిలంబులం జల్లార్చి రామపత్నిం గాంచి ప్రణామంబు లాచరించి యద్దేవిచేత ననుజ్ఞాతుండై సముద్రంబు గడచి వాలితనయజాంబవత్ప్రముఖులం గూడికొని చని లక్ష్మణసుగ్రీవసహితుండై యున్న యన్నృపశిఖామణి చరణంబులకుం బ్రణామంబు లాచరించి సీతావృత్తాంతం బంతయు నెఱింగించిన నమ్మహాబాహుండు కపిగోలాంగూలభల్లూకసైన్యంబులు పరివేష్టింప భేరీభాంకారనిర్దళితదిశాభాగుండగుచు సత్వరప్రయాణమ్ముల సాగరసమీపంబునకుం జనిచమూసమావృతుండై యచట నిలిచియున్నంత. 224

కం. అగ్రజుఁడు రావణునిచే
విగ్రహమ్ముం జెంది యలవిభీషణుఁ డపుడ
వ్యగ్రమతి నేగి రఘువీ
రాగ్రణి కృపఁ జెంది నిలిచె ననుచరుఁడగుటన్. 225

చం. నరవరుఁ డంత దర్భశయనవ్రతియై తను వేడుచున్న, ము
ష్కరమతియై సముద్రుఁడు ప్రసన్నుఁడుగామి నతిప్రచండని
ష్ఠురభయదాకృతిన్ ధనువుఁ జొప్పడఁ దాల్చి మహానలజ్వల
చ్ఛరనికరంబు పైఁబఱపె సాగరనీరము నింకఁ బాఱఁగన్. 226

సీ. ఉడుకునీట వసింపనోఁడి గ్రక్కున దీవి
మేటల నలరు తామేటికులము
శరధూమవిసరధూసరవహ్నికీలలఁ
జెదరి శోషిలుచుండు చిలువపిండు
తూఁపుటగ్గుల కాఁక దొరలి తూలింపఁగఁ
దెరలుచుఁ బెన్నీటఁ దేలుమీలు
విశిఖానలోష్మదుర్విషహమై క్రమ్మిన
మినుకజాలక త్రెళ్లు పెనుమొసళ్లు

తే. గీ. నగుచుఁ గంధిజలమ్ము లుగ్రాస్త్రశిఖికి
నింధనము లయ్యె దనుజసంబంధ మింత
జేసె నను భూనభశ్చరశ్రేణి ఘోష
మెల్లెడలఁ బర్వ సాగరం బింకఁదొడఁగె. 227

ఉ. అంత దురంతరోషచరశారుణలోచనుఁడైన జానకీ
కాంతుఁడు ప్రజ్వలజ్జ్వలనకాండము మౌర్వి టింప ఘోరక
ల్పాంతవిజృంభితార్కనిభమౌట సముద్రుఁడు భీతుఁడై జలా
భ్యంతరసీమ వెల్వడి నృపాగ్రణిఁ గొల్వఁగవచ్చె నమ్రుఁడై. 228

కం. నిరహంకృతి నతఁ డారఘు
వరుని న్వినుతించి కరుణవడసి సరస్వ
త్తరణమ్ము సేతుబంధో
ద్ధరణమ్మున నగునటంచుఁ దగఁ బల్కుటయున్. 229

వ. అట్లకాక యని తదాదేశప్రకారంబున ననేకప్లవంగపుంగవానీతంబులగు శైలసాలశిలాజాతంబుల సేతుబంధంబుల నలకర్తృకంబును శతయోజనపరిమితంబును నై విలసిల్లె నంత రామభద్రుండు లక్ష్మణసుగ్రీవహనుమద్విభీషణాంగద జాంబవన్నలనీలాదివీరభట పరివారంబు గొలువ సముద్రతరణంబు జేసి చని ప్రచండాట్టహాసగర్జారవఘోరమ్ముగా లంకాపురద్వారనిరోధంబుజేసినం గుపితులగు నిశాచరవరులు కయ్యమ్ముసేయ వెడలిన. 230

యుద్ధము

మ. అమితోత్సాహులు భానుజాంగద జగత్ప్రాణాత్మజుల్ జాంబవ
త్ప్రముఖుల్ మర్కటభల్లుకాధిపులు ధూమ్రాక్షప్రహస్తప్రజం
ఘ మహాపార్శ్వ నికుంభ కుంభముఖ విఖ్యాతాసురశ్రేణులన్
సమరక్షోణి వధించి రుజ్జ్వలభుజాసరంభదుర్వారులై. 231

తే. గీ. మేరుసమభీమకాయు ప్రమేయబల వి
జృంభణోదీర్ణ శిఖవర్ణు కుంభకర్ణు
చండకోదండముక్తార్ధచంద్రవిశిఖ
నిహతిఁ దునుమాడె రామావనీవిభుండు. 232

మ. ఉరులంకాపురవజ్రపంజరము మాయోపాయమంజూష యు
ద్ధురగర్వాంధతమోద్రిగహ్వరము వేధోదత్తదివ్యాశుగా
కర మీతండన నొప్పు నింద్రజిదభిఖ్యాతాసురుం దాఁకి దు
ర్భరబాణాహతిఁ ద్రుంచె నొక్కట సుమిత్రాపుత్రుఁ డవ్యగ్రుఁడై. 233

కం. దనుజేంద్రుఁ డంతయును విని
ఘనశోక ద్వేషరసవికారోద్ధతుఁడై
యినవంశవర్యుఁ దోడరుదు
నని సూతుంబనిచె రథముదగ్రతఁ దేఁజన్. 234

సీ. ప్రకటభల్లూక చర్మస్యూతషోడశ
చక్ర చంక్రమ చలత్త్వాతలంబు
యుగభారసహవేగయుక్తురంగసహస్ర
ఖురఘాత ధూళిసంకుల నభంబు
వితతాంగ దారులంబిత ఘంటికాజాల
ఘోష కాతరదిశాకుంజరమ్ము
చటులరత్నప్రభా సంవృతధ్వజపటీ
రచిత గృధ్రవిహంగ రాజితమ్ము

తే. గీ. శరగదా కుంతకోదండ శక్తిపరశు
ఖడ్గ ముఖ్యాయుధోగ్రంబు కాల కేతు
సూతచోదిత మగుచుఁ బ్రఖ్యాతమైన
ఘనరథంబెక్కి వెడలె రాక్షసవిభుండు. 235

వ. ఇట్లువెడలి రావణుండు ప్రచండకాండపరంపరగలం బ్లవంగపుంగవులం దొలంగిపరవం జేయుచు రామభద్రుందరిసిన నమ్మహాబాహుండును బురుహూత ప్రేషితంబును మాతలిసూతసహితంబును నగుస్యందనంబెక్కి రక్కసువెసందారొకని కయ్యంబుజేసె నప్పుడు. 236

చం. అపుడు రఘూద్వహుండును దశాననుఁడున్ బరగించుఁ దూఁపు ల
ట్లపరిమితంబులై దెసలు నాకసమున్ వెసఁగ్రమ్మ నట్టిచో
నృపమణి యుగ్రలీల రజనీచరవల్లభు మస్తకంబులున్
విపులభుజంబులుం దునిమె వే మొలువం దునుమాడె సాగెకుస్. 237

రావణ వధ

తే. గీ. అంత రఘువీరుఁ డత్యుగ్రుఁడగుచు బ్రాహ్మ
ణాస్త్ర మడరించి వజ్రవణాంకమైన

రక్కసులఱేని వక్షమ్ము వ్రక్కలింప
నసువులెడలిన గిరివోలె నవని వ్రాలె. 238

వ. ఇవ్విధంబున దశవదను వధియించి రామచంద్రుండు సర్వసుపర్వగణ మధ్యంబున వెలుంగు మహేంద్రునిచందంబున సకలకపిసేనామధ్యంబునం దేజరిల్లు చున్నంత లక్ష్మణసుగ్రీవ హనుమదంగదాది కపివీరు లమ్మహాత్మునకుం బ్రణామమ్ము లాచరించి యభినందించి రప్పుడు. 239

సీ. కురిసె రాఘవునిపైఁ గోమలమందార
సుమసముచ్చితమైన సోనవాన
మొరసె నొక్కట నవాంబుద గభీరధ్వాన
తులితమై దివ్యదుందుభి రవంబు
మెఱసె నంబరవీథి మృదులాప్సరోగణ
సంగీతనాట్య ప్రసంగసరణి
నెరసె నల్లనఁ బద్మినీసూన చయనీతి
సౌరభంబగు దివ్యమారుతంబు

తే. గీ. సురలవినుతులు మునివరస్తుతులు మర్క
టోత్తమస్తోత్రములు కిన్నరోరగేంద్ర
సిద్ధయక్ష స్తవంబులు చెలఁగె దిశల
జానకీజాని విజయావసరమునందు. 240

సీ. ఇందీవరార్ధేందు కుందబింబోడు స
న్నయనఫాల రదోష్ఠ నఖరనిచయ
కలశకేసరి శంఖకలహంస ఘనతుల్య
కుచమధ్య గళయాన కచవిలాస
స్మరధనుఃకరభ చంపకతటిన్ముకుర సు
భ్రూరునాసాంగ కపోలఫలక
యావర్తబిసకాహళాంబుజశ్రీ సము
ద్యన్నాభిబాహు జంఘాంఘ్రి కర్ణ

తే. గీ. సీత సద్గుణసంభూత శిఖిముఖంబు
వెడలి సితచేలచందనవిమలకుసుమ
రాజి రాజితమూర్తియై రామవిభుని
శోభితోత్సంగపీఠిఁ గూర్చుండె నపుడు. 241

కం. పూజ్యయశోనిధి రాముఁడు
ప్రాజ్యగుణు విభీషణునిఁ గృపన్ బహులీలా
భోజ్యంబగు లంకాపుర
రాజ్యరమావిభవమునకు రాజుం జేసెన్. 242

వ. అయ్యవసరమ్మున. 243

సీ. మంచువేలుపు చాయ లెంచి మెచ్చనికాంతి
మించి రాణించు రాయంచ నెక్కి
కొమ్మజమ్ముల బొమ్మగ్రుడ్డు జీరలు వాఱఁ
గత్తరించిన మేటిగిత్త నెక్కి
నడల నచ్చరబోంట్ల కడువ్రీడ నొందింప
రంగారు మదఁపుటేనుంగు నెక్కి
రతనంపుజతల దీధితులెల్లెడలఁ బర్వ
మానితంబైన విమాన మెక్కి

ఆ. వె. పద్మసంభవుండు ఫాలేక్షణుండు సు
రేశ్వరుండు దశరథేశ్వరుండు
సకలవిబుధవరులు జనుదేఱ నేతెంచి
రోలి రామచంద్రుపాలి కపుడు. 244

కం. ఊర్జితవాచారచనల
నిర్జితరిపు రాముఁ బొగడి నెరి నసురేఖా
వర్జితులగు వానరుల పు
నర్జీవితులుగ నొనర్చి నయ మెసలారన్. 245

వ. మఱియును దగువరమ్ములొసంగి నిజనివాసంబులకుం జనిరంత రామభద్రుండును జానకీలక్ష్మణసమేతుండగుచుఁ బుష్పకాధిరూఢుండై విభీషణసుగ్రీవహనుమదంగదప్రభృతులగు ప్రధానవరులు సపరివారమ్ముగాఁ దన్నుఁ గొలిచిరా సాకేతపురసమీపమ్మునకుం జనునప్పుడు భరతుండంతయు విని మహానందభరితాంతఃకరణుండై కౌసల్యాదిజననీచయంబును వశిష్ఠప్రభృతిగురువర్గంబును సుమంత్రప్రభృతిమంత్రిసంఘంబులును సమస్తపౌరజనంబులునుం బరివేష్టింపం జని యగ్రజు నెదుర్కొని. 246

కం. తాఁ దలనిడుకొని భరతుఁడు
మోదమ్మునఁ దెచ్చి మణిసముజ్జ్వలవిలస
త్పాదుకలు రామభద్రుని
పాదమ్ములఁదొడిగి మ్రొక్కె బహువారమ్ముల్. 247

కం. జననీగురుభూసురవం
దనములు గావించి సచివనాగరజనులన్
వినయోక్తుల నలరింపుచు
నినవంశ పయోధిచంద్రుఁడేగెన్ బురికిన్. 248

అయోధ్యా ప్రవేశము

తే. గీ. జడలువిడిపించి మంగళస్నానములరఁ
జేసి రుచిరాంబరంబులఁ జిత్రరత్న
భూషణమ్ముల స్రగ్గంధపుంజముల న
లంకరించిరి వెసరామలక్ష్మణులను. 249

సీ. శ్రీరామభద్రాభిషేకోత్సవంబు ని
ష్ప్రత్యూహ మగునంచు, శాకునికులు
సముదగ్రజలధరస్వన సముద్ధ్వనికరో
దారాహతులఁజూపు మహారజికులు
తత ముఖానిలసముద్ధతఘుళంఘుళ ఘోష
కలన నేర్పులు జూపు కాంబలికులు
షడ్జాది బహువిధస్వరమిళన్మాధురీ
వైఖరుల్ గావించు వైణవికులు

తే. గీ. స్వస్తివాచన ముఖరద్విజవ్రజంబు
జయజయార్భటి వందిసంచయము వొగడ
రుచిరకాంచనమయ రథారూఢుఁ డగుచు
రామచంద్రుం డయోధ్యాపురంబు సొచ్చె. 250

వ. తదనంతరంబ. 251

కం. చంచన్మణిఘృణి విలస
త్కాంచనపీఠమున జనకకన్యకతో న
క్తంచరవైరి రఘూద్వహుఁ
డంచితగతి నొప్పుచుండె నార్యులు పొగడన్ 252

శ్రీరామాభిషేకము

మ. కపిముఖ్యుల్ చతురబ్ధితోయముల వేడ్కం దేర సమ్యక్సుధీ
సపదిప్రోత్సహనమ్మునన్ జని యుదంచత్స్వర్ణకుంభమ్ములన్
నిపుణప్రక్రియఁ దెచ్చినన్ ముదముసంధిల్లన్ ద్విజవ్రాత మం
త్రి పురోధస్సుహృదాప్తవర్గము బలశ్రీమన్ముహూర్తమ్మునన్. 253

తే. గీ. అమలమణిమయసింహాసనమున జనక
జనవరాత్మజతో రామచంద్రు నునిచి
మహితపుణ్యోదకంబుల మంత్రరచన
వెలయ నభిషిక్తుఁ జేసిరి విప్రవరులు. 254

కవిరాజ. బలిమి చెలంగ నితండు ఘనుండని పల్కు నిలింపుల మాటలతో
నలరుచు గీతుల రీతులఁ దేలెడి యచ్చరబోటుల యాటలతో
పలుగడలన్ జయమంగళమే యను పాటలగంధుల పాటలతో
నలరె రఘూద్వహు నయ్యభిషేచన మన్నరవానర కోటులతో. 255

మ. మరుదీశుం డురుపారిజాత సుమదామంబుల్ కనద్రత్నసుం
దర కేయూరము లర్యమాత్మజుఁడు చంద్రద్యోతిహారాళి శం
బరనాథుం డనిలుండు కుండలము లింపారం గిరీటంబు కి
న్నరపాలుండు నొసంగి రవ్విభునకున్ మంజుక్రియాధుర్యులై. 256

తే. గీ. జలనిధులు పొంగె దివిమ్రోగె సాధువాద
మవనిసురసౌఖ్యము పొసంగె నఘముగ్రుంగె
పుణ్యము లెసంగె విమతుల పొలుపుద్రుంగె
రామభద్రుండు రాజ్యాభిరతి వహింప. 257

వ. ఇవ్విధంబున రామచంద్రుడు సామంతమంత్రి పురోహితగోభూసుర సమూహానందసంధాయకుండగుచు లక్ష్మణభరతశత్రుఘ్న హనుమత్సుగ్రీవప్రముఖానుజసుహృత్ప్రియజనంబుగొలువ పదునొకండు వేలయేండ్లు రాజ్యమ్ముఁ జేసి శ్రీమన్నారాయణలక్షణలక్షితంబైన నిజరూపంబుధరియించి గరుడవాహనారూఢుండై పరమస్థానంబునకుం జనియె భూవల్లభా! ఇట్టి శ్రీరామచరిత్రంబు వల్మీకసంభవ ప్రోక్తంబునుగాయత్రీవర్ణాత్మకంబును నుభయలోకసౌఖ్యసంధాయకంబునునగుటం జేసి యిప్పుణ్యచరితంబు భాగవతోత్తమునిచే నాకర్ణింపుచున్ గాలక్షేపంబు సేయుమనిచెప్పి యప్పుడమితేని నామంత్రితుం జేసి నిజేచ్ఛం జనియె నని చెప్పిన శిష్యప్రవరు లయ్యాచార్యుంజూచి యవ్వలివృత్తాంతం బెట్టిదని యడిగిన. 258

మ. జనకక్ష్మావరకన్యకాముఖసరోజాతార్క! శక్రాదిదే
వనికాయాపదపాయహేతుకరభాస్వచ్చండకోదండము
క్తనిశాతాశుగ భిన్నదైత్య గళరక్త ప్లావితోగ్రాహవా
వనిభాగా! మదరాగశూన్య ఘనవిద్వద్వేద్య తత్త్వోజ్జ్వలా! 259

కం. ధీరజనోద్ధార! మహో
దారగుణాధార! సారతరవిద్యావి
స్తార! సితఖడ్గధారా
దారితమాద్యత్కబంధదైతేయకరా! 260

మాలిని. శరవిహతవిరాధా! సద్ధితాత్మీయబోధా!
సురుచిరశుభదాయీ! శూరలోకాగ్రయాయీ!
సరసిజదళనేత్రా! చంద్రబింబాభవక్త్రా!
సురహితజయభద్రా! శోషితాంభస్సముద్రా! 261

వ. ఇది శ్రీరామచంద్రకరుణానిరీక్షణసమాసాదితకవితావిశేష శేషాన్వయప్రదీపక వేంకటాచార్యకుమార రఘునాథార్యప్రణీతంబైన కులశేఖరమహీపాలచరిత్రంబను మహాప్రబంధంబునందు ద్వితీయాశ్వాసము. 262

కులశేఖర మహీపాల చరిత్ర

తృతీయాశ్వాసము

★

క౦. శ్రీ జయకీర్త్యభిరామ! మ
హీజాప్రియకామ! విమతహృద్భీమ! మహా
తేజస్సీమ! జగద్ధిత
రాజద్గుణధామ! రామరాజలలామా! 1

వ. అవధరింపుము గురువర్యుండు శిష్యులంజూచి యవ్వలికత యిట్లని
చెప్పందొడంగె. 2

కులశేఖరుని రామాయణ శ్రవణము

ఉ. ఆనృపవర్యుఁ డాఘనుని యానతిఁ గైకొని సద్గుణాన్వితున్
సూనుని యౌవరాజ్యపదశోభితుగా నొనరించి నిర్భరుం
డై నిజబుద్ధికిం గడుప్రియంబగు రామకథాసుధారసం
బానుచు నుండెఁ గర్ణముల నందొక వైష్ణవముఖ్యసన్నిధిన్. 3

సీ. కౌశికువెంట రాఘవుఁడు కాల్నడ నేగ
ననుచోట రథిఁ జేతునని తలంచు
భార్గవుండాగి రాముపైఁ గిన్క నేతెంచె
ననుచోటఁ దానెదుర్కొనఁ దలంచు
కైకేయి జానకీకాంతుఁ గానలఁ ద్రోఁచె
ననుచోట మఱలింతునని తలంచు
దశరథాత్మజుఁ డద్రితటుల నెక్కఁదొడంగె
ననుచోటఁ దా నెత్తికొనఁదలంచు

తే. గీ. వితత కాకుత్స్థగుణ కథామృత రసైక
పానకౌతుక విభ్రాంతభావుఁడగుట

సమ్మోహరాజు తలఁపులి ట్లగలించుఁ
గాలభేదమ్ము దెలియనికారణమున. 4

తే. గీ. ఇత్తెఱంగున నవ్వైష్ణవోత్తముండు
సంతతము దాశరథికథ జనవిభునకుఁ
దెలుపునెడ ఖరదూషణాది ప్రచండ
సమరసన్నహన ప్రసంగము పొసంగె. 5

మ. అశనిధ్వాంతసమార్భటిన్ బ్రళయమేఘాకారదేహుల్ చతు
ర్దశసాహస్ర నిశాటవీరభటు లుద్యల్లీలఁ గొల్వన్ ఖర
త్రిశిరోదూషణ ముఖ్యు లారఘుకులశ్రేష్ఠున్ వెసన్ గల్వ న
శ్వశతాంగేభ పదాహత క్షితిరజస్సంఛన్నదిగ్భాగులై. 6

కం. అని కతఁజెప్పిన విని య
జ్జనపతి తాత్కాలికప్రసంగం బనుచున్
గినిసె రఘువీరపదభా
వన నొదవిన భక్తిపారవశ్యము కతనన్. 7

ఉ. అక్కట 'ధర్మవత్సలుఁ డుదగ్రగతిన్ దనదేవితోడఁ దా
నొక్కరుఁ డేగుదేర రిపుయూథ మెదిర్చెఁగదా! భరంబగున్
గ్రక్కునఁ దోడ్పడం దగు ననం గతచెప్పిన వైష్ణవుం డిదే
యొక్కడ! వచ్చెఁ'నంచు భయమొత్తి దిగుల్వడి చూచుచుండగన్. 8

శా. చండక్రోధరసజ్వలజ్జ్వలనచంచద్విస్ఫులింగమ్ము లొం
డొండన్ గన్గవ క్రేవల న్వెడల నత్యుగ్రాకృతిం దాల్చి మా
ర్తండప్రక్రియనున్న రాజుఁగనునంతన్ మంత్రిసామంతు లా
దండన్ నిల్వఁగఁజాలరైరి భయచింతావిస్మయభ్రాంతులై. 9

వ. ఇవ్విధంబున దృఢవ్రతతనయుండు సంగ్రామసంరంభవిజృంభితుండై ప్రయాణభేరి వ్రేయించిన. 10

స్రగ్ధర. తలఁకొందెన్ భూరిభేరీధ్వని చెవిసోఁకి దిగ్దంతు లత్యంతభీతిన్
గలుషీభూతంబులయ్యెన్ గడక జలనిధుల్ కంపమందెన్ మహాద్రుల్

బలభిన్ముఖ్యామృతాంధఃప్రవరు లదటునన్ బల్కి రాశ్చర్యమంచున్
దలయూఁచెన్ ధాత రాజోత్తము రఘుపతి సద్భక్తి మెచ్చుల్ ఘటింపన్. 11

వ. అంత నమ్మహీవల్లభుండు. 12

ఉ. దిగ్గనలేచి వీరరసదీప్తముఖాంబుజుఁడై నరేశ్వరుం
డగ్గలికన్ ధనుశ్శరగదాసి ముఖాయుధభీషణమ్ము స
మ్యగ్గతిశోభితోత్తమహయాన్వితమై మణిమాలికావళిన్
నిగ్గులుదేఱు తేరెదుటనిల్పిన సారథిఁజూచి ప్రీతుఁడై. 13

వ. తదారోహణం బాచరించి. 14

కం. సదమలతేజుఁడు రథహయ
మదకుంజర వీరభటసమాజము దన్నుం
బొదివికొని నడువ నరిగెన్
మది రాఘవకార్యభర సమగ్రంబగుటన్. 15

మ. నిపుణాశ్వౌఘ ఖురాగ్రఘాత మగుచున్ గెంధూళి పైపోక వి
ష్ణుపదీగాహనవాంఛ నేగుటయు నచ్చోఁ దద్రజోవ్యాప్తి త
ద్విపరీతాకృతికిన్ దొలంగి వెసనబ్ధింజేరఁ దద్రేణుశో
ణపయఃపూరము గ్రమ్మరం గని నగె న్వైమానికవ్రాతముల్. 16

వ. ఇవ్విధంబునఁ జతురంగబలపరివృతుండై కోదండకళాప్రచండభుజదండమండితుండగు నద్ధరాఖండలుండు సీతావల్లభునకు సమరసాహాయ్యం బొనరింప నుద్యోగించు నవసరంబున. 17

కం. అదియెల్లఁ జూచి మంత్రులు
తుదిమొదలు నెఱుంగఁబడని దుష్కరకార్యం
బిది మానుప నెట్లగునని
మది నాశ్చర్యమ్ము భయము మల్లడిగొనఁగన్. 18

ఉ. ఎన్నటికైక యీవరము! లెన్నటి రాఘవరాజ్యవర్జనం!
బెన్నటి దండకోపగమ! మెన్నటితాపసవేషధారణం

జెన్నటి రాక్షసీవికృతి యెన్నటివారు ఖరాదిదానవుల్
నిన్నటినేఁటికార్యమగునే! నృపుఁడేల యెఱుంగఁ డక్కటా! 19

ఉ. సంతతమున్ దిశాంతరనిశాంతులు వైష్ణవు లేగుదెంచి యే
చింతకుఁ దారమై మనలఁ జెంతలఁజేరగనీక రాజు నే
కాంతకథావిచిత్రిత వికల్పములం గడువెట్టిఁ జేసి హా!
యెంతకుఁ దెచ్చి రయ్య లిఁక నెవ్వరికిన్ దరమే!మఱల్పఁగన్. 20

తే. గీ. సచివు లిట్లువితర్కించి సమయసముచి
తాప్తులగు వారి నల్వుర నరసి తగిన
కార్య మెఱిఁగించి పంచినఁ గడగివారు
సైన్యములత్రోవఁ గేడించి చనిరి వేగ. 21

సీ. సముదితశ్రమబిందుసరణి ముల్ చీరలు
మేనులు మలకలై కానుపింపఁ
గవయు బీతెండల కడిమిచేఁ గ్రాఁగు కన్
గవలు కెంజివురుల కరణిఁదనర
రాలెడు వేణుపత్రములు గ్రమ్మినమస్త
కములఁ బుష్పరజమ్ము గ్రమ్మకొనఁగఁ
దొడిబడ నీరముల్ దూఱి కొట్టులఁ బెట్టు
కట్టువల్వల సీరికలు నటింపఁ

తే. గీ. జేరువల సారువల వెంటఁ జేరి తిరిగి
దండకాటవి నందుండి తరలివచ్చి
నట్లు మాయాపరిశ్రమం బలవరించి
మనుజపతి చూడ్కి నొదవి రమాత్యహితులు. 22

కం. డాయఁబిలిచి వారలతో
నేయెడలందుండి మీర లిటవచ్చితి రి
ట్లాయాసపడుచు ననవుడు
మాయికు లిట్లనిరి రాజమణికిఁ బ్రణతులై. 23

ఉ భూవర! దండకాటవుల పొంత ఘనాశ్రము లుండునంచుఁ దేఁ
బోవఁగ నందు బాహుబలభూషణుఁ డారఘువీరుఁ డుగ్రదై
త్యావళితో రణమ్మునకు నాయితమాటయు నేము చెంగటన్
గ్రావతటమ్మునన్ నిలిచి కన్గొనుచుండితి మద్భుతమ్ముగన్. 24

తే. గీ. ఇనకులోత్తముఁ డసురుల నెల్లఁ దునిమె
నపుడు శోణిత వేణిక లడరఁ జూచి
వెఱచిపఱతెంచినార మూర్జితలేశ!
యనుచుఁ జెప్పిన వెఱఁగంది యతఁడు పలికె. 25

కం. ఈగతి నాకరఘుపతియే
నాగాశ్వభటోగ్ర దైత్యనాశక్రీడా
యోగోద్ధతుఁడై యొసఁగుట
భోగీంద్రశయానుఁ డతఁడెపో! యూహింపన్. 26

చం. అనుటయు వార లానృపకులాగ్రణిఁ జూచి రఘూద్వహుండు ము
న్ననసిన బాల్యవేళ మిథిలేంద్రుని వీఁట నరేంద్రులెల్ల మున్
గినియు కపర్ది కార్ముకము కేలఁ దెమల్పఁగ నేగుచున్నచో
జనకుని సంశయంబెఱిఁగి సయ్యన గాధిసుతుండు నవ్వమున్. 27

శా. బాలుం డీనరపాలసూనుఁడు ధనుర్భారం బతిస్ఫార మే
లీలన్ దీనిఁ గదల్ప నోపునొకొ యాలేఁ జేత నంచాత్మ ను
య్యేలం బెట్టకు చండభాను గహనాద్రీలా సముద్రేందు ది
క్పాలోద్యద్ద్రుహిణాండ భాండమెగవైవం జాలు హేలాగతిన్. 28

తే. అనుచు ముని పల్కుపలుకులు జనములెల్ల
కతలుగాఁ జెప్పవినమె! లోకప్రచార
మరసి రక్షించునట్టి మహానుభావుఁ
డకట మనసాహ్య మతని కేమగు నృపాల! 29

కం. అని వారు పలుకుపలుకులు
విని సంతసమంది సుభటవిసరము గొలువన్

జని పురముసొచ్చి యచ్చట
సనయస్థితి నుండె రాముచరితము వినుచున్. 30

ఉ. రాజ్యము సేయుచుండి యువరా జొకయించుక లేక లోభమున్
వ్యాజ్యము సేసి సత్త్వగుణధన్యత పెంపువహించి వైష్ణవ
ప్రాజ్య సమాగమోత్సుకిత భావముచే నొగిఁ దత్పదాబ్జముల్
పూజ్యములై దలిర్ప మణిభూషణముల్ మదిఁ గోరఁడేమియున్. 31

ఉ. మంత్రులు వైష్ణవోత్తమసమన్వితులై విలసిల్లు రాజునా
మంత్రణ కార్యభాషణ సమర్థనవేళ ఘటింపకున్న దు
ర్మంత్రము బూని వాకిఁట నిమంత్రితులైన భటాళితోడ వా
క్తంత్రము మీఱి మీరు నృపుదండకుఁ జేరగనీకుఁ డయ్యలన్. 32

వ. అని నియమించి చనుటయు. 33

మ. నరనాథుం గను వేడ్క వైష్ణవులు సన్నాహమ్ముతో దిక్కులన్
హరిదివ్యస్థలవాసులౌట ఫలభక్ష్యవ్రాతముల్ చందనో
త్కరముల్ జేర్చిన తీర్థవల్లుభయహస్తమ్ముల్ వెసం గొంచు చె
చ్చెర విచ్చేసిరి తిర్వగూడలు భుజశ్రేణిన్ విడంబింపఁగన్. 34

ఉ. కావలివారు వాకిలెడగా నెదు రేగి మహాత్ములార!మా
భూవరు నాజ్ఞ లేదిఁక ప్రభుప్రియవాదములాచరించి సం
భావన బొందఁ గాలమొకభంగి నటించునె!వచ్చుత్రోవలన్
బోవుట కార్య మంచుఁ దమ మూర్ఖత నడ్డము వచ్చినిల్చినన్. 35

తే. గీ. అని నిరోధింప వార లన్యోన్యముఖ ని
రీక్షణ మెలర్పఁ బ్రభుదర్శనేచ్ఛ యాత్మ
సందడింపంగ శ్రీనివాసా! యటంచు
వేడ్కఁ గూర్చుండి రొగి బహిర్వేదికలను. 36

కం. మానవపతి తనకు సను
స్థానసమయమగుట నిరుగడల భాగవతుల్
గానబడ రనుచు మదిలో
నూనిన సంతాపమున సముత్థితుఁ డగుచున్. 37

ఆ. వె. పాదచారి యగుచు భవనముల్ వెడలి త
ద్ద్వారభూమి గడచి ధరణిభర్త
వెలయఁగాంచెఁ బార్శ్వవేదులఁ గూర్చున్న
భవ్యమూర్తులైన భాగవతుల. 38

మ. నృపముఖ్యుండు వెసన్ బ్రణామవినయప్రేమల్ విజృంభింప ధు
ర్మపయో లేశలసన్ముఖాంబుజుల సన్మానార్హులన్ నిష్ఠురా
తపదేశస్థితులైనవారిఁ గని చిత్తం బుత్తలంబంద నే
యపచారమ్ము ఘటిల్లెనో యనుచుఁ జింతాక్రాంతుఁడై యిట్లనున్. 39

కం. దాసుని యిలుద్రొక్కి యే
జేసిన యపరాధ మెఱుఁగఁజెప్పక కరుణా
భాసురహృదయులు మీ రా
యాసంపడదగునె యెండ నలమట ద్రోవన్. 40

తే. గీ. అనిన వారిట్టులనిరి మహాత్మ! నీకు
నరయ నపచార మిసుమంతయైనఁ గలదె!
ద్వారపాలురు రాజాజ్ఞ దప్పదనుచు
బలిమి మమ్ము నిరోధింప నిలువవలసె. 41

వ. అని తెలియంబలికిన. 42

శా. చండక్రోధరసానలప్రభలు చంచన్నేత్రకోణమ్ము లం
దొండొండన్ వెడలంగ భూరమణుఁ డత్యుగ్రాకృతిం దాల్చి పే
రెండన్ ద్రోఁచిరి వైష్ణవోత్తముల మీ రీద్వారపాలాంధులన్
ఖండీభూతులఁ జేయుఁడంచుఁ బనిచెన్ ఖడ్గాయుధోదగ్రులన్. 43

తే. గీ. అనుచుఁ బనిచినఁ దలవరు లధిపునాజ్ఞ
ద్వారపాలురఁ ద్రుంప నుద్ధతి వహింప
వలదు వలదిట్టి కార్యమ్ము వసుమతీశ
యనుచు శ్రీవైష్ణవోత్తము లడ్డపడిరి. 44

వ. ఇట్లామహాత్ములానతిచ్చిన నుపశమితక్రోధుండై సవినయంబుగా శ్రీవైష్ణవులం దోడుకొని నిజభవనంబునకుం జని ప్రియవచనపూర్వకంబుగా సంభావితులం జేసె తదనంతరంబ. 45

చం. అనవరతమ్ము రాజహృదయానుగతిం బఠియించు వైష్ణవుం
డనుపమకార్యభారమున నందొకయూరికిం బోవుచుండి నం
దను నృపసన్నిధిన్ ఘనకథాశ్రవణమ్ము ఘటింపఁబంప న
య్యనఘుఁడు గోపనీయమని యాత్మ నెఱుంగక చెప్పెనంతయుం. 46

ఉ. అక్కట రావణాసురుఁ డుదంచితమాయుఁడు రామలక్ష్మణుల్
గ్రక్కున మాయలేడి వెదుకంజనునట్లు ఘటించి జానకిన్
స్రుక్కక నెత్తికొంచుఁ జనుచోట జటాయువుఁ ద్రుంచి దుర్మదం
బెక్క నిజప్రణాశగతి నిచ్చ నెఱుంగక నేగ లంకకున్. 47

తే. అనిన నులుక్కుచు నృపుడు సభ్యాళిఁ జూచి
వింటిరే! లోకమాత నుద్వృత్తిఁ దెచ్చి
యసుర చెఱఁద్రోచె ననుట యేనితనిఁ ద్రుంచి
సీతఁ దోడ్తెచ్చి రఘురాముఁ జేర్పవలయు. 48

కులశేఖరుఁడు రావణునిపై దండెత్తుట

వ. అనిపల్కి ప్రచండరోషకాషాయితలోచనుండగుచు మహనీయ జవోద్రేకహసితోచ్చైశ్శ్రవంబగు నిజాశ్వంబు సన్నద్ధంబుజేసి తెచ్చినఁ దానునుం గట్టాయితంబై యతిఘోరధారాభీలంబైన కరవాలంబును గనకబింబసందోహ సముజ్జ్వలంబైన ఖేటకంబును ధరియించి తదారోహణంబు సేయునవసరంబున. 49

సీ. ఇది పూర్వకార్య మురీశ! యిట్లేటికి
వేగిరపడ నంచు విప్రవరులు
రామరావణచరిత్రంబు మున్నె జుఁగవె
మఱువ నేమిటికంచు మంత్రివరులు
కయ్యంబుసేయ నేగదలంచి యిదియేమి
మముఁబిల్వవంచు సామంతవరులు
నెన్నాళ్ళకథయిది యిప్పేళ వైష్ణవుం
డెక్కబెట్టెనటంచు నితరజనులు

తే. గీ. బహుజనంబిట్లు బహువిధభాషణముల
వలదువలదను ఘోషమ్ము వసుమతీశు
కర్ణముల సోఁకదయ్యె రాఘవపదాబ్జ
వర్ణనోల్లాస భాసురస్వాంతుఁడగుట. 50

మ. తురగ క్రూరఖురాగ్ర ఘాతధరణీధూళిచ్ఛటల్ గ్రమ్మ ది
క్కరి గండోదితదానబిందుచయ మింకన్ జండబాహావిని
ష్ఠుర కౌక్షేయకఘోరదీప్తి మదనిష్ఠ్యూతాహితవ్రాత దు
స్తరగర్వాంధతమం బడంగ నృపరత్నంబేగె నుగ్రాకృతిన్. 51

చం. వెనుకొని వచ్చు సైన్యములు విశ్రుతఘోష సముద్రతోయమున్
గని వెఱగంది నిల్చె రతిగాఢభయంకరఘోష మొప్ప న
జ్జనపతి సక్రపన్నగ ఝషవ్రకరప్రతిభాజగత్త్రియీ
పనిత మహాబ్ధివీచికలపైఁ బఱపెన్ జటులాశ్వరత్నమున్. 52

తే. గీ. అల రమాదేవి వైదేహియయ్యె నప్పు
డెలమి శేషాహి లక్ష్మణాకృతి వహించె
చక్రహస్తుండు రఘుకులస్వామియయ్యె
వరుస నేతెంచి రామహీశ్వరుని కడకు. 53

కం. వచ్చి నృపముఖ్యు భక్తికి
సచ్చెరువడి చూచి మందహాసాననుఁడై
మెచ్చు దళుకొత్తఁ బలికె వి
యచ్చరసంఘంబు ప్రేమ నభినందింపన్. 54

ఉ. రాజకుమార! యేను రఘురాముఁడ రావణనామదైత్యు ఘో
రాజి నెదిర్చి వానితనయాప్తులతోడ వధించినాఁడను
ద్వేజకమయ్యె వార్ధికి మదీయశరోద్ధతి యింక సద్యశో
భాజనమయ్యెఁ గార్యగతి భామినిఁ దోడ్కొనివచ్చితిం జుమీ! 55

చం. ఎలమి మదీయభక్తిభర మెల్లను నీవ వహించినాఁడ వి
జలనిధి నీటిపైఁ జనుట చాలు పురంబున కేఁగు వత్స! నీ

వలన సమస్తభాగవతవర్గము కోర్కులు చెందుచుండు ని
ర్మలగుణసంపదన్ భువనమాన్యచరిత్రుఁడ వెన్నిచూడఁగన్. 56

తే. గీ. అపుడు తురగమ్ము డిగ్గి రాజాత్మజుండు
హర్షబాష్పమ్ము లెసఁగఁగ సమ్మహాత్ము
చరణకంజాతముల వ్రాలె చటులమకుట
గతమణిప్రభ తన్నఖద్యుతులఁ బెరయ. 57

కం. కరములు మోడ్చుచుఁ బులకాం
కురములు మొనిగుడ వినయగుణభూషితుఁ డ
న్నరపతి రఘువల్లభు భా
సురసుందరమూర్తిఁ జూచుచున్ వెసఁ బలికెన్. 58

చం. నిరుపమశీల! లోకజననిం జెఱవెట్టిన దుష్టచిత్తు సో
దరసుత బంధుమిత్ర సహితంబుగఁ ద్రుంచుట చోద్యమే! భవ
చ్ఛరనికరాగ్నికీలము లెసంగినచో నిలువంగ మేరుమం
దరగిరులైన నోపునె నితాంతయశోబల భవ్యవైభవా! 59

శా. రాజీవాహింభయంకరాబ్ధి చులుకప్రాయమ్ముగా దాఁటి ఘో
రాజిన్ దానవరాజి రాజితమహోగ్రాస్త్రమ్ములం ద్రుంచి ది
గ్రాజవ్రాతము వేడ్కఁ జెంద భువనప్రఖ్యాతి వాటించి తౌ,
రాజీవాక్ష! భవత్పదాబ్జములు హృద్రంగమ్మునన్ గొల్చెదన్. 60

కం. అనుచు వినుతించు నృపతిన్
వినయానతవదను గారవింపుచుఁ బురికిన్
జనుమని యాజ్ఞ నొసఁగి య
ద్దనుజాంతకుఁ డరిగె నాత్మధామంబునకున్ 61

వ. ఇప్పగిది నప్పరమేశ్వరుం డానతిచ్చిన నప్పుడమిఱేఁ డనన్యసాధారణ పరాక్రమోపక్రమ విదళితవిరోధిసైన్యంబగు నిజసైన్యంబుతోడఁ బురంబు ప్రవేశించి సుఖంబుండె మఱియును. 62

నీళాదేవి యవతరించుట

క౦. ఈలీల నలరు ధరణీ
పాలాగ్రణి సతికి సత్యభాషిణికి వెసన్
నీళాదేవ్యంశంబున
బాలామణి పుట్టె రుచిరఫాలాలకయై. 63

క౦. నీళాభిధానయగు న
బ్బాలిక విలసిల్లె ధవళపక్షైందవరే
ఖాలీలఁ బెరిగెనంత వి
శాలంబగు యౌవనావసర మేతెంచెన్. 64

సీ. సంపూర్ణశశికళాజాలంబు మెచ్చని
ముఖమున కొకవింత పొలుపు దోఁచె
వికసితేందీవరప్రకరమ్ము నోడించు
కన్నుల కొకవింత కాంతి దనరె
కలహంసకృతమందగమన మెంతనఁజాలు
నడలయం దొకవింత నలువెసంగె
శుకపికాలాపనిస్తులమాధురి కెదుర్చు
పలుకుల కొకవింత చెలువు మిగిలె

తే. భ్రమరసందోహచక్రవాకముల గెలుచు
కచకుచంబుల కొకవింత రచనవొడమె
సరవి నవయువ సౌందర్యసౌష్ఠవంబు
వెలసె నవయౌవనాగమవేళ సతికి. 65

సీ. కచము సారంగలోకంబుతోఁ జర్చింప
గమనంబు సారంగగతుల గెలిచె
నయనముల్ జలజబృందములపైఁ దార్కొన్న
కరంబు జలజసంఘముల గెలిచెఁ
గటితటంబొగి రథాంగములతోఁ బురణింప
ఘనకుచంబులు రథాంగముల గెలిచె
రసవదోష్ఠము పద్మరాగంబుల హసింప
కరములు పద్మరాగముల గెలిచె

తే. గీ. నువిద రుచిరాంగకంబులం దొకటికొకటి
సొంపు రెట్టింప దీపించె సురనరాంగ
నానికాయంబునం దిట్టి నవ్యరూప
సంపద పొసంగునే యంచు జనులు పొగడ. 66

వ. ఇత్తెఱంగున సర్వాంగసౌందర్యశోభితయగు నయ్యంగనారత్నంబు సఖీజనమ్ములతోడ నాడుచుఁ బితృసన్నిధానంబునం బుణ్యకథలు వినుచుఁ బ్రసిద్ధి వహించియుండె నంత. 67

కం. రంగమునుండి వైష్ణవ
పుంగవులు శమాదిగుణవిభూషిత చేత
స్సంగు లొకకొందఱా నృప
తిం గనుగొను వేడ్కఁ జేరు దెంచిరి నెమ్మిన్. 68

కం. ఈరీతి నేగుదెంచిన
వారల కెదు రేగి మ్రొక్కి వరమణిమయపీ
ఠారూఢులఁ గావించి య
హీరమణుఁడు పూజ సేసె నెలమి దలిర్పన్. 69

వ. ఇవ్విధంబున నమ్మహానుభావుల సంభావించి తదనుజ్ఞఁ గొని తానును సమాసీనుండై సంభాషణమ్ములు సలుపుసమయంబున వారలతో శ్రీరంగవల్లభుని గుణరూపవైభవమ్ము లెట్టిట్టివనిన నగుచు నమ్మహాత్ము లిట్లనిరి. 70

తే. గీ. విశ్వమున కెల్ల విభుఁడు తద్విభవ మెన్న
నలవియే యింక నతని కల్యాణగుణము
లజునకైనను గణుతింపనగునె రూప
మాపిఁను యూహింప మన్మథమన్మథుండు. 71

కం. అని మఱియు హరిచరిత్రము
జనపతికిం దెలుపుచున్న సమయమ్మునఁ దా
విని నిశ్చయించె నీళా
వనజేక్షణ విభుఁడు రంగవల్లభుఁడనుచున్. 72

వ. ఇత్తెఱంగున నన్నీళాంగన రంగవల్లభు నెడం బొడమిన మోహాంకురంబు దినదినప్రవర్ధమానంబగుటయుఁ బెల్లుకొను విరహశ్రమంబునన్ గుందుచున్నంత. 73

చం. సవినయలీల రంగపతిసన్నిధికిం జను దూరదేశభా
గవతులు రాజకన్య గుణగౌరవరూపవిలాస [కాంతి]సౌ
ష్ఠవములు సారెసారెకుఁ బ్రసంగవశంబున నెన్నవిన్న య
య్యవనలినాక్షుఁ డాచెలి మనంబునఁగోరె బరిగ్రహింపఁగన్. 74

ఉ. హేయ భవవ్యపాయ రసికేహిత దివ్యపదప్రదుండు ప
ద్మాయతలోచనుండు సుగుణాంబుధి శౌరి, వధూవిమోహ చిం
తాయుతచిత్తుఁడౌటకు ముదంబునఁ బొంగి యనంగుఁ డుబ్బునన్
గో యని కేలుసాచె నునుగ్రొవ్విరికోలకుఁ బచ్చవింటికిన్. 75

వ. ఇత్తెఱంగున రంగవల్లభుండు నీళాంగనాపరిష్వంగసముత్సుకాంతరంగుండై యున్నయెడ. 76

ఉ. అంత వసంతమింపెసఁగె నద్భుతసౌరభలోభబంభరా
క్రాంత చలల్లతాంతము వికస్వరపద్మనళిన్యుపాంతవి
శ్రాంతమరాళకాంతము రసాలకిసాల రసానుమోద సం
భ్రాంత పికావళీమృదుతరస్వర భాసుర తానిశాంతమై. 77

సీ. సహసాసముల్లసత్సహకారమంజరీ
పుంజమంజుల విభాభూషితమ్మ
మల్లికావల్లకీ మధుపతంత్రీ ఝంకృతి
స్వనోత్సుక కిరాతీజనమ్మ
మత్త్యజాశాశుక త్రోటీత్రుటత్పక్వ
ఫలరసాపాత పంకిలతలమ్మ
కలహంసమాలికాకులితపంకజ రజ
శ్ఛన్నకాసారాంబు సౌరభంబు
తే. గీ. సరసకిసలయ చర్వణోత్సాహ కలిత
వితత కోకిలకాకలీ సితఖలీన

కర్షణోత్క్షుబ్ధ విముఖిత గమనపాంథ
సైంధవము మధుమాసవాసరము దనరె. 78

సీ. పశ్యజ్జనేత్రానుభావ్యంబులై కేసరంబులఁ
దగు కేసరంబులకును
ప్రచలత్సరోజకైరవమందిరమ్ములై
సరసులకింపైన సరసులకును
లలితవిచిత్రపల్లవశోభి సుమరమా
కందమ్ములైన మాకందములకు
మధుపానమదలీన మధురవాగ్భ్రమరీ
కదంబంబులైన కదంబములకు

తే గీ. పనసజంబూ శిరీషచందన మధూక
మాలతీకుంద కురవక మల్లికాది
తరులతాగుల్మతతులకు సిరి దనర్చె
మాధవోత్సాహశక్తి మాఱుగలదె! 79

వ. ఇవ్విధమ్మున మధుసమయప్రేరితమ్ములై పల్లవకుసుమఫలవిలసితంబులగు మాకందమధూకకేతకీవకుళచంపకశిరీషమాలతీ కదంబజంబూమాధవమన్మథమల్లికాప్రభృతిసకలమహీరుహశోభితారామంబులు లోచనాభిరామంబులై యొప్పుచున్నంత. 80

కం. భూవరకన్యక రంగ
ధామ్నవల్లభు వలన విరహసంభూతవిచా
రావిలమానస యగుతఱి
భావించి వధూజనమ్ము భయశంకితమై. 81

కం. మును రంగస్వామి పయిఁ
జనియించిన మమతకతన సంచలితమనో
వనజ యగుచున్నయది చెలి
వనకేళిఁ బ్రొద్దు గడపవలయుఁ మనకుఁ. 82

వ. అని తలంచి యన్నలంత యలంత బాపుటకు సఖీజనంబు లుద్యాన వనంబునకుఁ దోడ్కొనిచన నుద్యోగించు నప్పుడు. 83

కం. ప్రాలంబాలంబిత కుచ
రోలంబాలక విడంబరుచిరకరలస
త్కోలంబకనీలాంబక
నీలాంబుజవదన కదలె నెచ్చెలు లలరన్. 84

వ. ఇవ్విధంబున సఖీపరివారపరివృతయై మందగమన యారామసమీపంబునకుం జనునెడ. 85

వనవిహారము

సీ. ప్రచురమరందనిర్భరలతాంతమ్ముల
దొంతులు దొరలంగఁ ద్రోఁచిత్రోఁచి
సరససారసవికస్వరకుడుంగంబుల
పత్రముల్ గదలంగఁ బ్రాఁకిప్రాఁకి
రమణీయకనకవర్ణప్రకాశములైన
పుష్పాదుల్ మెయినిండఁ బొరలిపొరలి
వాసంతికాలతావ్రజకీలితమ్ములై
యొనరు నుయ్యాలలెక్కి యూఁగియూఁగి
తే. గీ. కదలిఁ గదలించి విరజాజిపొదలఁ బొదలి
కీచకమ్ముల మొరయించి కేకితతుల
గరులు చెదరించి భ్రమరసఖ్యము వహించి
పవనడింభకుఁ డెదురేగె పద్మముఖికి. 86

కం. మలయానిలాంకురము పై
నొలసిన మదిసంచలింప యువతీమణి నె
చ్చెలులఁ గని పలికెఁ గ్రేవల
విలసిల్లెడు తరులఁ జూచి విస్మయ మెసఁగన్. 87

సీ. కౌసుంభవసనయోగప్రకాశములయ్యె
నవి మన్మథుని తేరులటు మృగాక్షి
రచితరేఖావిచిత్రమ్ములై దీపించె
నవి మారునిపతాకలటు శుభాంగి

నవహేమరుచిరభాండవిభూషితములయ్యె
నవి కంతుని హయమ్ములట సుమధ్య
నీలగండశిలావిశాలమ్ములై యొప్పె
నవి దర్పకేభమ్ములట సుధోష్ఠి

తే. గీ. యనిన సఖు లింతి నీక్షించి యవియనూన
కింశుకము లవికుసుమిత కేసరమ్ము
లవికుసుమితచంపకములు పల్లవితగురత
మాలభూజమ్ములల్లవి మధురవాణి! 88

వ. మఱియు నిట్లనిరి. 89

సీ. పున్నాగసదయానుభూతి గోరెదు నీవు
పున్నాగసంగ్రహాస్ఫురణ వలదె
సహకారఫలపరీక్షణ మెఱింగిన నీవు
సహకారఫలపరీక్షణము వలదె
ప్రియకాంతసుమనోనువృత్తిగాంచిన నీవు
ప్రియకాంత సుమనోనువృత్తి వలదె
బంధుజీవకగుణప్రతిభగాంచిన నీవు
బంధుజీవక సౌరభంబువలదె!

తే. గీ. సమదమధుకరశుకపికసముదయముల
డిందుపఱచుట కిదియుందు సుందరరదన
సూనఫలపల్లవమ్ములఁ జాఱగొంద
మనుచు వన కేళి సలిపి రయ్యబ్జముఖులు. 90

మ. ఒకనారీమణి మల్లికాసుమములన్ యోజించి రాజన్యక
న్యకకున్ దోయిఁట నించినన్ గరతలోద్యద్రాగమేపారఁ గిం
శుకసూనభ్రమ నింతి నీ కతగునంచున్ ద్రోయఁ గాంతల్ వకా
వక నవ్వన్ విరు లేన త్రుంతు ననుచున్ భాషించె రోషమ్మునన్. 91

తే. గీ. సుదతి విరు లీవుగోయఁ బయ్యెద తొలంగి
బాలనీలాహిగతి నాఱు బయలువడియె

కొమ్మ వయినున్న నెమ్మి కన్గొనక మున్న
క్రమ్మకొనవమ్మ సరిగ చెఱంగు దిగిచి. 92

తే. గీ. అలరుఁ దేనెలు తేంట్ల కాహారమగుట
కొమ్మ విరిగొమ్మ కదలింపకమ్మ కమ్మ
విలుతుఁ బిలువంగ షట్పదకులము గినుక
కదలె నరమించు వసులకుఁ గరుణకలదె ? 93

తే. గీ. అకట కర్ణావతంసమ్మునకు రసాల
పల్లవముఁ ద్రుంప నాయాసపడకుమమ్మ !
చెన్నుదళుకొత్తు చివురునఁ జివురుకోయ
వశమె ! యేఁద్రుంచియిచ్చెద వనిత నీకు. 94

చం. వకుళముడాయ నంపు ఖగవర్గము లిట్టటుబాఱఁ దద్గరు
త్ప్రకటితమారుతాహతుల రాలిన పుప్పొడి మేనసోక ద
ర్పకవశతన్ దుపానలము పైఁబడినట్లు వణంకుచున్న య
మ్ముకురనిభాననం బొదివి ముద్దియ లూఱడిలంగఁ బల్కుచున్. 95

తే. ఇది యదనుగాఁగ నీయెడఁ గుసుఱుపఱచి
మదనుఁ డదయత పూఁములుల్కు లొదవఁజేయ
బెదరుకొను నీవు మెదలు తుమ్మెదల రొదలఁ
బొదలు పోద లేలదూఱెదు మృదులవేణి ! 96

సీ. వనిత పుప్పొడిఁ ద్రొక్కి వగచెదు విరిఁదేనె
మడు వల్లయదియె కాల్గడుగవమ్మ
శుక మోష్ఠబింబమ్ముఁ జూడ భీతిలకు మి
చ్చటు సంకుసౌగంధ్య జటిలమమ్మ
తుమ్మెదల్ నెమ్మోమ్ముదమ్మిఁ బైకొను చింత
దలఁగి సంపగివిరుల్ దాల్పవమ్మ
మలయానిలమ్ము పైనొలయు నంచడలకు
వేణికాఫణి డాయ వెఱచునమ్మ

తే. గీ. కొమ్మ యీలీల వెతనందకమ్మ రంగ
వల్లభునిఁ గూడి బహుకేళివైభవముల
నెలమి వాటింప నీకుక మీపికంబు
మదనకుముఁదాప్త్రలాప్త్రులయ్యెదరు నీకు. 97

వ. అనిన వారలలో రాజకన్య యిట్లనియె. 98

కం. అతివ వని నెసఁగె విరహుల
నతనుం డేచుటకు సేయు ననలాస్త్రంబుల్
మఱిఁ గుందనగునె జ్యోతి
ర్లతల ద్యుతులనుచుఁ దెలియరాదె మృగాక్షీ! 99

తే. గీ. ఉవిద చెంగట రవమిచ్చె నొకపికమ్మ
చెవికిఁ జేదయ్యె నిక నేమిసేయుదాన
కాదుకాదమ్మ మనకలకంఠి యొకతె
పంచమస్వరగతి పాటపాడఁ దొడఁగె. 100

వ. ఇట్లు నారీశిరోమణి న్నాలపింపుచు సఖులెల్లఁ గుసుమాపచయ
కుతూహలంబునం జరియించుచున్న యెడ. 101

సీ. చెలియొకర్తు దాడిమీఫలకాంతుఁ బఱతెంచు
శుకములఁ దోల నొండొకతె గొనియె
వెలఁదియొకర్తు కోకిలసూక్తులకు మాఱు
పలుకంగ సరియంచుఁబలికె నొకతె
సకియ యొకతె సూనశాఖ వంపకమున్నఁ
జూచితినని కోయఁజూచె నొకతె
వనితయొక్కతె హంస వెనువెంట గతిఁజూప
నొప్పుగాదనుచు నొండొకతె నడచె

తే. గీ. మఱియు రుచిరక్రియావచోమహిమ మిగుల
సరవిఁ బుష్పావచయ కళాచతురగతుల
భామినులు కాలయాపనప్రౌఢి నలువ
నీళ సొలయుచు నొకమావినీడ నిలిచె. 102

తే. గీ. కలికి యొకర్తె కడువేడ్కఁ గరము లెత్తి
ధరణిఁ జరణాగ్రముల నూఁది విరులుగోయు
కుచసరోరుహకోశముల్ కొండలయ్యెఁ
గాను వీక్షింప నదియొక గగనమయ్యె. 103

వ. ఇవ్విధమ్మున బహువిధవిహారపరిశ్రాంతలగు నన్నెలంత లక్కాంతామణిం దోడ్కొని నిశితాతపక్లాంతమ్ములగు శరీరంబులు స్వేదోద్గమాక్రాంతంబు లగుటయు జలావగాహంబు గోరుచుం బోవుచున్నయెడ. 104

సీ. మధుపానవదనూన మదలీనసదళీన
పదసూన మృదుగాన బంధురమ్ము
తతకుంజ తమాలతతి ఖేలదతివేల
పతగాలపిత జాల భాసురమ్ము
స్మరశాతశరపాత పరిభూతనరజాత
విరహాతపరయేత భరహరమ్ము
రసనాగబిసపూగ కిసభాగరసభోగ
రసికాగతసరాగ రాజహంస

తే. గీ. మమల కైరవకమల గంధానుబంధ
మలయమరుదంకురాగమోన్మాద చరిత
పాంథసందోహమగు సరిత్ప్రవర మొకటి
యానెలంతల కచ్చోటఁ గానబడియె. 105

కం. చని సంతసించి శశిముఖు
లానరఁగ నొండొరుల కరములూఁదుచుఁ జని ర
ల్లన పదములిడుచు శీతల
వనజాకర జలవిగాహ వశమతు లగుచున్. 106

మ. అతులాంభోజ విరాజమాన సరసీహంసావళిం జేరి య
య్యతివల్ నీరమునం జరింపఁగఁ దదీయాంగమ్ము లుత్తుంగ దీ
ప్తతటీ స్ఫాటికరత్న బింబితములై భాసిల్లె లాస్యైక స
మ్మతలీలం బ్రతిసీరపైఁ బసిఁడిబొమ్మల్ వోలె శోభిల్లుచున్. 107

సీ. ఆమంథరయానల హాసస్వరమ్ములు
  బెరయు హంసమ్ములు బెదరివఱచె
నాఘనస్తనుల బాహాగ్రవిక్షేపముల్
  కనుగొని చక్రవాకములు బెదరె
నాచంచలాక్షుల యంఘ్రివిన్యాసార్భ
  టులకుఁ బాఠీనమ్ము లలవుదరిఁగె
యానీలకచల యాహ్వానధ్వనులు బర్వి
  నెరిఁ బాసి భృంగముల్ నింగికెగసె

తే. రాజవదనల చల్లుపోరాట వేళ
వనజబృందమ్ము లొకవంక వ్రాలఁదొడఁగె
నొకటిచే మున్న యోటఁగియున్న వాని
రెండవవి కొన్ని పొడవంగ గుండెచెడదె. 108

ఉ. డాయుచుఁ బాయుచుం గరపుటమ్ములు సాచుచు వారిపూరమున్
దోయజలోచనల్ చలముతో నితరేతరవక్త్రబింబ ల
త్యాయతదృష్టిఁ జిమ్ముచు సహాసవచోరచనల్ చెలంగ నీ
రాయతనమ్మునం దరగలాడవు తత్తటఘట్టితమ్ములై. 109

శా. స్తుత్యశ్రీలగు మేనులం దొరగి కస్తూరీమిళత్కుంకుమ
ప్రత్యుప్తాగురు పంకసంకర హరిద్రాచూర్ణముల్ గ్రమ్మి సాం
గత్యం బేర్పడఁ జిత్రవర్ణములచేఁ గాసార మొప్పారుచో
వాత్యుక్తిం జలకేళిసల్పె నబలావర్గం బుదగ్రమ్ముగన్. 110

తే. పద్మషండమ్ము లందొక్క పంకజాక్షి
మునిఁగి మోమెత్తియున్నచో ముగుదలెల్ల
కని వదనమంచు నదిగాదు కమలమనుచు
నిశ్చయింవంగఁజాలక నిలిచి రపుడు. 111

కం. మీను తొడఁదగిలి యులికెడు
మానిని వెరుచఱచి వెరపుమాన్పుచు నొకప
ద్మానన గంతులువైచెను
దీనతఁ దనకాలు నాచుదీవఁ దగిలినన్. 112

ఉ. అంచలు చక్రవాకము లుదంచితగుంజదళిప్రసంగముల్
కాంచనసన్నిభాబ్జములు గాంచి మనోజుఁడు మెచ్చు రచ్చవ
ట్టంచుఁ దలంచి చిత్తమురియాడఁగ నీరవిహారలీలఁ జా
లించి సరోవరమ్ము వెడలెన్ నరపాలకుమారి గ్రక్కునన్. 113

తే. నెచ్చెలులు రాజకన్యక నెమ్మనమున
వెఱపుమిగులుట దెలిసి వెన్వెంటఁ గొలను
వెడలి తటసైకతస్థలి నిడినమడుగు
లెలమిఁదాలిచి రెంతయుఁ జెలువుమిగుల. 114

తే. అప్పు డతివలు నెరులార్చి కొప్పుదీర్చి
తిలక మలికమ్మున రచించి కలపములఁది
క్షితితలేశ్వరుకన్యఁ గైసేసి రెలమి
చెలిమి నొకయింతి పూబంతిచేతి కిచ్చె. 115

తే. విరహపరితాపభరమున వివశ యగుచు
సొలసి తూగాడుచున్న యన్నెలఁతఁ జూచి
లలితమగు నిందుకాంతశిలావితర్ది
నొనరు కిసలయశయ్యపై నునిచిరంత. 116

సూర్యాస్తమయవర్ణనము

చం. వనధిలుఠత్తరంగముల ప్రాలుటకున్ వెఱపగ్గలించినన్
దనదు మయూఖవార మొకదారిఁ జనన్ బెడఁగైన మేనఁ దా
ర్కొనిన వివర్ణవృత్తికి మఱుంగుగ శోణపటంబు దా వహిం
చినగతి రక్తదీప్తిఁ బొలిచెన్ రవి పశ్చిమశైలసంగతిన్. 117

సీ. చరమాద్రి తటనటచ్ఛబరార్భకులు చిమ్ము
చిచ్చురకొమ్ముల జిగి యనంగ
హరు లబ్ధిసారమి మల్లాడు కుంటెనకుఁ దో
డ్పడవచ్చు ఖగవిభుప్రభ యనంగ
దళితమం దేహకంధర నుద్గమించి మి
న్నొరసిన శోణితద్యుతు లనంగ
నినుఁబాసి వగచు పద్మినుల క్రేఁగన్నుల
మితిమించు శోణదీధితులనంగ

తే. గీ. రవిరథావక్ర చక్రచంక్రమణ జనిత
రవసముద్రిక్త కోపనిర్యద్భుజంగ
బహుఫణారత్న భవకాంతి పటలముఁగ
సాంద్ర సంధ్యారుణచ్ఛవిచ్ఛటలు దనరె. 118

కం. ఏదిశలను రవిసింహము
ప్రోఁదిస్ బరికించి పిఱపఁ గ్రుంకినఁ గని స
మ్మోదంబునఁ బొంగి తమో
వేదండశ్రేణి గుహలువెడలెన్ బెలుచన్. 119

మ. ప్రమదంబొంది తమిస్రయోషిదలకవ్రాతమ్ములన్ మెచ్చి దం
ష్ట్రిమహిష్యాదులఁ బ్రోఁదిచేసి గజరాజిన్ గౌఁగిటం జేర్చి కా
కమయూరీగళకోకిలమ్ములకు సాంగత్యమ్ము వాటించి గ
ర్వమణంచెన్ బకశంఖహంసహరి జీవంజీవజాతమ్ములన్. 120

తే. గీ. జారచోరుల రాత్రిప్రచార మెఱిఁగి
ఘూకఫల్గునికాదు లాగుణము గాంచె
జాతి వేఱయ్యు మనుజభాషణము లెఱిఁగి
శారికలు మాఱుపలుకుట సాక్షిగాదె! 121

తే. గీ. వసుధ విహరించు రాత్రిదేవతకుఁ బ్రీతి
సత్కృతిరొనర్పఁ దలఁచి దిక్సతులు వేడ్కఁ
దనర బహుపుష్పములు మేన నునిచినట్లు
దివి బహుగ్రహతారకల్ తేజరిల్లె. 122

చం. ఇనుఁ డతిరక్తి మున్ను దనునేర్పడఁ జెంది యతిక్రమించి వం
చన నపరాశఁగూడి మది చంచలతం జనఁజూచి ప్రాగ్దిశాం
గన నగినన్ రదద్యుతులు గ్రమ్మినకైవడిఁ దేజరిల్లెఁ గా
ర్కొను పెనుఁజీఁకటుల్ విరియఁ గొంత సుధాకరదీప్తి తూర్పునన్. 123

చం. హారుసిగబొందు పద్మనిచయమ్మునకెత్తినమచ్చుమందు మే
లరసిఘటించు కల్వలకు నచ్చినవిందు పయఃపయోధిపు

ష్కరములు పుష్కరంబెనయఁ గాంచినకందు జగమ్ము మెచ్చఁ జం
దరుఁ డుదయించె రేటిచెలి తోడుగఁ దూఱుపుకొండ కొప్పునన్. 124

సీ. కలశాబ్ధిసుతు తనుగ్లాని పోఁగడుగుచో
  ధరకుడిగ్గిన సుధాధారలనఁగ
శశిరథోద్ధతిఁ బూర్వశైలద్రుమంబులు
  సుడియ వీడిన విరిసోనలనఁగ
పతిఁజూచి రోహిణీప్రభృతు లుబ్బునఁదాల్ప
  కొలఁకులంటని హారగుళికలనఁగ
రాజు తామసగర్వరాహిత్య మొనరింపఁ
  బేర్మిఁజూపిన వెండిబెత్తులనఁగ

తే. గీ. హరజటాపేటి విధుసఖ్య మమరెఁ దొలుత
నాకసమ్మున నిపుడబ్బె ననుచు గంగ
పొంగఁ జదలేటి నవఫేనపుంజ మనఁగఁ
జంద్రికలుప్రాలె ధాత్రి నిస్తంద్రగతిని. 125

చం. పనవుచుజక్కవల్ జతలఁబాసి చరించె చకోరకమ్ము క
మ్మని కడిగాంచె పంకజసమాజమొగిన్ ముకుళించె పాంథభం
జనపరుఁడై మరుండు శరచాపము లోలిధరించెఁ బిండిచ
ల్లినగతి వెన్నెలల్ కొఱఁతలేక జగమ్ముల నిండియుండఁగన్. 126

సీ. అర్ధేందునిభలలాటాంతరమ్మునదిద్ది
  తీర్చిన కస్తూరితిలక మనఁగ
జిలుగుబంగరుశాలు జిగిఁజిందు మాళిపైఁ
  బికిలికుచ్చులదండ పెంపుఁజూప
సరసచందనచర్చ సమకొన్న యురమున
  సిరిగాంచు ముత్యాలసరులు గదల
సారిదినెన్నడుమునఁ జుట్టినధట్టీ చె
  ఱంగు లిర్వంకలరంగుఁ జూప

తే. గీ. శారికాకోకిలాళీమయూరభటులు
దండ నేతేర నిక్షుకోదండకుసుమ

కాండములు బూని శుకతురంగంబు నెక్కి
విరహిమృగముల వేఁటాడవెడలె మరుడు. 127

తే. గీ. మలయపవనమ్ము వడాయ వెన్నెలలుగాయ
భృంగసంఘమ్ము రొదసేయఁ బికముగూయ
తుంటవిలుదంట క్రొవ్విరితూఁపు లేయ
సకియ సుమశయ్యఁ గనుముయ్యఁ జాలదయ్యె. 128

మన్మథాద్యుపాలంభము

వ. ఇట్లయ్యింతి మదనతాపమ్మునం బొరలుచు సఖులంజూచి. 129

మ. మునుభర్గుండు లలాటకీలల మరున్ భోకార్చియున్ గ్రమ్మరన్
దనకున్ జాలినయంత భిక్షమిడ రీతన్వంగులం చల్కి నం
గనలం జంపుటకై యనంగునకు సంగ్రశ్రేణిఁ గల్పించి పం
చెనొ! కాదేని ధనుస్సమాస్త్రచయ మేచేతన్ విడంబించెడున్. 130

వ. అని పరిశ్రాంతిం బల్కిన. 131

కం. నీలాలకజాల గుణా
వాల మహీపాలబాల వగపెఱిఁగి సఖుల్
దూలుచు శైత్యవిధానము
లోలిం గావింప నప్పుడొకసఖి పలికెన్. 132

సీ. మలయానిలాహతాకులమైన చెలిమేనఁ
జందనసలిలమ్ము చల్లవలదు
కుముదబాంధవ రుచిక్షుభితమౌ నురమున
ఘనసారరేణువుల్ గ్రమ్మవలదు
రతిరాజతాప లోహితములై తగు నేత్ర
ములఁ బద్మపత్రముల్ మొనుపవలదు
వరపికస్వరభీతిఁ బొరలుచోఁ బఱపునఁ
జూతపల్లవములు చొనుపవలదు

తే. గీ. తజ్జనిత్వమ్ము తన్నామధారణమ్ము
తచ్ఛరత్వమ్ము తత్ప్రియత్వమ్ము నెఱిఁగి
సేయు శిశిరోపచారముల్ చెలికిఁదగునె
పగఱకూరిమిఁగలవారు పగఱకారె! 133

వ. ఇత్తెఱంగున నత్తెఱవ మనస్తాపమ్మునకు నుత్తలంపడు చిత్తమ్ములతోఁ దరుణకిరణప్రసారవిజృంభితుండగు సుధాకరుంజూచి సరోషభాషణమ్ముల నిట్లనిరి. 134

సీ. అతివేలగుణగణోన్నతుఁడైన శంకరు
శిరముద్రొక్కిన దుష్టచేష్టితమ్ము
తొలుత దివ్యులకాత్మకళలు దానమొసంగి
క్రమ్మఱఁగైకొన్న కల్మషమ్ము
నతులవిద్యాప్రదుండగు దేవతాచార్యు
నిల్లాలిఁ గవసిన హీనవృత్తి
నీనామముధరించి నెమ్మివాటించిన
శిలల నీరుగఁజేయు చెట్టతనము
తే. గీ. కాని పనులిన్నిఁటికిఁ దలకట్టు తోడఁ
బుట్టువున్నట్టియిల్లరికటుకొనుట
మానినీమణి నేచక మానఁగలవె!
కలుషమూలమ్ము నీదారి కమలవైరి. 135

సీ. హంసాదిఖగముల కానందమొనరించి
శోకమిచ్చెదు చక్రవాకములకు
కుముదముఖ్యప్రసూనములకు సిరులిచ్చి
కుందొసంగెదు పద్మబృందములకు
బహుశైలపంక్తులపై నింపువాటించి
కరఁపుదెచ్చితి విందుకాంతములకు
యువతీజనమ్ముల నుల్లసిల్లఁగఁజేసి
వెతలేర్పఱించెదు విరహిణులకు
తే. గీ. పక్షపాతేచ్ఛ నీకిట్లు ప్రాప్తమైన
కళలకును బక్షపాతసంగతి పొసంగె
రాజవే! నీవు ధరణిఁగారణగుణములు
కార్యగుణముల కారంభకములుగావె! 136

చం. అమృతము కాలకూటము సుధాంబుధియందు జనించె నట్టిచం
దమునను నీవునుం బొడమినాఁడవు నీకు హాలాహలస్వభా
వము దిరమయ్యె నయ్యమృతవైఖరి యించుక లేదు భామినీ
క్రమకృతకల్మషం బొకటి చాలదె నిన్నుఁ గృశాంగుసేయఁగన్. 137

ఉ. రోహిణి మున్నుగా సతులు రూఢినొనర్చిన సువ్రతమ్ములన్
రాహుముఖమ్మునన్ వెడలి రాఁగలిగెన్ విరహాంగనాజన
ద్రోహము నిన్ను నబ్ధిఁబడద్రోయదె! మేనుకృశింపకున్నె! యీ
సాహసవృత్తి మానుమిది సౌఖ్యకరంబగునే సుధాకరా! 138

సీ. రాజవై నినుగన్న రత్నాకరము నేఁచు
బడబాగ్ని నుడుపని వెడఁగుదనము
డాయఁజీఱిన మాత్రదాయకై వడి భర్గు
తలకెక్కి నిలిచిన తులువతనము
చిఱులేటిఁగొని నేలఁజెంగలిఁ దినసీక
వినువీధి నడ్డపెట్టిన భవమ్ము
వితతవిద్యాసమన్వితుఁ జేయు నాచార్య
సీమంతినీమణిఁ జెందునఘము
తే. గీ. క్రందుకొను నీకు బహుళపక్షక్షయ ప్ర
సక్తి వాటించి విదలింపఁజాలవమృత
కిరణభరణమ్ము భవదీయశరణమగుట.
* * * 139

మ. గగనమ్మెక్కుటి నెక్కి రాతిఁపగల్ గావింపఁ దాపంబునన్
మగువల్ కుయ్యిడ ధాతనీదుకళలన్ మార్చెన్ సుధావాప్తిచే
నగవారం డిగవారఁ గొంతకుశలం బీలీలఁ బూర్ణుండవై
జగతిన్ ఱాలయినన్ గరంచెదవు మాశక్యమ్మె జైవాతృకా! 140

చం. కలఁగక బాడబంబు నిజగర్భమునందిడుకొన్న తోయధిన్
గళగళఁ బొంగగాఁ గముచుకాఁకల గొన్నమవై హళాహళిన్
హాలహాల మజ్జణించు హరునౌదల నెక్కి మహావిషంబవై
నెలకొను నీకు నిర్విరహిణీవధ దుష్కరమా! కళానిధీ! 141

ఉ. తమ్ములచేవఁ జిక్కి గురుతల్పసుఖమ్మునఁ జొక్కి యాత్మకాం
తమ్ముల నీటఁ ద్రొక్కి జడదారి శిరమ్మున నెక్కి పాంథజా
తమ్ములమీఁద నిక్కి క్షణదావిహృతిం బయిలోటదక్కి చి
త్తమ్ముల నుక్కువుండనక తజ్ఞులుదూఱిన విక్కదే! శశీ! 142

కం. హరిణేక్షణ లిత్తెఱఁగున
సరసీరుహవైరి దూరి సఖి వెత గని ని
ష్ఠురణాత్మఁ డనుచుఁ గ్రమ్మఱ
మరు నుద్దేశించి కుపితమానస లగుచున్. 143

చం. మదన! తురంగమా శుకము! మంగళకాహళమా మయూరము!
న్మదకరిబృందమా పికసమాజము! చంద్రసమీరులాప్తులా!
ప్రదరములా సుమమ్ములు! శరాసనమైక్షవమా! మృదుత్వసం
పద లిటుగల్గియున్ సతులపాలిటి బూతమవైతి వక్కటా! 144

సీ. మధుపసంపదగుణప్రథితుండవగు నీకు
సరసధర్మగ్రహోత్సాహమేల!
జడచారసాహ్యలక్షణశాలివగు నీకు
సన్మార్గవిహరణశ్రాంతి యేల!
రజనీచరత్వదార్ఢ్యమ్ముగల నీకు
మాధవాశ్రయణసంబంధ మేల!
కృతపద్మినీచయాహితవృత్తివగు నీకు
శుకవచఃపరిచయౌత్సుక్య మేల
తే. గీ. బాలికాచిత్త దుస్సహాభీల కీలి
కీల జాలోపమోదగ్రకేళి సలుప
శరములేను ధరించె దుత్సాహమెసఁగ
శరమెఱుంగవు దుశ్చారి శంబరారి! 145

చం. అనుపమసౌరభమ్మున సుమాళి జగత్ప్రియ మాచరించి పే
ర్చిన సుమనోభిధానమునఁ జెన్నుదలిర్ప సగంధవృత్తి స
య్యన భవదీయసాధనములై కుసుమాహ్వయమంది డిందె దు
ర్జనసహవాస మీక్రియఁ బొసంగిన వన్నెయువాసి గ్రుంగదే! 146

సీ. వల్లవశ్రీ నోటుపఱుపఁ జూచెదవేనిఁ
బల్లవశ్రీ నోటుపఱుప లేమె!
మల్లిలతాంతమ్ము మఱల నేసెదవేని
మల్లిలతాంతమ్మె మనుపలేమె!
యబ్జమ్ము చేఁబూని యరముఁ జూచెదవేని
వదనాబ్జరోచులఁ బొదువలేమె!
కువలయంబని యేము దివుర నేసెదవేని
కువలయంబని యేము దివురలేమె

తే. గీ. నీవశోకమ్ముగొని యుగ్రనియతిఁ బూన
నీవ శోకమ్ముగొనధాటి నెరపలేమె
మార్గణములిట్లు వమ్మైన మార్గణములు
పరిహసింతురు నినుఁజూచి పంచబాణ! 147

ఉ. తాలిమి చూఱఁబోవఁ బరితాపముఁ గూర్చెదు మానసమ్మునన్
బాలిశుఁ డేనియున్ దనదుపట్టు దహించునె! నిన్నుదూఱగా
నేల భవచ్ఛరీరమొగి నీశుని మిక్కిలికంటిమంటచేఁ
గ్రాలకకాలుటన్ గొఱవికైవడి వేఁడిమి సూపకుండునే! 148

కం. ఘోరంబగు కుసుమశరా
సారమ్మునఁ గప్పి ధైర్యసారముఁ దప్పన్
బోరుడుగ వక్కటకటా!
మారుఁడవయ్యెదవా మాకుమారుఁడవయ్యున్. 149

మానిని. ఫాలవిలోచనలోచనరోచుల భస్మమయంబై మేనొకటన్
సోలకవ్రాలక గాలిపిశాచము చొప్పునఁ గుప్పునఁ గ్రొందలిరుం
గోలల గోలలనేయుచు డాయుచుఁ గోలుమసంగి యొసంగెడు నీ
శీలము చాలము గాంచిన ప్రాంచులు చెట్టని తిట్టరె భావభవా! 150

తే. అనుచునొక్కట మీనకేతనుని రోష
భాషణమ్ముల నిరసించి భయదలీల
నమ్మ నేతెంచు దక్షిణానిలము దలఁచి
తోయజాక్షులు నిందింపఁదొడఁగి రపుడు. 151

శా. రాణం గందఁపుగుబ్బలిం బొడమి సారగ్రాహివై సారస
శ్రేణిన్ సౌరభశైత్యసంపదల నాశ్లేషించి లోకుల్ జగ
త్ప్రాణుండంచు వచింతు రత్తెఱఁగు తథ్యంబైనఁ బాంథాంగనా
ప్రాణంబుల్ గొననెట్టు లోర్చితివి దుష్ప్రారంభ ! మందానిలా ! 152

మ. అహితప్రార్థన మాచరించి మలయాఖ్యక్ష్మాధరేంద్రమ్మునన్
బహుభోగి ప్రకటస్ఫుటామణిరుచిప్రాగల్భ్యముల్ మాని దు
స్సహదంష్ట్రావిషవహ్నిఁ బూని విరహశ్రాంతాంగనాంగవ్యథా
వహబుద్ధిం జనుదెంచెదింత కుటిలత్వంబేల మందానిలా ! 153

ఉ. ప్రాణపదంబటంచు నిను భావమునన్ గణుతింపుచుండుదున్
ఘ్రాణసుఖమ్ము సేయుమికఁ గస్తురిరంగని మేనితావిచే
నేణము నెక్కి పొమ్మచటి కీక్షణమాత్రనె యిమ్ము క్రమ్మఱన్
బాణియుగమ్ముసాచి నినుఁ బ్రార్థనచేసెద మారుతార్భకా ! 154

చం. అకలుషజీవనమ్మున మహాసరసుల్ దనరార దూఱెదో !
వికలసుఖంబుగాగ నడవిన్ సుమనస్తతి గెంటఁద్రోచెదో !
ప్రకటరజోవికాసమున భాసిలు కొమ్మలఁ గౌఁగిలించెదో !
అకటకటా మహత్తరుల కాపులపాటొదవెన్ సమీరణా ! 155

ఉ. క్రూరభుజంగచంగములు క్రోఁతలు జీరలు వాఱఁజీఱగాఁ
బౌరుషమేది కాలునిలుపన్ ధృతిమాలి విరాలి జాలిపొం
గారఁ గలంగుచున్న యబలాళిఁ గరంచి మహాబలుండనన్
బేరును బెంపుగాంచుటిది పెంటితనమ్ముసుమీ సమీరణా ! 156

వ. అని యిత్తెఱంగున నిందుకందర్పమందపవనుల నిందించి తత్పరిసర
వర్తులగు మరాళచంచరీకశుకకోకిలమ్ముల నుద్దేశించి యిట్లనిరి. 157

సీ. కలుషించి విసముగ్రక్కెడు రాజహంసంబ
మలినమ్ముగాదె నీమానసమ్ము
కొఁదుకుపల్కులఁ బండ్లుగొఱుకకు కీరంబ !
యేవగించిన దీఱ దీఫలమ్ము

పానమత్తత నెదుర్పఁగరాకు మధుపంబ
తెలియఁజాలవు నీదు దేహబలము
పంచమస్ఫూర్తి గారించనేల పికంబ
పలుగాకులకుఁ దేటపడుకులంబు

తే. గీ. నేల నడవడి దప్పుదు రేల మొగము
గంటు మానుదు రేల మీ కాకులరవ
రేల కన్నెఱ్ఱఁజేయరు మేలుమేల్వి
జాతులకుఁ బక్షపాత మెచ్చట ధ్రువంబు. 160

వ. అని యుపాలంభంబు సేయు నవసరమ్మున. 161

తే. గీ. ధరణిపతికన్య విరహసంతాపభరము
మది సహింపక వెన్నెలమడువు సొచ్చి
తనువు దొరగెద ననుచు నుద్ధతివహింప
వలదు సాహసమనుచు నెచ్చెలులుగదిసి. 162

కం. పొదివికొని యూఱడింపుచు
మదవతు లారాజకన్య మఱలఁదిగిచి నె
మ్మది కుసుమశయ్యఁ జేర్చిన
మదనాశుగ తాపతప్త మానసయగుచున్. 163

శా. వ్యాకోచాంబుజలోచనల్ పొదివి యాశ్వాసించుపల్కుల్ మనో
వైకల్యమ్మొనొకింత మాన్చుతఱి దుర్వారస్ఫురచ్చంద్రికల్
పైకొన్నన్ వెత నశ్రుతోయకణముల్ రాలం గళంబెత్తి తా
శోకించెన్ గలకంఠి కోకిలరవస్ఫూర్తిన్ విడంబించుచున్. 164

కం. వికలమతి నెద్దియును దో
చక వగచుచుఁ జూచుచున్న జలజాక్షుల యం
దొక నీలవేణి యనఁ జను
ముకురానన పల్కెఁ దెలియ మోము నిమురుచున్. 165

మ. అకటా! రూపగుణప్రభావరుచిర వ్యాపారయోగమ్ములన్
బ్రకటింపందగు రాజకన్యక వికన్ గన్నీరుమున్నీరు సే

యతు నీనాయకు రంగనాయకుని నెయ్యంబాఱఁ దోడ్తేర ను
త్సుకరాలాపము లొప్ప నిదుముగి నౌత్సుక్యమ్ము వాటింపుమీ ! 166

సీ. హరిణశాబేక్షణ ! హంసమయూరధూ
ర్తకుల నీకూర్చు నర్తకులఁ జేతు
మధురోష్ఠి ! భయకంద మందమారుత రతి
ధవుల నీ విహిత బాంధవులఁ జేతు
వనిత ! కోకిలమధువ్రత ముఖక్రూరవృ
త్తముల నీ గాయకోత్తములఁ జేతు
కాంత ! సంతాపదుష్కర చంద్రికాపేటి
కల నీదుకడఁ జేటికలుగఁ జేతు

తే. గీ. సతివ మును నీకుఁ బగవార లైనవారిఁ
జెలిమి నీకింక భృత్యులఁ జేయుదాన
రంగవిభు నిన్ను గూర్చు తెఱంగొనర్తు
వగవవలదమ్మ యేనుగలుగ శుభాంగి ! 167

చం. చెలియ మనోవ్యథన్ వెతలఁ జెందఁగ నేటికి నన్ను మున్ను బెం
పలరఁగ నేలినట్టి ఋణమంతయుఁ దీర్చెద రంగభర్తతో
నలవడ నీగు సచ్చరితమంతయుఁ బేర్కొని తోడి తెత్తు నీ
కెలమి ఘటింతు సజ్జనుఁడిచ్చిన ఖేచరవిద్య పెంపునన్. 168

ఆ. వె. అసిత నీలవేణి యంబుజమృదుపాణి
మోహసాగరమున మునిఁగియున్న
నన్ను నుద్ధరింప నావ వీవైతివి
పొమ్ము రంగభర్తృ పురమునకును. 169

కం. అని కౌఁగిలించికొని పో
మ్మనుపమగతి నీవువచ్చునంతకు నిచ్చో
టనె నిలిచియుండువారము
ఘనవిగ్రహు తోడి తెమ్ము గమలదళాక్షీ ! 170

వ. అని యిట్లు సముచితసత్కారమ్ములం బ్రియమ్మునెరపి మఱియు నయ్యంతింజూచి నీలవేణి! మనోభవపాణివిసృష్టమ్ములగు బాణవేణికల మునుగంజాల పొమ్ము చక్రపాణి నభిముఖుంజేయుమని యాజ్ఞాపించిన నయ్యంతి పితృదత్తంబగు విద్యావిశేషమ్ము నవలంబించి నభంబున కెగసి చనం దొడంగె నంతనక్కడ. 171

శ్రీ రంగపతి విరాళి

చం. ఎలమి మరుండు రంగవిభుఁడెంతయు రాజసుతన్ గురించి సం
చలితమనస్కుఁడై చెలంగి సయ్యన నెయ్యఁపుఁదియ్యవింట నే
ర్పలరఁగఁ బూన్చి సూనవిశిఖావళి పైఁబరగించు నంతకుం
దొలుత విపాండుపత్రరుచి నోఁచె మురారితను నెమ్మొగమ్మునన్. 172

తే. గీ. మును నృపాత్మజ చెలువమ్ము వినినయప్పు
డెఱిఁగి మురుండు జగద్భ్రమణక్రమంబు
దలఁగి యాత్మీయహృత్పీఠి నెలవుసేయ
రంగనికిఁ గోర్కి యువతిపైఁ జెంగలించె. 173

క. ఇవ్విధమున రాజాత్మజ
దవ్వుల నుండియును దనదు దండ నిలిచిన
ట్లువ్విళులఁ గోఁచిన మది
నవ్విభునకు విరహాభాస మగ్గలమయ్యెన్. 174

సీ. మంథాద్రిఁ బూని యంబరవీథిఁ జనుమేటి
విరహభారముఁ దాల్ప వెఱచుచుండె
పెఱిగినజలనిధిన్ బృథివిఁ దేల్చినదిట్ట
మోహాబ్ధి వెడల సందేహమాదె
కొనుక దావాగ్ని గ్రమింగిన మహాద్యుతిశాలి
దర్పకానలసముద్ధతికి నులికె
సకలదివ్యాస్త్ర తేజము లణంచెడుజోదు
నానరు పూఁదూఁపుల నోటువడియె

తే. గీ. చటుల భేరీసహస్ర ఘోషమున కోర్చు
ధైర్యధుర్యుండు కోకిలధ్వనికి నోర్చె

నహహా ! యెట్టువంటి ఘనులకున్నైన నొక్క-
కాలమునఁ గొన్నివింతలు గలుగకున్న. 175

వ. ఇట్లు నీళావధూమధురాధరరసమ్ము గ్రోల నుత్తలపడు చిత్తము నిలువనోపక ఫలప్రసూనకిసలయాభిరామంబగు నిజారామంబునం బ్రొద్దుగడపం దలంచి రంగవల్లభుండు విహంగపుంగవస్కంధంబున నిజకరాగ్రంబవలంబించి యుతం డొక్కరుండు సహాయుండుగా మందగమనంబునం జని సుమనోమనోహరంబులగు ననేకానోకహంబుల నవలోకింపుచు సంచరించుచో నొక్కయెడ రంగపతి విహగంపతితో నిట్లనియె. 176

ఉ. నాకు నెఱుంగఁజెప్పుమదె నాలుకలెల్లెడఁ గానుపించె ద
ర్వీకరవైరి ! యంచు హరి విస్మయమంద నతండువల్కె- శో
భాకరమైన పల్లవచయంబిది చూడు మశోకమన్న, న
స్తోకవియోగిచిత్తమున శోకముసేయు నశోకమయ్యె నే ! 177

చం. రజ మెగఁజల్లి వేడిమి భరింబిడి పాతకులై వియోగికిన్
గజిబిజి సేయు దీనినెఱుఁగంజెపుమయ్య సుపర్ణ ! నావుడున్
భుజగవిరోధి నవ్వుచు సనూనసుమవ్రజ సౌరభంబునన్
బ్రజ నలరించు కేతకులు పాతకులే ! జగదేకనాయకా ! 178

ఉ. ఆతత పాంథశోణితమయాకృతు లేర్పడియున్న భూతిసం
ఘాతము నిల్పెఁ గట్టెమటఁ గన్గొను మీవన నీకు నిజ్జగ
ద్వ్రాతమునందు బూతమెదురంగలదె ! యివి నూత్నపల్లవ
ప్రోతములైన చూతములు బూతములే నవపద్మలోచనా ! 179

ఉత్సాహ. ఉల్లలద్బహుస్ఫులింగ కోగ్రలీల లేర్పడన్
గ్రేళ్లువాతె నార ! వహ్నికీల పెంపవరె బలి
ద్వల్లభుండు పల్కె-మెచ్చువచ్చు కోరకమ్ములన్
ఫుల్లవల్లికామతల్లి పుష్పవల్లి కేశవా ! 180

వ. ఇవ్విధంబునఁ బల్లవఫలకుసుమ విసరభారోదారంబులగు భూరుహంబులం జేరిప్రకటించు శుక కేకికోకిలాలాపమ్ములవలనను గమలసౌరభవిలసితంబై చను

దెంచుమలయానిలమ్మువలనను బచ్చపిట్టతుండదళించు విరిగుఱుతులవలననం బొడమినయలజడికి న్గాలుసింగపంజాలకఁ దలఁకుచున్న యన్నలువతెంగ్రడిన్ దోడ్కొని చని యొక్కయెడఁ గుసుమితలవంగలతావేష్టితమ్ములును బుష్పితమల్లికావితానవిలసితమ్ములునగు నికుంజనిచయంబుల మంజులంబగు మధ్యదేశంబున శోభిల్లు తరుణచూతశీతలచ్ఛాయం గనుపట్టియున్న చంద్రకాంతశిలావిరచితంబగు వితర్దికోపరిభాగమ్మునం బఱచిన పల్లవశయ్యం జేర్చి ఖగేంద్రుండు నిజగరుదంచలంబుల నాయాసంబెడల విసరుచు నిట్లనియె. 181

తే. గీ. శుక మెఱుంగని ఫలములు పికము నోటి
గీఁటు లందని చివురులు తేఁటి తేనె
లానఁగానని కుసుమముల్ హంసగరులఁ
జెదరని సరోరుహములు దెచ్చెద మహాత్మ! 182

కం. అనుటయు రంగవిభుం డి
ట్లను పత్రరథావతంస! యల్లప్పుడె చె
ప్పనె కులశేఖరభూవర
తనయాసంభోగవాంఛ దలకొనె ననుచున్.

కం. మదికి నది పల్వలంబై
నదియై మున్నీటితెఱఁగునన్ బెంపై యు
న్నది మోహరసము నేనా
సుదతిన్ వరియించుతెఱఁగు జొప్పడదనఘా! 184

సీ. ఆయింతికెమ్మోవి యమృతపానినఁ జాలు
సమధికఫలరసాస్వాదమేల
నామానినీమణి మోముమూర్కొనఁ జాలు
కమనీయపద్మసౌగంధ్యమేల
నాబోటి నును జెక్కు లంటఁగలినఁ జాలు
పల్లవాలంబనభ్రాంతియేల
నాలేమ కౌఁగిట నలవరించినఁ జాలు
తనుపుష్పమాలిక దాల్పనేల

తే. గీ. యేల నిభములు తురగంబు లేల హేమ
రచితరథమేల రత్నహారవ్రజమ్ములేల
నేల ననునేల నీళావధూలలామ
కైకొనియెనేని నిన్నియుఁ గలుగవలయు. 185

చం. అనిన ఖగేంద్రుఁ డిట్లనియె నక్కట దేవరవారలానతి
చ్చినపని మానిఁ దాల్చి కులశేఖరభూవరుఁ డాత్మకన్యఁ గో
డ్కొని భవదీయసన్నిధికి గొబ్బునఁ దానరుదేరకున్న! యం
తనె కుశలమ్ము గల్గెడు వృథా విరహశ్రమ మందనేటికిన్. 186

తే. గీ. అనిన లక్ష్మీశ్వరుండు ఖగాధినాథుఁ
బలికె వినుమన్న మున్ను నే భావవీథిఁ
దెలిసియుండంగ నంకిలిగలిగె నొకటి
యదియు వినుపింతు నీకు నయ్యంబెసంగ. 187

కం. ఏయువతికైన శత్రు
ప్రాయంబగు హృదయ మిందిరాదేవి సప
త్నీయోగమ్మున కోర్వదొ
కో యని వెఱఁజెంది యూరకుండితి ననఘా! 188

వ. అనిపలికిన వైనతేయుండిట్లనియె. 189

శా. శ్రీభూనీళలు మున్ సపత్నులగుచున్ సేవింపరే! నిన్ను నీ
శోభామామణి దా వరించుటకు లీలన్ రాజకన్యాకృతిన్
శోభిల్లెన్ వెస నిందిరారమణి మెచ్చుంగాక సంపద్యశో
లాభమ్ముల్ గృపసేయు దేవికి మనోల్లాసమ్ము గాకుండునే! 190

వ. అనుటయు ఖగవల్లభువచనమ్ములకుఁ గలంకదేఱిన మనమ్ముతో
వికసితముఖుండై మధుసూదనుండిట్లనియె. 191

కం. పతగేంద్ర! నీసఖిత్వము
కతనం జితమయ్యె హృదయగతసంశయ మ

య్యతివం బరిణయమునకు సం
గతికిఁ బ్రయత్నమ్ము సేయఁగావలయు నికన్. 192

వ. అని పల్కునవసరమ్మున. 193

కం. నృపకన్య మున్ను పనిచిన
యుపకారిణి గగనవీథి నొగి నేగుచుఁ రం
గపతిం గనుఁగొల్లో ! యే
నెపమున భాషింపనగు ననేకజనులలోన్. 194

ఉ. ఆరమణీవతంసమున కాత్మహితమ్ముగఁ బెక్కు ప్రేలితిన్
దూరవిచార మించుకయుఁదోఁచక రంగవిభుండు వేడ్క దే
వేరులఁ గూడియుండు తిరువీధులనేగెడు వేళ చిత్రవి
ద్యారతులేగుదెంతురు రహస్యవచోరచనల్ ఘటించునే ! 195

తే. అని వితర్కించువేళ నల్లదియె విరుల
తోట యచ్చోట ఖగరాజుతోడ రంగ
నాయకుఁడు సంచరించుచున్నాఁడు సిల
వేణి ! పొమ్మంచు నశరీరవాణి పలికె. 196

ఉ. ఆపలుకుల్ మనమ్మునకు నచ్చెరుపాటు ఘటింప నభ్రవీ
థీపథ ముజ్జగించి జగతీస్థలికిన్ వెసడిగ్గి వార్ధిక
న్యాపతి సంచరించు తెఱఁగారసి నిల్కడవేళఁగాని నే
నాపృథివీశపుత్రి చరితామృతమున్ జవిచూప నెట్లగున్. 197

వ. అని తలంచుచు. 198

కం. అంతట నొకయారమ్మున
నంతర్హితలీలఁ దాల్చి హా ! సీతాసీ
మంతిని యనికూర్చున్న ము
రాంతకు పలుకాలకించి యతివ మనమునన్. 199

ఉ. ఎక్కడివింత భూపసుత నెన్నడుచూచె భ్రమంబుజెందె ! నీ
చక్కనిసామికిం జెలియ చక్క దనమ్ము మదిం ఘటింప న

ల్దిక్కులనుండి క్రమ్మఱు సుధీమణులెవ్వరుపూనిరో కొనే
మ్రొక్కి యెఱుంగఁజెప్పుటకు మున్నె యెఱుంగగనయ్యె నయ్యెడన్. 200

కం. అనుచు భయసంభ్రమంబులు
దనమది ముప్పిరిగొనంగఁ దరుణీమణి య
ల్లన నడుగులిడుచుఁ జనియెన్
వినయాన్వితయగుచు రంగవిభుఁ డున్నెడకున్. 201

తే. గీ. వచ్చుచున్నట్టి విరిబోఁడివలను సూచి
భూపకన్యక హృదయసంతాప ముడుపఁ
దలఁచి యేతెంచు సఖిగాఁగ దనదుదివ్య
చిత్తమున గోచరించె లక్ష్మీవిభునకు. 202

సీ. పరిపూర్ణచంద్రబింబము నందు నెరసులె
న్నఁగఁజూచు సుందరాననమువాని
శరదుల్లసత్సరోజదళమ్ముల హసించు
విపులవిశాలనేత్రములవాని
కమనీయపద్మరాగమణిద్యుతుల మించి
రాణించు సరసాధరమ్మువాని
భూరికుంజరకరస్ఫూర్తినోడించు న
త్యున్నతదీర్ఘబాహువులవాని

తే. గీ. చెన్నుసఁగు చిన్నినగవులు వెన్నెలలకు
వన్నెలునుదమ్ములును జేయునట్టివాని
రమ్యమగు శయ్యఁగూర్చున్న రంగవిభునిఁ
గాంచెఁ బూబోఁడి కన్నులకఱవుదీఱ. 203

చం. కని భయకౌతుకమ్ము లెసఁగన్ వెసఁ గ్రమ్మిన సమ్మదాశ్రువుల్
కనుగవనిండఁ బర్వితొనుకన్ గొలుకుల్ నిలుపోపలేమిఁ జ
య్యన నను జెక్కులం బొరయ నంగకముల్ పులకింప రంగధా
ముని చరణాంబుజమ్ములకు మ్రొక్కె సరోజదళాక్షి గ్రక్కునన్. 204

క. మ్రొక్కి నిలిచి యాద్దేవుని
వెక్కసమగు తేజమునకు వెఱచుచు మదిలో
స్రుక్కి తలవాంచి పలుకని
యక్కోమలి తెఱఁగెఱింగి హరి యిట్లనియెన్. 205

ఉ. ఎందు వసించుదానవిట కీగతి రాఁబనియేమి కుందమా
కందమధూకచంపకవికస్వరవాసన విందుగోరి నీ
విందుఁ జరించెదొక్కొ! మఱి యింకొక కార్యభరమ్ముపూని యీ
చందమునన్మెలంగెదవొ చంద్రముఖీ! భయమంద నేటికిన్. 206

తే. గీ. అనుచు రంగేశుఁ డానతిచ్చిన మృగాక్షి
ముదము సంధిల్లఁ గరములుమోడ్చి పలికె
సద్గుణాధార! సాధురక్షణవిచార!
కూర్మిఁదళుకొత్త మనవి చేకొనఁగవలయు. 207

నీలవేణి నీళావృత్తాంతమును శ్రీరంగపతికి విన్నవించుట

కం. శ్రీనిలయ! నీదుసన్నిధి
నే నెంతటిదాన నట్టిదిట్టిదియనఁగా
నైనను నొకసందేహము
పూని యిటకువచ్చితిని ప్రభూతసాధ్యా! 208

ఉ. హేలి నరాతినిర్మథనహేతుపరాక్రమశాలియై యశ
శ్శీలదయానుభావముల చెల్వగునక్కులశేఖరావనీ
పాలునిదేవియైన కులపాలికకున్ జనియించి బాలశో
భాలలితాంగియై పెరిగె బాలసుధాకరరేఖ వైఖరిన్. 209

సీ. ఆయింతి కుచగౌరవాప్తిఁ గనికాంచె
గజకుంభములు ధూళిఁగప్పికొనుట
యాలేమ ముఖకాంతిఁ బోలఁజాలక కదా
వనజారి కను కృశత్వమ్మునొందె

యానాతి లోచనశ్రీ నోటువడికదా
కమలముల్ జలములఁ గదలకుండె
నాబోటి పలుకుల యులవెఱుంగకకదా
చిలుకలు పంజరంబుల వసించె

తే. గీ. నాచలచ్చూర్ణకుంతల యంఘ్రియుగళి
నులికి చివురులు శాఖాగ్రములఁ జలించె
నా కలికి మధ్యభాగావలోకనమున
బెదరికాదె మృగేంద్రముల్ బిలముసొచ్చె. 210

వ. ఇవ్విధమ్మున నయ్యింతి చెలువమ్ము గొంతకొంత యెఱింగించి రమా
కాంతునితోనిట్లనియె. 211

తే. గీ. మతిఁ గొలఁది నింతి యవయవప్రతతిఁ బోల్పఁ
దోఁచె నివికొన్ని సదృశవస్తువులు సాటి
మున్న తెలిసిన సర్వజ్ఞమూర్తి వీ
వెఱింగినను నాకుఁ దెల్పవే! రంగనిలయ! 212

వ. అనిన రమావల్లభుండిట్లనియె. 213

తే. గీ. లేమ సుగుణమ్ము లెన్న పులోమజాది
సతుల నెఱుఁగవె పత్నీప్రశంస సేయ
నాకు నుచితంబె చెలియ సౌందర్యమహిమ
నీవెచెపు మేనువినియెద నీలవేణి. 214

కం. అని తనునియామించిన వ
వ్వనజాయతనయన రంగవల్లభుని గనుం
గొని చెప్పఁదొడఁగె భూవర
తనయామణి రూపసంపదలు తెలియంగన్. 215

మ. రమణీవేణికపై నెదుర్చు మధుపవ్రాతమ్ముల న్మారుఁడ
తుముఁడై త్రోఁచిన వ్రాలి కట్టెదుట రాజన్నాసికాచంపక

భ్రమదోఁపన్ వెఱగంది వక్త్రశతపత్ర ప్రాంతయుక్తిన్ సఖి
త్వము వాటించెననంగ ముంగురులు దత్ఫాలమ్మునన్ బొల్పగున్. 216

మ. తనముఖ్యాస్త్రము లింతిలోచనములై తత్తద్వ్యావాంతర్విభే
దనమున్ దృక్ఛరపంక్తిచేఁ బెనుపఁ గందర్పుండి కేలంచు వై
చిన పుండ్రేక్షుశరాసనమ్ములు కృతస్నేహములై యక్షిప
ద్మనిదేశమ్మున నిల్చినట్లెసఁగె సమ్యగ్భ్రూలతల్ బోటికిన్. 217

చం. విరహితసౌరభంబగుచు వెల్వెలఁబాఱు దిలప్రసూనమున్
జరదళిసంఘసంగతిఁబొసంగని చంపకమున్ దలంచి ని
ర్భరబహుగంధలబ్ధి ముఖపద్మవిలోలమధువ్రతాప్తి దా
నరసి మృగాక్షినాస పరిహాసమొనర్చు నిజోపమమ్ములన్. 218

మ. నవసంఖ్యాకృతితో ననంతగుణమాన్యమై శ్రుతిప్రఖ్య ద
మ్మవలంబించుట వీనులెన్న శతపత్రాకారమున్ రూపరూ
పవదర్థగ్రహశక్తి మాకె తగు గర్వంబేలనం చింతి క
న్గవ కిన్కన్ గడఁద్రోయు నట్టులమరెన్ గర్ణాంతవిశ్రాంతమై. 219

తే. చిలుక ముక్కునఁ జిందరల్ సేయునట్టి
దాడిమీబీజములు ముంటి దారిఁజూపు
ముత్తెములు విచ్చిచను మొల్లమొగ్గగుంపు
రహి సమంబులె పూబోడి రదనములకు. 220

ఉ. ఆరమణీముఖంబు సరియందురు మోవికిఁజాలసంచు నం
భోరుహ మంబులం దపముబూనుట రాగముజెంది రత్నమై
నీరసమాటకున్వగచి నిష్ఠురమైనగతిం దపించి ని
ర్భీరుత బింబమై యధరబింబమనం జను కంబుకంఠికిన్. 221

ఉ. స్థాణుశిరమ్మునన్నియతిసల్పి తమంబెడలన్ బుధాన్నవి
శ్రాణన మాచరించి జనరంజనతన్ శుభుఁడయ్యెఁ జందురుం
డేణము దాల్చియున్కిన్ హరిణేక్షణ ప్రసన్నమోము సాటికిన్
నాణెముజెందఁడయ్యె నలినంబది పంకజ మెన్న నేటికిన్. 222

కం. వదనము ఘనసారస్వత
పదనిగళము గళము రుచిరపటుశంఖకళా
స్పద మాపదంబు వేనలి
మృదుబిసకాండమ్ము లంబుజేక్షణ భుజముల్ 223

సీ. సౌవర్ణకలశముల్ సరివచ్చు శిఖిశిఖా
క్రమణకల్పితములు గాకయున్న
వనజకోకము లెన్నవచ్చుఁ జంచలచంచ
రీకరేచితములు గాకయున్న
గజకుంభములు సాటిగాంచుఁ దుండోజ్ఝిత
గ్రాసధూసరములు గాకయున్న
శైలాగ్రముల్ వోల్పఁజాలు నిమ్నోన్నతా
కారఘోరమ్ములు గాకయున్న

తే. గీ. కాంతిసౌష్ఠవ సమతాతికఠిన భావ
కలన నొక్కొక్కధర్మంబు గలుగఁజూచి
కొఱతలెఱుఁగక పూఁబోడి కుచసమాన
ఫణితి నెన్నుట యుచితమే ప్రాజ్ఞులకు. 224

మ. ప్రబలంబై చెలి యౌవనామృతఝరుల్ పైపై మెయింబర్వ నా
భి బిలావర్త విఘట్టితాహి వెఱ నుద్వృత్తిన్ బయల్నా కుచుల్
సొబగొప్పన్ వళివీచికల్ గడచి యచ్చోటన్ సగంధ స్తన
స్తబకాంతస్థితిఁ గాంచెనాఁ జెలికి నందంబయ్యె నూఁగారొగిన్. 225

తే. గీ. గగనమై తోఁచు నయ్యింతి కౌనుతీఱు
స్వాతిపథమందు మౌక్తికస్థగితకాంచి
కొసల వ్రేలెడు వజ్రంపుగుంపులెల్లఁ
జుక్కలై తోఁచు నయ్యింతి సొబగుతెఱఁగు. 226

చం. వలుదమెఱుంగుచన్ను లిరువంకలఁ గాంచనకుంభముల్ బొమల్
సలలితచాపముల్, గళముశంఖము పల్కులు కోకిలోక్తు లి
ట్లలరెడు గాంతమేను కుసుమాయుధుఁడుండు పసిండితేఱు సం
చలితరథాంగ మింతికటి శాతశరమ్ములు చూడ్కు లెన్నఁగన్. 227

తే. గీ. రమణి రూపమ్మునకు నోడి రంభయొకతి
యులికి కనుముయ్యదయ్యె వేఱొండు రంభ
కన్య యూరుభయంబునఁ గదలికదలి
కదళి యనుపేర నేఁటికిఁ గదలుచుండు. 228

కం. ఆహితగుణజంఘులకును
గూహాళమున నోరు దెఱచికొని కలహాళా
మోహమున నఱచుచుండెడు
కాహళములఁ బోల్ప నుచితగతియే చూడన్. 229

చం. సరవిఁ బ్రవాళ మాత్మరుచిసంపద పేర్మిఁ దదీయవిస్ఫుర
చ్చరణతలమ్ములం గెలుచు సాహసమూఁది నిజాంగసంగి ని
ష్ఠురతఁ దలంచి క్రమ్మఱినచోఁ దనమార్దవరాగయోగని
ర్భరత నెదిర్చి పల్లవము పల్లవమయ్యె సరోజసంధికిన్. 230

కం. ఆయింతి రూపగుణరే
ఖాయుతసౌష్ఠవము తోఁచినంత తెలిపితిన్
వేయేల నీకుఁదగు చెలి
తోయజముఖి కీవు దగుదు తుల్యాకృతులన్. 231

ఉ. స్వాములు మున్నుకొందఱు భవద్గుణరూపవిలాసముల్ నృప
గ్రామణి చెంగటన్ దెలుపఁగాఁ బితృసన్నిధిఁ బాయకున్న క
న్యామణి విన్నమాత్ర హృదయంబున మత్పతి నిర్జితాహిత
స్తోముఁడు రంగభర్తయనుచుం దలఁచెన్ దమి చెంగలింపఁగన్. 232

కం. రంగాధినాథ ! చటులవి
హంగేంద్రతురంగ ! విలసితాంగజనిభది
వ్యాంగ ! నినుబొందుటకు నీ
శాంగన తపియింపుచున్నయది మదిలోనన్. 233

ఉ. హా ! జగదీశ చాలతడవాయెగదా యిట కేను వచ్చి యా
రాజకుమారి సాహసికురాలుగదే ! తనువల్లి యింత కే

రోజకుఁ దెచ్చునోకొ – మరుఁడుద్ధతుఁడోర్చునె ముద్దరాలు! వి
భ్రాజితదివ్యమూర్తివి కృపన్ సెలవిచ్చినఁ బోయివత్తుదన్. 234

మానిని. కోకిల కోక బలాక కులార్భటిఁ గొందల మందెడిడెందమునన్
దీకొను గంధపుగుబ్బలిఁ బ్రమ్మిన తెమ్మెరతావుల యుమ్మలికన్
పైకొని చిన్నెల యన్నెలవెన్నెల పర్విన నోర్వక వేదనచేన్
ఆకలవాణి తపింపకయుండునె! యారసిపోరిది లోకపతీ! 235

కం. అని నీలవేణి పలికిన
వినయోచితవచనరచన విని యుత్సాహం
బున హృదయమలర నవ్వుచు
వనజాక్షుండిట్టులనియె వనితామణితోన్. 236

ఉ. సంగతిమీఱ సభ్యులు ప్రసంగవశమ్మున మెచ్చుచున్న నీ
శాంగన రూపసద్గుణ సుధాంబునిధిన్ మదిడిందుయున్న న
న్నంగభవుం డెఱింగి కుసుమాస్త్రము వేయఁ గలంగికాదె నా
రంగ లవంగలుంగ వనగంగవిహారము గల్గె! గోమలీ! 237

ఆ. ఇంగితజ్ఞురాల! యిఁక వేయు చెప్పంగ
నేల యెనయటకు నేగుదెంచి
క్షితితలేంద్రతనయఁ జేకొనియెద వేగఁ
జనుము చెలియ సంతసమున నెనయ. 238

వ. అనుటయు. 239

కం. స్వామీ! మా రాతనయకు
సేమం బెసగంగ ముదము చెన్నువహింపన్
శ్రీముఖపత్రిక యొసఁగుము
నా, మధురైత్యాంతకుండు నగుచుం బలికెన్. 240

ఉ. అంచిత సౌరభ స్ఫురితమైన మృగీమదకర్దమంబు సీ
లించి సమంచితాత్మనఖలేఖనిచే నొక వృత్తపద్ధతిన్

గాంచన కేతకీ కుసుమగర్భదళమ్మున వ్రాసి లేమ కి
మ్మంచు నొసంగె నాతట మురారి సువాణికి నీలవేణికిన్. 241

వ. అని యిత్తెఱంగున రంగపతి యానతియిచ్చి విహంగపుంగవ సమర్పితంబగు లేఁజివురులం బొదివిన కుసుమమాలికానిచయమ్ము నీలవేణికి సబహుమానమ్ముగానొసంగి నీలావధూమణి నూఱడింతువుగాని పొమ్ముపొమ్మని యానతిచ్చిన నెలంతశ్రీకాంతునకు మ్రొక్కి యమ్మహాత్మునిచేత ననుజ్ఞాతయై సభమ్మునకు నుద్గమించి చనునెడ నంతనట నీళావధూటి విరహభారపరిశ్రాంతయై యుండుటం జేసి నెచ్చెలులతోనిట్లనియె. 242

శా. ఆకల్లార్పఁదొడంగె మందపవనుం డందంద సూనాస్త్రభృ
ద్రాకాచంద్రులు దోడ్పడన్ గినుకచే, రానోపునే! తద్భయో
ద్రేకక్షాంతికి నీలవేణి, విభుఁ డో త్తెఱంగ నేగన్ బనుల్
గాకున్నన్ గద రాకయున్కి యని యక్కంజాస్య చింతింపఁగన్. 243

వ. అనిన నచ్చేడియతో నెచ్చెలులిట్లనిరి. 244

కం. బాలామణి! మది నెఱుఁగక
నీలో వగపేల కార్యనిర్వాహణకళా
శాలినియై సేమంబున
నీలోనన నీలవేణి యేతేఱంగన్. 245

సీ. చొఱనీయవలెగదె శుద్ధాంతమందిర
ద్వారసంస్థిత మహోదగ్రభటులు
నెడమీయవలెగదె యిందిరావిభుఁ గొల్వ
బడిబడి నేతెంచు భాగవతులు
మాటాడవలెగదె మదనమోహనమూర్తి
తేటకన్నుల నింతిఁ దేఱిచూచి
తలయూఁచవలెగదె తగినకార్యంబంచు
తాల్మి చేవలయూరు తల్లిగారు
తే. తెలివి నూహింప నిన్నిపట్టుల నిజప్ర
సంగభంగుల సవరించి రంగవిభుని

మానసమ్మున నీమీఁది మమతఁ జేర్చి
వేగ నేతెంచు మననీలవేణి యబల! 246

వ. అని యిత్తెఱంగునఁ జెప్పిరనిన గురువర్యునిం జూచి శిష్యప్రవరులు తఱువాతిచరితంబెట్టిదనిన వినుఁడని చెప్పఁదొడంగె. 247

శా. సుగ్రీవానిలనందనాది సుభటస్తోమప్రియోత్సాహ! పం
క్తిగ్రీవేంధనవీతిహోత్ర! విబుధక్షేమావహా! శంకరో
దగ్రేష్వాసనిరాసభాసుర! జగత్ప్రఖ్యాతచారిత్ర! ర
త్నగ్రైవేయకముఖ్యభూషణ లసత్సౌందర్యపాథోనిధీ! 248

కం. రాజద్రాజతనగ సుర
రాజేభాజాశ్వ భుజగరాజ త్రిదివ
తూజ మృగరాజ ధవళాం
భోజ ద్విజరాజ సదృశ పుంజితకీర్తి! 249

మాలిని. అనుపమగుణసాంద్రా! హంసవంశాబ్ధిచంద్రా!
వినిహతరిపుసేనా! విప్రపుత్త్రానుదానా!
మనసిజరిపుకాయా! మానుషార్చావిధేయా!
జనకనృపకుమారీ! సమ్యగానందకారీ! 250

గద్య. ఇది శ్రీరామచంద్రకరుణానిరీక్షణ సమాసాదితకవితావిశేష శేషాన్వయ ప్రదీపక వేంకటాచార్యకుమారక రఘునాథాచార్యప్రణీతంబైన కులశేఖరమహీపాలచరిత్రంబను మహాప్రబంధంబునందుఁ దృతీయాశ్వాసము. 251

కులశేఖర మహీపాల చరిత్ర

చతుర్థాశ్వాసము

★

శ్రీరమ్యమకుటరత్న
స్ఫారద్యుతి విజితభానుభానువ్రజ! లో
కారూఢకీర్తిసౌరభ!
సారగుణావేశ! జనకజాహృదయేశా! 1

వ. అవధరింపుము గురుసర్యంగు శిష్యులకిట్లనియె నట్లన్నెలంత విరహ భారమునఁబొరలుచున్న యెడ. 2

నీలవేణి సీతాదేవియొద్దకు వచ్చుట

మ. హరిహస్తాబ్జ నియుక్త నూత్నకుసుమోద్యన్మాలికావాసనల్
సరవిం బైపయిఁ గ్రమ్మ దేరఁ జెలులాశ్చర్యమ్మునన్ నల్దెసల్
బరికింపన్ దివి నీలవేణి ననువొప్పన్ గాంచి రచ్చో నభో
తరనిర్యన్నవచంద్రరేఖయన నుత్సాహమ్ము వాటింపగన్. 3

ఉ. రంగవరేణ్యదత్త సుమరాజి సువాసన మున్నెసంగఁగా
నింగి దొఱంగి వేదన మునింగి మనంబుగలంగియున్న సీ
తాంగన సంతసిల్ల ధర నంఘ్రులిడన్ డిగివచ్చు నీలవే
ణిం గని బాలికామణుల నెమ్మనముల్ వికసించెఁ గ్రక్కునన్. 6

ఉ. కాంచితిఁ గాంచనాంబరు వికస్వరవిగ్రహుఁ గాంచికాగుణో
దంచితమధ్యు రంగవిభు నద్భుతమందుచుఁ జెంతసేరి సే
వించితి నీదు రూపగుణవిభ్రమవైఖరి సారెసారెఁ గీ
ర్తించితి నిన్నతం డరుగుదెంచి వరించుట సంఘటించితిన్. 7

కం. అను పల్కు లమృతరసమై
తనవీనులఁ జొచ్చి హృదయతాపముడుప న

మ్మనుజేంద్రతనయ కుతుకము
దానుకఁగ నప్పులనేణితో నిట్లనియెన్. 8

ఉ. ఇందునిభాస్య! రంగవిభు నెయ్యెడఁ గాంచితివీవు నూచి యే
చందమున న్వచించితివి సారె పరాకొకయింతలేక గో
విందుఁడు చిత్తగించెనె! విభేదవిచారులు గొందఱయ్యెడన్
జెందరుగా! ననున్ గరుణ చేకొనవచ్చునకో తలోదరీ! 9

వ. అనిపలికిన నీలవేణి యిట్లనియె 10

ఉ. రాజముఖీ! మనోహరుని రాకలకున్ వగపేల మేఘవి
భ్రాజితమూర్తి నీదుపరిరంభము గోరుచునున్నవాఁడు ము
న్నే జప మేతపంబు రచియించితొ! తత్ఫల మబ్బెనేఁడు న
వ్యాజమనోజగాధ లెడ నయ్యెఁ జుమీ జలజాతలోచనా! 11

కం. హరిఁగాంచి వేడుకొనుటకు
నరవిందదళాక్షి మీ రల్లనువ నగ్రం
తరవీథిం జనఁగ విభాం
కుర రుచిరములైన మణులు కురిసెన్ మీఁదన్. 12

వ. అప్పుడేను వెఱగుపడుచుండ నంత. 13

ఉ. మానవతీ! మఱిన్ వెఱపుమానుము మింటఁ జరించు సిద్ధవై
మానికదంపతుల్ మణిసరోజము వేడుక సారె దోయిటం
బూని సమంబు చేసియగు బొమ్మని క్రీడయొనర్చుచున్న నీ
పై నొకకొన్ని రత్నములు బ్రమ్మిసచో వెఱగంద నేటికిన్. 14

వ. అనుచు నిరువురు సిద్ధాంగనలు శుభాంగీ! నీయత్నమ్ము శుభోదర్కం
బగుం బొమ్మని మత్పార్శ్వంబునం బలికి నిజేచ్ఛంజనుటయు. 15

తే. గీ. అపుడు పాడవున నరుగుచో నసఁదుటిక్క
లెల్లఁ గనుపడె గంపంత లేసివగుచు
మహి నిరీక్షింపఁ దుంగభూరుహములెల్లఁ
దుంగపాచల భంగిఁ గానంగఁ బడియె. 16

చం. పటుగతి నేగుచో నెదుట బారులుదీఱు చకోరకమ్ము లు
త్కటరవ ముల్లసిల్లఁ దమదండలనుండెడు పిల్లపిండు ముం
దట నెగువంగ సారసముదంచిత కోమలచంద్రికావళిన్
గుటగుట గ్రోలుచుక్కి గనుగొంటి మదిన్ ముదమగ్గలింపఁగన్. 17

వ. అంతఁ గడచి చనుచున్నయెడ విబుధావాసభాసురంబగు మేరునగమ్ము చందమ్మున మహాభాగవతమణిమందిర మాలికాలంకృతంబైన రంగనగరంబు దవ్వు దవ్వులం గనంబడియె నందు భేరీపటహ శంఖాదినినాదమ్మును నటనటీజనప్రవర్తిత వేణువీణాగానరావంబులును మహాభాగవత ముఖోదీరిత దివ్యప్రబంధానుసంధాన ధ్వానంబులునుం గలసి వీతెంచిన సమ్మహావైభవంబునకు సస్మితంబంది వినుచున్నంత నామనంబున. 18

కం. ఇట్టిమహావిభవంబున
నెట్టణ విలసిల్లు రంగసిం గనుచంగం
బెట్టిది చెలికత యే నే
పట్టున వినిపింప నేర్తు బహుసంఘములో. 19

వ. అని వితర్కించుచున్నయెడ. 20

కవిరాజ. సలలితకీర్తి పోసంగెడువేళ విచారముపొందెద వల్లదిగో!
ఫలకుసుమాసవ సౌరభవైభవ భాజన భూజసమాజములన్
బొలుచు వనంబు కనంబడుచున్నది పొందుగ నందు ఖగేంద్రునితో
నెలమి వసించె రమారమణీవిభుఁ డిందుముఖీ! చను మచ్చటికిన్. 21

వ. అని యశరీరి యాదేశించిన పలుకులకు డెందం బానందకందళితంబగుటయు గగనపథావతరణమ్ముచేసి యవ్వనంబు చేరంజని యందుఁ బ్రసవవిసర విలసితంబులై పొదలు పొదలలోనం గూర్చున్న యన్నళినలోచను నాలోకించునప్పుడు నామనంబున. 22

కవిరాజ. అలికులవేణులు వేణులకుం విరులాసి తాఁ గొనివచ్చుటకై
యళికుల మాకులమందఁగ నిప్పని యప్పనికిందగు నే యచుచున్
దలఁచితిఁ గ్రమ్మఱఁ దోఁచె నెఱుంగక తప్పుఁదలంచితి నీతనికిన్
గలుగరె భృతులు దీనికి వేఱొకకార్యము గల్గునటంచు మదిన్ 23

కం. అని నేను నమ్మహాత్ముని
కనుఁగొనుచున్నంత విపులకాంతా విరహో
పనతశ్రాంతిఁ జరించుట
కననయ్యెన్ మరుఁడు పాపకర్ముఁడు గాఁడే! 24

సీ. రమణీయసుమరజోరాజి రాజిలు చోట
సొలయుచు నేళించి తొలఁగుసమ్మ
లలితకోకిలశుకాలాపముల్ వీతేర
గరములఁ గర్ణముల్ గ్రమ్మునమ్మ
మృగనాభిసౌరభోన్మేషసాంకవశిలా
వితతుల డాయంగ వెఱచునమ్మ
ఘనచంద్రికాజాలకలితస్థలమ్ముల
నులికి వృక్షచ్ఛాయ నొదుగునమ్మ

తే. గుంజదళిపుంజ కలహంసకోకనిచయ
రుచిర నవపద్మకుముద సరోవతంస
మిళిత మరుదంకురములకుఁ దలఁకునమ్మ
యంగజశ్రాంతచిత్తుఁడై రంగవిభుఁడు. 25

కం. అదియెల్లఁ జూచి నామది
నొదవె విచారమ్ము విరహయోగశ్రమ మి
ట్టిదకాదె యితనిమది యే
మదిరాననయందుఁ జెందె మమతదలిర్పన్. 26

మత్తకో. సంగతంబగుచుం దరంగము సైంధవంబగుగాని తా
రంగమే జలరాశిలోకము రంగభర్తృకృతమ్ముగా
నింగితజ్ఞు లెఱింగి కొల్చెద రింపుసొంపు వహింప న
య్యంగహీనుఁ డెఱుంగఁ డంగ రథాంగపాణి నలంచెడున్. 27

ఉ. ఈమహనీయమూర్తిమది యేమదిరాననయందుఁ జెంది వి
శ్రామములేక నెవ్వగఁ బొసంగిచరించెనొ! చూచిచూచి యే
నేమని మాలతాంగి కతలేర్పడఁ జెప్పుదు! నిప్పుడీ గుణ
గ్రామణి పల్కునే యిది యగాధమనోరథ మేమిసేయుదున్. 28

తే. అనుచు మదిసంశయింపుచు నచటనిలిచి
పలుకరింపఁగఁ దగువేళ గలుగనంచు
మంజుసుమపుంజ మాధవీకుంజ మొకటి
మాటుగొని చెంతనిలిచితి మగువలార! 29

కం. అంత వసంతశయాను శ
కుంతవరేణ్యుండు కుసుమకోమలశయ్యా
భ్యంతరమున నునిచి పరి
శ్రాంతి యుడిపె నిజగరుద్వ్యజన పవనమునన్. 30

కం. అతఁడు గూర్చుండునప్పుడు
కౌతుకక సన్నేఁచ నేలఁ గులశేఖరభూ
పతిసనయా! యని విరహా
న్వితచిత్తుండగుట మఱియు నిను బేర్కొనియెన్. 31

వ. అప్పలుకులు నాకుం గర్ణగోచరమ్ములగుటయు నామనమ్మున
విస్మయంబొదవ నొక్కింత విచారించి యిమ్మహాత్ముం డమ్మదవతిఁజూడకుండియు
న్నృపసన్నిధికిం జనుదెంచు సుశీలు లయ్యింతిం జూచుచుందురుగావునఁ దత్సౌంద
ర్యాదిగుణమ్ము లిమ్మహాపురుషుని సన్నిధానంబున నుగ్గడించుకతంబున నితండు
నీలాంగనాపరిష్వంగసుఖతృష్ణాక్రాంతరంగుఁడై కుసుమశరవేదనాపరిశ్రాంతుండయ్యెం
గావలయునని నిశ్చయించి మఱియును. 32

కం. సార్థక మీ సరుదెంచుట
నిర్ధారితమయ్యెఁ గార్యనిర్వాహము పు
ణ్యార్థి వెస నాడఁబోయిన
తీర్థ మెదురొచ్చినట యని మదిన్ ముదమొదవెన్. 33

మ. కలకంఠీమణి! యప్పుడే నతని యుత్కంఠన్ వితర్కించి ద
వ్వులచూడ్కిన్ బని యెట్టులో నతనిచెయ్వుల్ భావమున్ గాంతు నం
చలరుందూఁపుల వేల్పు తండ్రికడ కే నందంద డాయంగఁ గ్రొ
న్నెలరాల్గూర్చిన తిన్నియన్ జివురువన్నెల్మించు తల్పమ్మునన్. 34

సీ. శతపత్రపత్రసౌష్ఠవము మెచ్చని దయా
ద్రాం విశాలనేత్రముల వాని
బంధురరత్నదర్పణపాళి నోడించు
లలితకోమలకపోలముల వాని
బలభిన్మణిస్ఫురత్ఫలకమ్ము నిరసించు
సముదీర్ణవిపులవక్షమ్ము వాని
దర్పితరాకాసుధాకరశ్రీ నోర్చు
భాసురవదనబింబమ్ము వాని

తే. హారకుండల మకుటకేయూర కౌస్తు
భాంగుళీయక కాంచికాద్యతులరత్న
భూషణోజ్జ్వలవిగ్రహు బుధమనోని
షేవితుని రంగవిభుని గాంచితి లతాంగి! 35

చం. సదమలభక్తిచే సతసి సారసతుల్యపదద్వయంబు ఫా
లము గదియంగ మ్రొక్కి మఱలన్ గనుదోయికిఁ దన్సముగ్రతే
జము మిఱుమిట్లుగొల్ప భయసంభ్రమముల్ మదినగ్గలించి తా
లిమి చెడి మ్రొక్కితీవఁ గదలింపుచు మోమువాంచి నిల్చితిన్. 36

ఆ. వె. నాదుభావ మెఱిఁగి నారాయణుఁడు చిఱు
నగవు మీఱఁబల్కె మగువ యిచటి
కేమిదలఁచి వచ్చి తెవ్వరుబనిచిరి
వెఱవనేల దెల్పవే మృగాక్షి! 37

వ. అనిపల్కు నమ్మహాత్ముని సంభాషణమ్ముల వలన ధైర్యం బవలంబించి కరంబులుముకుళించి యిట్లని విన్నవించితి. 38

ఆ. వె. హరి జగన్నివాస హాటకవసన ర
మావిహార నాదుమనవి యొకటి
కలదు చిత్తగింపవలయు నీదగు దయా
మృతవిలోకనములు మెండుకొనఁగ. 39

సీ. సర్వసర్వంసహాచక్ర నిర్వహణక్రి
 యా సముద్యత నిజోద్యద్భుజుండు
దీపితకీర్తికన్యా పదన్యాస చి
 హ్నాన్విత నిఖిలదిగంతరుండు
చటులకోదండ లస్తకవినిర్గత శరా
 సార మోహిత శత్రుసముదయుండు
సతతానుగత భాగవతబృంద వందనా
 చార సత్కారనిష్ఠాఘనుండు
తే. గీ. రమ్యవేదాంత గుంఫితార్థప్రపంచ
పరిచయావాప్త విజ్ఞాన పరిణతుండు
సకలజన పాలనోత్సాహశక్తి ధరుఁడు
వెలసెఁ గులశేఖరాహ్వయోర్వీవిభుండు. 40

ఉ. ఆమహనీయ తేజునకు నద్భుతశీలగుణప్రసిద్ధయై
శ్రీమహిళాసిభద్యుతులఁ జెల్వముగాంచి జనించెఁ బుత్రి సు
త్రామపదమ్మునందు వసుధాస్థలి రాజగృహమ్ములందు క
న్యామణు లెందఱేని సరిరాదురె! కేరళరాజకన్యకున్. 41

కం. అసమశర కుసుమవిశిఖో
ల్లసనము నోడించుసుతను లావణ్యశ్రీ
నెసఁగు చెలికి నీళాహ్వయ
మసదృశవిభవమున నొసఁగె నవనీపతియున్. 42

కం. సిరిమించు లక్షణమ్ముల
సురుచిర లావణ్యశీలసుగుణశ్రేణిన్
సరవిఁ బెనుపొంది యున్నెడ
సరసవయోరేఖ దనరె సరసిజముఖికిన్. 43

చం. జనకుని సన్నిధానమున సమ్యగుపాగత వైష్ణవాస్యసం
జనిత భవద్గుణామృతము సారెకు వీనులఁ గ్రోలుచున్న య
య్యనుపమగాత్రి నిన్ను హృదయమ్మున నాథునిగా భజింపుచున్
ఘనవిరహాగ్ని తాపమునఁ గ్రాగుచునున్నది రంగవల్లభా! 44

వ. ఇత్తెఱంగున మదనశరపీడితయగు నన్నెలంత నిరంతరచింతాసంతా
పితస్వాంతయై భవత్సన్నిధానంబున నిజవృత్తాంతం బెఱింగించి ప్రార్థించుటకు నన్నుం
బనిచిన నే నేతెంచితి నన్నెలంత ప్రాణపరిత్యాగప్రాణరక్షణమ్ములు రెండును
భవత్కరకమలగతంబులై యున్నయవి భక్తవత్సల! దేవర దివ్యచిత్తమ్మునకుం
దోఁచినయట్లు చేయుండని మ్రొక్కి నిలిచిన నమ్మహాత్ముండు వికసితముఖుండై
నన్నుంజూచి. 45

కం. మున్ను బుధు లెన్న సిన్నియు
విన్నాఁడఁ దదీయవిరహవేదనచే ని
ట్లున్నాఁడ నింక నే న
కన్నియఁ గైకొనక తాళఁగలనా! గలనా! 46

తే. గీ. అతివ! నేన వత్తు నచటికిఁ గులశేఖ
రావనీశుఁ గాంచి యాదరించి
యతనిపుత్రిఁ బెండ్లియాడెద నిక నేఁడుఁ
జెప్పనేల నను చెలియకడకు. 47

వ. అని యానతిచ్చి నిజనఖరముఖలిఖితంబగు శ్రీముఖంబు నీకు నిమ్మని
యొసంగె మఱియును మధుకరనికరసుకరమ్ములగు నెత్తావివిరిదండలు నాకుం గృపసేసి
బహూకరించె పదంపడి భవద్విరహశ్రాంతి శాంతిం బొందించుమని యమ్మహాత్ముం
డాజ్ఞాపించి నం జనుదెంచితినని పల్కి మఱియు నిట్లనియె. 48

ఉ. ఓసుకుమారగాత్రి! సుగుణోజ్జ్వలకీర్తి! నృపాలపుత్రి! యు
ల్లాస మెసంగ రంగపతిలాలితలైన లతాంగులెవ్వరున్
నీ సరిరారటంచు మది నిశ్చయమేర్పడఁ బల్కె నింక నీ
చేసిన పుణ్యరాశి ఫలసిద్ధి వహించెఁగదమ్మ! నేఁటికిన్. 49

వ. అనిపల్కి రంగవల్లభుండిచ్చిన శ్రీముఖపత్రంబు నీళాంగనకు నొసంగిన
నయ్యింతి నిజసఖులుం దానును పత్రికాలిఖితవృత్తమ్ము చదివించి గని. 50

శా. శ్రీలాలిత్యవిశాల రంగనగరిం జెల్వొందు గోవిందుఁడున్
శాలారత్నము! చింతయేమిటికి, సంభావించి శక్రాది ది

క్పాలుల మెచ్చఁ బరిగ్రహింతు నిను సౌఖ్యం బేర్పడన్ భృంగలీ
లాలోలాలకలాంఛితాలిక ! నిసీళాళావధూధూమణీ. 51

వ. అనుచుం జదువునప్పుడు నామాక్షరవ్యత్యయమ్మునను విశంకించు
సమయమ్మున నెచ్చెలు లిట్లనిరి. 52

చం. మగువ విచారమేల ! వనమాలి మనోభవబాధితాంగుఁడై
సొగయుచు వృత్తిలేఖ నొకచొప్పున వ్రాయుచునుండి యంత నీ
దగునభిధానవర్ణము లుదంచితలీల లిఖించుచోటఁ బె
ల్లెగసిన మోహసంతమ మిట్లు రచింపఁగఁ జేసెఁ గోమలీ ! 53

వ. అని ప్రౌఢకాంతలుపన్యసింప వారల తదర్థావబోధనంబునకు సంతసిల్లి
రాజకన్యక వికసితముఖకమలయై నీలవేణిం జూచి. 54

సీ. పద్మసంభవముఖ ప్రార్థనీయపదుండు
నిలిచి మాటాడెనె నీలవేణి !
సకలవేదాంత సంచారస్వభావాఢ్యు
నెలవు జేరితివటే ! నీలవేణి
శతమఖప్రముఖ పూజితపదాంభోజుండు
నిను సత్కరించెనే ! నీలవేణి
కవిబృహస్పతి కృతస్తవ భవ్యచరితుండు
నీనుతుల్ మెచ్చెనే ! నీలవేణి

తే. గీ. నాగశయనుని దర్శించి నాదుమనవి
వితతముగ విన్నవించి సమ్మతునిఁ జేసి
యెలమిఁ దలికొత్త నను నిర్వహించి తీవు
నీదు ఋణమెట్లు దీర్తునే నీలవేణి ! 55

వ. అని పొగడుచు నయ్యింతిం గౌఁగిలించికొని సంతోషమ్మునం
బొదలుచున్నయెడ సఖిజను లారాజకన్యం గనుంగొని. 56

సీ. మసలఁ జూచుచు నీపముస్రవాతెఁ గేకల
నడలఁజేయకయున్నె యదిశిఖండి
సనల రోయుచుఁ బరాకున నున్నఁగూయదే
కాకి పెంచిన కెంపుగంటి పులుగు
నొకచోటఁ గాలునిల్వక లతాంగుల నేఁచఁ
బూని క్రుమ్మఱు సోకుబూత మదియె
యెక్కడెక్కడి చాయ ప్రక్కలు మైనిండి
నిక్కుచుండెడుఁ బద్మినీవిరోధి

తే. గీ. మరుని గాడిలిచుట్టములే మనకుహితులె
విరహిణుల నేతు రిచ్చోట విరులతోట
వెడలి నీదగు మహానీయ వివిధరత్న
చిత్రకాంచన సౌధమ్ముఁ జేరవలయు.

వ. అనుచు సమ్రాజ్ఞిని మేననుండిన సుమనోరజమ్ము కరమ్ములం దుడిచి శీతలసలిలమ్ముల ముఖమ్ముఁగడిగి తిలకమ్ముఁదిర్చి కరమ్ముబట్టి లెమ్ము లెమ్మనుచు లతాంగులునిశాంగనం బోదివికొని చరణశింజానాదమ్ము పిక్కటిల్ల హంససందోహమ్ము నడచుకరణి మందగతిం జని మహానీయసౌధాంతరమ్ము సొచ్చి యుచితగతి నివసించియుండిరంత. 58

మంత్రుల దుర్మంత్రము

ఉ. శీలగుణోజ్జ్వలుండు కులశేఖరభూవరుఁ డాత్మమంత్రి వా
గ్జాల మనిత్యలౌకికవిచారఫలం బదియేల నంచు ల
క్ష్మీలలనామనోహరు విశిష్టకథాశ్రవణమ్ము మోక్షదం
బై లలినొప్పు నట్టిది మహాత్ములసన్నిధిఁగాని కల్గునే! 59

వ. ఇవ్విధంబున మనంబునం దలంచి శ్రీవైష్ణవసన్నిధానంబున నిరంతరంబును యోగ్యకాలక్షేపమ్ము సలుపుచుండె నయ్యవసరమ్మున నిజప్రభుప్రియసంభాషణాభావజనితక్రోధమ్మున మంత్రియూథమ్ము దమలోన. 60

కం. శ్రీవైష్ణవు లిట్టులఁ జన
భూవరునిం బోదిసికొని బుధప్రవరులకుం

గ్రోవయిడె రధిపుఁ జూడం
గా వశమే! మనకు రాజకార్యప్రౌఢిన్. 61

కవిరాజ. అనుచు సమాత్యులుపాంశువిచార సమన్వితోద్యమయుక్తమతులై
ఘనులకు రాజునకుం గలనెయ్యము గాసియొనర్చు నుపాయముచే
మనముల నొక్కొకరీతిఁ దలంచి సమగ్రజలాశయనక్రగతిన్
దినదినమున్ దగుకాలము వేచుచుఁ ద్రిమ్మరుచుండిరి దుర్మతులై. 62

మ. ఒకనాఁ డా నృపవర్యుఁ యోగ్యసమయం బూహించి యభ్యంగక
ర్మకళాకోవిదు జెట్టి నొక్కరుని రావించి మాణిక్యచి
త్రకిరీటాంగదకుండలద్వయ వినూత్నస్ఫారహారావళుల్
ప్రకటాత్మీయ మనోజ్ఞపీఠతటి యోరం బెట్టి తా నొక్కెడన్. 63

వ. అంత మల్లకరతలోల్లసితసంవాహనసుఖపరవశుండై యుండ నంత.

కం. సందుగని సచివులధిపుని
పొందుగఁ బిఠముఁ నిడినభూషణములు నే
గం దిగిచి డాఁపలంచం
బందిన యొకబోటిఁ బిలిచి పరితోషాత్ములై 65

కం. పనిచినఁ బిఠిక నరిచిన
ఘనరత్నవిభూషణములు గైకొని జరరాం
గన యొకమఱుఁగున డాఁచెన్
దనదుర్వినయప్రపంచదశ నింద్యముగన్. 66

మ. నరనాథాగ్రణియున్ బవిత్రసలిలస్నానమ్ము గావించి భా
సురపట్టాంబరధారియై బుధజనస్తోత్రవ్య దివ్యస్థలా
కరజ శ్వేతమృద్దూర్ధ్వ పుండ్రరచనాక్రమానసనాంభోజుఁడై
తిరుమంత్రంబు జపించి చెంత నొకయింతింజూచి పల్కెన్ వెసన్. 67

తే. గీ. నాతి తడవయ్యె మద్భూషణములు పీఠ
తలమునందిడి వచ్చితి మలయ కిపుడ
పొమ్ము తెమ్మంచుఁ బలికిన భూవరేణ్యు
నాజ్ఞ వేవేగ నటకేగి యంబుజాక్షి 68

కం. చని యచట వెదకి సొమ్ములు
కనిపింపక యున్న రాజుకడ కేగి మనం
బున వెఱఁగుదోఁప నంతయు
వినిపించిన నవ్విభుండు విస్మితుఁడగుచున్. 69

చం. నరవరుఁడాత్మపీఠమున నవ్యవిభూషణపంక్తిలేమిఁ దా
నరసి సమీపవర్తులగు నాప్తుల నెల్లెడఁ జూడఁబంచి యే
సరణియుఁ దోఁపకుండుటయుఁ జయ్యన మంత్రిగణమ్ముఁ గూర్చి యం
దఱు విననిట్లు పల్కె మదిఁ దద్దయు నద్భుత మగ్గలింపఁగన్. 70

ఉ. మంజులపీఠమధ్యమున మన్మణిభూషణపంక్తిఁ బెట్టి య
భ్యంజనతత్పరుండనగునప్పుడు దాని హరించె నెవ్వఁడో
కుంజగృహాంతరమ్ముల నిగూఢము చేయునొ వానిఁ దెచ్చి యీ
నెంజిలిఁ బాయఁ జేయుటకు నేర్పరులారయ మీరలే కదా! 71

వ. అనిన నమాత్యులిట్లనిరి. 72

మ. మనుజాధీశ్వర! దూఱ నేమిటికి దుర్మంత్రప్రచారాన్వితుల్
ఘనులో హీనులొ నిశ్చయించి పలుకంగావచ్చునే! మాకుఁ గాం
చనవాంఛాకృత వంచనామిళితసౌజన్యమ్ము వాటింతురిం
తననేలా పరికించినన్ దెలియరాదా! నీదు చిత్తమ్మునన్. 73

కం. అనిసచివులు భాషింపన్
విని భూరమణుండు కినుక నెఱసిన చిత్త
మ్మునఁ బల్కె నచటఁ గంటిమి
ఘనులకుఁ జౌర్యాభిలాష గడలుకొనంగన్. 74

ఉ. నావుడు వార లామనుజనాథునితో మదిఁ గోపగించి సన్
భావునె నిశ్చయించితిమి మున్నిటువంటివి పుట్టునందు నే
తాప్రఁ గన్న వైష్ణవకదంబము ద్రోహకృతిచోటు లేదు రా
జావసథమ్ము నందెచటనైన వినంబడ విట్టిచోద్యముల్. 75

ఉ. నాఁడు మనయ్యగాంద్రుఁ గఠినస్థితి నెండలనీఁగరించినన్
వాఁడిరటంచుఁ గోపమున వాఁకిటికావలివారిఁ జెండుబిం

తాపసుఁగ నాగ్రహించి చనవమ్మెయినిచ్చినచోట నవ్వరే
జానులవక్త్రగో తెలియఁజెప్పవె! మూషక నగాధితేశ్వరా! 76

ఆ. వె. అనినఁ జెవులు మూసికొని పాపరతుల గు
ర్వాచనంబు చన వినఁగవలసె ననుచు
జనవరేణ్యుఁడప్పుడు సంతప్తచిత్తుఁడై
కనుఁగొనఁగ మంత్రిజనులఁ జూచి. 77

ఉ. అక్కట శాంతచిత్తులు మహాత్ములు భాగవతోత్తముల్ మఱిన్
ప్రుక్కుక వారు రోగులనుచున్ గద యుల్లసించుచుర మీరు
ఎక్కడి సత్యశౌచకథ యెక్కడిధర్మవిచారసత్త్వవం
బెక్కడ నమర్మదంబొకటి హీనవిచారులఁ జేయకుండునే! 78

చం. జలరుహపత్రలోచనుఁడు సర్వజగత్పతి వైష్ణవోత్తముల్
దలఁపఁ దదీయపుత్రులుగదా! ధనఁగల్గుధనమ్ములెల్ల వా
రలవిని గైకొనందగుదు రట్టివెటింగి యికేల పెక్కు భా
షలు భగవత్ప్రపన్నులకుఁ జౌర్యములేదని పాయుముక్తుదన్. 79

కం. అని తెంపునఁ బలికెడి య
జ్ఞపతి వచనములకులికి సచివులు నృప! నీ
కనుచితము బాస ధరఁ గాం
చనవాంఛఁ బొసంగు నెట్టిజనులకు నైనన్. 80

కం. ఏమేమీ! మీగుణములు
స్వాములపై ద్రోచి పలుకఁజనునే! దుశ్చిం
తామలినస్వాంతులు ల
క్ష్మీమహిమోన్మత్తు చెంతఁ జేరంగలరే! 81

వ. అనిపల్కు భాగవతపరిభవభాషణ శ్రవణజనితరోషకషాయితమ్ములగు కనుంగొనల నిప్పులుప్పతిల్ల వారలముఖభంగంబును భగవత్ప్రపన్న ప్రభావప్రకటనంబును జేయం దలంచి దంష్ట్రనొకయుహితుండిచ్చిన బలిచినీలవర్ణాభీలంబైన వ్యాళంబునొక్కటి గొనితెండనిపనిచిన వారు సత్వరంబున నొక్కఘోరంబైన భుజంగమ్ముఁ బట్టి తెచ్చిన నిజాంగుళీయకంబుతోడ దానినొక్క నూతనభాండమ్మ

యందుఁ బెట్టించి తానును నిర్భీతుండై దానిం బట్టికొన నుద్యోగించునప్పుడు సురగరుడ గంధర్వకిన్నర కింపురుషసిద్ధసాధ్యాదు లాకాశమ్మున నిరవకాశమ్ముగా నిలిచి విస్మయంబునం జూచుచుండిరి హితపురోహిత మంత్రిసామంతవర్గం బిదియేమి పనియని యిమ్మహారాజునకుఁ గోఁచెననువారును నెవ్వరిగుణమ్ము లెవ్వరెఱుంగుదు రిట్టిసాహసమ్మునకుం గొత్త రేయనువారును సత్యవ్రతుం డింత సమ్మోహాక్రాంతుండు. 82

స్వాములకు దోషము లేమికిఁ గులశేఖరుండు పాము పట్టుట

తే. గీ. చూడు మిల్లవారు శుద్ధాంతరంగులు
భాగవతులు వారిపట్లఁ గలుష
వృత్తి లేదటంచు వెసఁ గేలు దడవెద
సర్వమూలకునికి సాక్షి మీరు. 83

వ. అని పలికి దయాసముద్రుండగు రామభద్రుం దలంచుచు 84

కం. చండాశీవిష భీషణ
భాండమ్మునఁ గేలుసొనిపి భయవిరహితుఁడై
యుండిన మండలపతిఁ గని
గుండియ లిట్టట్టుచెదరెఁ గొందఱ ప్రజకున్. 85

కం. తృణరజ్జులీల వంచిన
ఫణమెత్తికయున్న ఘోరఫణి గాంచి నృపా
గ్రణి యొక్కఁ కడకుఁ ద్రోఁచుచు
మణిముద్రిక డిగిచిచూపె మనుజులకెల్లన్. 86

మ. సురగంధర్వవిహంగపుంగవులు యక్షుల్ సిద్ధవిద్యాధరుల్
ధరణీవల్లభ సత్యధర్మముల కాత్మన్ విస్మయోల్లాస ని
ర్భరులై యంతనిమీఁద దివ్యకుసుమవ్రాతమ్ము వర్షించి ర
చ్చరకోటుల్ నటనావిశేష లలితోత్సాహమ్ము వాటింపఁగన్. 87

ఉ. అప్పుడు మంత్రులెంతయు భయంబడి మేరువు సంచలింప మా
తప్పు క్షమింపుమంచు వసుధాపతి పాదములందు వ్రాలినన్
జొప్పడు శాంతిచేఁ బలికె సొక్కి నెతంబడ నేల! స్వాములం
దెప్పుడు భక్తియుక్తిఁ జరియింపుడు మమకృతి మెల్లఁ బాయఁగన్. 88

వ. భూసురసామంతతతి పౌరజనంబుల సాధువాదంబు బెరయుకలకలంబు దిశల నెసంగ నప్పుడు. 89

శ్రీమన్నారాయణ సాక్షాత్కారము

సీ. మురువుదీపించు నెమ్మోమను జాబిల్లిపై
  చిఱునవ్వు వెన్నెల చెలువుఁ జూప
జిగిదళుకొత్తు వాసించు పొక్కిటితమ్మి
  బొమ్మ వేలుపు జన్మభూమిఁ దెలుప
నడుమునఁ గాంచీగుణవ్యాప్తి బొడ్డులోఁ
  గలజగమ్ములకుఁ బైకాఁపుఁ బూన
పొలుచు వక్షోహారముల చందిరఁపుఁగావి
  కమలాకుచగ్లాని గణనసేయు

తే. గీ. మంజుకంజాత కింజల్కపుంజ రుచిర
పీతకౌశేయరుచులు మ్రోఁబెరయ విహగ
రాజతురగమ్ము నెక్కి శ్రీరంగరమణుఁ
డమ్మహావల్లభునకుఁ బ్రత్యక్షమయ్యె. 90

ఉ. మించులమించు వస్త్రరుచి మీఱఁగ భూషణరత్నదీధితుల్
మించిపొసంగ నిన్నిఁటిని మించి మురాంతకుదివ్యతేజమున్
గాంచుటకుం దలంకెడుమనంబు నొకించుక నిల్వరించి సే
వించె నృపాలమౌళి యరవిందదళాక్షుని పాదసన్నిధిన్. 91

తే. గీ. ఇట్లు ప్రణమిల్లి యతఁడు లక్ష్మీశు నెదుట
నిటలతటమున నంజలిపుటముఁ జేర్చి
సమ్మదాశ్రులు కన్నులఁ గ్రమ్ము దేఱ
సవినయమ్ముగ నిట్లని సన్నుతించె. 92

చం. సరసిజగర్భశంకర కృశానుశతక్రతు ముఖ్యసేవ్య! భా
సురమహిమాలవాల! పరిశోభితభూరియశోవిశాల! దు
ష్కరదనుజవ్రజోగ్ర బలఖండనపండితకాండజాల! సు
స్థిరనిగమాంతసంచరణశీల! సుధీజనపాలనప్రియా! 93

దండకము. శ్రీమత్సుధాంభోధి వీచీచలచ్ఛేషభోగీంద్రపర్యంకశాయీ! ప్రపంచో
దయాదిక్రియాసంవిధాయీ! సధర్మానుయాయీ! బుధానందదాయీ
జగజ్జీవనాధారసమ్యగ్విచారా! ధరాభారసంహారకార్యావతారా! జితా
రాతిశూరా! మహోదారలక్ష్మీవిహారా! గభీరోరుసంసారఘోరాం
బురాశిం బ్రవేశించి నిర్మగ్నులై తీరమున్ జేరగాజాలరజ్ఞుల్ కడుం
బ్రాజ్ఞులాత్మన్ భవద్విగ్రహధ్యానయోగంబు పెన్నావగా జెంది నిశ్శంక
బుద్ధిన్ విజృంభింతు రానందసంధానసద్మంబులై నట్టి మీపాదపద్మంబు
లెల్లప్పుడున్ గొల్చువారెంతవారో కదా! త్వత్ప్రభావమ్ము భావింప
నే నెంతవాడన్ మహత్తత్త్వసంభూతభూతాద్యహంకారసంజాత
శబ్దాదితన్మాత్రజాభాసిలాగ్నిక్షమాఖ్యప్రసిద్ధంబులౌ పంచభూతంబు
లన్యోన్యయోగంబునం జేసి కాదే ప్రపంచంబ నేకాకృతుల్ దాల్చి చూపట్టు
నో యయ్య నీ వెయ్యెడన్ సూక్ష్మరూపంబునం జొచ్చి వర్తింతు వీవే కదా!
మున్ను కల్పాంతవేళన్ మహాల్లోలకల్లోలవీచీసముద్వృత్తపాయోరాశి
మధ్యంబునన్ దివ్యతేజోనుకారీ! నమో! మీనమై వారిధిం జొచ్చి
దైత్యాధముం ద్రుంచి వేదమ్ములా వేధ కర్పింపవే! యప్పొంగి భారం
బునన్ మందరక్ష్మాధరం బబ్ధిం గవ్వముం జేసి దేవాసురుల్ ద్రచ్చుచో
గ్రావముం భోధి గ్రుంగన్ విలోకించి కారుణ్యదృష్టిన్ మహోర్మిచ్ఛటల్
జర్ఝరీభూతముల్గా వడిం గూర్మమై వచ్చి యక్కొండ కుంద్రిండుగా
దండి వహించి చంచత్సుధాకుంభసంభూతి గావించి బర్హిర్ముఖశ్రేణులన్
బ్రోవవే! దుర్జయుండై హిరణ్యాక్షు డుర్వీతలంబంతయుం జాపచుట్టంగ
నీక్షించి బ్రహ్మాదులత్యంతభీతిన్ వితర్కించు నో నో మహోదార!
భూదారరూపంబునన్ దైత్యువక్షమ్ము భేదించి నిష్ప్రాణునిం జేసి
లోకమ్ము లం గావవే! యింక దత్పూర్వజుండైన దుష్టాసురేంద్రుండు
సమ్యగ్గుణాధారు గోవిందపాదాబ్జచింతావిహారుం గుమారున్ని రోధించి
నాతో విరోధించెదే దుర్మతీ! యివ్విరించిప్రపంచమ్మునం దెవ్వడైనన్
మదీయాజ్ఞకున్ మించి వర్తించునే! విష్ణుం డుండె నెందు శోధించినం దోచు
నంచీవు శోభించెదక్కైన నే తత్సభాస్తంభమధ్యంబునం జూపుమం
చుగ్రబాహాగ్రసంఘట్టనధ్వాన నిర్భిన్నదిగ్దంతి కర్ణద్వయీగోళముల్గా
సభాస్తంభమున్ వ్రేయ నందద్భుతాకారఘోరమ్ముగా నుద్భవంబై
నృసింహాకృతిం బెంపువాటించి దైత్యేంద్రుని న్మింటిపై నొంటిమై నంటి
రానీని వేగంబునం బాఱుచో వానిం బోనీక యుష్మద్భుజాదండసంఘట్టి

తుం జేయుచుం దెచ్చి రాజత్సభాద్వారదేశంబునం దూరుదేశంబునం
బేర్చి దంభోళిధారాధికారంబు నందండనిందించు చంచన్నఖాగ్రంబులం
దున్మి తూటాడి తత్పుత్రు నత్యంతసౌభాగ్యసంపన్నునిం జేసి రక్షింపవే !
తొల్లి యింద్రుం బలీంద్రుండు చండప్రతాపానలజ్వాలలం గ్రమ్మి
నాకాదిలోకమ్ములన్ నిర్జ్వాలగా నీక ఘోరాటవిం జెందగాం జేయుచున్
బూజ్యమైనట్టి స్వర్లోకరాజ్యమ్ము దాం జేయు చోం గశ్యపప్రార్థనావాక్య
సంతుష్టచిత్తుండవై వామనాకారమేపారి యజ్ఞార్థి మద్దానవుం జేరి
నాకుం జపస్థానమ్ము గావించు మూండడుగులం చుం బ్రసంగించి
మైకొన్న చోం బాదముల్ పెంచి బ్రహ్మాండగోళంబు పాదద్వయింగొల్చి
దైత్యేంద్రు నోడించి స్వారాజ్య మింద్రాదిబృందారకుల్ మెచ్చంగా నిచ్చి
పోషించవే! యింక మున్నార్తవీర్యార్జునాదిక్షమాభర్తలత్యంతగర్వోద్ధతిన్
ధర్మవిధ్వంసమున్ జేయంగోపించి నీవయ్యెడన్ జామదగ్న్యుండవై పుట్టి
పాపక్రియాపాల్జునుండైన యయ్యర్జునుం దాంకి తద్బాహుసాహస్రముల్
తత్కిరీటోజ్జ్వలంబైన శీర్షంబుతోడన్ కఠోరోగ్రధారాహతిం ద్రుంచి
గర్వాంధరాజన్యవిధ్వంసమున్ జేసి భూభారమున్ మాన్పవే మున్ను
లోకైకసంరక్షణం బాచరింపన్ హరిబ్రహ్మాదిసంప్రార్థితుండవై ధాత్రీస్థలిం
కోసలేంద్రాగ్రనారీరత్నలసద్గర్భసంభూతి వాటించి శ్రీరామనామంబునన్
బూర్ణచంద్రాకృతిన్ బెంపుదీపించి ఘోరధ్వసిధ్వస్త నానాపురగ్రామ
శృంగాటకం దాటకం ద్రుంచి సంగ్రామికోత్సాహు సత్యుగ్రదేహున్
సుబాహున్ ధరన్ గూల్చి మారీచు నంభోధివీచీనిమగ్నాంగుగా గావించి
మహానీంద్రు యాగమ్ము సౌభాగ్యయోగమ్ముగా గావించి వేడ్క క్ష్మాటన్
మునీంద్రోగ్రశాపమ్మునన్ గ్రావరూపమ్మునన్ గాసి నొందియున్న
యహల్యానిదేవిన్ గృపాదృష్టి వీక్షించి నీపాదపద్మద్వయీపాంసులేశమ్ము
నన్ దోషనిర్ముక్తయై తొంటిరూపమ్మునుం జెంది తద్భర్తృసంభోగ
సౌఖ్యమ్ము నొందింపవే ! యింక రౌద్రోగ్రకోదండదండమ్ము ఖండమ్ముగా నుగ్గు
గావించి లోకైకవిఖ్యాతలక్ష్మీకళాజాతయౌ సీతం బెండ్లాడి త్రోవన్ ని
రోధించినన్ భార్గవుం దోలి నాకేతముం జేరి నీ సవతిమాత్రంతరద్వేష
యోగంబునన్ రాజ్యసౌఖ్యాభిలాషమ్ము చాలించి సమ్యగ్గుణోపేతవై
యొప్పు సీతామహాదేవియున్ బ్రమదీపింప సౌమిత్రియుంగొల్వంగా
దాపసాకారమేపారంగ గాంతారవీథిన్ విరాధున్ ఖరున్ దూషణాద్యుగ్ర
దైతేయులం ద్రుంపవే ! రావణుం డంత దుస్తంత్రుడై ధారుణీకన్య

గొంపోయి లంకాపురారామసీమన్ జెఱన్ బెట్టుటన్ నీవు సుగ్రీవసాం
గత్యమింపొందఁగావించి యొక్కమ్మునన్ వాలిఁదూలించి సుగ్రీవు
రాజ్యాభిషేకోజ్జ్వలుంజేసి తత్సంగతిన్ వార్ధిబంధించి వేగన్ హనూ
మత్ప్రభృత్యుగ్రశాఖామృగశ్రేణితో లంకభేదించి ధూమ్రాక్షకుం
భేంద్రజిన్ముఖ్యులం జంపి యక్కుంభకర్ణున్ ధరన్ గూల్చి దైత్యేశ్వర
ప్రాణవిధ్వంసమున్ జేసి నీదాసునిన్ గుంభకర్ణానుజుంబ్రోచి బ్రహ్మేంద్ర
ముఖ్యుల్ భజింపంగ సీతాసమేతుండవై జాంబవద్భానుపుత్రాంజనే
యాంగదాదుల్ వెసంగొల్వ రత్నప్రభావిస్ఫురత్పుష్పకారూఢి నేతెంచి
మార్తాండవంశావనీశప్రియంబైన యోధ్యాపురంబున్ బ్రవేశించి గంధర్వ
గానంబురంభాదినాట్యప్రసంగంబులున్ శౌనకాదిత్యకణ్వాది మౌని
వ్రజంబున్ సునాసీరముఖ్యామరశ్రేణియున్ భూరిభేరీమృదంగాది ఘో
షమ్ములుంబర్వఁ బర్వేందుబింబంబుచందంబునం గాంతిపెంపొందఁ బట్టాభి
షిక్తుండవై లోకసంరక్షణోపాయమేపారశోభిల్లవే! యింకనుం దేవకీదేవి
గర్భంబునంబుట్టి పెంపేర్పడన్ రామకృష్ణాభిధానంబులన్ బెంపువాటించి
వ్రేపల్లెలో వల్లవుల్ మెచ్చఁ గ్రీడించుచున్ వెన్నలుంబాలు చౌర్యం
బునంగ్రోలుచో గుంపులై గోపికల్ రంతుసేయన్ బ్రమోదింపవే!
పూతనాఖ్యన్ దృణావర్తునిన్ వత్సదైత్యున్ బకాఖ్యాసురాభిఖ్యులన్
ద్రుంచి గోగోపకవ్రాతమున్ బ్రోవవే! కాళియాహిన్ మదంబేఁక పాదం
బులంద్రొక్కి స్రుక్కింపవే! వజ్రికోపించుటన్ ఘోరపాషాణవాతాంబు
పాతంబులన్ గోకులంబాకులంబందఁగాఁజేయు మేఘవ్రజంబున్ విలోకించి
గోగోపగోపీజనంబుల్ ప్రమోదింప గోవర్ధనోర్వీధరంబెత్తి హస్తాగ్ర
పీఠమ్మునన్ నిల్పి ఛత్రమ్ముగాఁబట్టి యాభీరులన్ బ్రోవవే! గోపికల్
నీవయిన్ మోహవిభ్రాంతిచేఁజేరి ప్రార్థింపఁ గద్వాంఛలీడేర్పవే! ధర్మ
విధ్వంసునిం గంసునిం హింసించి మోదంబునన్ దల్లిదండ్రుల్ హితుల్ బంధు
సందోహముల్ సంతసింపంగ వర్తింపవే! కీర్తి మూర్తీభవింపన్ ద్విజ
శ్రేణులన్ బ్రోవవే! మాగధాదిద్విషత్కోటి నిర్జించి శ్రీరుక్మిణీకన్యకం
దెచ్చి పత్నీవతంసంబుగాఁజేయవే! పాండుపుత్రప్రియాకాంక్షివై దుష్ట
చారిత్రుదుర్యోధనుంగూల్పవే చక్రపాణీ! జగన్నాథ! నిన్నున్ భజింపంగ
శక్తుండనే రాక్షసవ్రాతనిర్యాతనేచ్ఛన్ దయాంగనాసద్వ్రతధ్వంస
ముంజేయ బుద్ధావతారంబుగై కొంటివింకన్ గలివ్యాకులంబైన కాలంబు
నన్ దుర్మదోదగ్రమై మ్లేచ్ఛవర్గంబు దోర్గర్వదుర్వారవృత్తిన్ విజృం

భించి ధర్మక్రియానాశముం జేసి విప్రాదిక ప్రాణిలోకప్రమాదావహంబైన
యత్నంబునన్ మించి బాధించినన్ గాంచి కోపించి నీవయ్యెడఁ గల్కివై
కాదె రంగత్తురంగాధిరూఢుండవై బాహుదండస్ఫురన్మండలాగ్రంబునం
దుష్టులంబట్టి ఖండించి సన్మార్గముల్ వెంచి లోకంబశోకంబుగాఁ జేసి రక్షిం
పవే! వృష్టిచేఁ దుష్టిగావించి సస్యాభివృద్ధిన్ బ్రజన్ బ్రోవవే! గ్రాహ
సంగ్రస్తమై హస్తిరాజమ్ము ఘోషింపఁగారుణ్యమే పార నేతెంచి రక్షిం
పవే! కర్మవిజ్ఞానభక్తిప్రపత్త్యాదులం బెద్దియుం జేయఁగాఁ జాల నీపాద
పద్మద్వయంబున్ శరణ్యమ్ముగా నమ్మితిన్ నన్ను రక్షింపవే! భక్తమం
దార! సర్వప్రజాధార! లక్ష్మీవిహారా! నమస్తే నమస్తే నమః. 94

చం. అనుచు నుతించుచున్న వసుధాధిపతిన్ గరుణామృతమ్ము చే
నెనసినచూడ్కిఁ జూచుచు రమేశ్వరుఁ డాతని మేను పల్లవం
బన మృదులీలనొప్పు నిజహస్తతలంబున నంటుచున్ గుణా
వనపోఁడ నీవు నీకు సరివత్తురె! దివ్యులు భక్తియుక్తికిన్. 95

తే. మెచ్చు వచ్చితి వేఁడుము నిచ్చఁ గల్గు
వాంఛ దీర్చెద నరపా! వరము వేఁడు
మనినఁ గులశేఖరుఁడు వినయమునఁ బలికె
స్వామి! నీపాదభక్తియే చాలు ననుచు. 96

చం. సురనరనాగలోకముల శోభిలుకన్యకలందు నిందుమొ
వ్వరు సరిరాని రూపగుణవైభవలీలల నీతనూజ కి
ద్ధరనని లోకులెన్నఁగ నుదారగుణాకర! నాయకన్యకన్
దిగముగ నీకు నీఁదలఁచితిన్ జెలిఁ బెండిలిగమ్ము నెమ్మితోన్. 97

కం. వరమిది యొయనిన నప్పుడు
హరి యిట్లను నో మనుజనాగ్రణి! లక్ష్మీ శ్రీ
ధరణీనీళాఖ్యలు ము
వ్వురు మత్సతులనుచు నెఱుఁగవో! వేదములన్. 98

తే. ఇపుడు నను రంగమందుఁ గను టెంకిఁగి కోర్కి
మదివొడమి నీదుపుత్రియై యుదయమందె

వింటెనరపాల ! యే నంతకంటె మున్నె
కోరియున్నాఁడ నయ్యింతిఁ గూడుటకును. 99

వ. అని యభిప్రాయంబెఱింగించిన. 100

కం. రాజు ప్రియమునందిడి యోఖగ
రాజతురంగానుషంగ రంగపతీ ! మా
రాజీవేక్షణఁ బెండిలి
గాఁ జేయ ననుగ్రహింపవగావలయుఁ గృపన్. 101

వ. అనుచుం బ్రార్థించిన నద్గపదేవుం డట్లనకానిండని యనుగ్రహించినఁ గార్తాంతికులం బిల్వఁబంచి యారేయి ముహూర్తనిశ్చయంబుగావించి ముక్తాఫల మాలికాభిరామంబును మరకతమణిప్రభాశోభితస్తంభసంభృతంబును పద్మరాగ శిలాపుంజమంజులసాలభంజికారంజితంబును నగణితమణిగణకిరణభూషితసువర్ణబిందు సుందరకవాటశోభితంబును నగునొక్కమహాసౌధంబమ్మహాత్మునకు విడిదలగా నిరూపించి యచ్చటికివిచ్చేయునట్లుగావించి రుచిరాభీష్టపదార్థంబులు సమర్పించి యంతఃపురంబు శృంగారింపుడని వారి నియోగించిన. 102

సీ. రచితసామంతాంగరాగిమాటిసకటల్
తెలఁగఁజేసిరి సభాస్తంభములను
రజమడంగఁగఁ జందనజలంబుఁ జల్లిరి
వీథవీథుల బహిర్వేదికలను
మృగనాభి నలికి కూర్చిరి కప్పురంబున
రంగువల్లికలు గేహాంగణముల
రహిమించు పచ్చతోరణముల నెడనెడ
వ్రేలఁగట్టిరి కర్కరీఫలముల

తే. గీ. ధూపార్తి లెసఁజల్లు పిష్టాతధూళి పొరయు
పటికములనొరసిరి ? [మఱి] పాపడముల
ప్రేమ దళుకొత్త నిలిపిరి నృపతిగృహా వి
టంకతటములఁ జిత్రపటధ్వజములు. 103

కం. సరసాన్నపానముల న
న్నరసనుఁడు సమస్తజనమనఃప్రియముగ భూ
సురసంతర్పణ మత్యా
దరమునఁ గావించె విబుధతతి మెచ్చంగన్. 104

చం. ఫలములు జున్ను ఖజ్జములు పాయసముల్ గలమాన్న మప్పడం
బులు వడ లిడ్డెనల్ సగుడమోదకముల్ మిరియంపుఁజారు సం
ధిలు ఘృతపూరధారలు తుదిన్ దధిఖండసహాయమేర్పడన్
జెలిమి భుజింపఁబెట్టె నృపసింహుఁడు బంధుహితార్థకోటికిన్. 105

వ. అంత సమ్మోహినీకాంతుండు నిజకన్యాసఖులం బిలిచి యిట్లనియె. 106

కం. మీర లిపుడెచని మా నీ
హారమణికి నుచితమంగళస్నానాలం
కారమ్ములు గావింపుడు
నారీమణులార! కడు మనఃప్రియమొనఁగన్. 107

వ. అని యాజ్ఞాపించిన నవ్వేలందులమందగతిం జని యొక్క మణిమాలికాలంకారసురుచిరంబగు మందిరంబునందు సముచితపీఠమ్మునం గూర్చున్నయన్నెలంతం గాంచి డాయంజని యిట్లనిరి. 108

శా. ఏవేళన్ మదిఁగూర్తు వాఘునుఁడు తానేతెంచె మీతండ్రి సం
భావించె న్నినుఁ బెండ్లిసేయఁగ శుభాంభస్స్నానశృంగారముల్
గావింపన్ మముఁబంచినాఁడిచట నాలస్యమ్ముగానీక తే
లేవమ్మా రుచిరాంగి! నీవిభవ ముల్లేఖింపలేరెవ్వరున్. 109

కం. అనుచు నృపకన్యఁ దోడ్కొని
చని యొకపీఠమున నునిచి జలకేళిని లో
య్యాన సభ్యంగస్నానం
బొనరించిరి పరిమళప్రయుక్తజలములన్. 110

కం. ఒడలు తడియార్చి పొంకపు
కెపలని నునువలువఁ గట్టనిచ్చి నెటకురుల్

దడవి ముడియునిచి జిగిచిం
దెసు కస్తురితిలకమిడిరి నెలఁత నుదుటన్. 111

మ. సరవిం గన్నులఁ గజ్జలంబునిచి చంచచ్చందనస్వాదుప
త్రరుచుల్ చెక్కులఁ జేర్చి కర్కశకుచద్వంద్వంబునన్ గుంకుమ
స్ఫురణం బేర్పడఁజేసి మానికపుసొమ్ముల్ శోభిలన్ బెండ్లికూఁ
తురు గావించిరి పేరటాండ్రు మహిభృత్పుత్రిన్ బ్రమోదమ్మునన్. 112

తే. గీ. హారతాటంక హీరమంజీర కటక
కాంచికా హంసకద్యుతుల్ గడలుకొనఁగఁ
దనరు రాజన్యకన్యకఁ గనకపీఠి
నునిచి పాటలువాడిరి వనజముఖులు. 113

వ. అంత మహీకాంతుండు రంగవిభునకు మంగళస్నానాలంకారాద్యుప
చారంబులాచరింపందగిన పుణ్యాంగనలను వేదవేత్తలగు విప్రవరులం బంచిన
వారలమ్మహాత్మునిసందర్శించి వచ్చినకార్యంబు తెఱంగెఱింగించి తదనుజ్ఞఁగైకొని.
114

ఉ. మోము సెమర్పఁ గన్నులఱమోడ్పు వహింపఁ గచప్రసూనముల్
వేమఱు జాఱువాఱఁ గుచపీఠిఁ బొరంగి సరుల్ నటింప హ
స్తామితరత్నకంకణచయధ్వని సొంపువహింప నొక్క కాం
తామణి నేర్పుచే సురభితైలమునం దలయంటె శౌరికిన్. 115

కం. ప్రాంచద్బహుమణి కీలిత
కాంచనకలశోదకములఁ గడు వేడుక దీ
పించి జలకమాడించిరి
పంచాననమధ్య లబ్జపత్రాక్షునకున్. 116

సీ. వనితయొక్కతె నవ్యకనకపీతాంబరం
బందిచ్చె లోకైకసుందరునకు
తరుణియొక్కతె ఫాలతలమునఁ గస్తూరి
రేఖఁ దీర్చె వినమ్రలేఖునకును

సుదతియొకర్తె సంకుమదమృదుశ్రీగంధ
మలఁదె భక్తాభీష్టఫలదునకును
జెలియొకర్తె మకుటకుండలముఖ్యభూషణో
త్కర మొసంగెను సుధాకరముఖునకు

తే. గీ. వెలఁదియొకర్తె సుమమాలికలు మురారి
కంఠమునఁ జేర్చె వేఱొకర్తె కంబుకంఠి
పసిఁడిపావాలు గొడిగె శ్రీపతిపదములఁ
జికిలిముకురమ్ముఁ జూపె వేఱొకర్తె హరికి. 117

వ. ఇత్తెఱంగున నమ్మర్త్యకామిను లప్పురుషోత్తము నలంకరించి మెఱపించి
త్రిరుచివిలసితంబగు నొక్క సమున్నతకనకపీఠమ్మునందునిచి మహీసురమంత్రో
చ్చారణరవంబు లెసంగం గొలిపియున్నంత. 118

సీ. అరుదెంచె గరుడంచలాంచితహంసాశ్వ
నాదయుండగు సారసోదరుండు
చనుదెంచె శుభ్రాభ్రసముదగ్ర పృష్ఠభాక
వాహితుండగు నీలలోహితుండు
నేతెంచె గతిచాతురీ హితాగ్రహణో
చ్చైశ్శ్రవంబైన వృద్ధశ్రవుండు
తరలివచ్చిరి మరుద్వరుణవహ్నికుబేర
ముఖులు శ్రీహరిపదాంభోజసఖులు

తే. గీ. నపుడు చేరిరి గంధర్వు లప్సరసలు
రంగవల్లభు పరిణయారంభ మెఱిఁగి
యందఱచటకుఁ బఱతెంచి రధిపుఁగొలువ
జయవిజయ శేషభుజగేంద్ర సైన్యపతులు. 119

కం. పెక్కండ్రు విబుధ శేఖరు
లొక్కటఁ దను జుట్టి కొలిచియుండఁగఁ దేజం
బక్కజముగ హరియొప్పెఁ జు
క్కలలోఁ జందురుండు శోభిలు భంగిన్. 120

ఆ. వె. కేరళేశ్వరుండు కేశవుతోడ వి
చ్చేయవలయు దడవు సేయవలదు
వరముహూర్తవేళ వచ్చుచునున్నది
యనుచుఁ జెప్పిపనిచె నచ్యుతునకు. 121

నీళాకల్యాణము

కం. జనవరుని వలుకు లేర్పడ
విని రంగవరుండు చిత్తవృత్తులలర ము
న్ననువర్తించిన సురవర
మునిసంఘముతోడఁ గదలె ముదమొదఁ బౌరలన్. 122

వ. ఇవ్విధంబున జగచ్ఛరణ్యుండగు శ్రీరంగవరేణ్యుండు సంఛాదితవిచిత్ర
వర్ణోదీర్ణకుథాంచలవిలంబిత చంచన్మణిమాలికాశోభితోభయపార్శ్వభాగంబును
జిరత్నరత్నకింకిణీరుచిరసూత్రసంవేష్టితశింజానచతుశ్చరణంబును సుధాంశుకరనిభో
దంతదంతంబునునగు పంల్లకివహనంబు నారోహించె నప్పుడు. 123

సీ. అలంకారమ్ము ధరించి యహీంద్రుండా యాత్ర
పూనగ జను లగ్రభాగమున నడువ
శేషాంశుడు ముంపుజగజంపు సాగి పంపు
తళుకుపలగొడుగు చామరము వీవంప
కనకవేత్రము పూని గజిబిజి యుడుఁప వి
ష్వక్సేనుఁ డగ్రభాగమున నడువ
సాధు నిర్వాంశిల జనులు విజయమంద
రిహామింద సేవితమునకు సేవ

తే. గీ. బ్రహ్మరుద్రాది సకలసుపర్వవరులు
కదిసి యోతేఁ గనదీపికాసహస్ర
దీప్తపథమున విచ్చేసె దేవదేవుఁ
డమితవాద్యత్రఘోషమ్ము లతిశయిల్ల. 124

తే. గీ. సరససౌరభ మృగమదసాంకవాది
కలితచందనతాంబూలములు వసిండి
పళ్లెరమ్ముల నిడుకొని ప్రమదమొసఁగఁ
బుణ్యకాంతలు చనుదేర భూవిభుండు, 125

వ. బంధుజనసహితుండై వివిధవాద్యరవమ్ములు పిక్కటిల్ల ముచుకుంద వరదు నెదుర్కొని. 126

చం. మృదులసుగంధచూర్ణములు మేనులపైఁ గుఱియించి యందఱున్
గదిసినచోఁ నృపాలుఁడు జగత్పతికిం గలపంబ లదిస
మ్మదమున సూనమాలికల మానితలీల నలంకరించి సొం
పొదవ విరించిరుద్ర పురుహూతమునిద్విజులన్ గ్రమమ్మునన్. 127

వ. సముచితపూజావిశేషమ్ములం బత్నీసహితులగువారలకుం బ్రియంబు నెఱపి యందఱందోడ్కొని చన నగరవీథిం గ్రమ్ముకొను రంభాద్యప్సరోగణమ్ముల నృత్తప్రకారమ్ముల వీక్షింపుచు మందగతిం జనునప్పుడు భేరీపటహఝాంకారఘోషమ్ములును గాహళవేణువీణాగానస్వనమ్ములును దిశలం బర్వి నయ్యవసరమ్మున 128

సీ. తుంబురునారద స్తుతగీతరసలీల
భౌమగాయక గానఫణితి గాంచె
రంభోర్వశీకృత ప్రచురనాట్యవిధంబు
నగరవేశ్యానృత్త నయత నెనసె
ఆంగీరసోదీరితాగమస్వరసిద్ధి
నగరద్విజోచ్చారణతఁ బొసంగె
సురకంఠమందారసూనసౌగంధ్యంబు
జనధృతప్రసవవాసనల నొదిగె

తే. గీ. మఱియుఁ గౌబేరనిలయ సంపత్ప్రభావ
మానృపతికోశగృహలక్ష్మి ననుసరించె
వింతగాదిది శ్రీరంగవిభుని కరుణ
కలిగెనేనియు నచట దుర్ఘటముగలదె. 129

వ. ఇత్తెఱంగున రంగవల్లభుండు మహీసురస్వస్తివాచనంబులతో నంతఃపురంబు సొచ్చి మొగసాల నేనుంగుడిగ్గి సేనాపతికరంబవలంబించి కక్ష్యాంతరంబులు గడచి విరించిప్రభృతులు పొదివికొనిరా నేతెంచి ముందట నతివిచిత్రపాంచాలికాసముదంచితస్తంభాభిరామంబును బరిస్తీర్ణమనోహరణాస్తరణశోభితంబునునగు కల్యాణావసథంబు నగుమొగంబునం బ్రవేశించి సపరివారంబుగా నాసీనులై యున్నంత. 130

తే. గీ. అపుడు నగరి పురోహితు లమరగురువ
శిష్టముఖ్యమునీంద్రులచే ననుజ్ఞ
గాంచి యుచితస్థలంబునఁ గనకవిరచి
తోపకరణమ్ము లునిచి మంత్రోక్తు లెసఁగ. 131

కం. వైవాహికసమయోచిత
పావనపీఠమున రంగపతి నునిచి యిఁకన్
వేవేగఁ గన్యఁ దోడ్కొని
రావలయునటంచుఁ బలుక రాజు ప్రియమునన్. 132

కం. చెలులఁ గని కన్యకామణి
నెలమిన్ దోడ్తెండు మీరలిపుడని పనుపన్
జలజాక్షులు వేగమె చని
కలవాణిం గాంచి ప్రేమ గడలుకొనంగన్. 133

చం. మతిమతీ మాలతీసుమసమానశరీరిణి ! మంజుభాషిణీ !
కుతుకమెలర్ప లోకములకుం బతి నీపతియయ్యె, నయ్యె నీ
కతిహితమాచరించె సముదంచితమయ్యె విరించిలేఖ ము
న్నతనుఁడు నిన్ను నేఁచె నిఁక నాతిని నేఁచెదవమ్మ క్రమ్మఱన్. 134

తే. గీ. అనుచుఁ గించిదవాఙ్ముఖియైన రాజ
కన్య కరమూఁది తిగిచి యగ్గలికమిగులఁ
బొదివికొని వచ్చి చూపఱద్భుతము నొందఁ
దండ్రిముందట నునిచిరి తలిరుబోండ్లు. 135

తే. గీ. అంత సంకల్పతంత్రమంత్రాదివిధులఁ
బరగ వైదికముఖ్యు లేర్పడఁగఁ జేయ
సరవిఁ గూర్చున్న యవ్వధూవరుల కపుడు
నడుమఁ దెఱఁబూనిరి భవుండు నళినభవుఁడు. 136

కం. జనపతి పసిండిపళ్ళెర
మున రంగేశుని పదాబ్జములు నిలిపి ముదం
బున శుభజలములఁ బ్రక్షా
ళనమొనరిచి మౌళిఁ దజ్జలమ్ము వహించెన్. 137

కం. దర్పకుఁడు విరిశరమ్ముల
దర్పంబెడయయ్యె ననుచుఁ దలఁక మహీశుం
డేర్పడ నొగి మధుపర్కం
బర్పించెన్ రంగపతికి నర్ఘ్యద్యుతికిన్. 138

కం. నరనాథుఁడు ప్రాగ్జ్యోతిష
ధరణీశుండొసఁగు గంధదంతావళమున్
హరికి సమర్పించెఁ బురం
దరుఁ డిచ్చిన కల్పకుసుమదామమ్ములతోన్. 139

కం. ఆరట్టవిభుఁడు మును దా
కోరినక్రియ నిచ్చు చటులఘోటకముల ల
క్ష్మీరమణునకిచ్చెన్ మది
కూరిమి దళుకొత్త రత్నకుండలములతోన్. 140

వ. మఱియుం గులశేఖరధరారమణుండు మదింబొదవుముదంబు తుది
గానంబడక జగద్వల్లభుండైన యల్లునకుం బరార్ఘ్యహారకిరీట గోహిరణ్యాదిపదార్థం
బులు సమర్పించె నంత వధూవరులకు మఱుంగుపడ నెసంగు తెఱ వీడంజేసిన. 141

సీ. రంగవల్లభు చూడ్కి రమణిమోమునఁ జెందె
సతిచూడ్కి విభుపదాబ్జమునఁ బెనఁగె
వరుచూపు బోటి కంధరమున విలసిల్లె
చెలిచూపు హరియూరువులఁ దనర్చె
కాంతువీక్షణ మింతిఘనకుచమ్ముల ప్రాలె
నాతివీక్షణ మీశు నాభి నెసఁగె
పతిదృష్టి సఖినితంబములపైఁ బ్రాపించె
యువతిదృష్టి మురారియురము ప్రాఁకె

తే. గీ. నాథుని విలోకనమ్ములు నాతి యూరు
జానుజంఘాదులకు డిగ్గెఁ జంద్రముఖి వి
లోకనమ్ములు భర్త బాహాకపోల
నయననిటలావలంబనోన్నతికి నెసఁగె. 142

తే. గీ. రంగపతి తన్నుఁ జూచిన రమణిమోము
వాంచు నతఁడొండుజూచినఁ గాంచుమఱల

హంసములు ఖంజరీటమ్ము లందిడింది
మొనసి డాగురుముూతలాడిన విధమున. 143

క౦. సంగతి జగములకెల్లన్
మంగళదం బనుచు జనులు మదిమెచ్చఁగ నీ
శాంగన కంఠంబున హరి
మంగళసూత్రమ్ముగట్టె మది ముదమెసఁగన్. 144

ఉ. అంచితహేమపాత్రముల నక్షతముల్ దగ నాణిముత్యముల్
నించి నిజాప్తులిర్గడల నిల్చిన దంపతులింపుమీఱ ల
క్షించి చలించుదోయిళులఁ జేర్చి పరస్పరమాళులొప్పఁగా
నుంచిరి ముద్దులేనగవు లూటెడుమోములు సొంపుగుల్కఁగన్. 145

చ౦. పదపడి వహ్ని వేల్చి తనపాణితలమ్మునఁ బద్మగంధికే
ల్మొదమునఁ గీలుకొల్పి ద్విజముఖ్యులు మంత్రములుచ్చరింప నం
బుదముపిఱుందఁ గ్రొమ్మెఱుఁగు బూనినరీతి లతాంగితోడ సౌ
ఖ్యదహుతభుక్ప్రదక్షిణము కైటభవైరి యొనర్చనయ్యెడన్. 146

వ. ఇత్తెఱంగునఁ గ్రమక్రమంబున వివాహకార్యక్రమంబు నిర్వర్తించి యొక్కమణిమంటపమ్మునందు సువిశాలమనోహరంబైన కుసుమతల్పమ్మునందయ్యి రువురుదంపతుల నునిచిరి. పుణ్యాంగనల జయమంగళంబను పాటల రవంబెసంగ వేణువీణాపణవాదివాద్యఘోషమ్ములుపిక్కటిల్లె గంధర్వగానంబువినంబడియెనచ్చ రలుపెచ్చుపెఱిఁగి తమహెచ్చులమెచ్చులెఱుంగుటకు విచ్చలవిడి నటనమ్ముసలుపం దొడంగిరిట్లు మహావిభవమ్మునం దేజరిల్లుచున్న శ్రీరంగవల్లభుం జూచి. 147

సీ. ఘటితరత్నచ్ఛటాజటిలహాటకమైన
మకుటమ్ము గమలసంభవుఁ డొసంగె
మంజురోచిఃపుంజ రంజితాభ్రంబైన
పచ్చలపతకమ్ము భవుఁ డొసంగె
మందారగంధసంబంధ బంధురమైన
హారవారము సునాశీరుఁ డొసఁగె
మానితాంబుజరాగ మణిమండితములైన
కుండలమ్ములు మృగాంకుం డొసంగె

తే. గీ. వహ్నివరుణాది దిక్పతుల్ వసనభూష
ణాదిసంభావన లొనర్చి రలవు మెఱసి
రందఱును నవ్యతులసికాహస్తులగుచు
మంత్రపుష్పమ్ము సంగిరి మాధవునకు. 148

సీ. సగముకల్వల తేని సరివచ్చు నుదుటిపైఁ
గ్రమ్మ కస్తురితిలకమ్ము దనర
కెమ్మోవిరుచిగ్రమ్మి కెంపులకై వడి
ముక్కఱముత్తెముల్ మురువుసూప
రహిమించు చెక్కుల రవల తాటంకముల్
మితిలేని ధగధగద్యుతి నెసంగ
కుంకుమంబలఁదిన కుచకుంభయుగళిపై
మణిహారపంక్తి సంపదవహింప

తే. గీ. సిరులెనయుచూడ్కి పొదల ముంగురులు గదల
పసఁపుజిగిచీర మెఱయఁ బూఁబాన్పుమీఁద
ఘనునిచెంగట రాజన్యకన్యఁ జూచి
విబుధకాంతలు సిగ్గెత్తి వెల్లనెరి. 149

తే. గీ. భారతీపద్మసంభవుల్ పార్వతీత్రి
పురహరులు శచీపురందరులు మొదలు
సురవరోత్తము లవ్వధూవరులచేత
మిథునతాంబూలములు గాంచి రధికలీల. 150

కం. అంత వసంతములాడిరి
పంతములిగురొత్త విబుధపతు లచ్చరలున్
వింతగ సామంతులునటఁ
గాంతలతో చల్లుపోరు గావించిరొగిన్. 151

వ. ఇట్లు కృతోత్సవలీలావిశాలుండగు కులశేఖరనృపాలుండు కార్తాంతికులవలన దంపతులనొకటిసేయుటకు ముహూర్తమ్ము నిశ్చయించి తత్సమయంబగుటయు నయ్యిరువుర సముజ్జ్వలాలంకారశోభితులంగావించి గంభీరస్తంభసంభాసమానమ్మును విచిత్రచిత్రపుత్రికామనోహరకుడ్యమ్మును వినూత్నపల్లవతోరణోల్ల

సితపురోభాగంబును వివిధవర్ణోపరినిబద్ధవితానవిలసితమ్మును వితానపర్యంతలంబమాన
విద్యోతమానఖద్యోతసదృశసమృద్ధమణిమాలికాలంకృతమ్మును నగునొక్కరమణీయ
మంటపమధ్యంబునందు. 152

తే. గీ. పచ్చరాఁగోళ్లు పవడంపుఁబట్టెయలును
పట్టువఱచిన నునుపట్టు పట్టెడలును
దనరు పర్యంకపాళి మందారకుసుమ
పుంజములు మంజులాకృతిఁ బొందుపఱచి. 153

కం. పొందుగ ఫలభక్ష్యమ్ములు
చందనకస్తూరికానుషంగ భరణికల్
సుందరతల్పప్రాంతము
నందునిచిరి చంద్రవదన లతిమోదమునన్. 154

వ. అయ్యవసరమ్మున. 155

కం. వాచస్పతియు వసిష్ఠుఁడు
శోచిష్కేశుండు తగినచోటుల మంత్ర
శ్రీచతురతఁ జూపిరి సము
దాచారవిచారకార్య మనుకూలముగన్. 156

కం. వాణియు శర్వాణియు గీ
ర్వాణాధిపురాణి గూడి రాణించు గుణ
శ్రేణిఁ దనరు నీళాక
ల్యాణిం దోడ్కొనుచుఁ జనిరి హరియున్నెడకున్. 157

వ. ఇట్లు దోడ్కొనిచనుదెంచి శ్రీవత్సాంకు పర్యంకసమీపమ్మున నిలిపి
యిట్లనిరి. 158

ఉ. పొంకుటనేర దర్థిజనపోషణతత్పర సత్యధర్మని
ష్పంకచరిత్ర వృద్ధగురుభక్తిసమన్విత శీలసత్క్రియా
లంకృత కీర్తిశాలిని విలాసమనోహర తావకైకమో
హాంకురఖిన్నహృన్నళినయై యిటులున్నది రంగవల్లభా ! 159

ఆ. వె. సరసవచనరసిక ! సకలపతివ్రతా
తిలక మీమృగాక్షి దేవ ! నీదు

పత్నులందు మెచ్చుపడ నేర్చు నీముద్ద
రాలి మనసు దెలిసి యేలికొనుము. 160

కం. అని యప్పగించి దేవాం
గనలు నగవులొదవు వదనకమలమ్ములతోఁ
జనుటయు రంగేశ్వరుఁ డ
జ్జనపతిసుతవలనఁ గేలుసాచెన్ బ్రీతిన్. 161

ఉ. జృంభితభర్తృమోహ మొకచెంత నలంత ఘటింప నద్భుతా
రంభితయా నపత్రప భరమ్మున నిల్వఁగలేక మంటప
స్తంభము మాటుకుం జనినఁ దత్పరిరంభవిలోలచిత్తసం
రంభమునం గనుంగొనుచు రంగవిభుం డెలనవ్వు మీఱఁగన్. 162

కం. విరిపాన్పు డిగ్గి రంగే
శ్వరుఁ డయ్యరవిందగంధి జాడంజని త
త్కరపల్లవమ్ము నిజకర
సరసిజమున నూఁదినగ వెసఁగ నిట్లనియెన్. 163

కం. ఇది యేమే శుకవాణీ!
మదనాయాసమున నీవు మగువననుప నే
నొదవిన విరహార్తమున
గదియం జను దేర, నెట్లుగాఁ దొలఁగితివో! 164

వ. అనిపల్కి యయ్యతిం గాఁగిటం జేర్చి పూఁబాన్పునకుం దెచ్చి మఱి
యునుమృదుమధురసల్లాపమ్ముల నబ్బోటి పుయిలోటఁదీర్చి రంగవల్లభుండు. 165

సీ. శశిబింబమెంతనఁజాలు పూఁబోడి నె
మ్మోమ్ముపైఁ గదియంగ మోముఁ జేర్చి
వసిఁడిచాయల డిందుపఱచుఁ జక్కని చెక్కు
టద్దముల్ కళలంట ముద్దులిడియె
మృదులబింబఫలంబు నదలించు సఖిమోవి
నలరు సుధారసం బానఁదొడఁగె
గజకుంభముల గెల్వఁగడఁగు పీనపయోధ
రంబుల నఖలాంఛనంబు లునిచె

తే. గీ. విరులు గ్రొమ్ముడినునిచె ముంగురులుదడవె
ప్రబ్బిమేనులఁ బులకాంకురమ్ము లెసఁగ
మరునిచెయ్వులఁ బెఁగొన్న మమతకతన
రమణి నీవికిఁ జెయిసాచె రంగవిభుఁడు. 166

తే. గీ. వ్రీడపెంపున నయ్యింతి విభునికేలు
తనకరమ్మున బిగఁబట్టుకొనిన నగుచుఁ
జెలియ చిబుకంబు నివురుచుఁ జెలిమినెరపి
రంగరమణుండు చెలి యనుగ్రహమువడసె. 167

వ. ఇట్లన్యోన్యబద్ధానురాగులగు నయ్యిరువురు సురతవిశేషవిహారమ్ముల మెలంగునప్పుడు చెదరినతిలకమ్ములును జిక్కువడినహారమ్ములును సడలినకేశకలాపమ్ములును ముదురులగునూర్పులునుం గలిగి పరిశ్రాంతస్వాంతులగుచుఁ బర్యంకతలమ్మున శయనించియున్నంత. 168

ఉ. చందనశైలదేశమున సంజనితంబగుచుఙ్ సుమవ్రజా
మందసుగంధసంపద సమంజసమై విమలోల్లసత్సరో
బృంద పయఃకణవ్రజము పెంపెసఁగన్ మరుదంకురమ్ము గో
విందుఁడు సుందరీమణియు వేడ్కసుఖింపఁగ వీచె నయ్యెడన్. 169

ఉ. జాతవియోగదుఃఖయగు జక్కవ మెచ్చఁగ మున్నహర్ముఖ
శ్రౌతము వేళఁదెల్పి విలసద్గతిఁ బద్మినిమేలనన్ మనః
ప్రీతిచెడన్ జకోరకము, బిట్టలుకన్ విటచోరభంగవి
ఖ్యాతములై యెసంగెఁ జరణాయుధకంఠకఠోరనాదముల్. 170

ఉ. అయ్యెడ మేలుకాంచి కమలానన మెల్లన శయ్యడిగ్గి కా
నొయ్యన సంచలింప ముడియూడిన కొప్పునెఱుల్ నితంబమున్
నెయ్యమొనర్ప సళ్లుకొను నీవి కరంబునఁబట్టి సిగ్గు సం
దియ్యక తోడ్పడంగఁ బడకిల్ వెడలెన్ బదముల్ తడంబడన్. 171

వ. ఇట్లువెడలిచనునెడ నెచ్చెలులచ్చెడియంగూడుటయు లజ్జాభరమ్మునఁ జిఱునగవు నెఱయు మొగంబెగయింపంజాలక యూఱక చనుచున్న యన్నరపతిసుతం జూచి వారలిట్లనిరి. 172

ఉ. ఏమియుఁ జెప్ప విప్పుడది యేమి సరోరుహగంధి మున్నుగా
నీమది సంచలింప నతని౯ గదియంబడి చుల్కనైతొ, యా
ధీమణి ప్రార్థనల్ వడసి తేజముఁ గంటివొ! చైవులన్నియున్
క్షేమముగోరు మాకు నెఱిఁగింపుము సఖ్యమునివ్వటిల్లగన్. 173

వ. అనిన వారలకిట్లనియె. 174

కం. అక్కట క్రొత్తకతలు మీ
రిక్కడ సెప్పెదరు వింటెనింతియు సరి యం
దొక్కటియు నే నెఱుంగను
జిక్కులఁ బెట్టంగ నేల చేడియలారా! 175

వ. అనిన సఖులిట్లనిరి. 176

తే. గీ. ఏమియు నెఱుంగననుచు నీవిపుడు మమ్ము
చిక్కువఱిచెదు సరులేలఁ జిక్కుగొనియె
కుచతటుల నెలవంకలగుంపు మోవి
కెంపు లివియేమి తెల్పవే కీరవాణి! 177

వ. అనియిట్లు సాభిప్రాయవచనమ్ము లెసంగ మందస్మితాలంకృత వదనారవిందలగుచు నృపాలసుతం దోడ్కొని సముచితకృత్యమ్ములకుం జనిరంత. 178

ఉ. తామరసాకరోత్సవవిధాయి రథాంగవిహంగసంతత
క్షేమసమర్థనమ్ము సువిశేషబుధవ్రజ[వేద]భాషిత
శ్రీమహనీయమై రుచులఁ జెన్నెసఁగెన్ భువనైకదర్శన
ప్రేమరసావలంబ మినబింబము తూఱుపుకొండ కొప్పునన్. 179

కం. సూర్యోదయమ్మునకు స
త్కార్య[హార్మ్ముఖములెల్లఁ] గావించి మహా
దార్యధురీణుఁడు హరి దను
నార్యులుగొలువఁగ వరాసనాసీనుండై. 180

సీ. చంద్రచందనకళాసౌరభస్ఫురమాణ
వదనవక్షస్స్థవం బెసంగ

పాదాబ్జరాగవిభ్రమరుచిస్పృహణీయ
లలితాధరాలకోల్లసన మొప్ప
పల్లవావర్తశోభాగభీరస్ఫుర
త్పదనాభిసురుచిరప్రతిభ దనర
శంఖకుంజరహస్తసౌందర్యయుతదీర్ఘ
కంఠబాహువిలాసగరిమ దోఁప

తే. గీ. మంజుకేయూర కుండలమకుట హార
ముఖ్యభూషణములు మేన మురువుసూపఁ
దేజరిల్లెడు కరుణావిధేయు నెదుటఁ
గాంచె దేవనికాయమ్ము గారవమున. 181

వ. ఇవ్విధంబునం గాంచి చతుర్ముఖశర్వగీర్వాణవల్లభులు దేవమునిసహితులై రంగవల్లభునకుం బ్రణామమ్ములాచరించి ప్రసాదసుముఖుండగు నమ్మహాత్మునిచే ననుజ్ఞాతులై నిజస్థానమ్ములకుం జనిరి కులశేఖరమహీవల్లభుండు నల్లుని యభిప్రాయం బెఱింగి ప్రయాణోచితమ్ములగు చతుర్విధసైన్యమ్ముల సమకట్టం బనిచె మఱియును. 182

చం. ఉరుతరతప్తహేమ కలశోపహితాగ్రము పార్శ్వభాగ భా
సురసురరాజరత్నరుచిశోభితదారుచయమ్ము కేతువి
స్ఫురిత విహంగపుంగవ విభూషిత మద్భుతవేగవాహబం
ధురమగు తేరు రంగరమణుం డెదమెచ్చఁగఁ జెంతనిల్పినన్. 183

తే. గీ. అత్తమామలు మ్రొక్కుచు ననుప వెడలి
కనకమయరథమెక్కె రంగప్రభుండు
ప్రాగ్దిశాశైలశిఖర సంభావ్య మగుచు
భానుబింబమ్ము శోభిల్లు వగిదిదోఁప. 184

తే. గీ. తన్ను నెడబాయు నడలునఁ దాల్మివిడిచి
చిన్నవోయిన పూఁబోణిచిన్నె దెలిసి
జనని భాషించె వగవకే! సరసిజాక్షి!
కోరుకొన్నంత మేలు చేకూరె నీకు. 185

తే. గీ. నతహితుండగు శ్రీరంగనాయకుండు
ప్రేమ నేతెంచి నిన్ను వరించివాఁడు
నగుచుఁ బదవమ్మ యింకేల పగవ నీకు
జగములకు నెల్ల నేలికసానివగుచు. 186

వ. అనియాడించి యనేకగోహిరణ్యమణిభూషణాంబరదాసీదాసజనం బులఁ గూఁతుసకరణంబిచ్చి కౌఁగిలించికొని సువర్ణరత్నప్రభాశోభితయగుశిబిక నుంచిరంత. 187

చం. ఘనగజరాజ వాజిభట కంపితభూతలమైన సైన్యముం
గొని నరపాలశేఖరుఁ డకుంఠితవైభవమొప్పఁ గూఁతుఁ దో
డ్కొనిచన నుత్సహించి తనకుం హితవైష్ణవపంక్తి తోడ్పడన్
జననుతుఁ డేగె రంగపతిసన్నిధి సన్నిధిగాఁ దలంపుచున్. 188

సీ. పృథుల [ప్రయాణ]భేరీరవంబొక చాయ
విమతుల గుండియల్ వ్రీలఁజేయ
వేణుమర్దళశంఖవీణాస్వనము లొక్క-
కడ జనశ్రవణోత్సుకత ఘటింప
వసుధామరస్వస్తివచనస్వరము లొక్క-
* * ముదెంప
వందిమాగధ చాటువాగ్ధోరణి యొకచాయ
యొకచక్కి నాశ్చర్యయుక్తిఁ జేయుచు నుప

తే. గీ. మఱియు వారాంగనాగాన మధురనాట్య
భంగు లీక్షింప పౌరప్రసంగ మొసఁగఁ
గుతుక మేపారఁ గుక్కుటకూటనగర
విధి నల్లన శ్రీరంగవిభుఁడు జనియె. 189

వ. ఇట్లు బహుపరిజనసహితుండును భక్తివినయసంపన్నుండును నగు కుల శేఖరమహీపాలుండు కొలిచిరా రంగవల్లభుండు కతిపయప్రయాణమ్ముల శ్రీరంగ నగరసమీపమ్మునకుం జనునప్పుడు. 190

సీ. ఉచితదివ్యప్రబంధోచ్చారణధ్వాన
భాసురాస్యులు మహాభాగవతులు
రమ్యకర్పూరనీరాజనభాజనో
జ్జ్వలపాణియగు సాధుసముదయమ్ము
మహితకీర్తనావేళ మధురస్వనమ్ములఁ
ప్రకటించుచున్న గాయకచయమ్ము
సురుచిరచ్ఛత్రచామరముఖచిహ్నముల్
పేర్మిఁ గైకొనివచ్చు భృత్యగణము

తే. గీ. నెదురుసను దెంచి మ్రొక్కుచు నెల్లకడలఁ
గ్రమ్ముకొను పౌరసంఘంబు గదిసినడువఁ
జెలఁగి కన్యాజనమ్ములు సేసలిడఁగ
రాజవీథుల విచ్చేసి రంగవిభుఁడు. 191

కం. గవనులు కొన్ని గడచి రం
గవరేణ్యుఁడు రథముడిగ్గి ఘనమణిపీఠిన్
నివసించి యిందిరాసఖు
డవసర పరంగఁ బిలిచి లలి నిల్లని నెఱన్. 192

[illegible] శ్రీదేవి పరిగ్రహించుట

కం. వనజాక్షులార ! నీళాం
గనఁ దోడ్కొని మీరలిపుడు కమలాలయ ద
ర్శనము ఘటియింపుడన వా
రనుపమగతి నీళతోడ నరిగిరి వేడ్కన్. 193

వ. ఇవ్విధంబున నిందిరాదేవి సన్నిధానంబునకుం దోడ్కొనిచని తత్పా
దమ్ములకు మ్రొక్కించిరప్పుడు. 194

తే. గీ. మున్ను వినియున్న కతన నంభోజసదన
తనకు మ్రొక్కిన రాజన్యతనయఁ గాంచి
యొనర దీవించి కౌఁగిటఁ దనయఁ జేర్చి
యొలమి ముందట నిడుకొని యిట్టులనియె. 195

కం. సేమమె ! నీతలిదండ్రుల
కీమానితమూర్తి మదికి నెక్కినరూపం
బీమహిమ నీకుగలుగుటఁ
గామించె వరించె మేలుగలిగెన్ దరుణీ ! 196

వ. అని పలికిన లజ్జాభయమ్ములనత్తన్వి నెత్తమ్మిఱేకులమొత్తమ్ము నుత్తలపడంజేయుకన్నుల నిలాతలమ్ముఁజూచుచు నెమ్మొగంబెత్తకయున్నచిన్నె యెఱింగి శ్రీదేవియిట్లనియె. 197

తే. గీ. సుదతి ! మోమెత్తి నావంకఁ జూడవేమి
తొల్లిఁటి తెఱఁగు విన సపత్నులము మనము
అక్కచెలియండ్రమనెడి నెయ్యమ్ము గలుగ
వెఱచి యిటులుండ నేటికి వెఱ్ఱివగుచు. 198

మ. అలివేణీ ! శుకవాణి మున్న మనమయ్యబ్జాక్షు దాస్యమ్ము సం
థిలఁ గ్రీడించుచునుండువార మిపుడద్దేవుండు రంగేశుఁడై
నిలువన్ బద్మకుడుంగ రాడ్గృహములన్ దీపించియిట్టుల్ సప
త్నులమై కూడెడుభాగ్యమబ్బె హరి నిన్నున్ నన్ను బ్రోచున్ గృపన్. 199

కం. అన నృపకన్యక పలికెన్
జనవొసఁగితి నాదుపూర్వచరితము తెలిసెన్
ఘనతన్నీకడఁ జేరితి
మనమున నాకింకి వెఱపు [మాటయు] గలదే ! 200

వ. అనిన శ్రీదేవి భూపాలకన్యకంజూచి సంతసిల్లుచు నిట్లనియె. 201

కం. అదనిదియె నీదుమదికిన్
గొదువలులేవింకఁ జక్రిగూడి సకలసం
పద లనుభవింపుమేలిమి
పదవే ! పూఁబోఁడి [వాసభవనమ్మునకున్] 202

వ. అని యయ్యింతి నుత్సహింపఁజేసి సఖులందోడిచ్చి నిజసౌధంబునకుం బనిచె నంత రంగవల్లభుండల్లనల్లన నిజాగ్రమహిషీసమీపమ్మునకుం జనుటయు నయ్యబ్జగేహిని యెక్కింతకినుక నెరయ నతనింజూచుచునిట్లనియె. 203

కం. ఈసారి పెండ్లికూఁతురు
నేసీమం దెచ్చికొనఁగ నిచ్చఁదలఁచితో !
ఆసపడి మారనగునే
వేసరకుఁడి క్రొత్తచెలుల వెదకెడువనికిన్. 204

కం. నావుడు శ్రీహరి యిట్లను
దేవి వధూమణుల నేను దెచ్చుటలు భవ
త్సేవాపరిచర్యలకుం
గావలెననికాదె ! వేఱుగాఁ దలఁపకుమీ ! 205

కం. అప్పలుకులు విని యిందిర
తప్పక విభుమోముఁజూచి ధర్మాత్ములు మీ
రెప్పటికి [మాయ] లెఱుగరు
చెప్పకుడిఁక మేలిపనులు చేసెదరెలమిన్. 206

ఉ. కుంఠితవైరి ! మున్నునినుగూడి చరించెడివేళలందు వై
కుంఠములోన నీళ యనుకూలసఖిత్వ మొనర్చఁగాన యు
త్కంఠ జనించె నింకనొకకన్నియఁ దెచ్చెదవేని దాని సో
ల్లుంఠములాడి రంగపురిలో వెడలింతుఁజుమీ ! జగత్పతీ ! 207

వ. అనిమేలంబునంబలికి నెమ్మొగమ్మునం జిఱునగవు నెఱయ నగధరుం గౌఁగిలించికొనియె నిట్లయ్యిరువురు చతురసల్లాపసానుభవమ్ముసేయుచు నాత్మీయ సౌధంబునకుం జనిరి మఱియును. 208

సీ. మంజులోద్యాన ద్రుమచ్ఛాయ లందుండి
శుకకోకిలోక్తుల సొంపు వినుచు
పద్మకైరవసౌరభము లొప్పుకొలఁకుల
సలిలకేళీసముత్సాహు లగుచు
మణిమయప్రాసాద మహితస్థలమ్ముల
రమ్యవీణాగానరసికు లగుచు
కలితమౌక్తికమాలికా డోలికల నెక్కి
లాలితక్రీడావిలాసు లగుచు

తే. గీ. ఘనజనాలోకనానందకారులగుచు
ప్రేమ నీళాంగనారంగధాము లపుడు
బంధురైశ్వర్యసౌఖ్యసంపదలఁ బొదలి
యెలమిఁ బెంపొంది రానందకలన దనర. 209

కం. ఇట్లీఁగున నిజపుత్త్రియు
దాత్తమహాసౌఖ్యభోగదశ గని భూపా
లోత్తముఁడు సంతసిల్లుచుఁ
జిత్తమునం దనపురమ్ము చేరం దలఁచెన్. 210

కం. రంగపతికిఁ బ్రణమిల్లి సు
సంగతమా గతి నతండు సరవి సనుప పు
త్త్రిం గాంచి గారవించి ర
మాంగనకున్ మ్రొక్కి పలికె నతిమోదమునన్. 211

కం. గోముననఁ బెరిగినయది మది
నేమియుఁ గాపట్యమెఱుఁగ దెఱుక నొసఁగినన్
బ్రేమగొను సడుగద్దియు
నీమఱువునఁ జెల్లెలనఁగ నిలుపుము వేడ్కన్. 212

ఉ. చల్లనిచూపు లెంము వెదఁజల్లి జగమ్ములఁ బ్రోతువీవ కా
తల్లివి భవ్యవైభవమతల్లివి సేవకకల్పవల్లి! ని
న్నెల్లబుధుల్ భజించుకత లేమెఱుఁగన్ బసికూన! దీని నీ
చెల్లెలిగాఁ దలంచి కృపసేయుము నేరములేమొనర్చినన్. 213

తే. గీ. అనిన శ్రీదేవినగుచు నోయవనిపాల!
మదిచెదరి కూఁతునప్పగించెదవు గాక
జన్మజన్మమ్ములను విష్ణుసేవల నగుచుఁ
జెలిమినుండెడు మాకిన్ని చెప్పనగునె! 214

కం. అనఘ! భవత్సుత మీగృహ
మున మెలఁగినయట్లు యిచట ముదమున నలరున్
ననుగూడి చెలఁగుచుండెడి
మనమున సంతోషమెసఁగ మరలుము పురికిన్. 215

వ. అనిరమాదేవియానతిచ్చిన సంతుష్టాంతరంగుండై తన్నుం గృతార్థుం గాఁ దలంచుచు సకలపరిజనయుతుండై నిజనగరంబు ప్రవేశించె మఱియు. 216

కం. శ్రీవైష్ణవ పూజాసం
భావనలేమిఁక రామభద్రచరిత సే
వావిలసితహృదయుండై
భూవరుఁ డార్యాళిసంగఁ బాలుపువహించెన్. 217

సీ. సతతమ్ముపురమున సాటించు భేరీమృ
దంగ మెసంగ శ్రీరంగయాత్ర
రచియించె హరిభక్తిరసము జొబ్బిల బుధా
నందానుకూల ముకుందమాల
నిఖిలప్రపన్నవర్ణితముగాఁ బ్రకటించె
బంధురద్రవిడ ప్రబంధమొకటి
సంతతశ్రీరామచరితామృతాస్వాద
* * స్తగాంచె
తే. గీ. బహుళనీవృత్సమాయాత భాగవత జ
నాభినందన గురుసపర్యాభిలషిత
వస్తువిశ్రాణన క్రియావశత నెసఁగ
నతహితుండు దృఢవ్రతి నందనుండు. 218

కం. చిరకాలము భూపాలన
పరుఁడై ....
స్ఫురణమ్మున నిజతనయున్
గరిమన్ బట్టాభిషిక్తుఁ గావించె వెసన్. 219

వ. ఇట్లు సప్తాంగంబు తనయవశమ్ముజేసి నిర్భరచిత్తుండై యుండె మఱియును.

తే. వసుధఁ బాలించి శ్రీవైష్ణవప్రియార్చ
నంబు గావించి జానకీనాథుఁ గొలిచి
...........................రూఢుఁడగుచు
నెమ్మి నృపమౌళి విష్ణుసన్నిధికిఁ జనియె. 221

వ. అని యిత్తెఱంగు. 222

కం. గురువర్యుఁడు శిష్యునకున్
నిరుపమకులశేఖరావనీవల్లభ స
చ్చరితం బంతయు నేర్పడ
కరుణం దగ నానతిచ్చి క్రమ్మఱఁ బలికెన్. 223

కం. కులశేఖరాళువారుల
విలసితచరితమ్ము జగతి వినినఁ జదివినన్
గలుషవ్రజమ్ము దొలఁగెడు
నెలమిం బ్రాపించు నరుల కిహపరసుఖముల్. 224

వ. అనిపలికి శిష్యోత్తమా! పరమపవిత్రంబగు కులశేఖరచరిత్రంబు సవిస్తరంబుగా నీకు నెఱింగించితి ననుటయు శిష్యుండాచార్యునకుం బ్రదక్షిణపూర్వకంబుగా ప్రణామంబు లాచరించి విమలంబులగు కుసుమచందనంబులం బూజించి మమ్ముం గృతార్థులం జేసితిరని యానందరసభరితాంతఃకరణులై విలసిల్లి రిత్తెఱంగున. 225

మ. తరుణీలోలపిత్రుక్తిపాలనకళాధౌరేయ! గాధేయదు
ర్భరభవ్యాధ్వరమంత్రతంత్రకలనాప్రత్యూహకృద్దైత్యసం
హర! రంహోభయదాబ్ధిగర్వదళనోద్యద్రక్తనేత్రాంచలా!
ధరధైర్యాఢ్య! ధరాధురాధరభుజా! ధారాధరాంగద్యుతీ! 226

కం. కాకమదోద్రేకతమో
... ...
....
... ... 227

మాలిని. ....

* *

కలశజనుతిశాలీ కమ్రపద్మాక్షమాలీ
విలులితసదవద్యా వేదవేదాంతవేద్యా 228

గద్య. ఇది శ్రీరామచంద్రకరుణానిరీక్షణసమాసాదితకవితావిశేష శేషాన్వయప్రదీపక వేంకటాచార్యకుమారరఘునాథార్యప్రణీతంబైన కులశేఖరమహీపాలచరిత్రంబను మహాప్రబంధంబునందుఁ జతుర్థాశ్వాసము. 229

సంపూర్ణము